
ఆంధ్రసచిత్రవారపత్రిక

31-5-61

25 నయాపైస







గృహోన్ముఖులు


ఫొటో — శ్రీపాద వెంకన్న (ఖర్గపూర్)

ఆంధ్ర సచిత్ర వారపత్రికను చదవండి!






SEENU & CO., 28, THANDAVARAYA GRAMANI STREET. MADRAS 21.
GRAMS. "ORCAS" (ESTD. 1946) PHONE. 55387
(ADVT. PERMITTED UNDER G.O. MS. NO. 1121. HEALTH.)



ఏటువంటి ప్రదేశానికైనా
-చమత్కారంగా- పెయింటు వేయుటకు

షాలిమార్ సూపర్‌లాక్
సింథెటిక్ ఎనామెల్



- త్వరగా ఆరి, గట్టిగా కట్టివుండే మంచి నిగారింపుగల సింథెటిక్ ఎనామెల్
- లోపల, బయట వాడుటకు
- బ్రష్‌తోను, స్ప్రేతోను
- ఒక దానితో ఒకటి కలుపుటకు వీలైన
- 38 రంగులున్నాయి.

SHALIMAR PAINT, COLOUR & VARNISH CO., LTD.
Calcutta-Bombay-Madras-New Delhi-Kanpur



తయారు చేయువారు:
ఇండియా క్యానింగ్ ఇండస్ట్రీస్
విజయవాడ.

ఉత్తరాలు

మన రాజధాని

క్రొత్త పద్ధతిలో రచించబడిన 'మన రాజధాని' బాగుంది. తెలంగాణా భాషని పూర్తిగా కథలో ఉపయోగించారు రచయిత. కాని కొన్ని కొన్ని చోట్ల స్వచ్ఛమైన భాష ఉపయోగింప బడింది. ఉదాహరణకు :—

"అది ఉమన్స్ కాలేజి .... మామ చెప్పిండు. అదేంద్రా అని నేను సోచాయించుతుంటే"

పై మాటల్లో 'తప్పు' ఉంది. అంటే నా ఉద్దేశం తెలంగాణా భాష మాట్లాడేవారు 'అది' అనరు. 'గది' అంటారు. అంటే పై మాటల్ని.

'గది ఉమన్స్ కాలేజి .... మామ చెప్పిండు. గందేంద్రాని నేను సోచాయించుతుంటే" అని ఉండాలి.

ఈవిధంగానే భాష మార్చబడితే పూర్తిగా తెలంగాణా మాటల్ని ఉపయోగించిన ట్లవుతుంది. ఇది ఒక క్రొత్తరకం వినోదం. రచయిత 'పతి' గారికి నా ధన్యవాదాలు.

ఇంద్రకంటి విశ్వేశ్వరరావు (హైద్రాబాద్)

* * *

ఓ ! పుల్లయ్యా నీవు రాసినది చదివిన. శానా బాగా రాసినవు. అయితే మళ్లా నాకు ఒక సందేహం వచ్చినది. మరయితే నీవు రెండోది చదివవుకదా ! మళ్లా యింత బాగా ఎట్ల రాసినవు. ఇగ ఎట్లనన్న రాసినవులే ! నాకు శానా కుషీ అయినది. నీకు మా శుక్రియా !

కుమారి వై. లలిత (సీతాఫలమండి)

* * *

కార్టూనులు

83 వ నెంబరు ఎప్పుడూ ఇంతే. కార్టూను అంత బాగాలేదు. 'ఉప్పు అద్భుతంగా పడిపోయింది. ఎటొచ్చి కూరే కొంచెం తగ్గినట్టుంది' అని అనటంలో అర్థమేమిటో తెలియడంలేదు. కూరలో కొంచెం ఉప్పు వేస్తారు కాని కూర లేకుండా వెయ్యరు.

బాలగంగారాం (నిజామాబాద్)

* * *

శ్రీ. శివరామకృష్ణారావుగారికి 80 వ నెంబరు ఎప్పుడూ ఇంతే, కార్టూను అర్థం కాకపోవడం ఏమిటో నాకుఅర్థం కావడంలేదు. "అటువంటి కార్టూనులు వేసి పత్రికను పాడు చేయవద్దని" వ్రాశారు. విచిత్రంగా ఉంది. "ఎప్పుడూ ఇంతే" వలన పత్రికస్థాయి మరింత పెరుగుతుంది.

భగవాన్ (రాజమండ్రి)

* * *

కథకాని కథ

కథకాని కథలకు మీరు న్యాయముగ బహుమతు లివ్వటంలేదు. ఒక మోస్తరుగా ఉన్న దానికి మొదటి బహుమతి, బాగా ఉన్నవాటికి రెండవ బహుమతులు ఇస్తున్నారు.

కుమారి ఎం. ఆర్. కృష్ణవేణి (తాపేశ్వరం)

ఉత్తరాలు

కథలు

"పైరుగాలి" కథ ఎంత హాయిగా ఉంది. చదువుతున్నంతసేపూ, తలచుకొన్నంతసేపూ, చల్లని పైరుగాలి శరీరానికి సోకుతున్నట్లనిపించింది. (అందులోను ఈ వేసవిరోజుల్లో) బస్తీ ప్రేమల్ని చూసిచూసి, చదివి చదివి వేదెక్కిన ఈ రోజుల్లో, పల్లెసీమల ప్రేమల్ని చల్లగా, తీపిగా, పైరుగాలిలా మా పైకి వదిలారు సదానందంగారు. వారికి అభినందనలు.

దివాకర్ (చిత్తూరు)

సదానందగారు వ్రాసిన 'పైరుగాలి' కథ చాలా బాగుంది. రచయితకు నా అభినందనలు.

పి. ఎస్. రామారావు (మునునూరు)

* * *

'అగ్గి బరాటా' లోని ఉషాదేవి లక్ష్మీణ హస్తానికి చిటికెన వ్రేలు లోపించిం దేమిటండి ? అంత అందమైన స్త్రీ అంగవిహీనయేనా ?

కె. దివాకర్‌రెడ్డి (కాల్వ శ్రీరాంపురం)

* * *

"తల్లి మనస్సు" కథ ఆకర్షణీయంగా ఉన్నది. "కేవలం మూఢ నమ్మకాలతో బిడ్డల చదువు పాడుచేయు అజ్ఞాను లున్నారని పాఠకులకు తెలియజేసిన రచయిత వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారికి నా అభినందనలు.

ఎస్. శ్రీరాం (చిత్తూరు)

* * *

"దూరపుకొండలు" కథ చాలా బాగుంది. నిజంగా యీ కథ చదివినప్పుడు నాకు యిదంతా కల్పితము కాదనిపించింది. ఇటువంటి కథలే పత్రికకు అలంకారాలు. రచయిత సింగరాజుగారికి నా అభివందనములు తెల్పుకుంటున్నాను.

డి. విరూపాక్షప్ప (ఉరవకొండ) ☆

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపాదకుడు:
శి. రా ధా కృ ష్ణ

★

సంపుటము 55
సంచిక 38

31-5-61

బుధవారం

ప్లవసం॥అధిక జ్యేష్ఠ బ॥పాడ్యమి

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
లలితకళానికేతన్ వారి
"భక్తజయదేవ"లో నాట్యతార ఇ. వి. సరోజ.


కథలు:


వ్యాసాలు:

శీర్షికలు:

సీరియల్ కథలు:

బాలసాహితి:


ఆత్మరక్షణ చేసుకోండి!
కేరళ శాసనసభాపతి ఎన్నిక
కేరళ కాంగ్రెస్
ఈ ఇల్లు నాకు చాలదా!
పంజాబీసుబా ఏర్పడితే....
పంజాబీ సుబా
మా మొరాలకించండి బాబూ!
చిన్న పరిశ్రమలు
నిజాం నిధులు



భారత శిశుసంక్షేమమండలి ప్రతినిధులకు రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ ఇటీవల తమ భవనంలో విందు ఇచ్చారు.

న్యూఢిల్లీ లేఖ — శ్రీకృష్ణ

వరకట్నం నిషేధ[illegible] తో [illegible]! ఢిల్లీలో అసభ్య ప్రకటనల దహనోద్యమం

మన పార్లమెంటు గత వారంలో జరిగిన ప్రథమ సంయుక్తసమావేశంలో వరకట్న నిషేధంబిల్లు ఆమోదించేసింది. మన శాసన పట్టికచూస్తే అందులో బాల్య వివాహ నిరోధం, ఆహార కల్తీ నిషేధం చట్టాలు కూడా కనిపిస్తాయి. అయితే ఈ రోజుల్లో కూడా బాల్య వివాహాలు కొనసాగుతూ వుండటం ప్రాపంచిక జ్ఞానంవున్న ప్రతివాడికి తెలుసు. సరే! ఆహార కల్తీ నిరోధక చట్టం..... దీన్ని గురించి ఎంత తక్కువచెప్తే అంత మంచిది.

వరకట్నాల పద్ధతికి సంబంధించినంతవరకు, హిందూ సమాజంలో ఆడపిల్లలుండటం పాపమై పోయింది. మగపిల్లలు కోరినప్పుడు డబ్బుఇచ్చే హుండీలుగా లెక్కకు రావటం పరిపాటైంది. ఇప్పుడు ఆమోదం పొందిన బిల్లు ననుసరించి వధువుకు బహుమతులు ఇవ్వవచ్చు. అయితే వరుడు పక్షంవారు వధువుకు ఈ బహుమతులు ఏమాత్రం ఇస్తున్నారో అంతా ఎరిగిన సంగతే. అంతేకాక, ఇరుపక్షాలవారు వరునకు బహుమతులు ఇచ్చేందుకు ఈ బిల్లు అడ్డురాదు.

గత వారంలో పార్లమెంటు కాంగ్రెసు సభ్యులొకరు న్యూఢిల్లీలో తమ కుమారుని వివాహం జరిపారు. ఈ వివాహానికి రాష్ట్రపతి ప్రధాని హాజరయ్యారు. ప్రధానం సమయంలో వధువుపక్షంవాళ్ళు ఏదో కొద్దిగా ఒక కారుతోసహా ఓ ముప్పై వేల రూపాయల బహుమతులు మాత్రం వరుని పక్షానికి అందజేశారు. ఇంతకన్న చిత్రంగా గత శీతాకాలంలో ఒక వివాహం ప్రధానం జరిగింది. ఆ ప్రధానోత్సవంలో కొత్త పెళ్ళికొడుక్కి బహుమతులుగా ఎంతోకాదు కేవలం 200 బంగారు సవరనులు మాత్రమే ఇచ్చారు.

నిజానికి హైందవ వనితాబృందానికి విముక్తి ప్రసాదించకల్గితే అది అప్రమత్తులైన ఆదాయపన్ను అధికార్లేకాని, వరకట్న నిషేధ బిల్లుకాదు. ఎందుకంటే ఒక వ్యక్తి 200 పౌండ్లు బంగారు నాణేల రూపంలో అనగా 200×80 రు. 16,000 అక్షరాలా పదహారు వేల రూపాయలు ఎలా ముట్టచెప్పగల్గాడు. ఆ ఆదాయపు మార్గాలేవి? అని పరిశోధించాల్సిన బాధ్యత ఈ అధికార్లకుంది. అంతే కాదు. ఒకే ఒక వ్యక్తి తన ఇద్దరు కుమార్తెల వివాహానికిగాను ఒక లక్ష రూపాయలు ఎక్కడనుంచి తెచ్చి ఖర్చు పెట్టగల్గాడనేది పరిశోధించాల్సిన బాధ్యత కూడా వీరిపై వుంది.

అసలు భారతదేశం అనే ఈ దౌర్భాగ్య భూమిలో వరకట్నాలకన్న ఇంకా విచారకరమైన సంఘటనలెన్నో జరుగుతున్నాయి. ఇవి సాధారణంగా వరకట్నాలవల్ల ఏర్పడుతున్నాయి. ఎందరో సంపన్న వనితలను వారి భర్తలు వదిలివేసిన ఘట్టాలున్నాయి. కేవలం బాహ్యాడంబరాలకు ధనం ఖర్చు పెట్టటం, తొడ్డిదారిన వరకట్నం ఇవ్వటంలాంటివాటికి బదులు, ఈ సొమ్ము యువతులకే ఇస్తే అత్తింటికోడంటికం, భర్త అవమానం, విడిచిపెట్టటంలాంటి అవాంతరాలు సంభవిస్తే తట్టుకోగల్గుతారు.

* * *

ఈవారం న్యూఢిల్లీ పౌరుల కొలక్టేపానికి డా. సుశీలానయ్యర్ డా. యుధ్ వీర్ సింగ్ సాధనాలయ్యారు. వారేం సామాన్యులామరి. డా. నయ్యార్ ఉన్నారను కోండి. ఆమె గాంధీజీ అనుచారిణి. ఢిల్లీ

(62-వ పేజీ చూడుడు)

క్రికెట్టు క్రీగంటి చూపులు



ఆర్. ఎం. చిదంబరం

'స(్రుమంటూ ఎ(్రటి బంతి స్పుట్నిక్ వేగంతో దూసుకువచ్చింది. దానిమీదే దృష్టిని కేం(్రదీకరించి, బాట్‌తో దాని వేగాన్ని తగ్గించి పొగరణచి, తృప్తిగా నిట్టూర్చాడు గిరి. దాని మిడిసిపాటు చూస్తే తన 'వికెట్ను' బౌండరీ దాకా వెడతా యనుకున్నాడు. గండం తప్పిందన్న ఆనందం అతన్నావరించింది. మరు క్షణం మైదానంలో ఉన్న ఆటగాళ్లందరూ కలిసి ఏకకంఠంతో 'హౌ ఈజ్ దట్' అనరిచారు. గిరి ఉలిక్కిపడి, ఊహాలోకాన్ని వదిలి వచ్చాడు, ఎదురుగా యమ ధర్మరాజులా 'అంపైర్' కనబడ్డాడు. చూస్తూ, చూస్తూ ఉండగానే అతని చూపులు వేలుపైకి కదిలి, ఆకాశాన్ని చూడమంది. అంతే, పాపం! గిరి అవుట్! బాట్ చేసేందుకు కాలికి కవచం కట్టుకున్నంతసేపైనా ఆడలేదు. మొట్టమొదటి బంతికే బండి వెనక్కి తిప్పవలసి వచ్చింది. తల వంచుకుని వెనక్కు బయలుదేరాడు. కొందరు హేళనగా నవ్వారు. మరికొందరు సానుభూతిగా పెదవులు చప్పరించారు. మిగిలినవారు ఎగిరి గంతు లేశారు. ఒక్క పరుగైనా చేయకుండా వోడిపోయాడు. మనసు చీకాకుతో నిండిపోయింది. కళ్లు చీకట్లు కమ్మాయి. కాళ్ళు తేలిపోయాయి. ఎదురుగా కంపెనీ మానేజరు అతనికేసే చూడటం గమనించటంతో 'అమ్మోయ్' అని కేకేసి నేల కొరిగాడు.

'ఠంగ్!'

గ్లాసు కిందపడి సంగీతం పాడి ఓ మూలకు చేరింది. గిరి లేచి కూర్చుని కళ్ళు నులుముకున్నాడు. కేరింతలు కొట్టిన ఆ జన సమూహం ఏది? కాలభైరవుడిలా పరుగెత్తుకు వచ్చి బౌలుచేసిన ఆ 'తుఫాను వీరు' డేడి? .... ఎవరూ కనపడరేం?—కుర్చీ, బల్ల, పుస్తకాల బీరువా, రేడియో.

'ఛట్! .... ఇంతాచేసి కలన్నమాట!' అని నవ్వుకున్నాడు గిరి.

అయితేనేం? .... గిరికి మరో బెంగ పట్టుకుంది. పగటి కలలు నిజమవుతాయని ఎవరో ఎప్పుడో అనగా విన్నాడు. నిజంగా కల నిజమైతే తనగతేంకాను? అతని కంపెనీ తరఫున పైన

ల్సికు మద్రాసు వెళ్ళాలి.

'గిరి! నువ్వుమన జట్టుకి వెన్నెముకలాంటి వాడివి. ముఖస్తుతి కాదుసుమా ! .... నీ మీదే జయాప జయాలు ఆధారపడి ఉన్నాయి. 'విష్ యు గుడ్ లక్' అన్న మేనేజరు వాక్యాలు అతనికి పదేపదే వినిపించాయి. ఆ క్షణంలో విక్రమార్కుని సింహాసనం దొరికినంత సంబరం కలిగింది. తనమీద అందరూ ఆశపెట్టుకున్నారు.

'పోనీలే ! .... రెండో ఇన్నింగు ఉండనే ఉంది'. అని 'గుడ్డిలో మెల్ల' పడ్డాడు.

బద్ధకంగా వళ్ళు విరుచుకుని, నేలమీద పడి మూలుగుతూన్న గ్లాసును యధాస్థానంలో ఉంచాడు. తలుపుకు పైనున్న వెంటిలేటర్లోంచి రెండు కవర్లు నేలమీదకు ఎగురుతూ వచ్చి పడ్డాయి. మొదటి ఉత్తరం మీది దస్తూరీ చూడగానే ఎక్కడనుండి వచ్చింది తెలిసిపోయింది. రెండో ఉత్తరం ఉనికి చూసీ చూడటంతో తెలిసి రాలేదు. కాని ఆ దస్తూరీ మాత్రం మంచు తెరలో వస్తువులా ఎక్కడో చూసినట్టే ఉంది. నాన్న రాసిన మొదటి ఉత్తరం చదువుకున్నాడు. అందులో కొత్త విషయాలు ఏవీ లేవు. దీవెనలతో ఆరంభమై, ఆరోగ్యాన్ని పలుకరించి పెళ్లి ప్రస్తావనలో దిగింది. గత రెండు సంవత్సరాలుగా వచ్చి పడుతున్న సంబంధాలమీద 'విశ్వామిత్ర దృష్టి' వేసినందుకు అక్షింతలు—

'బ్రహ్మచారి ముదిరినా ....' వంటి సామితలు. 'హోటలు పక్టిగా' ఎందుకు బతకాలన్న ప్రశ్నలు—'జరాభారంచేత జవసత్వా లుడిగిన' తల్లిదండ్రుల మాటను మన్నింపమని హెచ్చరిక—ఇవేమీ బాగు పడే లక్షణాలు కావని, కాస్త నిందాగర్భితమైన విసురులు—కనుక 'ఎవతెనో, ఒకతెను—వనితను' చేపట్టి 'ఇంటివాడి' ననిపించుకోమని ముగింపు—ఇలా రకరకాల భావాలతో, బెదరింపులతో కూడిన ఆ ఉత్తరం అరవ్వాడి 'అవియల్' కూరలా తయారైంది. స్కూలుఫైనలు చదివే విద్యార్థి చేతికి ఆ ఉత్తరాన్నిచ్చి మూడో వంతుకు సంక్షిప్తం చేయమంటే 'మూడోవంతుదాకా ఎందుకయ్యా ? మూడు మాటల్లో ముగిస్తాను. నువ్వు పెళ్లి చేసుకో—' అంటాడు.

గిరి విసుక్కోలేదు. కోపగించుకోలేదు. టేబిలు డ్రాయరులోంచి రెండు ఫైళ్ళు తీశాడు. మొదటి ఫైలు మీద 'నాన్న వద్ద నుండి' అని రాసి ఉంది. చదివి ముగించిన ఉత్తరాన్ని ఫైలు చేశాడు. పెళ్లినిగురించి నాన్న దగ్గర్నుండి వచ్చిన పదహారో ఉత్తరం అది. రెండో ఫైలుమీద 'నాన్నకు' అని రాసుంది. అవన్నీ తను నాన్నకు అదేసబ్జెక్టు మీద రాసిన ఉత్తరాలు. 'రైటింగ్ పాడ్'లోంచి సర్రున కాగితం చింపి జవాబు రాశాడు.

'గత రెండు సంవత్సరాలుగా, సరాసరిన నెల కొకటి చొప్పున రాసిన ఉత్తరాల్లో ప్రతిపాదిస్తూ వచ్చిన 'పాలసీ' లో ఎలాంటి మార్పు లేదని మొదలుపెట్టాడు. 'పెళ్లనేది అవసరం. కానది జీవితంలో పైకివచ్చే అవకాశాలకు ఆటంకంగా ఉండే పక్షంలో అనవసరం. విసర్జనీయం. జీవితలక్ష్యాన్ని సాధించాక ఏ పని లేకుండా కాలాన్ని చంపలేక' అవస్థపడే మనుష్యులే పెళ్లి చేసుకోవాలి. ఎందుకంటే పెళ్లయాక మగపిల్లవాడు యితరుల ఆలోచనలమీద, అధికారం మీద ఆధారపడివుంటాడు. వ్యక్తిత్వం నశిస్తుంది. నా విషయంలో నే నింకా అనుకున్న గమ్యస్థానం చేరుకోలేదు. గొప్ప క్రికెట్ ఆటగాణ్ణి కావాలన్న నా కోరిక సగం వరకే పూర్తయింది. అంతవరకూ పెళ్లిమాట ఎత్తవద్దని ప్రార్థిస్తున్నా' అన్నాడు గిరి. ఉత్తరం కాపీ ఫైలు చేసి కవరు అంటించేశాడు. ఇక నెల రోజులవరకూ ఈ 'టాపిక్' ముట్టనక్కర్లేదన్న సంతోషంతో కుర్చీకి జారబడి ఆవులించినప్పుడు టేబిలుమీద ఉన్న రెండో ఉత్తరం కనపడింది

'డియర్ గిరి—



ఈ ఉత్తరం చూడగానే ఎవరు రాసింది చెప్ప గలిగుండాలి. లేకపోతే నన్ను మర్చిపోయావన్నమాట. అంటే మన చిరకాల స్నేహితాన్ని తుంచివేశా వన్నమాట. అంటే పెరిగి పెద్దదై వుప్పించే మొక్కను మొదలంట నరికివేశావన్నమాట.

గిరికి వళ్ళు మండింది.

'నీ తలకాయన్నమాట .... ఎవడ్రా ఈ ఉత్తరం రాసింది ?' అని చివర చేవ్రాలు చూశాను.

'హరిసీ ! .... మువ్వట్రా ! .... నరహరి ! .... ఏంత కాలాని కెంత కాలానికి !' అని హరి ఎదురుగా వచ్చినట్లు తను కావలించుకున్నట్లు భావించి పరమానందభరితుడై ఉత్తరం చదువుకున్నాడు.

'సరే .... ఇప్పుడు తెలిసిందన్నమాట. నీకు తరుచు ఉత్తరాలు రాయాలని, గగనకుసుమ మవుతున్న మన చెలిమిని 'భూ కుసుమం' చేయాలని అనుకోటం, అవాంతరం వచ్చిపడటం, ఇలా ఈ రెండేళ్ళగా జరుగుతూ వచ్చింది. అదిగాక, ఇంతకాలంగా నువ్వెక్కడున్నదీ నాకు మొన్ననే మీ నాన్నగారు కనిపించి చెప్పారు..... ఆ తరువాత ఆయన్ని నాలుగైదుసార్లు కలుసుకున్నాను. నీ పెళ్ళి గురించే ప్రస్తావించాం.'

గిరి ఉలిక్కిపడ్డాడు. ఉన్న రెండు ఫైళ్ళు చాలక 'హరి దగ్గర్నుండి' అని పెళ్ళి సబ్జక్టు మీద మరో ఫైలు తెరవాలి గామోలని గజగజ లాడిపోయాడు. ముందుకు పోగక తప్పదు.

'నీ అభిప్రాయాలు వివరించారు. నువ్వు క్రికెట్ ఆటలో అఖండవిజయం సాధించి, నీ నామం దేశ దేశాలు పాకి పరుగెత్తాలని వెర్రి కలలు కంటున్నావని వాపోయారు. నీ లక్ష్యాన్ని అంగీకరించాను. కాని ఓనాడు కాకపోతే ఓనాడు ఒంటరితనం వదులుకోవలసిందే కదా ! అయినా ఉత్త వెర్రినాగమ్మలా ఉన్నావు. క్రికెట్‌కూ, జీవితానికి ఏమిటి సంబంధం ? నీ దృక్పథాన్ని వారం రోజుల్లో మారుస్తానని మీ నాన్నగారి ముందు శపథం చేశాను. అది నెరవేరుతుందో లేదో...

ఆ సంగతి వదిలేయి. నీ నుండి ఓ సాయం ఆశించి ఈ ఉత్తరం రాస్తున్నా. మా ఆవిడ అర్జంటుగా మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. రేపే బయలుదేరి తీరాలి. నాకు సెలవు దొరకదు. ఒంటరిగా వెళ్ళటానికి దానికి వల్లమాలిన భయం. ఒట్టి పిరికిపంద. మా యింటికి పదిళ్ళవతల ఉన్న చుట్టాలింటికి వెళ్ళటమంటే కీకారణ్యాన్ని దాటినట్టే. కనుక ఆమె సాయం లేకుండా మద్రాసు వెళుతుం దనుకోటంకల్ల. బెజవాడ ఎలాగో పంపిస్తాను. నువ్వు మీ కంపెనీ తరవున క్రికెట్ ఆడేందుకు వెడుతున్నావని, శనివారం బయలుదేరుతున్నావని విని ఆమెను మద్రాసు దాకా దిగబెట్టమని ప్రార్థిస్తున్నా. మన చిరకాల స్నేహితాన్ని పురస్కరించుకుని ఈ ఉపకారం చేస్తావని ఆశిస్తున్నా. 'కాదు కూడ' దని ఎదురు చెప్పవన్న ధీమాతో ఆమెను పంపిస్తున్నా.

గిరికి వళ్ళు భగభగమండింది. శుభకార్యానికి పిళ్ళి దురు. మిత్రులతో కలిసి ఆదివారం హాయిగా, కులాసాగా వెడదా మనుకుంటే ఇలగాడి కోసం శనివారమే బయలుదేరాలట ....ఈ బాధ్యత వహించటం తనతరం కాదని 'కుంట బద్ధలు' కొడదా

[illegible]

మనుకుంటే అవధి లేదాయె. అదీకాక నరహరితో అతనికున్న చెలిమి 'అలాంటిది, ఇలాంటిది' కాదు. సినసైనది. చీకటి వెలుగులకు మల్లే శాశ్వతమైనది. కాలేజీలో చదివే రోజుల్లో ఆర్థికంగా నైతికంగా అండగా నిలిచి క్లిష్టపరిస్థితుల్లో ఆదుకుని గట్టెక్కించాడు. అలాంటి మిత్రుడికి ఈ చిన్న ఉపకారం చేయలేకపోతే ఎలా ? .... శని వారం—అంటే ఆనాడే బయలుదేరటానికి నిశ్చయించుకున్నాడు.

కాని, గిరికి గిరిలాంటి మరో సందేహం. వచ్చింది.

హరి పెళ్ళికి తను వెళ్ళలేదు. కనుక అతని భార్య ఎలా ఉంటుందో తనికి తెలియదు. బెజవాడ ప్లాటుఫారంమీదున్న అమ్మాయిల్లో హరి భార్యను కనుక్కోటం ఎలా ? 'పులి నోట్లోంచి తల తీసి సింహం నోట్లో ఉంచినట్లు ఏమిటీ చిక్కు ?' అని ఆలోచిస్తుండగా ఉత్తరం నేలకు జారి బోర్లా పడుకుంది. పొరబాటున ఉత్తరం రెండోవేపు చదువుకోలేదన్న విషయం అప్పటిక్కాని తెలియలేదు. నరసింహం నిజంగా బుద్ధిమంతుడు.

'మా ఆవిణ్ణి నువ్వింతవరకు చూడలేదని నాకు తెలుసు. అందుకని గుర్తులు రాస్తున్నా. గులాబీ రంగు చీర, నల్లటి చుక్కల బార్డరు, అదే రంగు జాకెట్టు, నుదుటిమీద అర్ధచంద్రా కారపు బొట్టు, చేతిలో నీలిరంగు 'హాని టి బాగ్', ఎడంచేతికి ఆరు బంగారు గాజులు, కుడిచేతికి ప్లాస్టిక్ రాళ్ళు తొడిగిన చెయిన్‌లో కూడా వాచీ, ఇవన్నీ ఆమెను గుర్తు పట్టేందుకు సహకరిస్తాయి. ఇందులో కొన్ని గుర్తులున్న అమ్మాయి ఎదురు పడొచ్చు కానీ, అన్ని ఉన్నది మా ఆవిడే ! ఆమెను కనుక్కోటంలో నీ కెలాంటి యిబ్బందీ ఉండదని తలుస్తాను.'

గిరి మేనేజర్ని కలుసుకుని, ఏదో పని ఉండటం వలన ఒకరోజు ముందుగానే బయలుదేరవలసి వచ్చిందనీ, అనుమతి తీసుకుని సూట్‌కేస్‌తో స్టేషనులో హాజరయ్యాడు. అప్పుడే మచిలీపట్నంబండి వచ్చిపోయింది. ప్రయాణీకులు గుంపులు గుంపులుగా వస్తున్నారు. గిరి, హరి ఉత్తరం మరోమారు చదువుకుని గుర్తులన్నీ కంఠస్థం చేశాడు. వళ్ళంతా కళ్ళు చేసుకుని, ప్లాటుఫారం ఆ చివర్నుంచి ఈ చివరిదాకా రెండుసార్లు తిరిగాడు. వెదికాడు. ఎక్కడా జాడ లేదు. ఎందరో అమ్మాయిలు కదిలిపోయారు..... ఒకవేళ హరి తన్ను ఏడిపించటానికి ఈ ఎత్తు ఎత్తాడేమో ! .... ఛీ ! వేళాకోళానికైనా ఓ అంతు ఉంటుంది. అలా ఎన్నటికీ చేయడు. ఏం చేయటానికి తోచక ఆలోచిస్తున్న సమయంలో ఆ అమ్మాయి కెరటంలా ముందుకు కదిలి రావటం చూశాడు.

'గులాబీరంగు చీర .... బార్డరు ? .... నలుపు రంగు—రైట్. జాకెట్టు అదే రంగు. అంత వరకూ సరి—బొట్టు దూరం నుండి కనపడటం లేదు. ఒకటి. రెండు .... ఆరంటే, ఆరుగాజాలున్నాయి. వెరీ కరెక్ట్. నీలిరంగు హాండ్‌బాగ్.'

గిరి లేచి నిలబడ్డాడు. అతనికి కొంచెం జంకుగా ఉంది. ఆమెతో జాగ్రత్తగా మాట్లాడాలని, హరి తన మంచితనాన్ని మెచ్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. పెళ్ళికాని పిల్లతో మాట్లాడటం వేరు. మొగుడున్న మగువతో మెలగటం వేరు.

దగ్గరకు రానే వచ్చింది.

'నమస్కారం ....' అన్నాడు అర్ధ చంద్రాకారపు బొట్టు చూస్తూ ఆమె కెదురుగా నిలబడి

ఆ అమ్మాయి కొంత ఆశ్చర్యపడ్డట్టు కనిపించి ప్రతి నమస్కారం చేసింది.

'నా పేరు శేషగిరి. నరహరి ఉత్తరం రాశాడు. మీరు భయంలేకుండా నాతో మద్రాసు రావచ్చు. మీకు అన్నయ్యలాంటి వాడిని.... టిక్కెట్టు కొన్నారా ?'

ఆ అమ్మాయి నవ్వు నాలుగువైపులా పరుగెత్తింది.

'ఓ ! .... మీరేనా ? .... ఆయనే కొనిచ్చారు. పాపం ! మిమ్మల్ని శ్రమపెట్టాల్సి వస్తోంది. ఏం చేయటం చెప్పండి. నాకు ఒంటరిగా ప్రయాణం చేయటమంటే మహా చెడ్డ భయం. నా కంటె వయస్సు సగం చిన్నవాళ్ళు కూడా ఒంటరిగా భూప్రదక్షిణం చేసి వస్తున్నారు. బెజవాడ నుండి మద్రాసు వెళ్ళలేనని చెప్పుకుంటే సిగ్గు ....'


(57 వ పేజి చూడండి)

స్కూలు భవనం కాలిపోతూంది. ఇది గమనిస్తూ నిలబడివున్న ఇద్దరు పిల్లల్లో ఒకడు వున్నట్లుండి ఏడుపు లంకించుకున్నాడు.

రెండవవాడు:-"ఏమిటి బ్రదర్! ఏడుస్తావెందుకోయ్! స్కూలు కాలిపోతే మనకే గదటోయ్ జాలీ. మళ్లీ స్కూలు కట్టేంతవరకు మనకు సెలవు లేగా!!

మొదటివాడు:- వెఱ్ఱి నా తండ్రీ! అది సరే. అందుకు కాదురా నేనేడవడం. మరి మాస్టర్లంతా బయటే వుండి పోయారే!

"రమ" (కడప)



ఇటీవల జరిగిన రాష్ట్రయువజన కాంగ్రెసు మహాసభలో ప్రసంగిస్తున్న శ్రీమతి ఇందిరా గాంధీ.

ఆంధ్రయువకుల సమీకరణదృష్టి: దేశనాయకుల అస్తవ్యస్త విమర్శ

ఉద్యమాలలో దూకడం, ఉద్రేకులుగా ఉండడం సంఘాలుగా ఏర్పడడం, ఆంధ్ర యువకులకు వెన్నతో పెట్టిన విద్య. పల్లెటూరులో అయితే ఆట—పాటలకు, విందులకు—వినోదాలకు జట్లు కట్టడం, సమాజాలుగా ఏర్పడడం, పోటీలు పడడం వారికి సరదా. పట్టణాలలో మాత్రం వీరి సమీకరణ, సంఘీభావం ఇందుకు విరుద్ధమైన స్వభావాలతో ఉంటుంది. వినోదం కంటె విజ్ఞానం పాలు దీనిలో హెచ్చు. దేశీయమైన ఆట పాటలకంటె, విదేశీయమైన వినోదాలమీద మోజు అధికం. ఇలా ఆయా పరిసరాల ప్రభావాన్ని బట్టి ఆంధ్ర యువకుల్లో సంఘీభావం సమీకరణదృష్టి వ్యక్తమవుతూ ఉంటుంది.

ఈ సంగతి తెలిసో, తెలియకో అఖిలభారత నాయకులు కొంతమంది అప్పుడప్పుడు ఆంధ్ర దేశం వచ్చి ఆంధ్ర యువకులను విమర్శించి పోతూవుంటారు. కమ్యూనిస్టు ప్రభావం ఉధృతంగా ఉన్న రోజుల్లో శ్రీ కె. ఎం. మున్షీ విజయవాడకు వచ్చి ఆంధ్ర యువకుల్లో గాంధీజీ సిద్ధాంతాలు బాగా వంటబడితే కమ్యూనిజం ఇంతగా ఇక్కడ అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. కాంగ్రెసు నాయకత్వాన నడిచిన ప్రతిజాతీయోద్యమంలోను వందలు కాదు వేల సంఖ్యలో పట్టణాల నుంచి కాదు, పల్లెల నుంచి, విద్యావంతులైన వారినుంచి కాక, విద్యార్థులుగా ఉన్నవారి నుంచి ఎలా ముందుకు రాగలిగారని ఆనాడు ఆయనను ఎదురు ప్రశ్నించగా సమాధానం లేకపోయింది.

ఈ తడవ కూడా, క్రిందటి నెల చివరలో విజయవాడలో జరిగిన రాష్ట్ర యువజన కాంగ్రెసు మహాసభలకు వచ్చిన అఖిలభారతయువజన కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ రామలాల్ పరీఖ్ కూడా "ఆంధ్రప్రదేశ్ యువజనకాంగ్రెసు పట్టు ఉన్నతమైనదే కాని, రాష్ట్రంలోని వ్యతిరేక వాతావరణంవల్ల సరిగ్గా పని చేయలేక పోతున్నది. ఇప్పటికే అనేక రంగాలలో అది అగ్రగామిగా ఉంది." అన్నారు. పోతే ఈ "వ్యతిరేక వాతావరణం" కాంగ్రెసు ముఠా తగాదాలకు సంబంధించి ఉందని ఈ మహాసభను ప్రారంభోత్సవం చేయడానికి వచ్చిన శ్రీమతి ఇందిరా గాంధి బహిరంగంగానే విమర్శించి వెళ్ళారు. ప్రాంతీయమైన వాతావరణాన్నిబట్టి ప్రసంగించారు.

వారు ఇంతగా చెప్పిన ఈ వ్యతిరేక వాతావరణం అనేదాన్ని గురించి, కాస్త పూర్వ చరిత్ర గుర్తు చేసుకుంటేగాని అసలు సంగతి బోధపడదు. మన జాతీయోద్యమాన్ని 1022, 1932 1942 అనే మూడు ఘట్టాలుగా విభజించుకుంటే, ఈ మూడు దశలలో నేటితో నడ్చిన వెల్లువల్లో మూడు తరాల యువకులు ముందుకు వచ్చారు. సహాయ నిరాకరణ, వ్యక్తిగత సత్యాగ్రహం, ఆగస్టు ఉద్యమం వర్గాలు వారిని కదిలించాయి. జాతీవాదులు, [illegible]

(61-వ పేజీ చూడండి)

మనమూ మన దేహస్థితి

డా॥ గాలి బాలసుందరరావు

మాటలు - లోపములు

గత వ్యాసములో మాటలాడడం అనేది, జీర్ణం లాగా ఒక కోశానికో, అవయవానికో సంబంధించిన పని కాదనీ, అందుకు అనేక అవయవములు—ఇతర బాధ్యతలు ఉన్న అవయవములు—సహకరించడం చాలా అవసరమనీ తెలుసుకున్నాము.

లేకుండా మాటలాడలేక పోవడమును "ఎఫేజియా" (Aphasia) అంటారు.

మాటలాడడానికి వినడం, చూడడం, అత్యవసరములు. విన్నదానినీ, చూచినదానినీ జ్ఞాపకం ఉంచుకుంటానికి, ఇతరులకు తెలియజేయడానికీ అక్షరములూ, వాటిని వ్రాయడం, చదవడం అవసరం. అందుకు చేతి కండరములు అవసరం. అంటేకరోటి (Skull) లో వున్న మెదడులో శ్రవణేంద్రియానికీ, చక్షురింద్రియానికీ సంబంధించిన కేంద్రములకూ, చేతి కండరములను ఆడించే మోటారు కేంద్రములకు అతి సన్నిహిత సహకార సంబంధం ఉండి ఉండాలి. విన్నదానిని మాటలుగా మార్చడానికీ, చూచిన దానిని మాటలుగా మార్చడానికీ, మెదడులో గౌరభాగంలో (Gray matter) ప్రత్యేక కేంద్రములు ఉన్నవి. మాటలాడడంలోనూ అనేక కండరములు పాల్గొంటున్నవి. పైన చెప్పిన సెన్సరీ కేంద్రములకూ, మాట్లాడడానికీ, వ్రాయడానికీ అవసరములయిన మోటారు కేంద్రములకూ సహకార సంబంధం ఉండాలి. చిత్రంలో ఏయే అవయవముల నుండి అనుభూతులు మెదడులో ఏ కేంద్రములకు వెళ్తున్నాయో చూపబడింది. ఈ వార్తలు పోయే దారులకు గానీ, యీ కేంద్రములకుగానీ వ్యాధి, ప్రమాదము ఏర్పడ్డప్పుడు మాటలాడడం లోపభూయిష్టమవుతోందని యిదివరకే తెలుసుకున్నాము. ఇందులో కంటినుంచి దృష్టి కేంద్రానికీ, అక్కడనుండి దృష్టి వాక్కేంద్రానికీ పోయే దారిలో భంగం ఏర్పడితే, మాట్లాడడం బాగానే ఉన్నా వ్రాసిన మాటలు చూచి, వాటి అర్థం తెలుసుకోవడం పోతుంది. మెదడులో ఉన్న మోటారు కేంద్రముల నుండి మాటలాడడంలో సహకరించే కండరములకు పోయే దారులు దెబ్బతిన్నప్పుడు విస్పష్టంగా మాట్లాడ్డం, సరిగా వ్రాయడం సాధ్యంకాదు. ఆ వ్యాధిగాని, అపాయంగాని తీవ్రమైనప్పుడు అసలు వ్రాయడం, మాటలాడడం పూర్తిగానే పోవచ్చును. ఈ వ్యాధిగాని, ప్రమాదం గాని కరోటిలో ఉన్న మెదడు భాగములో నైనా ఏర్పడవచ్చును. లేక వెన్నుపాములో నైనా ఏర్పడవచ్చును. మెదడులో కేంద్రములు చెడ్డప్పుడు మాట్లాడడంలో లోపమే కాక మాటలను అర్థం చేసుకొనే శక్తి కూడా క్రమంగా తగ్గిపోవచ్చును. చిన్న వాక్యములు అర్థమై పెద్ద వాక్యములు, డొంకతిరుగుడు వాక్యములు అర్థంకాకపోవచ్చును. అటువంటి రోగిని "నీ చేయి ఎత్తు" అంటే ఎత్తుతాడు. కాని "నీ ఎడమ చేతి చిటికెనవ్రేలుతో నీ కుడి కనుబొమను తాకు" అంటే కంగారుపడి, తెల్లమొగం వేస్తాడు. మోటారు లోపములవల్ల ఉచ్చారణ స్పష్టంగా ఉండదు. సెన్సరీ లోపములలో వ్రాసిన అక్షరములు చదివి అర్థం చేసుకోడం, అవి చూచి తాము వ్రాయడం సాధ్యంకాకుండా పోతోంది. ఒకప్పుడు మాటలే వినపడవు. అది ఒకరకమయిన చెముడు అనవచ్చును. కాని ఇతర శబ్దములు వినిపిస్తవి. మాటలు, మాటలుగా వినపడి అర్థం కావు. ఒకప్పుడు చూచిన వస్తువుల పేర్లను ఉచ్చరించడం సాధ్యంకాకుండా పోతుంది. మెదడు సరిగా ఉన్నప్పుడు మనం మాట్లాడిన మాట మనకు వినపడి, అందులో ఏదయినా లోపం ఉన్నప్పుడు సవరించుకొంటాము. అల్లాగే వ్రాస్తున్నప్పుడు తప్పు వ్రాసి, అది తప్పని తెలుసుకొని, అది సవరించుకుంటాము. మెదడులో కేంద్రములు చెడ్డప్పుడు, తప్పు సవరించుకోడము ఉండదు. మాట్లాడ్డం కూడా, ఏదో అర్థంవుండీ లేని పేలాపనగా ఉంటుంది. పంక్తులమీద పంక్తులు వంకర పంక్తులూ వ్రాయడం జరుగుతుంది.

మాటలాడడం అంటే నాలుకతో ఉచ్చరించడం అనే సామాన్యంగా భావిస్తాము. నాలుక లేకపోతే మాట్లాడ్డం సాధ్యంకాదు. కాని ఒక్క నాలుక సరిగ్గా ఉన్నంతమాత్రాన మాట్లాడడం సాధ్యంకాదు.

మెదడులోనో, వెన్నుపాములోనో లోపము ఏర్పడి మాట తీరు చెడినప్పుడు సమర్థులయిన నిపుణులనుంచి వైద్యసహాయం పొందడం తప్ప వేరు మార్గం లేదు. ఈనాడు వైద్యమున్న స్థితిలో అల్లా ఏర్పడిన అన్ని లోపములూ నివారణలు కూడా పూర్తిగా సవరించడం సాధ్యం కాదు. కాని మెదడూ, వెన్నుపామూ సరిగా ఉన్నా, నాలుక తర్పేదు లోపములవల్ల మాటలాడడంలో లోపములు చాలా రకములుగా ఏర్పడుతవి. ఆ లోపములకు కారణములు తెలుసుకొని కొన్ని సాధనములవల్ల కొంతవరకు సవరించుకోటానికి సామాన్యులకు కూడా వీలుంటుంది.వాటిని గురించి విపులంగా తెలుసుకోడం చాలాఅవసరం.

స్థూలంగా మాటలాడడంలో లోపములను ఈ క్రింది విధంగా విభజించవచ్చును.

(1) కావలసిన శబ్దములను కావలసిన క్రమంలో ఉచ్చరించలేక పోవడం.

(2) కావలసినట్లుగా కంఠస్వరమును ఉత్పత్తి చేయలేక పోవడం.

(3) నత్తి.

(4) త్వరగా మాటలే రాకపోవడం.

(5) జన్మతః పెదిమెలలోనూ, అంగిలిలోనూ లొత్ర ఏర్పడినప్పుడో, ముఖంలో పక్షవాతం ఏర్పడినప్పుడో కండరములు స్వాధీనంకాక ఉచ్చారణ లోపం ఏర్పడడం.

(6) చెముడు ఏర్పడినందున, మాటలాడలేక పోవడం.

మాటలాడడంలో లోపం ఏదోఒక కారణం వల్లనే నని ఉద్ఘాటించడానికి వీలులేదు. ఏ రకమయిన లోపానికయినా కారణం స్థానికం కావచ్చును. ఇతర అవయవములలోనో కోశములలోనో లోపం కావచ్చును.

మాట్లాడ్డంలో లోపం ఉందని ఎప్పు డనుకుంటాము ?

ఒకే మాటను, ఒకరకంగా, ఒక అర్థంతో ఒక ప్రాంతంలో నివసించేవారు ఉచ్చరించి ఉపయోగిస్తారు. ఆవిధంగా ప్రచారంలో ఉన్న ఆ మాటను పిల్లలయినా, పెద్దవాళ్లయినా ఉచ్చరించి ఉపయోగించనప్పుడు వినేవారి దృష్టిని ఆకర్షిస్తారు. ఆ వ్యక్తి మాటలాడడంతో వినే వారికి విడ్డూరంగా, అసాధారణంగా ఉంటుంది. కాని ఒక ప్రాంతంవారు మాట్లాడడం మరొక ప్రాంతంలో వారికి విడ్డూరంగా ఉండవచ్చును. దానిని మాటలాడడం లోపం అంటానికి వీలులేదు. కాని ఒకే ప్రాంతంవాడు మాట్లాడుతున్నప్పుడు, ఎదుటివారు గమనించదగిన భేదం ఏర్పడ్డప్పుడు మాటలాడడంలో ఏర్పడింది అని చెప్పవచ్చును. ఒకే ప్రాంతంలో కూడా ఒక సంస్కృతికి చెందినవారికీ మరొక సంస్కృతికి చెందిన వారికీ మాటలాడడంలో భేదం ఉండవచ్చును. శ్రోత్రియులు "వస్తారుట" అనరు. వస్తారష !" అంటారు. అది మాటలాడడంలో లోపం కాదు. ఎందుకంటే ఆ శ్రేణిలో అందరూ అల్లాగే అంటారు. కాని "వస్తారష, అని అనే వారు హఠాత్తుగా "ఒస్తారష" అనడం ఆరంభిస్తేనో, మాటలాడడం రావలసిన యీడులో "ఒస్తారట" అనడం రాకపోతేనో అది మాటలాడ్డంలో లోపమవుతుంది. ఈ శబ్దమును యీవిధంగా ఉచ్చరించాలని తెలిసీ, అల్లా ఉచ్చరించలేక పోవడమూ మాటలాడ్డంలో లోపమే అవుతుంది.

ఉచ్చారణలో లోపం ప్రధానంగా మూడు విధములుగా ఉంటుంది.


(1) మాటలో ఒక అక్షరమును మింగెయ్యడం. జీవితం అంటానికి జీతం అనడం 'ప్లే' అంటానికి 'పే' అంటం. వికారం అంటానికి బదులు వియారం అంటం.


(2) శబ్దలోపం. మాటలో ఒక శబ్దమును అనవలసినంత గట్టిగా, స్పష్టంగా అనకపోవడం. "విశ్వాసం" అంటానికి బదులు "విసాసం" అంటం. 'ష' అంటానికి బదులు 'స' లేక 'శ' అంటం.


(3) మాటలో ఒక శబ్దానికి బదులు మరొక శబ్దం ఉపయోగించడం. "రమ్మన మంటున్నారు" అంటానికి బదులు "దమ్మన మంతున్నారు" అండం. ఇది చిన్నపిల్లల్లో తరుచు కనుపిస్తూ ఉంటుంది.

మాట్లాడ్డంలో అతి సాధారణమైన లోపం ఉచ్చారణ లోపం. అది అర్థం చేసుకుని దానిని సవరించడం ఎల్లాగో తెలుసుకోవాలంటే నాలుక యితర శాబ్దికావయవములు ఎల్లా ఉన్నప్పుడు ఏ శబ్దం ఉత్పత్తి అవుతుందో తెలుసుకోవాలి.

అక్షరములు అచ్చులనీ, హల్లులనీ రెండు విధములని యిదివరకే తెలుసుకున్నాము. కంఠంలో శబ్దరజ్జువులు స్పందించినందున స్వరం ఏర్పడుతున్నది. ఈ స్పందనం సెకండుకు కొన్ని పర్యాయములు జరిగినప్పుడు ఆ స్పందనంలో స్పందన దూరం (Amplitude) సమానంగా ఉన్నప్పుడు ఒకే శృతిలో ఒకే నాదం వస్తుంది. అల్లా కానప్పుడు నాదంకాని శబ్దం వస్తుంది. అచ్చులు నాదములు, హల్లులు శబ్దములు, వీణ తీగలలాగే శబ్దరజ్జువులు తమ నిలువునా స్పందించవచ్చు. లేక తమలో ఒక భాగమును మాత్రమే స్పందింపజేయవచ్చును. కంఠస్వరంలో భేదములు స్పందన దూరం తగ్గి స్పందన సంఖ్య (Frequency) అంటే సెకండుకు ఎన్నిమార్లు స్పందించినదో ఆ సంఖ్య—హెచ్చుతూ ఉన్నందున ఏర్పడుతవి. ఈ భేదములను బట్టి కంఠస్వరం మారుతూ ఉంటుంది. మనకు అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ లు అచ్చులు. పాశ్చాత్య భాషలలో ఏ ఇ ఐ ఓ యు అన్న అక్షరములు మాత్రమే అచ్చులు. అచ్చులను ఉచ్చరిస్తున్నప్పుడు ఎక్స్‌రే చిత్రములు తీసి చూస్తే ఒక్కొక్క అచ్చును ఉచ్చరిస్తున్నప్పుడు నాలుక ఒక స్థానంలో ఉన్నదనీ, నాలుక ఆ స్థితినిబట్టి నోటిని అనుసరించివున్న గహ్వరములు ఘనపరిమాణము, అందులో ఉన్న గాలి స్పందన దూరమూ, సంఖ్య మారుతూ ఉంటవి. లేరింగ్సులో పుట్టిన నాదం నాలుక స్థితివల్ల అయా అచ్చుగా ధ్వనిస్తుంది. హల్లులు నోటిలోనూ, ముక్కులోనూ, ముక్కుకు రెండు ప్రక్కలా పైదవడ ఎముకలో ఉన్న సైనసులు (Sinuses) అనే ఖాళీ ప్రదేశములలోనూ ఏర్పడే స్పందనమునుబట్టి ఏర్పడతవి. ఈ హల్లుల లోనూ కొన్ని ఉత్పత్తిలో కంఠస్వరమునకు సన్నిహితమునై ఉంటవి. ఆ వివరములు వచ్చేవారం చర్చిస్తాము. ★







కెమిస్టులందరివద్ద లభించును.

DA-9297B

కథ కాని కథ

ఆఖరు ప్రార్థన

(మొదటి బహుమతి రు. 10 లు)

అప్పుడు మేము బందరులో ఉండేవాళ్ళం. మా పాపకు నాలుగేళ్ళు. అల్లిబిల్లి మాటల తోనూ, అమాయకమైన ప్రశ్నలతోనూ మమ్ము లను ఆనందపరవశులను చేసేది. నాకు ప్రతిరోజూ రాత్రి నిద్రపోయేముందు దైవప్రార్థన చేయడం అలవాటు. ఆ సమయంలో నా ప్రక్కనే మా పాప కూడా చేతులు జోడించి కూర్చొని నన్ను అనుక రిస్తూండేది. ఒకసారి నాకు బెజవాడ ట్రాన్స్‌ఫర్ అయి నట్లు ఆర్డర్లు వచ్చాయి. మరునాడే బయలుదేరుటకు నిశ్చయమవటంవలన తగిన సన్నాహాలు ఆనాటి రాత్రే చేసున్నాము. మా పాప నిద్ర వస్తోందని పండుకొన డానికి వెళ్ళినది. అలవాటు ప్రకారము ప్రార్థన చేసు కొని ఈ విధంగా ముగించింది. "ఓ ప్రియమైన భగ వంతుడా! మేము నిన్ను ఇక్కడ విడచి రేపే బెజవాడ వెళ్తున్నాము. ఇక నేనెప్పటికీ నీకు కనిపించను. ఇవే నా ఆఖరు నమస్కారాలు. ఈ మాటలు విన్న మేము నవ్వాపుకోలేకపోయాం.

రామానంద్ (విజయవాడ)

* * *

శూర్పణఖ-మారీచులు

(రెండవ బహుమతి రు. 5 లు)

ఇది మూడు నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన సంగతి. మధ్యాహ్నం ఫస్టవర్ తెలుగు క్లాసు జరుగు తోంది. తెలుగు లెక్చరర్ డ్రామా చదువుతున్నారు. చదువుతూ మధ్యలో శూర్పణక ప్రవేశం అని చది వారు. సరిగ్గా ఆ సమయానికే మా క్లాసమ్మాయి రాధ వచ్చి క్లాసులోకి ప్రవేశించింది. మేమంతా గొల్లుమన్నాం. 'శూర్పణఖ' 'శూర్పణఖ' అని కేకలు వేశాం. ఆ అమ్మాయి చాలా ఘటికురాలులెండి. అల్లరులకు భయపడేరకంకాదు. మావైపు తిరిగిఇంకు గొంకు లేకుండా "మీవంటి మారీచుల లోకంలో శూర్ప ణఖలు కాక దేవతా కన్యలుంటారా" అన్నది. మేమేమనాలో తెలియక కిక్కురు మనకుండా కూర్చున్నాం.

ఓ. ఆర్. లక్ష్మణస్వామి (హైదరాబాద్)

మాయబజారు

(రెండవ బహుమతి రు. 5 లు)

నాలుగు సంవత్సరాలనాటిమాట. మావాడు బాప ట్లలో ఎగ్రికల్చరల్ బి. యస్ సి. చదువుచున్నాడు. ఆ వూరువాడికి క్రొత్త. నేను ఒకరోజు మా వాణ్ణి చూడ్డానికని వెళ్ళినాను. వరే సాయంత్రము మేమి ద్దరము సినిమాకు బయలుదేరినాము. ఆ రోజుల్లో 'మాయబజారు' మహాజోరుగా ఆడుతోంది. ఓరిక్షాని మాయబజారుకి తీసికెళ్ళమన్నాము. కొంచెం కను చీకటి పడుతోంది. ఆ రిక్షా ఒక ఇరుకైన బజారుముందుఆగినది. రిక్షాఅతను యింక దిగం డన్నాడు. 'మేమిటోయ్ ఇక్కడ ఆపినావు" అన్నాము. అందుకతను "ఇదేనండి మాయబజారు" అని అన్నాడు మా గుండెలు జల్లుమన్నాయ్. కాని మాకేమి తోచక కొశ్చన్‌మార్కు ముఖం పెట్టినాము. మా తిప్పలు చూసి రిక్షా అతను "ఈ బజారును మాయబజారు అని పిలుస్తారండి" అని అన్నాడు. అప్పుడు మేము కొంచెము ఊపిరి పీల్చుకొని అసలు మాయ బజారుకి దారి తీశాము.

కె. ఆర్. పులి (కనకలగుంట)

* * *

అరమీసం

(రెండవ బహుమతి రు. 5 లు)

ఈ మధ్య మా వీధిలో సత్య హరిశ్చంద్ర నాటకం వేశారు. దాదాపు 12లేక 1 గం. కావస్తున్న సమయ మది. మొత్తంమీద నటులకు, ప్రేక్షకులకు గూడ నిద్మర తూలుతున్నది. నాటకం కాటికాపరి హరి శ్చంద్రుడికి పని పురమాయించే ఘట్టానికి వచ్చింది. పాపం కాపరిపాత్రధారికి పొర్షను సరిగారాలేదు కాబోలు. కొంచెం ప్రక్కకు వంగి వంగనట్లుగా వంగి ప్రామ్టిం గుకోసరం ఎదురు చూస్తున్నాడు. (అనగా ఆయన అప్పుడు పద్యం కొంతపాడి చివరి చరణం కొరకు ఆత్రుతతో ఉన్నాడు) అదే సమయంలో ఆయనకు ఒక ప్రక్క ఉన్న బుర్రమీసంవూడి క్రిందబడి రెండవ ప్రక్క మిగిలిపోయింది. ప్రామ్టింగు ఆయన మెల్లగా మీసం వూడింది చూచుకో అన్నాడు. అదే చివరి పద్య పాదం అనుకొని "మీసమూడెన్ చూచుకో! హా.....హాహా....హా" అని గట్టిగా రాగం తీశాడు. జనమంతా ఒక్కసారి గొల్లుమన్నారు. నాకూ నవ్వాగిందికాదు.

పి. ఎస్. వి. మూర్తి (హైదరాబాద్)

* * *

'రాకరాక వచ్చానని.....'

(రెండవ బహుమతి రు. 5 లు)

ఒకసారి మా పెద్దనాన్నగారు వాళ్ళ ఆరేళ్ళ అబ్బా యిని రాజమండ్రి చూపించుదామని తీసుకెళ్ళారు. అన్నీ చూపించి మధ్యాహ్నం హోటలుకి భోజనానికి వెళ్ళారుట. అక్కడ ఒకటి పెరుగు, ఒకటి మజ్జిగ భోజనం టిక్కట్లు కొన్నారు. అందులో వీళ్ళు భోజనం చేసేటప్పుడు ఎక్కువ మంది లేరుట. ఉన్నవాళ్ళు అందరు మజ్జిగ పోసుకున్నారుట. వీడు ఒక్కడే అక్కడ పెరుగు పోసుకున్నవాడు. ఇంటికి వచ్చిన తరువాత అక్కడి విశేషాలు చెబుతూ "రాక రాక వచ్చానని నాకు పెరుగుపోసి పెట్టారు" అని చెప్పాడు. అంతా విన్న మాకు వాడి అమాయకత్వా నికి ఎంతగానో నవ్వు వచ్చింది.

కుమారి కె. సుశీల (ప్రక్కిలంక)


* * *

శవమూర్తి!

(రెండవ బహుమతి రు. 5 లు)

హైదరాబాదులో టెలిగ్రాఫ్ ట్రెయినింగ్ సెం టరు పెట్టిన తరువాత ఎన్నికైన మొదటి బట్చులో నేనూ ఒకణ్ణి. మేము పదిమంది నాలుగు గదులు అద్దెకు తీసుకొనిఉండేవాళ్ళం. ఎక్కడకు వెళ్ళినా అందరం కలిసి వెళ్లేవాళ్ళం. హైదరాబాదు వెళ్ళిన కొత్తలో జరిగిన సంఘటనిది. ఒకసారి మేమంతా చార్‌మి నార్ చూడడానికివెళ్ళి ఒక బట్టల దుకాణంలోనికి పోయాం. అక్కడ మాతోటి టెలిగ్రాఫిస్టు కొన్ని బట్టలు తీసుకున్నాడు. దుకాణం యజమానికి తెలుగురాదు. బిల్లు రాస్తూ "ఆప్ కా నామ్ క్యాహై" (మీ పేరేమిటండీ) అన్నాడు. మా వాడు తన పేరు చెప్పాడు. తీరాబిల్లువిచ్చుకొని చూచేసరికేముంది. 'శేశవ మూర్తి' అని ఇంగ్లీషులో వ్రాసాడు, శేశవమూర్తి అని వ్రాయడానికి. అది చూచి మేమంతా కడుపు చెక్కలయ్యే టట్లు నవ్వుకొన్నాం. అప్పటినుండి మా ఫ్రెండు పేరెప్పుడు చెప్పాల్సొచ్చినా ఇంటిపేరు కూడా కలిపి ఎం. కె. మూర్తి అనే చెప్పేవాడు.

వజ్రపు కామేశ్వరరావు (కాకినాడ) ★



ఇచ్ఛ-దైవేచ్ఛ
భూపతి
S.d. Rao

"నా జీవితమే వృథా!"

"ఛీ—ఎన్నిసార్లు చెప్పాలిరా నీకు—అలా అనద్దని? ప్రపంచంలో ఏ వ్యక్తీ అనవసరంగా పుట్టడు....."

రాజు నేను చెపుతున్న మాటలకు విలువ యివ్వనట్టు గులకరాళ్ళు చెరువులో విసురుతున్నాడు. నేను మాత్రం నా ధోరణి మానలేదు.

"....అంటే...పుట్టిన ప్రతివాడివల్లా ప్రపంచానికి ఉపయోగం ఉంటుందనికాదు నా భావం. కానీ ప్రతి ఒక్కని ఉనికివల్లా కొందరికన్నా ఉపయోగమో, సంతోషమో, ఆనందమో మరేదైనానో ఉండితీరుతుంది." నేను ఆవేశంతో చెప్పాను. పసిపిల్లాడికేసి చూసినట్టు రాజు నాకేసిచూసి ఆఖరి రాయి చెరువులోకి విసిరేసి చేతులు దులుపుకున్నాడు.

"వాసూ! నువ్వు చెప్పేది—దగ్గర దశాంశం వరకూ సవరించిచూస్తే—నూటికి నూరు పాళ్ళూ నిజమే—నేను కాదనను. కానీ, నా ఉనికి ఎవరికి ఆనందం?" అన్నాడు తీక్షణంగా చూస్తూ.

అలాంటి ప్రశ్నకు సమాధానం యివ్వడానికి నేను సిద్ధంగాలేను. ఆ సంగతి కనిపెట్టిన రాజు చిన్నగా నవ్వాడు.

"నీ ఉనికి నాకు ఆనందంరా" అన్నాను రాజు ముఖంలో మార్పు గమనిస్తూ.

"నిజమే! నేను చచ్చిపోతే కన్నీరు కార్చేవాళ్ళు ఎవరైనా గనుకఉంటే నువ్వు ఒక్కడవే. ఆ సంగతి నాకు తెలుసు."

ఆ మాటలు ఎంత బాధతో కూడినవో నాకు అర్థం అయ్యింది. రాజు నేలమీద వేలుతో గీతలు గీస్తున్నాడు.

"రాజూ నే నొక మాట చెప్తాను వింటావా? షేక్స్పియర్ ఏమన్నాడో తెలుసా—ప్రపంచం అనేది ఒక స్టేజి—అందులో మనం అందరం పాత్రధారులం అన్నాడు. కనుక మన పాత్ర ఎంత వరకూ అవసరమో, ఎంతవరకూ అనవసరమో మనని ప్రవేశపెట్టిన వాడే తేల్చుకుంటాడు. మనం కాదు ఆ సంగతి తేల్చేది. నువ్వు అనవసరం అని వాడికి ఎప్పుడుతోస్తే అప్పుడే నిన్ను తోసేస్తాడు యీ స్టేజిలోంచి, తెలుసా" అన్నాను.

నా ఉపన్యాసానికి రాజు చప్పగా నవ్వాడు.

"పోనీ అలాగే అనుకుందాం. కానీ నాటకంలో నీకు నచ్చని పాత్ర యిస్తే ఒప్పుకుంటావా? ఒప్పుకోవు. అంతగా వస్తే నాటకం మానేస్తావు. అవునా—అలాగే నేనూను...."అన్నాడు రెండు చేతులూ వెనక్కి ఆనించి తలఎత్తి ఆకాసం వంక చూస్తూ.

రాజు చిన్నప్పటినుంచీ అదోక రకమైన మనిషి. అతని నిశ్చయాన్ని, విశ్వాసాన్నీ ఎవరూ మార్చలేరు. అతనితో మాట్లాడడం అంత తేలికయిన పనికాదు.

"అయితే నీ నిశ్చయం ఏమిటి?" అన్నాను.

"నా నిశ్చయం—అదే—నాకు జీవితేచ్ఛ ఏనాడో పోయింది. కాని, ఎప్పుడు—ఎలాగ—నా తనువు పోతుందో నాకే తెలియదు" అతని మాటల్లో విరాగి మాటల్లోకన్నా ఎక్కువ నిస్పృహకనిపించింది.

"అవును నీకేం? సూటూ, బూటూ వేసుకున్నావు. ఎన్నికబుర్లయినా చెబుతావు" అన్నాడు రాజు. ఈ మాటలకు వాసు మనస్సులో వెయ్యి శూలాలతో పొడిచినట్లు బాధపడ్డాడు.

"రాజూ! యీవిధంగా నన్ను మాటలతో హింస పెట్టావంటే నీతో షికారుకు నేను రాలేను" అన్నాను ముఖంమీదికి కోపం తెచ్చుకుంటూ.

"ఆవేశపడక—మనిషికి పశువుకూ ఉన్న తేడాయే అది"

"అలా అనక. పశువులకు కూడా ఆవేశం ఉంటుంది. ఆగ్రహం కూడా ఉంటుంది. ఆవుచూడు—అంతదాకా ఎందుకు పిల్లిచూడు—దాన్ని గనుక మనం ఎక్కువగా భయపెడితే మన గుడ్లుపీకి గూట్లో పెడుతూందిట......ఆ ఉద్రేకమే గనుక లేకపోతే........"

"అలాగని మీ బామ్మ చెప్పిందా" నవ్వుతూ అన్నాడు రాజు.

"కుట్టని తేలు—కుమ్మరిపురుగుకన్నా హీనం" అన్నారు పెద్దలు తెలుసా? కుడితేగాని తేలుకు గౌరవం, అదంటే మనకు భయం ఉండవు తెలుసా"

రాజు మాట్లాడకుండా తలపంకించాడు పాలేరు కుర్రాళ్ళు గేదెలను చెరువులో కడిగి వాట్లమీద ఎక్కి కూర్చున్నారు. వాళ్ళల్లో ఒక కుర్రాడు "సానా పొద్దూకిందయ్యగారూ యింకా కూకుండారేమిటి?" అన్నాడు మమ్మల్నిచూసి.

"వాడి మాటల్లో ఎంత ఆప్యాయత ఉందో చూడు. వాడికి మనం ఏమైనా పెట్టామా, పోశామా? రోజూ యిక్కడ కూర్చున్నందువల్ల అయిన పరిచయమేగదా? అమాత్రం ఆప్యాయతకు కూడా నేను నోచుకోలేదు" అంటూ రాజు లేచి నించుని క్రిందనున్న రుమాలు తీసుకున్నాడు.

నేను కూడా లేచాను. "రాజూ—పసికందు—పాలకోసం ఏడిస్తే పాలు కలిపేలోగా వేలు నోట్లో పెడుతారు. పసిపిల్ల ఆవేళే 'పాలపీక' అనుకుని అది చప్పరిస్తూ, పాలు వస్తున్నాయని తృప్తి పడుతుంది. కానీ రాను రానూ పెద్దయ్యాక అది పాల కీక కాదని, పాలురాటంలేదనీ గ్రహించి, కాస్సేపు చప్పరించినా తర్వాత వేలుతో సేసుకుంటూ ఏడుస్తుంది తెలుసా—అమాత్రం జ్ఞానం లేదు నీకు" అన్నాను.

"నిజమే" అన్నాడు నెమ్మదిగా.

చెరువుగట్టు వెంబడి ముందు నేను నడుస్తున్నాను. నా వెనకాల రాజు నడుస్తున్నాడు. గట్టుమీదనున్న యీతచెట్టు సమీపానికి వచ్చాను. అమాంతం ఒక కాకి వచ్చినా నెత్తిమీద తన్ని ఎగిరి పోయింది. కొన్ని కాకులు అరుస్తూ ఎగరసాగాయి. నేను రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకుని కొంచెం వంగడంవల్ల నెత్తి చిల్లుపడలేదు.

"ఏమయ్యింది?" అన్నాడు రాజు ముందుకు వస్తూ.

"ఆగు. వెనక్కివెద—యిక్కడెక్కడో కాకి పిల్ల పడిపోయి ఉంటుంది యీ చెట్టుమీంచి జారి. మనం ముందుకు ఒక్క అడుగు వేసినా పొడిచి చంపేస్తాయి" అన్నాను వెనక్కు వచ్చేస్తూ.

"చూద్దాంపద" అన్నాడు రాజు నన్ను తోసుకుని ముందుకు వెళుతూ. కాకులు గోల గోలగా అరువులు ప్రారంభించి రాజుమీద పడ్డాయి. "రాజూ వృథా శ్రమపడక రా—వచ్చెయి" అన్నాను నేను మరో రెండడుగులు వెనక్కివేస్తూ. నెత్తిన చేతులు పెట్టుకుని రాజు వెనక్కి వచ్చేశాడు.

'దానిపిల్ల అంటే దానికి ఎంత ప్రేమో చూడు—ఆ కాకి దాని చుట్టం కాకులూ కూడా కాపలా కాస్తున్నాయి. చెట్టంత మానవుణ్ణి కూడా ఢీ కొనడానికి వెనుదీయటంలేదు" అన్నాను.

"మానవులకూ, పశుపక్ష్యాదులకూ ఉండే తేడా యిదే" అన్నాడురాజు నా వెనకాల వస్తూ.

"అంటే" అని అడిగాను.

"ప్రేమ, వాత్సల్యం, అభిమానం—యివన్ని రాను రాను మానవుల్లో తగ్గిపోతున్నాయి. పశుపక్ష్యాదులలో యివన్నీ రాను రాను ఎక్కువయి పోతున్నాయి—యిది నా అభిప్రాయం—బహుశా తప్పు అయివుండచ్చు" అన్నాడు.

నేను రాజు విమర్శనకు ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయాను. "నిజమే" అన్నాను.

"స్వానుభవం నిజంకన్నా గొప్పది" అన్నాడు రాజు. దారిలో యింకేమీ మాట్లాడలేదు. మౌనంగా ఎవరింటికి వాళ్ళం చేరుకున్నాము.

భోజనంచేసి ఆరుబైట వెన్నెలలో మంచం వేసుకున్నాను. గేదెకు పాలు పిండిన అమ్మ దూడను వదిలింది. 'అంబా' అంటూ అది ఒక్క గెంతులో తల్లివద్దకు వెళ్ళిపోయింది. ఆ దృశ్యం నాకు ఆనందాన్ని కలుగజేసింది.

పండు వెన్నెల పిండి ఆరబోసినట్లుంది. "చంద్రునికి ఎంత పక్షపాతం? తన వెన్నెలను పట్నవాసులకన్నా పల్లెవాసులకే ఎక్కువగా యిస్తాడు. వెన్నెలే ఒక్కటే కాదు — ప్రకృతి అంతా అంతే. పట్నవాసులు ప్రకృతి అనుభవించలేరు" అనుకున్నాను వెల్లకిల్లా పడుకుని చంద్రునికేసి చూస్తూ.

నా మనస్సు చంద్రునినుంచి రాజుమీదకు మళ్ళింది.

రాజు— అతను గంభీరుడు. తండ్రి అంత నీచంగా సంచరించినా—ఆ సంగతి ఆప్తమిత్రుణ్ణయిననాతో కూడా చెప్పడు. మాట వరసన అతనిచ్చే సూచనల ద్వారా గ్రహించాల్సిందేకానీ అతను ఏనాడూ కావాలని చెప్పలేదు.

తాతయ్య పడుకుని సంస్కృత శ్లోకాలు గట్టిగా చదువుతున్నాడు. ఈ విషయం తాతయ్యని అడిగి తాతయ్య అభిప్రాయం తీసుకుందాం అనుకుని మంచంమీంచిలేచి వంటింటి గుమ్మం దగ్గరున్న ముక్కాలిపీట తెచ్చుకుని మంచం దగ్గర వేసునికుని తాతయ్యతో రాజు సంగతి చెప్పాను. నా ప్రశ్నలకు సమాధానంగా తాతయ్య సంస్కృత శ్లోకంలో ఒక పాదం చదివాడు.

"ప్రాప్తేతుషోడశవర్షే — పుత్రం మిత్రవ

దాచరేత్''.....అంటే, అంటూ దాని అర్థం మొదలు పెట్టాడు.

''పదహారేళ్ళు గడచిన కొడుకును ఏ తండ్రి అయినాసరే తన స్నేహితుణ్ణి చూసినట్టు చూడాలి గాని, కొడుకుగదా అని అజమాయిషీ చెయ్యకూడదు. అలా చేస్తే — తన కొడుకుకు తనని ఎదిరించవలసిన పరిస్థితి తనే యిచ్చినవాడవుతాడు. నువ్వేం భయపడనక్కరలేదు — కాలగమనంలో రాజే వాళ్ళ నాన్నని ఎదిరించక తప్పదు—రబ్బరుకు—వొక్కినకొద్దీ ఎగిరే శక్తీ, లాగిన కొద్దీ కుంచించుకునే శక్తి స్వతసిద్ధంగానే ఉంటాయి. మనమేం నేర్పక్కరలేదు'' అన్నాడు.

తాతయ్య మాటలు నగ్నసత్యాలు. కానీ రాజు పట్ల యీ శ్లోకాలు నిజం అనిపించుకుంటాయి అని నాకు తోచలేదు.

నా పక్కమీదకు వచ్చి నిద్ర కుపక్రమించాను.

* * *

మర్నాడు మామూలు ప్రకారం చెరువు గట్టు మీద కూర్చున్నాము. రాజు చెరువులోకి రాళ్ళు విసురుతున్నాడు.

''రాజా! ఇంటరుకి నువ్వు మీ నాన్నగారింటికి వెళ్ళిన దగ్గరనుంచి యీ మూడు సంవత్సరాలల్లో జరిగిన విషయాలు క్లుప్తంగా చెప్పు—మనం ఒక మార్గం తొక్కుదాము'' అన్నాను.

నా మాటలు వింటూనే అతని ముఖం నల్లబడిపోయింది. పక్కనున్న గడ్డిపువ్వునుకోసి నలిపి నీళ్ళలో పారేశాడు. అతని కళ్ళవెంట నీరు ప్రవాహంగా కారుతోంది. తలవంచుకుని మౌనంగా కన్నీరు కార్చడం మొదలు పెట్టాడు. నాకు కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కదిపినట్టు బాధ కలిగింది.

''రాజా! అనవసరంగా మధనపడక. నువ్వేం చెప్పక్కరలేదులే'' అన్నాను వోదార్పుగా రాజు భుజం తట్టి. రాజు శిలాప్రతిమలా కదలకుండా ఉండిపోయాడు.

''రాజును యిక ఎన్నడూ ఏమీ అనకూడదు. పిల్లైతే విషయాలను గ్రహించి హద్దులు మీరకుండా మరీ మాట్లాడాలి. రాజు మనస్సు అనవసరంగా కష్టపెట్టకూడదు'' అనుకున్నాను.

అంత బాధపడినాసరే కన్నతండ్రి అంటే ఎంత గౌరవం, ఎంతగుట్టు? కాసబియాంకా' కథ విన్నవారు అమితాశ్చర్యపోతారు. కాని రాజు కథ విన్నవారు? కాస్సేపుదాకా నమ్మరు కూడా. ఏది ఏమైనా రాజు అంటే నాకు అసమానమైన గౌరవం, అభిమానం ఉన్నాయి.

''రాజా అనవసరంగా బాధపడక. నీ బి. ఏ. అయిపోనియ్యి — ఆ తర్వాత నువ్వూ సంపాదించుకోగలవు—అంతదాకా ఎలాగో అలాగ జాగ్రత్తగా కాలక్షేపం చెయ్యి'' అన్నాను ఏమనాలో తెలియక.

''నిజమే. కానీ నాకా శక్తి లేదు. ఈ బి. ఏ. నేను పూర్తి చేయగలననే నమ్మకం నాకులేదు. నేను ఎలాగూ చివరిదాకా బతకలేను'' అన్నాడు. అతని మాటలలో ఎంత నిస్పృహ ఉందో కనిపెట్టగల శక్తి నాలో లేదు. అతన్ని హుషారుపరచాలన్న ఉద్దేశ్యంతో ''చస్తాను చస్తాను అన్న ఎవ్వడూ చచ్చేదాకా చావలేదు. వాళ్ళల్లో నువ్వొకడివి'' అన్నాను.

''అలాగే అయితే నా అంత దురదృష్టవంతుడు ప్రపంచంలో మరొకడు ఉండడు.''

''ఏడిచేవు లేవోయ్!''

''అది చేసినా హాయిగా వుంటుంది. ఏమీ చెయ్యలేనప్పుడు బావురుమని ఏడిస్తే ఎంత రిలీఫ్ వస్తుందో తెలుసా? నాకు అటువంటి అదృష్టం కూడా పట్టదు'' అంటూ కళింగంమీద వెల్లకిల్లా పడుకున్నాడు.

''రాజా! యిదిగో ఆఖరిసారిగా చెపుతున్నాను. నువ్వు యీ రకమైన మాటలు మాట్లాడితే నేను నీతో రాలేను. ఇంతకన్నా నన్ను చిత్రవధ చేసినా నాకు ఆనందమే'' లేచినుంచున్నాను.

రాజు కూడా లేచాడు. ''వాసూ! నా మనస్సులో ఉన్న విషయం నీతో చెపుతున్నాను. స్నేహితుడు అంటే నాకు పవిత్రమైన అభిప్రాయం ఉంది. తన స్నేహితుని మనస్సు నొప్పించకుండా అతని మనస్సును అనుసరించి మాట్లాడుతూ అతన్ని ఆనందపరిచేవాడే స్నేహితుడు. ఇంగ్లీషులో అలాంటి స్నేహితుణ్ణి 'ఫ్రండు' అని నేను అనలేను. ఫ్రండు అంటే పేలవంగా ఉంటుంది నాకు. స్నేహితుడు అని అంటే అనడం నా వళ్ళు పులకరిస్తుంది. అటువంటివాళ్ళల్లో నువ్వు — అసలు స్నేహితుడు అన్న పదానికి నువ్వే నాకు స్ఫురిస్తావు'' అన్నాడు కట్టవెంబడి నడుస్తూ.

ప్లీడరు:- (సాక్షితో)
నువ్వేమీ చదువుకోలేదన్నావు! మరి యింత తెలివిగా జవాబులెలా ఇవ్వగలుగుతున్నావు?
సాక్షి:—బుద్ధితక్కువ ప్రశ్నలకి జవాబివ్వడానికి చదువక్కరలేదండి.
యం. ప్రభాకరరావు (కావలి)

* * *

శలవులు అయిపోయాయి. నేను నా చదువుకోసం బందరు వెళ్ళిపోయాను. రాజు బెజవాడ వెళ్ళిపోయాడు. నేను బందరు వెళ్ళేనాడు ''రాజా: ఏ విధమైన అఘాయిత్యం తలపెట్టనని, వేసంగుల్లో మళ్ళా కనుపిస్తాననీ నాకు నువ్వు హామీ యివ్వు'' అన్నాను. రాజు ''చూద్దాం'' అన్నాడు.

* * *

కాలేజీలు తెరిచి అప్పుడే నెల అయిపోయింది. పరీక్షలు దగ్గరకు రావడంవల్ల హోరాహోరీగా చదవడం ప్రారంభించాను.

ఒకనాడు టపాలో రాజు దగ్గరనుండి నాకొక ఉత్తరం వచ్చింది. అది పదిహేను పేజీలైనా ఉంది. వంటరిగా ఒక మూల కూర్చుని ఆ ఉత్తరాన్ని ఆమూలాగ్రం చదివాను. నాకు మనస్సంతా వికలమయిపోయింది. కాలేజీలో ఉండలేక రూముకు వచ్చేశాను. మంచంమీద పడుకుని రాజు విషయం ఎంతసేపు ఆలోచించానో నాకే తెలియదు. ''అలా వున్నావేం'' అన్న నా రూముమేటు మాటలతో యీ లోకంలోకి వచ్చాను. ''అబ్బే ఏం లేదు'' అన్నాను పొడిగా. ''సినిమాకి వెళ్దాం వస్తావా?'' అన్నాడు అతను.

''ఇప్పుడేం సినిమా'' అన్నాను నేను.

''అసలు వస్తావా అని అడిగాను''

నాలుగేళ్ళనుంచీ నాతో సహజీవనం చేస్తున్న నా రూముమేటు ప్రసాద్‌తో యీ విషయం ముచ్చటించి అతని అభిప్రాయం కూడా తీసుకుందాం అనుకున్నాను. ఆ నిశ్చయంతోనే ''నేనో విషయం అడుగుతానుగానీ చెప్తావా?'' అని అడిగాను.

''ఏమిటి'' అన్నట్టు నాకేసి చూశాడు.

''ఇది వూహ అనుకో — నీ సలహా మాత్రం చెప్పు'' అని ప్రారంభించాను—''నీ తండ్రి మొదటి భార్యకు నువ్వొక్కడివే సంతానం అనుకో. నిన్నుకని మీ తల్లి చనిపోయిందనుకో. మీ నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు అనుకో — మీ పినతల్లి వయస్సులో చాలా చిన్నపిల్లా, మంచి గుణం కలది ప్రత్యేకంగా నువ్వంటే అభిమానించేదీ అయిందనుకో—అదే మీ తండ్రికి అనుమానం అయిందనుకో—నిన్ను తన్నడానికి వచ్చాడనుకో—'' అన్నాను గబ గబా.

''ఇవన్నీ అనుకోడాలు కాకుండా నిజంగా జరిగితే నేనైతే ఆ తండ్రిని అమాంతం యిలా పుచ్చుకుని అలా పైడు కాలవలోకి పారేస్తాను అంతే'' అంటూ తన చేతిలో బూటు రూమువతలకు విసిరేసి పరిగెట్టుకెళ్ళి తెచ్చుకున్నాడు.

''లేకపోతే'' అన్నాను నేను మంచంమీంచి లేచి కూచుంటూ.

''లేకపోతేనంటావా? ఆ యింట్లోంచి వేరుపడి నాకు కావలసిన ఆస్తిపాస్తులూ చిన్నం చిదరా, ఎగదూ, న్యాటూ, బట్టా పాతా అంతా టకాయించి సదరు కోర్టువారి ద్వారా రాబట్టుదును!''

నాకు అతను చెప్పింది నిజమే అనిపించింది. కానీ అది రాజు చెయ్యలేని పని.

''ఏం అలాంటి పరిస్థితిలో ఎవరైనా చిక్కుకున్నారా?'' అన్నాడు నా ముఖకవళికలు కనుకున్న ప్రసాద్.

''అవును''

''ఆ! వాస్తవికంగా అలాంటి తండ్రి ఉన్నాడా? నీ స్నేహితుణ్ణి వాళ్ళ బాబును యీడిచి నాలుగు తన్నవని రాయి. కనగానే తలిదండ్రులయిపోతారా? చిత్తశుద్ధీ, ప్రపంచజ్ఞానం అక్కర్లే—అదేదో సామెత చెప్పినట్టు కన్న ప్రతీ అమ్మా, తల్లీ అవదు. దాని మొగుడు తండ్రీ అవడు!'' అన్నాడు.

''కాని నా స్నేహితుణ్ణి వాళ్ళ నాన్నేతన్ని అవతలకు తగిలేశాడు. సగంలో ఆగిపోయిన చదువుకోసం మేనమామ దగ్గర అప్పుకోసం వెళ్తున్నానని రాశాడు'' అన్నాను నెమ్మదిగా.

"మీవాడెలా వూరుకున్నాడోయ్. చదువులో జీనియస్ ఏమిటి?"

"జీను"

"అదీ! అలాగ చెప్పు. ఈ ఫస్టు మార్కులూ, యూనివర్శిటీ ఫస్టులూ వచ్చే కుర్రాళ్ళు బయట ప్రపంచంలో అంతే — వింతపశువులు — ఎప్పుగాలల్లా వుంటారు. యిది నా అభిప్రాయం సుమీ. ఎవ్వరితోనైనా అనేవు. వీపు పగలగొట్టి సున్నం మెత్తి ఆముదం రాసి నవ్వారు మంచంమీద పడుకోబెట్టి నీలం దుప్పటి కప్పుతారు" అనేసి నవ్వుకుంటూ సబ్బు తీసుకుని బాతురూమువైపు నడిచాడు.

*   *   *

మరోవారం రోజుల్లో రాజు దగ్గరనుంచి మరో ఉత్తరం వచ్చింది. "పోనీలే నోటు రాయించుకునైనా యిచ్చాడు" అనుకున్నాను.

రాజు దగ్గరనుంచి తరుచు ఉత్తరాలు నాకు వస్తూనే ఉన్నాయి. ఒకనాడు వచ్చిన ఉత్తరం మళ్ళా నన్ను కలవరపెట్టింది. "మళ్ళా ఆ గుమ్మం ఎందుకు ఎక్కావు? నీకు మంచి పనే అయింది. తల పగలడం చాలా మంచి బహుమతి నీకు. యీసారి వెళితే నీ ప్రాణం పోయినా నేను ఆశ్చర్యపోను — కాని ఒక విషయం — నీవల్ల అమాయకురాలైన నీ పినతల్లి జీవితం నాశనమవకుండేలాగ చూడు" అని రాశాను చొరవ తీసుకుని.

*   *   *

ఆవేళ ఆఖరు పరీక్షరాసి వచ్చాను. కాలేజీతో ఋణం తీరిపోయింది యీనాటితో అన్న ఆనందంతో కుర్రాళ్ళు సినిమాలకు బయల్దేరారు. నేనూ, ప్రసాదూ సినిమాకి వెళ్ళాము. ఆ మర్నాడు కూడా నాకు అక్కడ పనుండడంవల్ల ఉండిపోయి మూడోనాటి ఉదయం కారెక్కాను.

*   *   *

బస్స్టాండుకు రాజు వచ్చాడు. 'ఒరేయ్ వాసూ' అని పిలిచేదాకా నేను వాడిని గుర్తుపట్టలేకపోయాను.

ఇద్దరం రిక్షాలో కూర్చున్నాము. "పరీక్షలు ఎలా రాశావు?" అన్నాడు నన్ను—'బాగానే వ్రాశాను.. అది సరేకాని యిలాగ మారిపోయావేంరా రాజూ— నిన్ను ఆనవాలు కట్టడమే కష్టమయ్యింది" అన్నాను నేను. "మనోవ్యాధికి మందులేదు అని నీకు తెలుసు కదురా? యింతకన్నా చిక్కలేక యింతతో ఆగిపోయాను" అన్నాడు గంభీరంగా.

*   *   *

వేసంకాలంలో చెరువుగట్టుమీద కూర్చోకుండా ఎదురుగావున్న మోటబావిగట్టుమీద కూర్చోడం మాకు అలవాటు. అలవాటు ప్రకారం బావిగట్టున కూర్చున్నాము. రాజు గట్టుమీద కూర్చుని కాళ్ళు బావిలో వేళ్ళాడేశాడు. నే నతని పక్కనే కూర్చున్నాను. నిశ్శబ్దం రాజ్యం చేయసాగింది. ఒక రాయి తీసి రాజు బావిలో పడేశాడు. 'బుడింగ్' అని శబ్దం చేసింది. నేను నీళ్ళల్లోకి చూశాను. రాయి పడిన చోటునుండి నీటితరంగాలు రింగులు రింగులుగా నూతిగట్టువరకూ పరిగెత్తుతున్నాయి.

రాజు జేబులోంచి ఒక కాగితంతీసి నా చేతికి అందిచ్చాడు. మడతవిప్పి దాన్ని చదివాను. నా ముఖంలో మార్పులు గమనిస్తున్నట్లు రాజు నాకేసి చూస్తున్నాడు. కాగితం చదివేసి మడతపెట్టి రాజుకు అందించేశాను.

"మీ మామయ్య యిలా రాయడానికి కారణం ఏమిటి?"

"మా నాన్న ఆస్తి నాకు రాదని తెలియడమే."

"ఎందుకురాదు?"

"మా నాన్నగారిది స్వార్జితం. పిత్రార్జితం కానీ కూడా లేదు."

నాకేమని చెప్పాలో తెలియలేదు. "అయితే ఏం చెయ్యదలుచుకున్నావు?" అన్నాను.

దానికి సమాధానంగా రాజు కాళ్ళను వూపుతూ నవ్వాడు. అతని ఎడంకాలు చెప్పు జారి నూతిలో పడింది. అరే! చెప్పు జారిపడిపోయిందిరా— లేలే— నువ్వూ పడగలవు."

"ఇప్పుడు ఏం జరిగిందో చూశావా?"

"చెప్పు జారి నూతిలో పడిపోయింది."

రాజు మిగిలిన చెప్పును తీసి చేత్తో పట్టుకుని "దీని ఉపయోగం యిప్పుడు ఏమైనా ఉందా?" అని అడిగాడు.

నాకు రాజు ప్రశ్న అర్థమయ్యింది. "ఆ వుంది" అన్నాను మొండిగా.

"ఏమిటి? చెప్పు....."

"చెప్పులుచేసేవాడికిస్తే దీనిలాంటిది యింకో చెప్పు తయారుచేసి యివ్వగలడు."

"అప్పుడు ఒక కాలికి కొత్త జోడూ మరో కాలికి పాత జోడూ తొడుక్కుంటావన్నమాట. ఏం తెలివిరా, వ్యాసభూపతివి కూడాను మళ్ళా!" నవ్వుతూ అన్నాడు.

"అందుకనే పేరు అలా మార్చుకున్నాను."

"అప్పుడు యీ చెప్పు గతి ఏమిటో తెలుసా?"

"తెలియదు.

"ఇదీ దీనిగతి" అంటూ దాన్ని రంయ్యమని నూతిలో గిరాటు వేశాడు. 'ఛీ ఛీ' అన్నాను నేను. నాకు తెలియకుండానే.

"ఏం? జత—అంటే దిక్కులేని ఆ చెప్పుకు అంతకన్నా ఏం జరుగుతుంది"

"అది సరేలేగాని, మరి నీ విషయం ఏమిటి?'

ఒకాయన ఇంకో ఆయనతో:

ఏమండీ నా ఆరోగ్యం ఫేలయ్యేట్లుంది.

రెండో ఆయన పరధ్యానంగా ఆ ఫరవాలేదు లెండీ, సెప్టెంబరులో పేసవుతుంది

కె. పద్మ (విజయవాడ)

"ఆ చెప్పుగతే" అన్నాడు నీళ్ళలో తన ప్రతిబింబాన్ని చూసుకోడానికి వంగుతూ.

"ఛీ రాస్కెల్—నా చిన్నతనంనుండి నువ్వు యిలాగే అంటున్నావు. చచ్చేవాళ్లెవరూ చెప్పిచావలేదు." అన్నాను కోపంతో. రాజు నవ్వుతూ బావిగట్టుమీద వెల్లకిల్లా పడుకున్నాడు.

"రాజూ షేక్స్పియర్ రాసిన 'హేమ్లెట్ చదివావుకదా—వాడు అలాగే తనలో తను మధనపడి సర్వనాశనమూ అయ్యాడు. ఏ విషయాన్నీ కూడా చివరదాకా తరచి చూడకూడదు. తాడు తెగేదాకా లాగకూడదు" అన్నాను నేను మళ్ళా. రాజు నిశ్శబ్దంగా ఆకాశంవంక చూస్తున్నాడు.

"అయితే నోటులో ఎప్పుడు యిస్తానని రాశావు?

"ఎప్పుడు అడిగితే అప్పుడు యిచ్చేలా రాశాను.

"ఏడవలేకపోయావూ? అదేం తెలివిరా? ఉద్యోగంలో చేరిన తర్వాత తీర్చగలనని రాయాలిగానీ. యిప్పుడు మీ మామయ్యలాయరు నోటీసు యిస్తే" అన్నాను.

ఆ సంగతి ఆలోచించలేదు నే నప్పుడు.

"నీకు చావు విషయం తప్ప రెండో విషయం ఆలోచించే శక్తి లేదు."

"అవును ఆ మాట నిజమే" అని రాజు లేచి కూర్చున్నాడు.

"రాజూ మనం యీ వేసంగిలో చెరువుగట్టుమీద కూర్చోకుండా యీ నూతి గట్టుమీద కూర్చుంటాం ఎందుకో తెలుసా"

"చెరువులో నీళ్ళు ఉండవు గనుక.

"అంటే?"

"అంతకన్నా నాకు తెలియదు."

"మనకు యిష్టమైన వస్తువు ఒకచోట లేనపుడు అది ఎక్కడఉంటే అక్కడకు వెళ్తామన్న మాట. నీళ్లున్నప్పుడు చెరువు గట్టుమీద కూర్చునేవాళ్ళం. నీళ్ళులేవు గనుక యిప్పుడు యీ నూతి గట్టుమీద కూర్చుంటున్నావు ఏమంటావు' అన్నాను.

"కానీ మనకు యిష్టమైన వస్తువు ఎక్కడా లేకపోతేనో"

ఆ ప్రశ్నతో నా గొంతుకు తాళం పడింది. ఒక క్షణం ఆగి "అది మనం అనుకోడంలో ఉంటుంది" అన్నాను. 'అవును. నిజమే' అన్నాడు రాజు మళ్ళా పడుకుంటూ.

సూర్యుడు ఆలోచించి ఆలోచించి మరీ పడమటి దిక్కునఉన్న కొండల చాటుకు వెళ్ళిపోయాడు. అంతదాకా లోకంతో ఆడుకున్న అతని కిరణాలు మాత్రం లోకాన్ని అప్పుడే వదలం యిష్టం లేనట్లు కొండల వెనుకనుంచి కనుపిస్తూనే వున్నాయి. ఇద్దరం లేచి గృహోన్ముఖులమయ్యాము.

*   *   *

మా షికారు రోజూ సాగుతూనే వుంది. బంగారము ఎంతసేపు ఒళ్లో పెట్టుకు కూర్చున్నా వంటికి కొంచెం కూడా అంటదు అన్నట్లు రాజు నావల్ల ఏమీ మార్పును పొందలేకపోయాడు.

(44వ పేజీ చూడండి)



మగవారికి అందం అక్కర్లేదంటారు నిజమేనా?

విశాఖ

ఆ రోజు ఆదివారం. కాలేజీకి సెలవు. తలంటుకుని వాలు కుర్చీలో కూర్చుని వార పత్రిక తిరగేస్తున్నాను. మా పద్మ, కళ్ళు ముఖం ఎర్రగా వాచివున్న ముఖంతో నా ప్రక్క కుర్చీలో చతికిల పడింది. "ఏం పద్మా! అలా ఉన్నావు ?" అని నేను ప్రశ్నించేసరికి అంతవరకూ దాచుకున్న దుఃఖం అంతా ఒక్కసారి పెల్లుబికి వచ్చేసింది. "నువ్వు విన్న నన్ను చూడ్డానికి వచ్చిన పెళ్ళికొడుకుని చూసావుగా !" అంది. "ఊ" అన్నా సాలోచనగా. ఆ పెళ్ళికొడుకు రూపు కళ్ళముందు ప్రత్యక్షమైంది. ఒక చిన్న ఎలుగుబంటినో, మరే జంతువునో జ్ఞాపకం తెచ్చే రూపు.


"నాకు రాత్రి కన్ను మూస్తే చాలు అతనే జ్ఞాపకం వచ్చి లేచి కూర్చునేదాన్ని. అలాంటిది వాళ్ళు వప్పుకున్నారుట. బామ్మ నన్ను వూ అనమని చంపేస్తోంది"

"పద్మా ! నీ కిష్టం లేదంటే చెప్పెయ్యి" అన్నా [illegible] ఎక్కడనుంచి విందో మా బామ్మ గా[illegible] వచ్చిం[illegible] "ఏమిటర్రా మరీ ! ఆ అబ్బాయికేం తక్కు[illegible] ? చక్కగా కలెక్టరీ ఉద్యోగం చేస్తున్నాడు. ఒక పెద్దయిల్లుంది. కట్నం అయిదువేలయితే చాలంటున్నారు. ఇంతకంటె ఏం కావాలి ?" అంది. పద్మ విసురుగా "పో ! బామ్మా, నా కిష్టంలే" దంది. "ఏం" అన్న బామ్మకి ఆ అబ్బాయి భయంకరంగా ఉన్నాడు అని పద్మ జవాబిచ్చింది.

బామ్మ తారాజువ్వలా లేచింది. "ఏవిటే నాకు తెలీక అడుగుతాను. మా చిన్నతనాల్లో మాతో మాట్లాడకుండానే పెళ్ళిళ్ళు చేసేవారు. మీ తాత గారు ఏం అందగాడని. అసలు మొగాడికి అందం ఏవిటి ? అంటాను. నాలుగు రాళ్ళు సంపాదిస్తే చాలదా ?" అంది. పద్మనీ బామ్మనీ వాళ్ళ వాగ్వాదాలకి వదిలేసి నేను నెమ్మదిగా లేచి వెళ్ళి నా గదిలో కూర్చున్నాను. కూర్చున్నా నన్న పేరేగాని మొగాడికి అందం ఏవిటి ? అన్న ప్రశ్నే నన్ను వేధించింది.

అసలు అందం అంటే ఏవిటి ? అందాన్ని నిర్వచించడం చాలా కష్టం. ఒక ఆడపిల్లే ఉందనుకోండి. ఆ పిల్లని అందంగా లేదని ఒక అబ్బాయి చేసుకోకపోతే అదే యింకొక అబ్బాయికి రంభలా కనబడి మూడు ముళ్ళూ వేసేస్తాడు. ఇంతకీ ఆ అమ్మాయి అందమైనదా ? కాదా ? అంటే ఎవరు చెప్పలేరు. అలాగే నా స్నేహితురాలు ఒక అమ్మాయి తెల్లగా నాజూకుగా ఉంటుంది. ముక్కు, కన్ను, ముఖం అన్నీ చాలా బాగుంటాయి. ఆ అమ్మాయి కొంచెం లావుగా, నల్లగా, బొద్దుగా ఉండే అబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. వాళ్ళ కాపురం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది ప్రస్తుతం. చూసినవాళ్ళంతా కాకి ముక్కుకు దొండపండులా ఉంది అనుకొన్నారు. ఓ పెద్దమనిషి వుండబట్టక ఆ అమ్మాయినే అడిగేశారు. "ఏంవమ్మా! ఏం బాగున్నాడని ఆ అబ్బాయిని ఏరి కోరి చూసుకున్నావు" అన్నారుట. "నా కళ్ళు పెట్టుకు చూడండి బాబాయిగారూ. నవమన్మధుడులా గుంటారు. ఆయనకేం లోటు. అలాంటి సుగుణవంతుడు ఈ ప్రపంచంలో ఉంటారా ?" అని ఎదురు ప్రశ్న వేసింది.

ఈ అమ్మాయి అన్నట్టుగా ప్రతి స్త్రీ తను పెళ్ళాడిన వ్యక్తిలో ఏదో ప్రత్యేకతను చూస్తుంది. ఆమెకి ఆ ప్రత్యేకత మిగిలిన పురుషులలో



లేదనే నమ్మకం మనస్సులో గాఢంగా నాటుకుంటుంది.

ఫలానాలాగా ఉంటేనే అందమైనవాళ్లని ఎవరూ చెప్పలేరు. నా కంటికి అందమైనది ఇంకోరి కంటికి అందంగా కనపడదు. అసలు అందం అంటే ప్రతీ వ్యక్తిని కదిలించే ఒక విధమయిన అనుభూతి. తను పెళ్లాడిన వ్యక్తిలో ఏదో ప్రత్యేకత ప్రతి స్త్రీకి కన్పడుతుంది. ఆ ప్రత్యేకత వలన, ఆయనలో ఏదో అందం కన్పడి, ఏవేవో మధురానుభూతులకి దారితీస్తుంది.


సాధారణంగా ఆడవాళ్లలో కంటె అంత ప్రపంచ విఖ్యాతి చెందిన అందమైన మగాళ్లు చాలా తక్కువ. అందమైన మగాడు, అని శ్రీకృష్ణమూర్తిని శ్రీరామచంద్రమూర్తిని కావ్యాల్లో వర్ణిస్తారు. కానీ అందం ఒకటే కాదు మానిని కోరుకునేది. గుణవంతుడై తనను ప్రేమగా చూసుకుని, తనను సుఖపెట్టగలిగేవానినే ప్రతి స్త్రీ కోరుకుంటుంది. అంతే గాని "మేడిపండుచూడ మేలిమైయుండు, పొట్ట విప్పి చూడ పురుగులుండు" అన్నట్లుగా చాలా అందగాడయి ఉండి అన్నీ చెడుబుద్ధులే ఉంటే ఆ అందం ఏం రాణిస్తుంది చెప్పండి. ఈ విషయం ఆడవాళ్లకే అన్వయిస్తుంది. అందంగా ఉన్నంత మాత్రం చాలదు. గుణం కూడా ఉండాలి.

"అందంగా ఉంటే ఏమైనా కొరుక్కుతింటారా" అనే మాట నిజమే. అందంగా లేనంత మాత్రాన ఒక మగవాడిని తీసి పారెయ్యలేము. అన్నీ సరిగ్గా ఉండి మనిషి మామూలుగా ఉన్నా డనుకోండి. పెద్ద అందగాడు కాకపోయినందువలన ఆ మగవాడిని లోకువ చెయ్యడం అన్యాయం. మా చుట్టాలలో ఒకమ్మాయి ముందర అందగాడైన వానినేకానీ పెళ్ళాడనని పట్టుపట్టింది. మావయ్య అందం, గుణం, సంపద అన్నీ ఉండే అబ్బాయి కోసం గాలించి గాలించి విసిగిపోయాడు. ఈ మూడూ కలిసి ఒకే మనిషిలో ఉండటం బహు కష్టం. ఆ అమ్మాయి ఓ ముప్పైయ్యోపడి దాటాక మొద్దులా ఉండే ఒక మనిషిని పెళ్లి చేసుకుని ఇప్పుడు ఇద్దరు పిల్లల తల్లయింది.

అయితే కావ్యాల్లోను, కథల్లోను నాయకులని అంత అందంగా వర్ణిస్తారేం చెప్మా అని బుగ్గ మీద వేలు వేసుకుని ఆలోచించకండి. వాస్తవిక జగత్తుకి, కావ్య జగత్తుకి చాలా తేడా ఉన్నాయి. కథల్లో పాత్రలు కవి చేతుల్లో కీలుబొమ్మలు. మనం విధి చేతుల్లో కీలుబొమ్మలం.

కొంతమంది మొగాళ్లు అందమైన ఆడపిల్లనే గాని పెళ్లాడనని శపథంచేసి కట్నంతో వచ్చిందికదా అని ఓ కురూపిని పెళ్లాడేస్తారు. అలాగే మన ఆడవాళ్లలో కూడా కథలని చదివి ఓ సుందర రాజకుమారుని సుందరరూపం ఊహించుకుని అందంగా ఉంటేగాని పెళ్ళాడకూడదని తీర్మానించుకుని ఆఖరికి ఏమీ బాగా ఉండని ఇంజనీరునో, డాక్టరునో పెళ్లాడేవాళ్లూ ఉన్నారు.

కానీ నే చెప్పదలిచేది ఒక్కటే ముక్క. ఆయా స్త్రీల అభిరుచులను బట్టి పెళ్లి సంబంధం నిర్ణయిస్తే మంచిది. అందంగా తన భర్త ఉండాలని కోరుకునే అమ్మాయికి ఓ మొద్దునో ఎలుగుబంటినో కట్టబెడితే ఆ అమ్మాయి జీవితమంతా ఆ అబ్బాయితో ఏం వేగుతుంది చెప్పండి. ఆ అబ్బాయి మంచివాడే కావచ్చు కానీ ఈ అమ్మాయి మనస్సులో 'సుందర రాజకుమారుడే' మెలగి ఇంక కాపురం సరిగ్గా చేయదు. ఎప్పుడు భర్తలో ఏదో లోపం కనబడుతుంది. ఇలాగా అందం మగాడిలో ఉండితీరా లనుకునేవారు చాలా కొద్ది మంది.



మగాడికి అందం అనేది అంత అవసరం లేదు. మనిషి సుమారుగా ఉంటే చాలు. చెలామణి అయిపోతారు. ఆడవాళ్లలో అందాన్ని వెదికినట్లుగా మగవాళ్లలో వెదకరు. ఒడ్డూ పొడుగూ ఉంటే చాలు. అతన్ని అందగాడి కిందే జమ కట్టేస్తారు.


ఈ నవనాగరిక ప్రపంచంలో కూడా అందాల పోటీలు ఆడవాళ్లకే గాని, మగవాళ్లకి లేదుకదా. అలా ఎందుకుంది ? మగవాళ్లకు అందమే ప్రధానమైన విషయమైతే వాళ్లకీ అందాలపోటీలు ఎందుకుండవు ? ఉద్యోగం పురుషలక్షణం అన్నారు పెద్దలు. కానీ ఎక్కడా అందం ప్రధాన విషయమనలేదు. కనుక పురుషునికి కావాల్సింది సాధారణమైన అందం మాత్రమే. సుమారుగా ఉండి భార్యని, పిల్లల్నీ పోషించగల ప్రేమాభిమానాలు వారికి చూపించితే చాలదూ ?

ఏ వ్యక్తికైనా సరే గుణం ప్రధానమే గాని రూపు కాదు. గుణమూ ఉండి రూపు కూడా ఉంటే ఆ పురుషుడు భర్తగానో, సోదరుడుగానో లభించిన స్త్రీ జన్మ సాఫల్యమైపోతుంది.

కానీ, ఒక్క విషయం ఆలోచించతగింది కూడా ఉంది. ఒక భార్యా భర్తల్లో ఒకరు మరీ అందగాళ్లయి ఇంకోరు ఏమీ బాగులేకపోతే అది ఒక్కొక్కప్పుడు అనర్థాలకి దారితీస్తుంది. ఉదాహరణకి భార్య ఏమీ బాగుండ దనుకోండి, భర్త అందగా డనుకోండి, అలాంటప్పుడు భార్య తన భర్త ఏ యితర స్త్రీతో మాట్లాడినా కూడా ఆ స్త్రీని తనతో పోల్చుకుని ఆ స్త్రీ తనకంటే అందంగా ఉంది కనుకనే తనభర్త ఆమెతో మాట్లాడుతున్నాడని పూహించుకుని తనంటే ఆయనకి యిష్టం ఉండదు, తను పక్కనే నిల్చుంటే ఆయనకి అవమానకరంగా తోస్తుంది అని అనుకుని, అనేకవిధాల మానసిక క్షోభకి గురి అయి తన సంసారాన్ని తనే చేతులారా పాడుచేసుకునే అవకాశం ఉంది. అందుకే పెద్దలు ఈడు జోడు చూసి వాళ్లకి పొందు కుదురుతుందా లేదా అని ఆలోచించి మరీ చేస్తారు పెళ్లిళ్లు. అలా కాకుండా ఇష్ట మొచ్చినట్లు చేసేవాళ్లు ఉన్నారనుకోండి. అది వేరే సంగతి.

ఈర్ష్య అనేదానికి తావులేకుండా ఉండాలంటే దంపతులలో ఈడు జోడు సరిగ్గా ఉండాలి.

మగవారిలో అందంకంటే వ్యక్తిత్వానికే విలువ ఎక్కువ. కొంచెం ఒడ్డు పొడుగు ఉండి



మగవారికి అందం....

చక్కటి విగ్రహం ఉండేవాళ్లని 'అందగాడు' అని అంటారు. అలాంటి విగ్రహం ఉండేవారు సాధారణంగా, వరిగ్గా శుభ్రమైన దుస్తులు ధరిస్తే ఇట్టే అందర్నీ ఆకర్షిస్తారు.

ఈ బాగుండడం బాగుండకపోవడం నే మొదట చెప్పినట్లుగా చూసేవారి అభిరుచులని బట్టి ఉంటుందనుకోండి. రూపం, హుందాతనం, గుణం సంపద ఉండి తనను ప్రేమించి, అభిమానంతో చూసుకునే భర్త లభించిన స్త్రీ అదృష్టవంతురాలు. ఇందులో అన్నీ కాకపోయినా కొన్నయినా ఉంటే అంతకుమించి కోరుకోతగ్గ దేమీ లేదు. మగవానికి గుణంతోబాటు అందం ఉంటే అతను అందరిచేతా పొగడబడుతాడు. అందర్నీ ఆకర్షించ గలుగుతాడు. అందం మగవాని ఆకర్షణను పెంపొందిస్తుంది. గుణం కూడా మంచిదైతే ఆ అందానికి ఒక కొత్త శోభను ఇనుమడింపజేసి పరిమళాన్ని వెదజల్లుతుంది. ఆ పరిమళాన్ని నలుగురూ ఆస్వాదిస్తారు. అలాంటివారిని శ్రీరామచంద్రమూర్తితో పోల్చవచ్చును. ★

పొట్టి పోతరాజుకి విదూషకుడి మీద మళ్ళీ కోపం వచ్చింది. శిక్షిస్తా నన్నాడు.

"కొన్నెప్పుడు అవమానించడం కన్నా క్షమాపణ కోరడం పెద్ద తప్పు." అన్నాడు విదూషకుడు.

"దానిని నిరూపించు. లేదా, నీతల ఎగిరిపోయినట్లే!" పొట్టి పోతరాజుగారు స్పష్టంగా చెప్పేశారు.

విదూషకుడు వెంటనే ఏమీ అనలేదు. కాని రాజుగారి వెనక్కి వెళ్లి నుంచున్నాడు. ఏదో ఇవ్వబోయి కిందపడేశాడు. పోతరాజుగారువంగి ఎత్తబోయాడు. విదూషకుడు వెనకనుంచి ఒక తన్ను తన్నాడు. ఒళ్ళు మండుతూ పొట్టి పోతరాజుగారు నేరుగా నుంచున్నారు.

"క్షమించండి, రాణిగారేమో అనుకున్నా"నన్నాడు, విదూషకుడు అతి వినయంగా.



జార్జి బ్లేక్

గూఢచారి జార్జి బ్లేక్

విక్రమాదిత్యుడు ఏడాదికి కొంతకాలం మారువేషంలో దేశం సంచరించేవాడంటారు. చాణక్యుడు ఇప్పటికి రెండువేల సంవత్సరాల క్రితం గూఢచారులను విరివిగా వాడేవాడని 'ముద్రారాక్షసం' లో చదువుతాము. ప్రతాపరుద్రుడి మంత్రి యౌగంధరాయణుడి మారువేషాన్ని గురించి చదవనివాళ్ళు తక్కువ. రాజ్యాలమధ్య విరోధాలు ఉన్నంతకాలం గూఢచారుల అవసరం ఉండి తీరుతుంది! పాశ్చాత్య దేశాలలో గూఢచారవృత్తి బాగా 'ప్రచారంలో' ఉన్నవాటిలో ఒకటి. ఇంగ్లాండ్‌లో ఆల్‌ఫ్రెడ్ రాజు, షేక్స్‌స్పియర్ సమకాలికులలో ఒకరయిన క్రిస్టోఫర్‌మార్లో, ప్రసిద్ధ రచయిత సామర్‌సెట్ మామ్, గ్రాహంగ్రీన్ వీరందరూ ఎప్పుడో ఒకప్పుడు గూఢచారులుగా పని చేసినవారే. చివరకు గూడచారులు సాహిత్యంలో ఒక ప్రత్యేకమయిన స్థానాన్ని ఏర్పరచుకున్నారు. 'మాతాహరి' అనే ఆ గూఢచారి ఈవృత్తికే ఒక చిహ్నమయిపోయింది! గూఢచారుల జీవితాలు చాలా విచిత్రంగా ఉన్నట్లు రచయితలు చిత్రీకరించారు. ప్రచ్ఛన్నయుద్ధంవల్ల గూఢచారుల సంఖ్య పెరిగిపోయింది. అణ్వస్త్రరహస్యాలతో వారి సంఖ్య మరికొంత పెరిగింది. క్లాస్‌ఫుక్స్, రోజ్‌న్‌బర్గ్ దంపతులు వీరందరి పేర్లూ దేశద్రోహులుగా సుపరిచితాలయినాయి. భారతదేశంలో కూడా గూఢచారులు ఉన్నారని వింటున్నాము!

కాని ఎంత సామాన్యమయిపోయినా ఒక గూఢచారి పట్టుపడ్డాడంటే అది ఒక పెద్ద వార్త అయి పూరుకుంటుంది. ఇటీవలే కొందరిని లండనులో పట్టుకొన్నారు. మళ్ళీ ఈ నెలలో జార్జ్ బ్లేక్ అనే ఇంగ్లీషు అధికారిని గూఢచారిగా ఉన్నాడని నిర్బంధించి, రహస్యంగా విచారణజరిపి 42 సంవత్సరాలు కారాగృహవాసం శిక్షవేశారు. 'ఈ దేశంలో మరణదండన విధించే అవకాశం లేకపోవడంవల్లనే అది తప్పిం'దని 'జడ్జి' కూడా అన్నారు. మూడు నేరాలపైన ఒక్కొక్కదానికి 14 సంవత్సరాల చొప్పున 42 ఏళ్ళ శిక్ష విధించారు. 'యావజ్జీవ కారాగారవాసం' లభించినవారు కూడా ఏడు, ఎనిమిది సంవత్సరాలకు మించి 'జైలు'లో ఉండరు. దానినిబట్టి బ్లేక్ శిక్ష ఎటువంటిదో గ్రహించవచ్చు.

జార్జిబ్లేక్ వయసు 38. ఇతను హాలెండులో జన్మించాడు. ఇతని తండ్రి ఈజిప్టు దేశస్థుడు. తల్లి డచ్ స్త్రీ. తల్లి రెండవ వివాహం తర్వాత ఆమె పేరుతోబాటు ఇతనిపేరు కూడా బ్లేక్‌గా మారింది. రెండవ ప్రపంచ యుద్ధంలో 'అండర్‌గ్రౌండ్' ఉద్యమంలో ప్రముఖపాత్రను వహించిన వారిలో ఒకడు. ఈ సందర్భంలోనే బ్రిటిష్ గూఢచారిగా స్వీకరింప బడ్డాడు. కొరియా యుద్ధం జరిగిన సమయంలో కమ్యూనిస్టులకు ఖైదీ అయ్యాడు. అప్పుడే కమ్యూనిస్టు సిద్ధాంతాలకు లొంగిపోయి రహస్యంగా కమ్యూనిస్టు గూఢచారి అయినట్లు తెలుస్తోంది. వరుసగా మూడు సంవత్సరాలు కమ్యూనిస్టుల ఖైదీగా ఉన్నాడు. విడుదల తరువాత బ్లేక్ పెళ్ళిచేసుకుని బ్రిటిష్ విదేశాంగశాఖలో చేరాడు. 1959 వరకూ పశ్చిమ బెర్లిన్‌లో పనిచేసి, లెబనాన్‌కి బదిలీ అయ్యాడు. ఈ సంవత్సరం ఏప్రిల్‌నెలలో హఠాత్తుగా ఇంగ్లాండుకు తిరిగి వచ్చేయమని, 'అరెస్టు'చేసి రహస్యంగా విచారణజరిపి శిక్షించారు. తనమీద ఆరోపణలన్నిటినీ బ్లేక్ ఒప్పుకున్నాడు. ప్రధాన న్యాయమూర్తి పార్కర్ అతనికి శిక్ష విధించేటప్పుడు, ఈ సందర్భంలో అవసరమయిన రహస్యం బ్లేక్‌కి సుముఖంగాఉన్న విషయాలు బయటపెట్టటానికి వీలులేకుండా చేసిన దన్నారు. ఇంగ్లాండ్‌లోని పత్రికలను కూడా ఈ విచారణకు సంబంధించిన వివరాలేమీ ప్రచురించవద్దని ప్రభుత్వం కోరింది. మొదట ఒప్పుకున్నా, విదేశపత్రికలు ఈ సంగతులు వేయటంతో బ్రిటిష్ పత్రికలు కూడా దొరికిన వివరాలన్నిటినీ ప్రచురించాయి.

బ్లేక్ కమ్యూనిస్టు ప్రభుత్వాల వైపుకి ఎప్పుడు మారిపోయాడో ఇంతవరకూ సరిగ్గా తెలియలేదు. కొరియాలోనేనని అతనే చెప్పినా కొందరు నమ్మటంలేదు. అతనితోబాటే కొరియాలో ఖైదీగా ఉన్న, ఒక ప్రఖ్యాత పత్రికా విలేఖరి ఇది అసంభవమన్నారు.

ఏది ఎట్లా ఉన్నా బ్రిటిష్ గూఢచారుల శాఖలో పెద్ద లోపాలున్నాయన్న విషయం మాత్రం తేలింది. ★

ఎండమావులు

వింజరపు భాస్కరాచార్యులు



"ప్రేమ" అనే మాటకు నిర్వచనం సూర్యారావని ఒకనాడు కమల అనుకున్నది. ఆ ప్రేమ పర్యవసానం ఏమిటో ఆనాడు ఆమె ఆలోచించ లేదు. కాని...

పందిట్లో పెళ్లి బాజాలు జోరుగా మ్రోగిపోతున్నాయి. ముత్తైదువులు, పెళ్లి పెత్తనం వహిస్తున్న పెద్దలు హడావిడిగా అటూ యిటూ పరవళ్లు తొక్కుతున్నారు. వధువు తండ్రి వాసుదేవరావుగారు వయోభారం అనుభవించకపోయినా, ఆఖరికి తమ గారాబు కూతురు కమల పెళ్లికూతురు అయిందన్న ఆనందాన్ని అనుభవిస్తూ, పందిట్లో ఒకమూల వాలు కుర్చీలో పవళించారు. ఆయన పెద్దకొడుకు కృష్ణమూర్తి, కోడలు పార్వతి తరచు విసుక్కొంటున్నా, తమ కది తప్పదన్నట్లుగానే పెళ్లి భారం నిర్వహిస్తున్నారు.

వరుడు నారాయణరావుగారు మద్రాసులో పెద్ద వ్యాపారస్థుడు. అప్పుడే నలభయ్యో పడిలో అడుగు పెట్టేరు. ఆయనకు మొదటి భార్య వలన ఇద్దరు ఆడపిల్లలు మాత్రం కలిగేరు. ప్రస్తుతం వివాహం వంశానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చే పుత్రునికోసం 'పెద్దల బలవంతం' వలన తప్పింది కాదు.

వధువు కమల యిప్పుడు ముప్పయి అయిదేళ్ల ముదిత. ఆమెకు పందిట్లో జరుగుతున్న హడావిడి కాని, వదినగారి ఎత్తిపొడుపులు గాని, అన్నగారి అదలింపులు గాని ఏమీ పట్టినట్లు లేదు. ఆమెలో చైతన్యం నామమాత్రంగా గోచరిస్తోంది. వయస్సులోను సౌందర్యంలోను చాలా ప్రకరణాలు గడిచిపోయినా, ముఖంలో తెచ్చిపెట్టుకున్న యాంత్రికమైన చిరునవ్వు మాత్రం లీలగా కనుపిస్తుంది. కంటికి కగుపించని నిర్వేదం చిరునవ్వుల వెనకనుండి తొంగిచూస్తోంది. ఏది ఏమయినా, కమల పెళ్లికూతు రయింది.

2

వాసుదేవరావుగారు కాకినాడ దగ్గర ఒక ఊరికి కరణం. పెద్దలు గడించిపెట్టిన పెద్ద ఆస్తులేమీ లేకపోయినా, ఆయనకు తన కరణీకం హయాంలో గడించిన ఆరెకరాల మాగాణి, మామిడితోట, ఇల్లు మాత్రం ఉన్నాయి. ఆయనకు ముగ్గురు మగపిల్లల తర్వాత ఒక్కగా నొక్క కూతురు కమల. అందుచేత రావుగార్కి, భార్య కనకమ్మ గారికి కమల అంటే పంచ ప్రాణాలని వేరే చెప్పనక్కరలేదు. కూతురు కోరుకుంటే కొండమీది కోతినైనా తెచ్చి సంతృప్తిపరచేవారు వాసుదేవరావుగారు. ఇక కనకమ్మగారి సంగతి వేరే చెప్పనక్కరలేదు. కాస్త పనిచేస్తే కందిపోతుందేమోనని ఎంతో నొచ్చుకొనేవారు. అతి గారాభంగా, ఆడింది ఆట, పాడింది పాటగా పదిహేనేళ్ల ప్రాయం వచ్చింది కమలకు. కలువరేకుల్లా విప్పారిన కాటుకకళ్లు, బంగారాన్ని మించే శరీరచ్ఛాయ, వాలుజడ, నూత్న యవ్వన ప్రాదుర్భావపు మిసమిసలతో కమల ఎంతో అందంగా కన్పించేది. నీలపు సిల్కు చోళీమీద, తెల్ల వాయిలు చీర కట్టుకుంటే కమల మూర్తీభవించిన సౌందర్యలక్ష్మి అనిపించేది.

అందచందాలకు, అలవడే గుణాలకు, స్వభావానికి ఎక్కువ దూరం ఉన్నట్లు తోస్తుంది. చదువుకీ, సంస్కారానికీ మధ్య ఉండే దూరానికి ఇదేమీ తక్కువ కాదేమో! లోకంలో అందచందాలుండే

చోట తరచు అహంకారం కూడా కన్పిస్తుంది. కమల విషయంలో ఇది అక్షరాలా నిజం అయింది. దానికి తోడు కనకమ్మగారు కమలకు ముద్దు ముచ్చట్లు కొంచెం అతిగా ఆదరించి తీర్చేవారు. రోజూ అద్దం ముందు గంటల తరబడి నిల్చుని అలంకరించుకోడం, స్కూలు టైమికి బయలు దేరి వెళ్లటం తప్ప ఆమెకు వేరే పూచికపుల్లెత్తు పనిలేదాయింట్లో. ఆమె కెప్పుడూ తన అందం, అలంకరణ అనేవి తప్ప వేరే చింత ఉండేదికాదు. ఆ యింట్లో ఆడపిల్లల చదువులు క్రొత్తయినా, భార్య పట్టువలన కమలను చదివించక తప్పింది కాదు వాసుదేవరావుగారికి.

కమల హైస్కూలులో అయిదవ ఫారంలోకి వచ్చేటప్పటికే, ఆమె పెద్ద అన్న కృష్ణమూర్తికి పెళ్లయి, ఇద్దరు బిడ్డల తండ్రి అయాడు. తండ్రికి అసరాగా ఉంటానికి, అతను మెట్రిక్యులేషన్‌తోనే చదువు చాలించవలసి వచ్చింది. రెండో అన్న వెంకట్రావు యూనివర్శిటీలో ఫిజిక్స్ ఆనర్స్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. చిన్న నాడే అతనికీ పెళ్లి అయింది. మూడో అన్న శ్యామలరావు కాకినాడలో ఇంటర్ సీనియర్ చదువుతున్నాడు. వృద్ధాప్యం సమీపిస్తున్నందువలన వాసుదేవరావుగారు కమలకు పెళ్లి ప్రయత్నాలు చేయడం ప్రారంభించారు.

3

కృష్ణమూర్తి భార్య కాపురానికి వచ్చేసరికి పదిహేడేళ్లు. ఆమె కమలతో సమంగా అందకత్తె కాకపోయినా, మొత్తంమీద నాజూకుగా ఉంటుందనే చెప్పవచ్చు. ఆమె పుట్టిల్లు కాకినాడ దగ్గర ఒక చిన్న పల్లెటూరు. హైస్కూలు చదువులు గాని, ఎక్కువ ఫేషన్లు గాని తెలిసే అవకాశం ఆమెకు లేక పోయింది. పైపెచ్చు ఆమెకు పూజా పునస్కారాలపై ఆసక్తి ఎక్కువ. అందుచేత ఆమె కమల దృష్టిలో కొంచెం చులకనగా కన్పించేది. కమల సినిమాకు పిలిచినా, తన హైస్కూలు క్లాస్‌మేట్సుతో కేరింతాలు కొడుతున్నా, పార్వతి కొంచెం విముఖంగా ప్రవర్తించేది. కమల దృష్టిలో ఆమె ఇంచుమించు 'పల్లెటూరి మొద్దు' అనే చెప్పాలి. తరచుగా వదినా ఆడపడుచుల మధ్య వాగ్యుద్ధాలు చెలరేగేవి. అందులో కమలదే పైచేయిగా ఉండేది. పిల్లలు పుట్టక పార్వతి పడే 'అవస్థలు' చూస్తే కమలకు కొంచెం వేళాకోళంగా ఉండేది.

* * *

ఆరోజు విశాఖపట్నం నుండి కమలను చూడటానికి పెళ్లివారు వచ్చేరు. అబ్బాయి బి. ఏ. పాసయాడు. ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో నిమగ్నుడై ఉన్నాడు. అతనితో పెళ్లిచూపులకు అతని అక్క, తల్లి నాయనమ్మ కూడా వచ్చేరు.

భోజనా లయిన తర్వాత పెళ్లిచూపుల కార్యక్రమం ప్రారంభమయింది. కమలను బాగా అలంకరించి తీసుకొనివచ్చి, చాపమీద ప్రక్కగా కూర్చున్నారు కనకమ్మగారు, పార్వతి. ఇంతలో 'ఇంటర్వ్యూ' ప్రారంభమైంది. ముందు కమల చదువు గురించి అడిగారు. తర్వాత "అమ్మాయి కేమైనా సంగీతం గాని, డాన్సు గాని వచ్చునా?" అని పృచ్ఛించేరు అబ్బాయి అక్కగారు.

సమాధానంగా ఆత్మాభిమానం ముంచుకొస్తున్నా, కమల కంఠం విప్పి పాడటం తప్ప లేదు.

"కొంచెం గొంతు బొంగురుగా ఉంద"ని తీర్పు యిచ్చారు అబ్బాయి నాయనమ్మ.

"అమ్మాయి తరుచు సినిమాలు చూస్తుందా?" అని అపరాధ పరిశోధకుని ఫోజులో అడిగేరు అబ్బాయి తల్లి.

తనను సినిమాలు చూడకుండా నిర్బంధించటానికి, అడగటానికి వీళ్లెవరని కమలకు ఉక్రోషం ముంచుకొని వచ్చింది.

"అప్పుడప్పుడు మాత్రం చూస్తుందండి" అని కనకమ్మగారు నిర్లిప్తంగా జవాబిచ్చేరు. పరీక్షలో తప్పినట్లు పెదవి విరిచింది అబ్బాయి తల్లి.

> ఒక స్కూలులో పంతులమ్మ పిల్లలందరికీ వాళ్ళ గ్రూపు ఫోటో తలొక కాపీ కొనుక్కోమని చెపుతుంది. "మీరు పెద్దవాళ్ళయ్యాక, యీ ఫోటో చూస్తే మీ కెంతో సంతోషంగా ఉంటుంది. ఒకసారి ఆలోచించండి మీ రేమనుకుంటారో-ఇదిగో సుసీ - దీనికి ఇద్దరు కూతుళ్ళు. ఇది సుభ దీనికి పెళ్లయింది-వీడు మధు-ఇంజనీరు.
>
> అంతలో వెనక బెంచీ నుంచి ఒక గొంతుక:—ఈమె మన పంతులమ్మ-పాపం! చచ్చి స్వర్గాన ఉంది.
>
> యన్. ఆనందం (నిజామాబాద్)

"ఇంకేమైనా ప్రశ్న లున్నాయా?" అన్నట్లు చూసింది కమల నలుగురికేసి—మనస్సులో కుత కుత ఉడికిపోతూ.

అప్పు డందుకొంది అబ్బాయి బామ్మగారు: "అయ్యో! ఈ అమ్మాయి ఇంత పొడుగ్గా ఉందేమిటి? వరహీనం అవుతుందేమో కూడాను! అబ్బాయి ప్రక్క నుంచోబెట్టి కొలవకపోతే వీల్లే" దని భీష్మిస్తూ.

ఇక కమల కోపం ఆపుకోలేకపోయింది. వెంటనే చివాలున లేచి విసవిసా నడిచి లోపలికి వెళ్ళిపోయింది. అర్థికశాస్త్ర పట్టభద్రునితో సహా అమ్మలక్క లందరూ తెల్లబోయారు. "ఇంత పొగరుమోతుపిల్ల మాకు వద్దం" టూ తీర్పు చెప్పి అపూటే నిష్క్రమించారు పెళ్లివారు.

ఆ రాత్రి కమలకు భోజనం సయించలేదు. మనస్సు దహించుకుపోతున్నట్లుయింది. 'పెళ్లి' అనే దానికి పుస్తకాల్లోను, సినిమా కథల్లోను ఉండే ప్రతిపత్తి ఉంటే, యీ వెర్రి మొర్రి పెళ్లిచూపులకు అర్థం ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. తన అందం, తెలివి—ఇవన్నీ అంగట్లో వస్తువులవలె పరీక్షించే యీ పద్ధతిలోని ఔచిత్యం ఏమిటో ఆమెకు బోధపడలేదు. ఈ పెళ్లి చూపులలో తనొక ఆటవస్తువు కంటె ఎక్కువేమీ కానన్నమాట!

కమల ఆత్మాభిమానం బాగా దెబ్బతింది. ఆమె కా రాత్రి నిద్ర లేదు. అంపరవరకు వస్తే పెళ్లి అనేదే లెక్కచేయగూడదని ఆమె అనుకోక పోలేదు!

౪

... స్కూలుఫైనలు పరీక్ష పాసయి'నందుకు అనాడు వాసుదేవరావుగారి రింట్లో ఆనందోత్సాహాలు నిండి ఉన్నాయి. పెళ్లి పెడాకులు లేకుండా యీ చదువేమిటని మనస్సులో విసుగ్గా ఉన్నా, పార్వతి కూడా కమలను అభినందించక తప్పలేదు.

కమల కాలేజీలో చేరతానని భీష్మించి, ఎలాగో తల్లి తోడ్పాటుతో తన పట్టు నెగ్గించుకొంది. ఆమె రెండో అన్న వెంకట్రావు కూడ కాకినాడ కాలేజీలో అప్పుడే ఫిజిక్సు లెక్చరరుగా చేరి, కాపురం పెట్టేడు. మూడో అన్న శ్యామలరావు బి. ఏ. సీనియర్‌లోకి వచ్చేడు. అందుచేత వాసుదేవరావుగారు కమల అభీష్టాన్ని సులువుగా ఆమోదించారు.

కాలేజీ వాతావరణంలో ప్రవేశించిన కొన్నాళ్లకే కమల తన వయస్సులోను, అందంలోను కన్పించే క్రొత్త మార్పులు గుర్తించింది. 'పెళ్లి', 'పెళ్లిచూపులు' — వీటిపై తనలో జీర్ణించిపోయిన అభిప్రాయాలు విడువకపోయినా, కొన్ని వయోసహజమైన వూహలు జనించినప్పుడల్లా ఆమె కొంచెం చలించేది. కాని వాటికి 'పెళ్లి' తో గల సంబంధం ఆమె వూహకు అందలేదు.

* * *

కమల ఇంటర్మీడియేట్ పాస్ అయింది. స్వతహాగా తెలివైనది కాబట్టి ఫస్ట్ క్లాస్ లో వచ్చింది. కాలేజీలో బి. ఎస్‌సి. క్లాసులో చేరింది.

గాంధీనగరంలో వెంకట్రావు కుటుంబం ఉండే ఇంటిప్రక్కనే కంట్రాక్టరాఫీసు క్లర్కు కాంతయ్య కుటుంబం నివసిస్తుండేవారు. కాంతయ్య దంపతులకు సంతానానికేమీ లోటు లేదు. పెళ్లి కెదిగిన బంగారపు బొమ్మలవంటి ముగ్గురు ఆడపిల్లలు, ఆ తర్వాత యిద్దరు మగపిల్లలు మాత్రమే ఆయనకు చెప్పుకోదగిన ఆస్తి. వచ్చే జీతపురాళ్లు చాలక అద్దె యివ్వలేక యింటి యజమానిచేత చీవాట్లు తిన్న రోజులు, పస్తున్న రోజులు వారి జీవితంలో అనేకం. పిల్లల కేమైనా పెళ్లి సంబంధం తెలిస్తే చూడమని వెంకట్రావుని కాంతయ్య అర్థించటం అనేకసార్లు వింది కమల.

కాంతయ్య పెద్దకూతురు సుగుణ కమల యీడుదే అయినా, చిరిగిన బట్టలతో, చిక్కిన

దేహంతో కొంచెం వన్నెతగ్గి కన్పించేది. ఆమె తరచు కమల యింటికి వస్తూ పోతూ ఉండేది. ఇద్దరూ చాలా స్నేహంగా ఉండేవారు. కని పెంచటం కష్టమైన కాంతయ్య ఆమెకు కమలతో సమంగా చదువెక్కడ చెప్పించగలడు ?

చాలా వూళ్ళు గాలించి, చెప్పులరిగేలాగ తిరిగి చివరకు సుగుణకు వో సంబంధం కుదిర్చి పెళ్ళయిం దనిపించాడు కాంతయ్య. వరుడు సుగుణ కంటె పదేళ్ళ పెద్ద; మొదటి భార్య మరణించటం వలన 'కష్టంమీద', రెండో పెళ్లికి కనీసపు కట్నం రెండువేలు లభించటంవలన ఒప్పుకొన్నాడు. పెళ్లిలో బంగారు శలాకవలె మెరిసిపోతున్న సుగుణ, ప్రక్కన వరుణ్ణి చూచిన అమ్మలక్క లందరూ సుగుణకు మనస్సులో ఎంతో సానుభూతి అందిం చారు.

సుగుణ పెళ్లి అంతా కమల గమనిస్తూనే ఉన్నది. మొదట పెళ్లిచూపులు, తర్వాత తలకు మించే కట్నాలు—ఇవి లేకపోతే పెళ్లే లేదు. ఈ "వివాహం" అనే వ్యవస్థకు ఇదేనా పరమావధి ? అని ఆమెకు అనిపించేది. కాని తనకు పుస్తకాలలో గాని, సినిమాలలో గాని 'పెళ్లి' అంటే ఉండే నిర్వచనానికీ, లోకంలో ఉండే అర్థానికీ పోలిక కన్పించలేదు. "ఇటువంటి పెళ్లి అయితేనేమి, కాకపోతే నేమి ?" అని ఆమె కాలేజీ డిబేట్లలో ఉపన్యాసాలు యిచ్చేది. కాని 'వయస్సులో జనించే కోర్కెలకు పెళ్లికి ఏమైనా సంబంధం ఉన్నదా ?' అనే ప్రశ్న ఆమె వూహాపరిధిని దాటింది. తా నటు వంటి కోర్కెల కతీతురాలనని ఒక్కొక్కప్పుడు విర్రవీగినా, మరొకప్పుడు తన విశ్వాసంపై కొంచెం నమ్మకం సడిలేది.

5

కమల కాలేజీ డిబేట్లలో యిచ్చే ఉపన్యాసాలను ఎక్కువగా మెచ్చుకొనే వారిలో సూర్యారావు ఒకడు. తరచుగా ఆమెకు ప్రత్యర్థిగా నిలచి వాదించినా, ఆమె వాదనలను, కూడ మెచ్చుకొనేవాడు. వారి పరిచయానికి కాలేజి డిబేట్సు రంగస్థలాలు అయ్యేవి.

సూర్యారావు, కమల ఒకే క్లాసు. కమలకు మల్లేనే సూర్యారావుకి కూడా జీవితంమీద, సాంఘిక వ్యవస్థలమీద ఉండే అభిప్రాయాలు ఇదమిత్థమని చెప్పటం కష్టం. అయినా అందం, అణకువ, శ్రద్ధ, తగిన సంస్కారమూ లేకపోలేదు. పైపెచ్చు అతను ఆ కాలేజీలోని ప్రముఖ టెన్నిస్ ఆట గాళ్లలో ఒకడు. మంచి వక్త అని పేరు పొందాడు తరచుగా కమల, సూర్యారావూ తమ కాలేజి తర ఫున అంతర్విశ్వ విద్యాలయ వక్తృత్వపు పోటీలలో పాల్గొనేవారు. అది వారి పరస్పర భావాలను వ్యక్తం చేసుకొనటానికి అవకాశం కల్పించి, పరిచయాన్ని పెంపొందింపజేసింది.

* * *

కమలతో సూర్యారావు పరిచయం 'ప్రేమ' లోనికి దారి తీస్తుందని వా రిద్దరూ కూడ మొదట వూహించనేలేదు.

కమల దృష్టిలో మొదటినుండీ 'పెండ్లి'అనే

వ్యవస్థపై గౌరవం తక్కువ. వయస్సులో పరిణత పొందుతున్నా, ఆమె 'అనుభవాలు' ఆమెను పెండ్లికి అంగీకరింపచేయలేక పోయాయి. అనేకసార్లు ఆమె పెళ్లి గురించి తండ్రికి సుదీర్ఘమైన లేఖలు వ్రాస్తూ సంఘంలో ప్రస్తుతం 'పెళ్లి' అనే వ్యవస్థ యెడ తనకు గల తిరస్కారాన్ని వ్యక్తం చేసింది. కాని ...... సూర్యారావు పరిచయంతో తనలో కలిగిన భావాలు తన జీవితంలో ఒక నూత్న ప్రకరణం తెరచినట్లు భావించింది కమల. అతని సాన్నిధ్యంలో ఆమెకు ఒడలు పులకరించేది. తరచు అతని దర్శనభాగ్యానికై తపస్సు చేసేది. తత్ఫలితంగా వారు తరచు కలుసుకొంటూ, వీలయినప్పుడల్లా పార్కులలోను, సినిమాలలోను విహరించేవారు.

'ప్రేమ' అనే మాటకు కమల ప్రస్తుత నిర్వచనం 'సూర్యారావు !'. ఆ ప్రేమకి పర్యవసానం ఏమిటో ఆమెను ఆమె వయస్సు, యవ్వనపు పొంగు ఆలోచించనీయలేదు. ఆమె వూహించ గలిగినంతలో దాని పర్యవసానం సూర్యారావు పరిచయంతో తనకు లభించిన తీయని అనుభవాలే. ఆ అనుభవాలు శాశ్వతం అయితే బాగుండునని ఆమె కోరుకొనేది.

6

యూనివర్శిటీ పరీక్షలు వ్రాసి,, సెలవులకు తమ సొంత వూరు వెళ్లింది కమల. రిజల్ట్సు వచ్చిననాడు కమల పరీక్షలో తప్పటం కమలకు తప్ప మిగతా అందరికీ ఆశ్చర్యం కలిగించింది. దానిని గురించి ఆమె కొంత విచారించినా, సూర్యారావు నుండి వేరుకావటం, అతని వర్తమానం ఏమీ తెలియకపోవటం ఆమెకు పెద్ద మనోవ్యధగా ఉండేది.

ఉన్నట్లుండి ఒకరోజున సూర్యారావు వద్ద నుండి అతని పెళ్లికి ఆహ్వానిస్తూ వచ్చిన శుభలేఖ ఆమెను దిగ్భ్రాంతురాల్ని చేసింది. ఆమెకు తన ఆశలు కుప్పకూలినట్లయింది. ఆమె జీవితంలో ఎంతో ప్రేమగా పెంచుకొన్న ఆశయాలు ఎండమావులుగా పరిణమించటం ఆమెలో ఎనలేని నిరాశ రేకెత్తించింది. నిస్సహాయురాలైన ఆమె వేడి నిట్టూర్పులు నిర్వేదాన్ని స్ఫురింపజేశాయి.

* * *


కాలచక్రం దొర్లిపోయింది. కమల జీవితంలో రూపంలో, భావనలో ముప్ఫయి అయిదేళ్లు నిండాయి. ఆమె కిప్పుడింకేమీ జీవితంపై చెప్పుకోదగిన ఆశయాలు వూహలు లేవు. యాంత్రికంగా రోజులు మాత్రం గడుస్తున్నాయి. మోడువారిన ఆమె తలపులకు వసంతశోభ లేమీ కన్పించలేదు.

తలిదండ్రుల, పెద్దల కోరికపై, ప్రయత్నంపై కమల తుదకు పెళ్లికూతు రయింది.

* * *

ఒడిలో నిద్రపోతున్న పసికందు ఏడవటంతో వూహాలోకాన్నుండి ప్రస్తుతానికి వచ్చింది కమల. అప్పుడే డాబామీదకు వచ్చి విశ్రాంతి తీసుకొంటున్న భర్త రాకను గమనించనందుకు తన మతిమరుపుకు నవ్వుకొంది తనలో తాను. 'కేరు' మన్న పసిపాప కాసేపటిలో మళ్లీ ఒడలు మరచి, చిరునవ్వులు చిందుతూ సుషుప్తిలో లీనమయ్యాడు. ★

ఆంధ్ర సచిత్ర వారపత్రికను చదవండి!



కుమారి పద్మాలక్ష్మి

వచ్చేది పెండ్లి చూపులకు

ఒకసారి మా బాబాయి కూతుర్ని చూడటానికి ఎవరో వచ్చారు. మా అక్కయ్యను ముస్తాబుచేసి కూర్చోబెట్టినాము. వారు చూచి మా అక్కను నడవమన్నారు. మా అక్క సిగ్గుచేత నడువలేదు. మేము అక్కయ్యను తీసుకొని వచ్చేసినాము. తరువాత మా బాబాయి పెండ్లికుమారుడి తండ్రిగారిని "అమ్మాయి మీకు వచ్చినట్లేనా ?" అని అడిగారు.

పెండ్లికుమారుని తండ్రిగారు "మాకు నచ్చినట్లే గాని, అమ్మాయికి వంట వచ్చా ?" అని అడిగారు.


మా బాబాయి "సుమారుగా వచ్చు" అని అన్నారు.

అందులకు వారు మరల "అమ్మాయి ఒకటే గదూ మీకు. మీ దగ్గర చాలా గారాబంగా పెరిగిందనుకుంటాను. మా యింట్లో చాలా పని చేయాలి. వంట కూడా వచ్చినట్టు లేదు. మేము నడువమంటే నడువలేదు" అని అన్నారు. మా బాబాయి మొహం చిన్నబోయింది. ఇంతకీ నేను చెప్పేదేమిటంటే పెండ్లిచూపులకు వచ్చిన వారు అమ్మాయి నచ్చితే నచ్చినదని చెప్పాలి. నచ్చకపోతే నచ్చలేదని చెప్పాలి. అంతేగాని ఎదుట వారిని లేనిపోని వంకలు పెట్టటం వారికి సరదా కాబోలు. మా బాబాయికి ఒకే కూతురు ఉండటము తప్పా? గారాబంగా పెంచుకోవటము తప్పా? ఆ అమ్మాయి సిగ్గుచేత నడవనన్నది కాని గారాబముచేత నడవకుండా ఉంటారా!

ఇంకొక రకము పెండ్లిచూపులు వారు కూడ ఉన్నారు. ఒకసారి నేను మా అన్నయ్య వూరి కెళ్లాను. అన్నయ్య ఇంటిప్రక్కవాళ్ళ వాళ్ల అమ్మాయిని ఎవరో చూడటానికి వస్తారని మమ్మల్నికూడా రమ్మన్నారు. మా వదినకు తీరిక లేద నన్ను పంపించినది. చూడటానికి వచ్చిన వారిలో ఆడవాళ్ళకూడా ఉన్నారు. అమ్మాయిని చూచిన తరువాత "ఆ బుగ్గమీద మచ్చ లేవిటి ? (నిజానికి ఆ అమ్మాయికి బుగ్గమీద మచ్చలే లేవు) ఇలా సన్నగా ఉందేవిటి ?" అని అడిగారు. అలా మాట్లాడినప్పుడు ఆ అమ్మాయి మనస్సు, ఆ తల్లిదండ్రుల మనస్సు ఎలా ఉంటుంది ? ఎదుటివారిని అలా అడిగినప్పుడు, ఆ లోపాలు మరల చూడవచ్చిన వారినే అడిగితే ఎలా ఉంటుందన్న సంగతి వారికే తెలియాలి! వారు వంట వచ్చా అని అడగవచ్చు. రాదని చెప్పితే నేర్పండని చెప్పాలి గాని మారు మాటలతో తిట్టడం ఎవరికి ప్రయోజనం ఉంటుంది? కొంత మంది పెద్దమనుష్యులు రావటానికి పెండ్లి చూపులకు వచ్చినా, "అవి లేవు, ఇవి లేవు!" అని అంటూ ఉంటారు. లేనివి ఎక్కడనుంచి తెస్తారు? ఉదాహరణకు ఒకరింటికే పోయా రనుకోండి. వారింట్లో కరెంటు ఉండదు. "అరె! మీ యింట్లో కరెంటు లేదా! ఏమండీ మీ యింట్లో కరెంటు లేదే! మీరేమి చేస్తారండి మీ అమ్మాయి పెండ్లి?" అని అడిగే పెద్దలు ఉన్నారు. పెండ్లిచూపులకు వచ్చేవాళ్ళ పిల్లను చూడాలి. తమ అభిప్రాయాలు అడిగి తెలుసుకొనవచ్చు. ఇష్టపడితే ఇష్టమని చెప్పాలి. లేకపోతే ఇష్టము లేదని చెప్పాలి. అంతేగాని, లేనిపోని కబుర్లతో ఇతరులను హేళన చేయుచూ, తామేదో గొప్ప వారులూ ప్రవర్తిస్తే ఏమి ప్రయోజనం ? ★

ఎప్పుడూ ఇంతే — 8

శంకర్





దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

31-5-1961 బుధవారము మొదలు
6-6-1961 మంగళవారము వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ఇంతకుముందుకన్నా అనేక విధాల ప్రోత్సాహం కనుపిస్తూ ఉంటుంది. ముఖ్యంగా వృత్తి, ఉద్యోగాలలో శ్రమకరమైన పనులు చేయవలసి వచ్చినా హోదా, ధనాదాయము, సమయంలో మిత్రుల సలహా లభిస్తవి. శుభకార్య సందర్భాలలో గాని, పుణ్యస్థలాలకు గాని ప్రయాణం చేస్తారు. మీ కార్యక్రమాలు రహస్యంగాను, నిరాడంబరంగాను జరిగేటట్లు చూచుకొనటం మంచిది. పది మందిలో యుక్తితో మాట్లాడి గౌరవం పొందగలుగుతారు. తలపెట్టినపనులు కొంచెం నిదానంగా దారికి వస్తవి. బంధువులను నమ్మి యితరులకు ముందుగా వాగ్దానాలు ఈయవద్దు. కుటుంబంలో చాలవరకు నెమ్మదిగానే ఉంటుంది. వారాంతంలో కోపోద్రేకాలు కనిపించవచ్చు. 31, 1 తేదులలో ధనప్రాప్తి, తూర్పు, ఉత్తర దిక్కుల నుంచి శుభవార్తలు.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

గ్రహబలం బాగున్న సమయం. ముందు జాగ్రత్తతో మాట్లాడుతూ మీ అంతస్థును నిలబెట్టుకో గలుగుతారు. వృత్తిలో క్రొత్తవారితో సంబంధం ఏర్పడుతుంది. ఖర్చుల విషయంలో మాత్రం మీరు కొంత జాగ్రత్త పడటం అవసరం. పుణ్యస్థలాలకు ప్రయాణాలు చేస్తారు. ఒక పనికోసం ప్రయత్నిస్తే మరొకవిధంగా ఫలితం కనుపిస్తూ ఉంటుంది. మీ క్రింద పని చేసేవారిమీద అకస్మాత్తుగా కోపం రావచ్చు. కాని, ప్రస్తుతం చిక్కులకు దారితీయకుండా చూచుకొనవలసి ఉంటుంది. కుటుంబంలోని వారి ఆరోగ్యం అంత తృప్తికరంగా ఉండదు. వ్యవహార తీర్మానాల నిమిత్తం తొందరపడవద్దు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతవి. ఇతరులను గురించి దూషిస్తూ మీవల్ల కార్యం సాధించుకొనటానికి ప్రయత్నించేవారు ఉంటారు. జాగ్రత్త. 5, 6 లలో అపవాదులు, దుబారా ఖర్చులు.

* * *

గ్రహస్థితి

మేషంలో శుక్రుడు, వృషభంలో సూర్యుడు, మిధునంలో బుధుడు, కర్కాటకంలో అంగారకుడు, సింహంలో రాహువు మకరంలో గురు, శనులు, కుంభంలో కేతువు వృశ్చిక ధనుర్మకర కుంభాలలో చంద్రుడు.

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ప్రతి విషయంలోను శుభసూచనలు కనుపిస్తూ ఉంటవి. అధికారులు మీకు ప్రోత్సాహాన్ని కలుగజేస్తారు. మీరు చేసే ఆలోచనలు చురుకుగా ఫలించి మీరు పైన వేసుకొన్న బాధ్యతలు తగ్గుతవి. ఈ సమయంలో బుద్ధిబలంతో, అవతలివారిని మెప్పించి కార్యం సాధించుకో గలుగుతారు. ధర్మకార్యాలకై ఖర్చులు పెరుగుతవి. కుటుంబంలో కలహప్రసంగాలు రాగల సూచనలున్నవి. పడమర దిక్కునుంచి నిరుత్సాహకరమైన వార్తలు తెలుస్తవి. మీరు మీ బంధుమిత్రులకు చేసిన సహాయం సక్రమంగా వినియోగపడక పోవటంవల్ల నిరుత్సాహం కలుగుతుంది. ఆదాయం బాగా పెరుగుతుంది. 2, 3 తేదులలో వృత్తిలో పోటీలు, నీచులతో కలహాలు.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

ఏ సందర్భంలో ఏ విధంగా చిక్కు వస్తుందోనని జాగ్రత్తపడుతూ మీ కార్యక్రమాలను సాగించవలసి వస్తుంది. పైకి మీతో మృదువుగా మాట్లాడుతూ వృత్తి ఉద్యోగాలలో పోటీకి దిగేవారుంటారు. విలాస, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. కాని, మనశ్శాంతి మాత్రం కనిపించదు. ఆదాయం మామూలుగా ఉంటుంది. బంధుమిత్రుల వద్ద నుంచి కష్టవార్తలు తెలియవచ్చు. విలువగల వస్తువులు కొంటారు. యంత్రసంబంధమైన పనులలో జాగ్రత్తగా ఉండటం అవసరం. సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణము, సహస్రనామ పూజ జరుపుకొనటంవల్ల సుఖ శాంతులు, కార్యసిద్ధి పొందగలుగుతారు. 3, 4 తేదులలో అకస్మాత్తుగా దేహబాధలు, దండుగ ఖర్చులు.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

సంఘంలో కీర్తిప్రతిష్ఠలు పొందతగిన సమయమే కాని, ప్రతిబంధకాలను తొలగించుకొంటూ ముందుకు పోవలసి వస్తుంది. వృత్తివ్యాపారాలలో మీ యోచనలను అమలు జరుపగలుగుతారు. మధ్యవర్తుల మాటలను నమ్మి స్నేహితుల మీద కోపాన్ని పెంచుకోవద్దు. ఆరంభించిన పనులను సమర్థతతో నెరవేర్చగలుగుతారు. అయితే మీరు అనుకున్నంత ప్రతిఫలం లభించదు. ప్రయాణాలు సుఖంగా జరుగుతవి. ఇతరులకు సలహా చెప్పి కార్యరంగంలో దింపగలుగుతారు. ఈ వారం అంతా మానసికంగానూ, శారీరకంగానూ శ్రమ అధికమవుతుంది. కోర్టు కచేరీలలో మీ మాటను సులభంగా చెలామణి చేసుకోలేక పోతారు. 31, 1 తేదులలో సంఘంలో గౌరవం, ఆడంబరం నిమిత్తం ఖర్చులు.

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

దైవబలం బాగున్నది. ఏపని అనుకున్నా వెంటనే కార్యరూపంలోకి వస్తుంది. ఇతరులను గురించిన ఆలోచనలు మిమ్ములను నిరుత్సాహ పరచవచ్చు. అనేకరకాల మనుష్యులతో పరిచయం లభిస్తుంది. ధనాదాయం విశేషంగా పెరుగగల సమయం. కాని, ఖర్చులుకూడా అదేవిధంగా కనిపెట్టుకుని ఉంటవి. చట్టావ్యాపారవంటి వృత్తులలో ఫలితం పొందగలమనే ఆశను వదులుకొనటం మంచిది. కుటుంబంలో శుభ, సంతోష కార్యాల నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. ఆరోగ్యము, మనశ్శాంతి లభిస్తవి. ఇంతకుముందు మిమ్ములను కలహాలకు దించటానికి ప్రయత్నించే శత్రువులు క్రమంగా అణగిపోతారు. వారాంతంలో దక్షిణదిక్కు నుంచి శుభవార్తలు తెలుస్తవి. 1, 2 తేదులలో వృత్తిలో అభివృద్ధి, అధికారుల ఆదరణ.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

దేహశ్రమతోకూడిన పనులలో విశేషం ఫలితం లభించగలదని, అనుకున్న సందర్భంలో ఆ ప్రకారం పొందలేకపోతారు. వృత్తిలో గౌరవము, పెద్దమనుష్యుల పరిచయము లభిస్తుంది. ఇంతకుముందు మీరు ఆశ వదులుకున్న ధనం చేతికి వస్తుంది. బంధుమిత్రుల నిమిత్తం శ్రమపడతారు కాని, మంచితనం సంపాదించలేకపోతారు. ప్రయాణాలు అనుకున్న ప్రకారం సాగవు. పిల్లల ఆరోగ్యంగురించి ఆందోళన అధికమవుతుంది. ప్రస్తుతం ఆదాయం సాధారణంగా ఉన్నా, సంతృప్తితో కార్యక్రమాలు పెంచుకొనకుండా ఉండవలసిన సమయం. కలహ ప్రసంగాలలోను, వ్యవహార విషయాలలోను ప్రవేశించ తగిన కాలం కాదు. దైవబలం తక్కువ. 5, 6 లలో వృత్తిలో ప్రతిబంధకాలు, ఆందోళన.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

మీ స్వశక్తితో పనులు నెరవేర్చుకొనటం శ్రమగా తోచవచ్చు. కాని, మీరు మంచితనంతో సమర్థులయిన పెద్దమనుష్యుల ఆదరాభిమానాలు సంపాదించగలుగుతారు. ప్రతిబంధకాలు మాత్రం ఏమీ ఉండవు. క్రొత్తవారి స్నేహసంబంధాలవల్ల ఖర్చులు పెరుగుతవి. వృత్తిఉద్యోగాలలో మీరు ఎదురుచూస్తున్న మార్పులు క్రమంగా అనుకూలిస్తవి. కొన్ని పనులలో స్వల్పఫలితంతోనే సంతృప్తి చెందవలసి వస్తుంది. పిల్లల ఆరోగ్యం సరిగా ఉండదు. వారం రెండవ భాగంలో శుభ లాభ వార్తలు వింటారు. భూములు మొదలయినవి కొనే ప్రయత్నాలలో తాత్కాలికంగా ప్రతిబంధకాలు వచ్చునట్లు కనిపిస్తుంది. ఖర్చులు అధికంగా ఉన్నా, తగినంత ప్రయోజనం పొందగలుగుతారు. 31, 1 లలో అకస్మాద్ధనలాభం, అధికారులవల్ల కార్యసిద్ధి.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)

ప్రస్తుతం ఏ సందర్భంలోను నిలకడ కనుపించదు. ఒక సమయంలో చాలా ఉత్సాహం కనుపిస్తుంది. గొప్పగా లాభించేటట్లు తోస్తుంది. అందువల్ల ఏ విధమైన ఉపయోగముఉండదు. మరొక సమయంలో విశేషంగా కష్టనష్టాలు రాబోతున్నట్లు పరిస్థితులు తీవ్రంగా కనుపిస్తవి. కాని చివరకు అందువల్లకూడా ఏవిధమైన చిక్కు ఉండదు. అన్నిటికి తొందరపడి బయట వేసుకొనకుండా నిబ్బరంగా ఉండటం అవసరం. విలాసవస్తువులు మొదలైనవాటికై ఖర్చులు పెరుగుతవి. మంచి పేరు కోసం శ్రమను లెక్కచేయకుండా ప్రాకులాడ గలుగుతారు. అదనపు ఖర్చులు వచ్చిపడుతవి. వ్యవహార విషయాలలో తొందర పనికిరాదు. బంధువులవల్ల సహాయం లభిస్తుంది. కుటుంబ విషయాలలో మనశ్శాంతి తగ్గుతుంది. 4, 5 లలో భాగస్థులతో అభిప్రాయభేదాలు, స్నేహితుల ఎడబాటు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

మీరు ఎంత వద్దని అనుకున్నా అవసరానికి అప్పు చేయవలసి వస్తుంది. వ్యవహారరంగంలో చిక్కులను దాటగలుగుతారు. అయితే దైవికంగా జరిగే నిదానమును భరించటం శ్రమగా తోస్తుంది. క్రమంగా ఆదాయం పెరుగుతుంది. ఈ సమయంలో వృత్తి, వ్యాపారాలలో మీరు అనుసరించే మార్గం గౌరవప్రదంగాను, లాభకరంగా ఉంటుంది. ఇతరుల హాస్య ప్రసంగాలకు, అనవసర విషయాలకు సమాధానం చెప్పవలసిన అవసరాన్ని తప్పించుకొనడంవల్ల అన్నివిధాలా గౌరవం పొందగలుగుతారు. వ్యవహార సంబంధమైన విషయాలలో ఇతరులకు సహాయం చేయవలసి వస్తుంది. ధర్మకార్యాలకు ప్రతిబంధకాలు రాతగిన సమయం. ఇంతకుముందున్న ఆందోళన చాలవరకు తగ్గుతుంది. 1, 2 లలో సంచారం, కార్యభంగం.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఈ సమయంలో ఫలితము, హోదా కూడా సమానంగా పెరుగుతవి. లభించిన అవకాశాన్ని వినియోగించుకునే సందర్భంలో శ్రమ కనుపిస్తుంది. కుటుంబంలో ఇంతకుముందు ఏర్పడిన ఖర్చులు క్రమంగా తగ్గుతవి. మీరు ఇతరులకు వ్రాసిన ఉత్తరాలకు అనుకూలమైన సమాధానం వస్తుంది. ముందుముందు లాభించగల పనులయందు డబ్బును వినియోగిస్తారు. నౌకరులు మొదలయిన వారితో కలహాలు వచ్చి సులభంగా సమసిపోతవి. కోర్టు కచేరీలలో ఏ పనీ సంపూర్తిగా నెరవేరే సమయం కాదు. ముందుగా అంచనా చూచుకొనకుండా ఆరంభించిన పనులు మధ్యలో నిలిపి నిదానంగా కొనసాగించవలసి వస్తుంది. పై అధికారులతో పేచీలు వచ్చినా, వెంటనే సమాధానం కుదురుతుంది. 2, 3, 4 లలో త్రిప్పట అధికం, శుభ సందర్భాలలో ఖర్చులు.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)


ప్రతి విషయంలోను మృదువుగా జరుపుకోగలుగుతారు. అందువల్ల మీ మాటకు ప్రాధాన్యత లభిస్తుంది. ఆదాయాన్నిగురించి ఆందోళన తొలగుతుంది. అనుకోకుండా క్రొత్త మనుష్యులతో స్నేహసంబంధాలు ఏర్పడుతవి. ఇతరుల నిమిత్తం మీ పలుకుబడిని వినియోగించగలుగుతారు. దూరపు ప్రయాణం చేయవలసి రావచ్చు. కొన్ని రకాల మనుష్యులతో కఠినంగా ప్రవర్తించవలసిన అవసరం కలుగుతుంది. వారాంతంలో మీ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్తగా ఉండండి. వస్త్రాలు మొదలయిన అలంకార వస్తువుల నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. నౌకరులతో కలహాలు వస్తవి. 5, 6 లలో అశాంతి, వృత్తిలో ప్రతిబంధకాలు. ★

ఈవారము ధరలు

బంగారు ధర ఈ వారంలో క్రమంగా పెరిగి వారాంతంలో కొద్దిగా తగ్గుతుంది. వెండి ధర కొద్దిగా తగ్గుతుంది. అయితే నిలకడ ఉండదు.

పసుపు ధరలో వారం ఆరంభంలో మందీ కనుపిస్తుంది. వేరుశేనగపప్పు ధర నిలకడగా ఉంటుంది. వారాంతంలో కొద్ది పెరుగుదల వస్తుంది. నూనె ధరలో మందీ సూచనలు కనుపిస్తవి. నూవుల ధర తగ్గే సూచనలున్నవి. నూవులనూనె ధరలో పెద్ద మార్పులు ఉండవు.

గోధుమల ధరలో మందీ వస్తుంది. కందులకు గిరాకీ కనుపిస్తుంది. మినుముల ధర కూడా పెరుగుదలలోనే ఉంటుంది. నూలు ఉద తేజీలో విలుస్తుంది.



చిత్రకారుడు : జి. గణేశ్. (కాకినాడ)

అన్నా-తమ్ముడూ





యస్ జయరామిరెడ్డి

సుబ్బారావు కవరుచింపి ఉత్తరం చదువు కున్నాడు. 'చిరంజీవి సుబ్బారావుకు, మీ పెదనాన్న దీవించి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. ఈ ఉత్తరం అందిన వెంటనే నీవు ఒక వారం రోజులు సెలవుపెట్టి ఇక్కడకు రావలెను. ఇది అర్జంటు.

మీ పెదనాన్న,
సుందర్రామయ్య.

సుబ్బారావుకు ఆ అర్జంటు ఏమిటో అర్థం కాలేదు. కాని ఆయన 'అర్జంటు' అని వ్రాశాడంటే అది 'డబుల్ అర్జంటు' అయివుండాలి! అందువల్ల అప్పుడే ఆఫీసుకు సెలవుపెట్టి బయలుదేరాడు సుబ్బారావు.

సుబ్బారావుకు పెదనాన్న సుందర్రామయ్య గారంటే ఎంతో భయమూ, భక్తీ ఉన్నాయి. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి సుబ్బారావును, తన స్వంత కుమారుడు ప్రసాద్‌తోపాటు చదివించి ఇంజనీరుని చేశాడు. తమ్ముడి కొడుకు అనే భావం ఆయనలో ఎన్నడూ కలుగలేదు. అందువల్లే సుబ్బారావుకి సుందర్రామయ్యగారంటే అంత ప్రేమ.

బండి దిగి ఇంట్లోకి వెళ్ళేప్పటికి ఆదుర్దా పడవలసిన పరిస్థితి ఏమీ కనిపించలేదు. కాకపోతే పెదనాన్న మామూలుకన్నా కొంచెం గంభీరంగా ఉన్నాడు. సుబ్బారావు భోజనం చేసి వచ్చి వరండాలో కూర్చున్నాడు. సుందర్రామయ్య పడక కుర్చీలో కూర్చుని చుట్ట చుట్టుకుంటున్నాడు.

చుట్ట చుట్టుకోవడం పూర్తి చేశాక ఆయనే సంభాషణ ప్రారంభించాడు. "మన ప్రసాద్ విషయం ఏమీ బాగులేదురా" అన్నాడు.

సుబ్బారావు మౌనం వహించాడు.

ఆయన లాల్చీ జేబులోంచి ఒక ఉత్తరంతీసి సుబ్బారావు కిస్తూ "ఇది చదువు. అంతా చదవనక్కర్లేదు. ఆ చివర భాగం చదువు నీకే అర్థమౌతుంది" అన్నాడు.

సుబ్బారావు ఉత్తరం చదివాడు: "—ఆ అమ్మాయి మా ప్రొఫెసర్ శంకరబాబుగారి రెండవ కుమార్తె. పేరు సవిత. మీకు అన్నివిధాలా తగిన కోడలని నా ఉద్దేశం. మీరు మీ ఆశీర్వాదాలను పంపిస్తే ఈ వేసవికాలంలోనే వివాహం చేసుకోటానికి సిద్ధంగా ఉన్నాను .... శంకరబాబుగారుకూడ ఈ వివాహానికి అంగీకరించాడు. మీ నుంచి జవాబు రాగానే ఆ విషయం శంకరబాబుగారికి తెలియజేస్తాను. ఆయన మీకు ఉత్తరం వ్రాసి మీ పరిచయం చేసుకోటానికి చాల ఆదుర్దా పడుతున్నాడు.

ఇట్లు మీ కుమారుడు
ప్రసాద్.

ఉత్తరం పూర్తి కాగానే సుందరరామయ్యగారు "చూశావా మీ తమ్ముడి ఘనకార్యం? వీడి వ్రాతలకు ఏమైనా అర్థముందా అంట? ఎవరో బెంగాలీ అమ్మాయి వీణ్ణి వలలో వేసుకొని ఆడిస్తుంటే వీడోమో కోతిలాగ ఆడుతున్నాడు. పెళ్ళి చేసుకొంటాడుట. పెళ్ళి! వీడు పెళ్ళి చేసుకోవాలంటే ఆ కలకత్తాలో బెంగాలీ పిల్ల తప్పితే ఇక్కడ పిల్లలే లేరా? ఆంధ్రదేశం గొడ్డుపోయిందనా వీడి ఉద్దేశం? చెప్పవోయ్ నువ్వన్నా చెప్పు!'' అన్నాడు గుక్క తిప్పుకోకుండా. ఆయనలో అంతకుముందు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం అంతా మాయమైపోయింది.

''చెప్పాను. కాని.....కాని వాడిక్కడ లేడుగా మరి''



అన్నాడు సుబ్బారావు ఏం జవాబు చెప్పాలో తోచక.

''అందుకే గదటోయ్ నీకు ఉత్తరం వ్రాసింది! వెళ్ళు. ఇవ్వాళే బయలుదేరి కలకత్తా వెళ్ళు. వెళ్ళి వాడి ముఖం వాచేటట్లు చివాట్లు పెట్టు. ఇటువంటి వెధవ వేషాలువేస్తే ఇకనుంచీ దమ్మిడీ కూడ పంపనని చెప్పు. అవసరమైతే నాలుగు తన్ని, పోలీసు రిపోర్టు ఇచ్చి ఇక్కడకు లాక్కురా. తెలిసిందా?'' అన్నాడు.

సుబ్బారావుకు తెలియలేదు.

''పోలీసు రిపోర్టు ఏమని ఇచ్చేది పెదనాన్నా!'' అన్నాడు.

''అదేనోయ్. వాడికి పిచ్చెక్కిందని ఇవ్వు. ఇక వెళ్ళు. అక్కడ కాలేజీలో లెక్చరరు కోదండరావని నా బాల్యమిత్రుడొకడు ఉన్నాడు. వాడికి నేను ఇవ్వాళే ఉత్తరం వ్రాస్తున్నాను. అతని అడ్రసు ఇదుగో. నువ్వు కూడ అతని దగ్గరకెళ్ళి అతని సహాయం కూడ తీసుకో. ఉదయమే మెయిలుకు వెళ్ళవుగాని సిద్ధంగా ఉండు. ఆఁ, అడగటం మర్చిపోయాను. నీవైనా చక్కగా పెద్దవాళ్ళు చూసిన పిల్లను చేసుకొంటావా లేకపోతే ఏ అరవ పిల్లనో పట్టుకొని ప్రేమ, గీమ అంటావా మా వెధవలాగ'' అన్నాడు.

సుబ్బారావు నవ్వుతూ ''లేదు పెదనాన్నా, నేనుండేచోట అరవపిల్ల లెవరూ లేరు. అంతా సాయిబులే'' అన్నాడు.

సుబ్బారావు మర్నాడు ఉదయమే హౌరా మెయిలు ఎక్కాడు. స్టేషను ప్లాట్‌ఫారంమీదనుంచి రైలు పెట్టెలోకి ఎక్కేసరికి కలకత్తా వెళ్ళినంత పనైంది. పెట్టెలో అందరూ బెంగాలీవాళ్ళే ఉన్నారు. ఎలాగో ఒక మూల సీటు సంపాదించుకొని కూర్చున్నాడు.

సుబ్బారావూ, ప్రసాదూ స్వంత అన్నదమ్ములు కాకపోయినప్పటికీ అంతకన్న ఎక్కువ సోదరభావంతోనే కలసి ఉండేవారు. ప్రసాదు వయసులో సుబ్బారావుకన్నా నాలుగైదేళ్ళు చిన్న. ఇద్దరూ కలసి వాల్తేరులో చదువుకొంటున్నప్పుడు ప్రసాద్‌లో ఈ పోకిరీ లక్షణా లేమీ లేవు. కాని ఇంతలోనే ఇంత మారిపోతాడని అనుకోలేదు. పెదనాన్న అన్నట్టు ఈ ఆంధ్రదేశంలో ఆడపిల్లలే లేరని ఆ బెంగాలీ అమ్మాయిని చేసుకోవటమేమిటి? బహుశా ఏదో కుర్రతనంవల్ల ఆ ప్రేమ వ్యవహారంలోపడి ఉంటాడు. ప్రసాద్ బాగా డబ్బుగలవాడని తెలుసుకొని ఆ బెంగాలీ పిల్ల పెళ్ళి చేసుకోమని పట్టుబట్టి ఉంటుంది. లేకపోతే ఆ పిల్లకు మాత్రం కలకత్తాలో వాళ్ళజాతివాళ్ళు దొరక్క వీడినే ప్రేమించటమేమిటి? ఇది తప్పకుండా ప్రసాద్ అమాయకత్వాన్ని ఆధారం చేసుకొని ఆ బెంగాలీవాళ్ళు ఆడుతూన్న నాటకమే అయి ఉండాలి! ఏలాగైనాసరే తమ్ముణ్ణి ఈ రొంపిలోంచి



బయటకు లాగాల్సిందే. అవసరమైతే బలప్రయోగం చేసేంత చనువు కూడ తనకున్నది. అదీకాక పెదనాన్న ఆ అధికారం తనకు ఇవ్వనే ఇచ్చాడు.

ఎలాగైతేనేం రొప్పుతూ, రోజుతూ, రోజున్నర ప్రయాణంచేసి, హౌరా—మద్రాసు మెయిలు తన బాధ్యత తీరినట్లు ఒక నిట్టూర్పు విడిచి, హౌరా స్టేషన్లో ఆగిపోయింది.

ప్రసాద్ పెట్టెలన్నీ వెతుక్కుంటూ సుబ్బారావు ఉన్న చోటికి వచ్చాడు. అన్నయ్యను అంత దూరంలోనే చూసి లైసెన్సు పోర్టరును పిలుస్తూ "నీ టెలిగ్రాం ఇంతకుముందే అందింది అన్నాయ్" అన్నాడు.

ఇద్దరూ స్టేషను బయటకు వచ్చారు.

"నువ్వు ఇక్కడే భోజనం చేయటం మంచిది. ఇక్కడ దగ్గర్లోనే ఒక హోటల్లో మన భోజనం దొరుకుతుంది" అన్నాడు ప్రసాద్.

"మరి నువ్వో"

"నాకు బెంగాలీ భోజనం అలవాటైంది."

"ఓహో" అన్నాడు సుబ్బారావు కోపంగా.

సుబ్బారావు భోజనం చేశాక ఇద్దరూ ఒక టాక్సీ ఎక్కి, బజార్లన్నీ తిరిగి చివరకు ఒక చిన్న మేడ ముందు ఆగారు.

"ఈమేడపైనే నేను ఉండేది. క్రింద ఇంటి వాళ్ళు ఉంటారు" అన్నాడు ప్రసాద్.

ఇంటి చుట్టూ చిన్న పూలతోట ఉన్నది. వరండాలో నాలుగైదు పేము కుర్చీలు, రెండు సోఫాలూ ఉన్నాయి. ఇంటిముందు చక్కని కారు, ఇంట్లోంచి సన్నగా రేడియో సంగీతం వినిపిస్తోంది. ఇంటివారు ఎవరోగాని బాగా సంపన్నులే అయిఉండాలి అనుకొన్నాడు సుబ్బారావు. మేడమీద ప్రసాద్ ఉంటున్న గదిఒక్కటే ఉన్నది. రెండు కుర్చీలు, చిన్న టేబులూ చక్కగా అమర్చిన పుస్తకాలూ, తెల్లని పరువూ చూడగానే అలసిపోయి వచ్చిన సుబ్బారావుకు 'హాయి' అనిపించింది.

"ఇపుడు స్నానం చేయటానికి వీలుంటుందా? అన్నాడు సుబ్బారావు నీరసంగా ఒక కుర్చీలో కూలబడుతూ.

"వేడినీళ్ళు కావాలా? చన్నీళ్ళా?"

"ఓహో ఇక్కడ వేడినీళ్ళకు కూడ పైపు ఉన్నాయా?"

ప్రసాద్ నవ్వుతూ "నువ్వు కావాలంటే క్రింద ఇంటి వాళ్ళ నౌఖరుతో చెప్పి పెట్టిస్తాను" అన్నాడు.

"సరే కానీయ్" అన్నాడు సుబ్బారావు.

ప్రసాద్ క్రిందకు దిగివెళ్ళి పది నిముషాల్లో నౌఖరును తీసుకొని మళ్ళీ పైకివచ్చాడు.

"ఇతనివెంట వెళ్ళు అన్నాయ్. స్నానానికి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి" అన్నాడు.

సుబ్బారావు ఆ నౌఖరువెంట స్నానంచేసి రావటానికి క్రిందకు వెళ్లాడు. అతను స్నానంచేసి మళ్ళీ పైకి వచ్చేసరికి ప్రసాద్ అవీ ఇవీ సర్దుతున్నాడు. సుబ్బారావు వస్తూనే "ఈ ఇంటి వాళ్ళు చాల మంచివాళ్ళులా వున్నారు. ఆ నౌఖరు కూడ నేనేదో వాళ్ళ బంధువైనట్లు మర్యాదలు చేస్తున్నాడు. వాడికి తెలుగు కూడ వచ్చునే!" అన్నాడు.

అన్నా - తమ్ముడూ

"అవునన్నాయ్. వాళ్ళు చాల మర్యాదస్థులు. మన తెలుగువాళ్లే" అన్నాడు ప్రసాద్.

సుబ్బారావు బట్టలు వేసుకొని ఇక అసలు విషయానికి వద్దాం అనుకొన్నాడు. కాని నిద్ర ముంచుకొస్తోంది. అందువల్ల రేపు తాపీగా మాట్లాడవచ్చులే అనుకొంటూ మెత్తని పరువు మీద నడుం వాల్చాడు. మరుక్షణంలోనే గాఢంగా నిద్ర పట్టింది.

మర్నాడు సుబ్బారావుకు మెలకువచ్చి చూసేసరికి ప్రసాద్ స్నానంచేసి, బట్టలు వేసుకొని ఏదో చదువుకొంటున్నాడు. సుబ్బారావు గబగబా బ్రష్ నోట్లోపెట్టి పళ్ళు తోమటం మొదలెట్టాడు. అంతలో ఏడెనిమిది సంవత్సరాలు వయసుగల ఒక అమ్మాయి మేడమీదకువచ్చి "నాన్నగారు ఇవ్వాళ మిమ్మల్నీ, మీ అన్నగార్నీ ఫలహారం చేయటానికి క్రిందకు రమ్మంటున్నారు" అన్నది చక్కని తెలుగులో.

"అలాగే వస్తామని చెప్పు పాపా" అన్నాడు ప్రసాద్.

సుబ్బారావు బట్టలు వేసుకొని తమ్ముడికి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"నువ్వు వచ్చావని ఇంటివాళ్ళు ఫలహారానికి పిలిచారు. వెళ్దాం పద" అన్నాడు ప్రసాద్.

సుబ్బారావు గంభీరంగా ముఖంపెట్టి "కాదు ముందు నీతో మాట్లాడాలి" అన్నాడు.

ప్రసాద్ కొంచెం ఆశ్చర్యపడి "ఏమిటన్నయ్యా అది" అన్నాడు.

"నీ ప్రేమ వ్యవహారం. నీ వాలకం నాకేమీ నచ్చలేదురా" అన్నాడు గంభీరంగా.

ప్రసాద్ తేరుకున్నాడు. ఓహో అయితే నాన్నగారు నీ కా ఉత్తరంలో విషయాలన్నీ చెప్పారన్నమాట.

"ఊరక చెప్పటంకాదు. నీకు బుద్ధి చెప్పటానికై నాచేత సెలవు పెట్టించి ఈ కలకత్తా కూడ పంపించారు" అన్నాడు.

"ఇందులో బుద్ధిచెప్పటానికి నేను చేసిన తప్పేమీలేదు. ఆ అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటానన్నాను. ఇందులో తప్పేముంది?" అన్నాడు ప్రసాద్.

"తప్పేమీ లేదంటావా? పెంచి పెద్దవాడినిచేసిన తండ్రిని ఎదిరించి, మన జాతీ, మన కులమూ కాని ఎవర్నో పెళ్ళి చేసుకుంటాననటం తప్పుకాదూ? పెద్దవాళ్ళంటే నీకున్న గౌరవం ఇదేనా?"

"గౌరవం వుండబట్టే ముందుగా ఉత్తరం వ్రాసి ఆశీర్వాదాలు కోరాను"

"ఏమైనాసరే. ముక్కూ మొఖం తెలియని వూళ్ళో ఒక అనామకుల పిల్లను చేసుకొని మన వంశమర్యాదకు భంగం తెచ్చుకోవటం నా కిష్టం లేదు."

"వాళ్ళు అనామకులేమీకారు. మనకన్నా పేరు, ప్రతిష్ఠలూ, డబ్బూ ఉన్నావాళ్లే."

"అయినా సరే. వాళ్ళు బెంగాలీలు"

ప్రసాద్ అసహనంతో "వాళ్ళు బెంగాలీలని ఎవరన్నారు? వాళ్ళు అచ్చమైన తెలుగువాళ్ళే. కాకపోతే చాలకాలంనుంచీ ఇక్కడ ఉండటాన పేర్లు మాత్రం బెంగాలీవాళ్ళలా వుంటాయి—అదుగో మనకోసం మళ్ళీ వాళ్ళ నౌఖరు వస్తున్నాడు. తరువాత మాట్లాడుకోవచ్చు. ముందు ఫలహారానికి వెళ్దాం పద" అన్నాడు.

ఇద్దరూ మౌనంగా క్రిందికిదిగి వెళ్ళారు.

గదిలో అడుగు పెట్టేప్పటికి అందరూ వీళ్ళ కోసమే ఎదురు చూస్తున్నారు. తెల్లని సిల్కు లాల్చీ, తెల్లని ధోవతి ధరించి, కళ్ళజోడు పెట్టుకొన్న ఒక వ్యక్తి వీళ్ళను ఆహ్వానించాడు. ఆయన ప్రక్కనే, ఆయన భార్య కాబోలు ఒక వయసు మళ్ళినావిడ కూర్చుని ఉన్నది. ఆ తరువాత ఇద్దరు యువతులూ, ఇంతకు పూర్వం మేడమీదకు వచ్చి పోయిన పాపా ఉన్నారు.

ముసలాయన అందర్నీ పరిచయం చేశాడు. "ఈవిడ నా భార్య. వాళ్ళు ముగ్గురూ నా కూతుళ్ళు. మీ గురించి ప్రసాద్ నాతో నిన్ననే చెప్పాడు. మా గురించి గూడ ఈపాటికి మీకూ చెప్పేవుంటాడు. ప్రసాద్ ఇంతకుముందే మా కుటుంబంలో కలిసిపోయాడు. ఇక మీరు కూడ మమ్మల్నీ అన్యులుగా భావించమని మాట ఇస్తే మేము చాల సంతోషిస్తాం" అన్నాడు.

నిజానికి ప్రసాద్ వాళ్ళను గురించి ఏమీ చెప్పలేదు. బహుశా తాము ఆ ప్రేమ గొడవల్లో ఉండటాన చెప్పటానికి వీలులేకపోయివుంటుంది. అంతమంది కొత్తవాళ్ళమధ్య సుబ్బారావుకు బిడియంగానే ఉంది. కాని త్వరలోనే ఆ బిడియం కాస్తా పోయింది. ముసలాయన చాల కలుపుగోలుతనంతో సరదాగా మాట్లాడుతున్నాడు. ఆ యువతులిద్దరూ ఇంటరెస్టుతో వీళ్ళ కబుర్లు వింటున్నారు.

నాటకం జోరుగా సాగుతోంది. వీరుడైన పుత్రుని ఆశీర్వదించి దేశాంతరానికి తల్లి పంపే ఘట్టమది.

తల్లి:-'పుత్రా! నీ నోరు మంచిదైతే నీ భవిష్యత్తుకూడ ఆశాజనకంగా ఉంటుంది" అన్నది.

వెంటనే ఓ పల్లెటూరు రైతులేచి తల్లీ నీవు రెండు నాలికబద్దలు కొనుక్కుంటే నీ ఆరోగ్యం బాగుపడుతుంది. తద్వారా నాటకం ఆశాజనకంగా ఉంటుంది" అని కూర్చున్నాడు.

కన్నెగంటి వెంకటేశ్వరరావు
(తణుకు)

"ఐతే బాబూ, ప్రసాద్ నాన్నగారిపేరు ఇదివరకే నాకు తెలుసు. మరి మీ నాన్నగారి పేరేమిటి?" అన్నాడు ముసలాయన సుబ్బారావు నుద్దేశించి.

"మా నాన్న, వాళ్ళ నాన్నా అన్నదమ్ములేనండీ. వాళ్ళనాన్నపేరు కాళిదాసు" అన్నాడు ప్రసాద్, సుబ్బారావుకు బదులు తనే సమాధానమిస్తూ.

అంతవరకూ మౌనంగా కూర్చుని రొట్టె తింటూన్న వాళ్ళ మూడో అమ్మాయి హఠాత్తుగా తలఎత్తి ప్రక్కనేవున్న వాళ్ళ అక్కను ఉద్దేశించి "అక్కా, కాళిదాసంటే అభిజ్ఞానశాకుంతలం వ్రాసినాయనేకదూ? ఆయన చాల గొప్ప కవి. అలా అని మా తెలుగుమేస్టారు చెప్పారు లేవే!" అంది.

వాళ్ళ అక్క సిగ్గుపడిపోయి "ఛీ, ఊరుకోవే. ఆ కాళిదాసు ఈకాలంవాడు కాదు" అన్నది.

"ఫరవాలేదులే. మా చిన్నాన్న కూడ ఈ కాలం వాడు కాదు — స్వభావంలో" అన్నాడు ప్రసాద్ ఆ యువతి వేపు చూస్తూ.

అందరూ నవ్వారు.

ఆ యువతి ప్రసాద్‌వేపు కృత్రిమ కోపంతో చూస్తూ "చాల్లెండి, పెద్దవాళ్ళమీదనా మన హాస్యాలు" అన్నది.

అప్పటివరకు మౌనంగా కూర్చునిఉన్న రెండో యువతి, మొదటి సారిగా సుబ్బారావు నుద్దేశించి "చూశారా, మా చెల్లికీ, ప్రసాదుకూ ఒక్క క్షణం కూడ పడదు. ఇంకా కొంచెం సేపట్లో వాళ్ళిద్దరూ 'కోల్డ్ వార్'లో దిగి మనందర్నీ మర్చిపోతారు. ఈ లోపునే మీ కాఫీ ముగించటం మంచిది" అన్నది.

సుబ్బారావు ఆ అమ్మాయి కలుపుగోలు తనానికి ఆశ్చర్యపోతూ ఆ యువతివేపు పరీక్షగా చూశాడు. చాల అందంగా ఉన్నది. తెల్ల షిఫాన్ చీరె, నల్లరంగు చోళీ, రెండు జడలూ....

ఎర్రపూల సిల్కుచీరె కట్టుకున్న చెల్లెలు అక్క వేపు కోపంగా చూసింది.

ముసలాయన కూతుళ్ళవేపు ప్రేమగా చూస్తూ "రాక రాక ఎవరైనా తెలుగువాళ్ళు వస్తే మా అందరికీ ప్రాణం లేచివచ్చినట్లనిపిస్తుంది. చూశారా, ఇవ్వాళ మా పిల్లలు ఎంత సంతోషంగా ఉన్నారో! అందుకే మా అమ్మాయిల్ని దూరమైనా సరే తెలుగుదేశం నడిగడ్డన ఇవ్వాలనుకొంటున్నాను" అన్నాడు సాభిప్రాయంగా ప్రసాద్‌వేపు చూస్తూ.

ఎర్ర చీరె యువతి ఎందుకో ప్రసాద్‌వేపుచూసి సిగ్గుపడుతూ తలవంచుకొన్నది. చెల్లెలు సిగ్గుపడటంచూసి తెల్ల చీరె అమ్మాయి తనలో తనే నవ్వుకొన్నది. సుబ్బారావుకు ఈ నాటకం అర్థం కాక కొంచెం గందరగోళంలో పడ్డాడు.

అలా సరదా కబుర్లతో ఫలహారం ముగించారు. సుబ్బారావూ, ప్రసాదూ వాళ్ళందరివద్దా సెలవు తీసుకుని మేడమీద తమ గదికి బయలుదేరారు. సుబ్బారావు మనసు చాల ఉల్లాసంగా ఉన్నది. తాను కలకత్తాలో ఏదైతే దొరకదని బాధ పడ్డాడో, ఆ కాఫీ దొరికింది. ఎంతో కలుపుగోలుతనంతో తనను ఆదరించిన ఆ కుటుంబాన్ని చూసేసరికి సుబ్బారావు మనసులో ప్రసాద్‌మీద కలిగిన కోపం కూడా మాయమైపోయింది. ముచ్చటైన కుటుంబం. అమాయకంగాఉన్న ముగ్గురు అక్కా చెల్లెళ్ళు అతని కళ్ళముందు మెదలసాగారు. ముఖ్యంగా ఆ తెల్లచీరె యువతి—ఎంత అమాయకంగా నవ్వుతుంది! అనుకొన్నాడు సుబ్బారావు.

ప్రసాద్ తలవంచుకొని మేడమెట్లు ఎక్కుతున్నాడు.

"చాల మంచివాళ్ళులాగున్నారు. వాళ్ళ కుటుంబం చూస్తుంటే నాకు చాల ముచ్చటగా ఉంది. ఆడపిల్లలు కూడ అనవసరమైన సిగ్గును ప్రదర్శించలేదు. చాలసంస్కారం కలవాళ్ళనుకొంటాము?" అన్నాడు సుబ్బారావు.

"అవును. ఆ ఇద్దరమ్మాయిలూ గ్రాడ్యుయేట్స్" అన్నాడు ప్రసాద్. ఇద్దరూ రూములోకి వచ్చారు.

"ఇక మన వ్యవహారం తేల్చు" అన్నాడు సుబ్బారావు.

"ఏమిటి?"

"అదే. నీ పెళ్ళి సంగతి. మీ నాన్న ఈ పెళ్ళికి చచ్చినా ఒప్పుకోడు"

"దాని విషయం యింకా చెప్పేదేముంది? నా నిశ్చయం ఇదివరకే చెప్పాను. దానికి తిరుగులేదు" అన్నాడు ప్రసాద్.

"అంతేనన్నమాట! సరే—ఆ అమ్మాయిని నాకొకసారి చూపిస్తావా?"

ప్రసాద్ ఒప్పుకోకపోయినా, ఆ అమ్మాయిని కలుసుకొని ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదనిచెప్పి ఆ అమ్మాయినైనా ఒప్పించాలని సుబ్బారావు ఉద్దేశం.

"నేను చూపించేదేముంది. ఇప్పటివరకూ చూసే వచ్చావుగా" అన్నాడు ప్రసాద్. తాపీగా.

సుబ్బారావు నివ్వెరపోయాడు "ఐతే — ఐతే ఆయనేనా శంకరబాబంటే ?"

"అవును. ఆయనే శంకరబాబు. మాకు ప్రొఫెసరు కూడ ఆయనే" అన్నాడు.

"ఆ ఇద్దరు యువతుల్లో—ఎవర్ని నువ్వు ప్రేమించింది?"

"ఆ ఎర్రపూల చీరెకట్టుకొన్నదే ఆ అమ్మాయి. శంకరబాబుగారి రెండో కుమార్తె. పేరు సవిత. తెల్లచీర కట్టుకొన్న ఆ రెండో అమ్మాయి ఈవిడ అక్క. కొద్ది రోజుల్లో నాకు ఒదిన కాబోతోంది. పేరు పార్వతి. ఇంకా ఏమైనా వివరాలు కావాలా ?" అన్నాడు ప్రసాదు విసువుగా.

అవును. ఇంకా వివరాలు కావాలి! ఆ తెల్లచీరె అమ్మాయి—పార్వతినిగురించి ఇంకా చాల వివరాలు కావాలి. కాని తమ్ముణ్ణి ఏ ముఖం పెట్టుకొని అడగటం? ఇప్పటివరకూ తనే వాడికి బుద్ధి చెప్తున్నాడాయె! సుబ్బారావు ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

ప్రసాద్ కొంచెంసేపుఉండి "నాకు ఇవ్వాళ ప్రాక్టికల్సు ఉన్నాయి. ఎగగొట్టటానికి వీల్లేదు. నేను యూనివర్శిటీకి వెళ్తున్నాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సుబ్బారావు అలా ఆలోచిస్తూ ఎంత సేపు కూర్చున్నాడోకాని శంకరబాబుగారి నౌఖరు గదిలోకి వచ్చేసరికి ఈ లోకంలో పడ్డాడు.

"మిమ్మల్ని భోజనానికి రమ్మంటున్నారు" అన్నాడు ఆ నౌఖరు.

సుబ్బారావు కొంచెం కంగారుపడి "ప్రసాద్ కాలేజీకి వెళ్ళాడు" అన్నాడు.

"ఆ బాబు సాయంత్రం వరకూ రారు. భోజనానికి రమ్మనేది మిమ్మల్నే"

సుబ్బారావు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించలేకపోయాడు. క్రిందకువెళ్తే పార్వతి కనిపిస్తుందని అతని ఆశ.

సుబ్బారావు దుస్తులు వేసుకొని వెళ్ళేసరికి పార్వతి కుర్చీలో కూర్చుని ఉన్నది. సుబ్బారావును చూడగానే కుర్చీలోంచి లేచి "రండి" అన్నది. సుబ్బారావు ఆ అమ్మాయి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"మీ తమ్ముడు లేకుండా కొత్త ఇంట్లో భోజనం చెయ్యటం మీకు ఇబ్బందిగానే ఉంటుంది. కాని నాన్నగారూ, ప్రసాదూ యూనివర్శిటీకి వెళ్ళిపోయారు. సాయంత్రం వరకూ రారు" అన్నది.

"అబ్బే ఇబ్బందేముందండీ. మీ ఆదరణలో నాకు అభిమానంవున్న సంగతి కూడ మర్చిపోతున్నాను" అన్నాడు.

ఆ అమ్మాయి చల్లని వెన్నెలలా నవ్వింది. "మీరు హైదరాబాదులో జూనియర్ ఇంజనీరు చేస్తున్నారనే ప్రసాద్ చెప్పాడు. కాని భర్తగా ఉద్యోగం కూడ చేస్తారని చెప్పనేలేదు" అన్నది.

సుబ్బారావు కూడ నవ్వాడు. ఇప్పుడు అతని సంకోచం పూర్తిగా పోయింది. "నా ఉద్యోగాని కేంయిలెండి. మీకేమీ అభ్యంతరం లేకపోతే మీ భర్తగారు ఏం ఉద్యోగం చేస్తారో తెలుసుకోవాలని ఉన్నది" అన్నాడు.

ఆ మాటలు వినగానే పార్వతికి నవ్వు ఆగలేదు. పకపకా నవ్వుతూ "మీరెంత అమాయకులండీ. పెళ్ళైతే మెడలో మంగళసూత్రం కనపడదా? అలా కనపడకుండా ఉండటానికి నేనేమీ చంద్రమతిని కాదే" అన్నది.

సుబ్బారావు కూడ మనస్ఫూర్తిగా నవ్వకుండా ఉండలేకపోయాడు.


భోజనం చేసివచ్చి రూములో పడుకొంటే సుబ్బారావుకు ఎంతకూ నిద్రపట్టలేదు. తెల్ల చీరె, అమాయకంగా కళ్ళు. చిన్న పిల్లలా నవ్వే పార్వతి గుర్తు కొస్తూంది. రకరకాల ఆలోచనలతో అతను సుడితిరుగుతున్నాడు. "సాయంకాలం నాలుగుకి మళ్ళీ పిలిపించుకోకుండా టీ తాగటానికి రండేం" అన్న పార్వతి మాటలు గుర్తుకొచ్చాయి. సాయంత్రం ఎప్పుడౌతుందా అని ఎదురు చూస్తున్నాడు.


మూడు గంటలకు ప్రసాద్ యూనివర్శిటీ

"మీ వ్రాత సరిగాలేదు. టైపు చేసి తీసికొస్తే..." అన్నాడు సంపాదకుడు.

"అయ్యో! టైపుచేయడం వస్తే ఈ వెధవ కవిత్వం రాసుకొనే వాణ్నా?" అన్నాడా రచయిత.

పి. కృష్ణమూర్తి, (కడప)





అన్నా - తమ్ముడూ

నుంచి వచ్చాడు. ప్రసాద్ రాగానే "తమ్ముడూ! నేను ఇదివరకు నిన్ను అన్నమాటలకు ఏమీ అనుకోనంటే నేనొక విషయం చెప్తారా" అన్నాడు సుబ్బారావు.

"అదేమిటన్నాయ్! నువ్వు పెద్దవాడివి. అదీ గాక నువ్వేమన్నావని?" అన్నాడు కొంచెంఆశ్చర్యంతో.

సుబ్బారావు రెండు మూడు క్షణాలు ఆగి మెల్లగా "నేను పార్వతిని ప్రేమించానురా" అన్నాడు.

* * *

అక్కడ, విజయవాడలో సుందరామయ్యాగారు ఖంగారు పడుతున్నాడు. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తానన్న సుబ్బారావు ఇంతవరకూ రాయలేదు. చివరకు స్వయంగా తనే కలకత్తా వెళ్దామనుకొంటూ ఉండగా బాల్య స్నేహితుడు కోదండరావు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

ప్రియమైన స్నేహితునికి,

నేను క్షేమంగా ఉన్నాను. చి. సుబ్బారావువలన నీవు కూడ క్షేమంగానే ఉన్నావని తెలుసుకొని చాల సంతోషిస్తున్నాను.

నీవు రాసిన ఉత్తరం ప్రకారం మీ ప్రసాదు ప్రేమ వ్యవహారం నేను పూర్తిగా విచారించాను. ఇందులో మీవాడి తెలివితక్కువ పని ఏమీలేదు. ఇంకా చెప్పాలంటే చాల తెలివైన పనే చేశాడు. శంకరబాబులంటే తక్కువవాడుకాదు. విదేశాల్లో కూడా పేరు మోసిన ప్రొఫెసరు! ఆయన అచ్చమైన ఆంధ్రుడు. భాగ్యం విషయంలో కూడ నీకన్నా నాలుగైదు రెట్లు గొప్పవాడు. ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే. మొగపిల్లలు అసలు లేరు. ఎలా లేదన్నా మీ వాడికి లక్ష రూపాయల ఆస్తి వస్తుంది. అందువల్ల మీ వాడికి పిల్ల నిస్తానని ఆయన అంగీకరించటం నిజంగా మీ అదృష్టమే. మీవాడు ప్రేమించిన చి. సౌ. సవితను నేను చూసి వచ్చాను. నిజంగా నీకు తగిన కోడలు. ఇంకొక్క శుభవార్త! మీ తమ్ముడి కుమారుడు సుబ్బారావు శంకరబాబుగారి పెద్దకూతురు పార్వతీ కూడ మొదటి చూపులోనే ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. వీళ్ళ ప్రేమని కూడ శంకరబాబు అంగీకరించారు. నువ్వు కూడ దీని అంగీకరిస్తే ఒకే శుభ ముహూర్తాన అక్క చెల్లెళ్ళను అన్న దమ్ములకిచ్చి వివాహం చేయటానికి ఏర్పాట్లు చేద్దాం. ఈ విషయాలన్నీ కుర్రవాళ్ళు నీతో చెప్పటానికి భయపడి నాతో మొర పెట్టుకొంటున్నారు. నువ్వు ఉత్తరం వ్రాస్తే ఆచారం ప్రకారం శంకరబాబుగారు అక్కడకువచ్చి నీతో బంధుత్వం ఖాయం చేసుకోటానికి ఆదుర్దా పడుతున్నారు.

నీ ప్రియ మిత్రుడు,
కోదండరావు.

ఉత్తరం చదివి సుందరామయ్యగారు ఒక్క క్షణం గాంభీర్యం వహించాడు. మళ్ళీ అంతలోనే నెరిసిపోయిన మీసాల్లోంచి చిరునవ్వు తొంగి చూసింది. "ఫర్వాలేదు. పిల్లసన్యాసులు మంచి పనులే చేస్తున్నారు. వీళ్ళకు ఇంత తెలివి ఎక్కణ్ణుంచి వచ్చిందబ్బా!" అని ఆశ్చర్యపడుతూ, గర్వంగా మీసాలు దువ్వుకొన్నాడు. ★



జూల్స్ వెర్న్ నవల

౮౦ రోజులలో భూప్రదక్షిణం

ఎస్. పార్థసారథి

(గతసంచిక తరువాయి)

ఆగ్డెన్‌నుంచి ఒక గంటసేపు ఉత్తరంగావెళ్ళి వెబర్‌నదిదగ్గర తిరిగి తూర్పుకు తిరిగి పోసాగింది రైలు. అప్పటికి శాన్‌ఫ్రాన్సిస్కోనుండి 900 మైళ్ళ దూరం నడిచివచ్చింది. ఇక్కడనుండి వాశాచ్‌కొండలు దాటాలి. ఇక్కడనుండి రాకీ పర్వతాలవరకూవున్న రైలుదారి, అది వేసిన రోజుల్లో ఇంజనీర్లకు గడ్డు సమస్య అయి కూర్చుంది. మైదానాలలో మైలుకు 16 వేల డాలర్ల సబ్సిడీ ఇచ్చిన ప్రభుత్వం ఈ పర్వతసీమలో ఒక మైలురైలు దారికి 48 వేల డాలర్ల చొప్పున ఇచ్చుకొంటూరావలసివచ్చింది. ఇంజనీర్లు కూడా ప్రకృతి సౌందర్యం భ్రష్టంకాకుండా, కొండల్ని చిత్తం వచ్చినట్టు దొలిచి గొలికి బాధించకుండా చుట్టతిరుగుడు అయినా సరేనని గుహలులేని రైలుదారి వేశారు. ఈ భాగం మొత్తంమీద ఉన్నదల్లా ఒక్కటే గుహ—అది 14 వందల అడుగుల పొడుగు. అంతే. సాల్ట్‌లేక్ చేరేసరికి అంతవరకూపోనంత ఎత్తుకు పోయింది. అక్కడనుంచి జాగ్రత్తగా పెద్ద వంపు తిరుగుతూ బిటర్‌క్రీక్ లోయలోకి దిగ నారంభించింది. తిరిగి అట్లాంటిక్ పసిఫిక్ అఖాతాలమధ్య గోడలా నిలబడ్డ కొండలు ఎక్కసాగింది. ఈ దారిలో కొండలూ గుట్టలూ అసంఖ్యాకంగా ఉన్నాయి. రైలు పోతున్నకొద్దీ అడంగి చేరువవుతున్నకొద్దీ పాస్పార్తుకు ఆతురత, కంగారు ఎక్కువ కాసాగాయి. ఈ కొండగుట్టలు ఎప్పుడు విరగడవుతాయా అన్నట్టు కూర్చున్నాడు ఫిక్స్. అసలీ దేశం ఎప్పుడు దాటి అవతల పడతావా అని వుంది అతని ప్రాణానికి. ఇంగ్లీషు గడ్డమీద కాలుమోపాలన్న తొందర ఫిలియాస్‌ఫాగ్‌కన్న ఇతనికే ఎక్కువగా ఉంది.

ఆ రాత్రి పది గంటలకు రైలు ఫోర్ట్‌బ్రిడ్జర్ స్టేషను చేరింది. తిరిగి వెంటనే బయల్దేరింది. ఇరవైమైళ్ళ తరువాత యోమింగ్ ప్రవేశించింది. మర్నాడు—డిసెంబరు 7 ఉదయం గ్రీన్‌రివర్ స్టేషనులో ఒక పావుగంట ఆగింది. రాత్రి తెల్లవార్లూ మంచు దట్టంగా కురిసినట్టుంది. కాని, వాన కూడా కురిసినందువల్ల కొండల్లెపడిన మంచు, మంచల్లేనే చాలవరకు కరిగిపోయింది. అందువల్ల రైలు కేమీ ఆటంకం ఏర్పడలేదు. కాని పాస్పార్తుకుమాత్రం భయంగానే ఉంది — ఈ గాలి ఇలాగేవీస్తే క్రమంగా రైలుచక్రాలలో మంచు పేరుకుని గట్టిపడి చిక్కు పెడుతుందని.

"అయినా కాపోయినా చూసి చూసి శీతాకాలంలో బయల్దేరడమేమిటి — ఇంత పందెంపెట్టుకుని. కాస్త ఆగితే ఈచిక్కు లుండేవికావుగదా" అనుకున్నాడు.

పాస్పార్తు కేవలం గాలి, వాతావరణం, ఆకాశం ఇవే చూసి భయపడుతున్నాడుకాని, అయుదా ఇంతకన్న ప్రమాదకరమైన వాతావరణం గురించి కంగారుపడుతోంది. రైలు గ్రీన్‌రివర్‌లో ఆగినపుడు జనం చాలమంది దిగి ప్లాటుఫారంమీద పచార్లుచేశారు. కిటికీలోంచి చూస్తున్న అయుదాకు ఆ జనాభా మధ్య కర్నల్ స్టాంప్ ప్రోక్టర్ కనబడ్డాడు. గుండె గతుక్కుమంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫిలియాస్‌ఫాగ్‌మీద మొరటుగా చెయిచేసుకోబోయింది ఇతనే! అతనికంట బడితే..... అయుదా గబుక్కున తల లోపలికి తీసుకుంది.

ఫిలియాస్‌ఫాగ్ పట్ల ఆమెకు కృతజ్ఞత ఉంది. గౌరవం ఉంది. అతను దిన దినం క్షణక్షణం చేసే ఉపకారాలు చూపే ఆదరం—ఎంత ముక్తసరిగా అయితేనేం—ఆమెను పరవశురాలిని చేసివేస్తున్నాయి. అతనిపట్ల సద్భావం పెరిగిపోతోంది. ఈ భావానికి ఆమె ఇంతవరకూకూడా కృతజ్ఞత అనే పేరు పెట్టుకుంది. అలాగనే అనుకుంటుంది. కాని అంతకన్న లోతైన, లేదా ఎత్తైన గొప్ప భావం ఆమె హృదయాంతరాంతరాలలో మొలకెత్తి పెరిగి వ్యాపిస్తున్న సంగతి ఆమెకు స్పష్టంగా తెలియదు. ఈ క్షణాన కర్నల్ ప్రొక్టర్‌ను చూడగానే, ఫాగ్‌కు ఆపదరాగలదన్న భావం ఆమె హృదయంలో స్పందించి నిలువెల్లా కంపింపజేసింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో తగాయిదా సొంతంకానందువల్ల ఈసారి కలుసుకొని తేల్చుకుందాం అని బయల్దేరివచ్చాడు ఫాగ్. ఇప్పుడుకనక ఈ ప్రొక్టర్‌ని చూస్తే ఘర్షణ తప్పదు. అందువల్ల చూడకుండా జాగ్రత్తపడాలని నిశ్చయించుకుంది అయుదా.

రైలు కదలిన తరువాత, ఫాగ్‌కు కొంచెం నిద్రపట్టినవేళ, ఫిక్స్ పాస్పార్తులను చేరబిలిచి విషయం తెలియచెప్పింది అయుదా.

"మరేం ఫరవాలేదమ్మా. అసలు వాడు ఫిలియాస్‌ఫాగ్‌ని ముట్టుకునేముందర నాకు జవాబు చెప్పి మరీ కదలాలి. ఆ గొడవలో ఎక్కువ పరాభవంపొందింది నేనే" అన్నాడు ఫిక్స్.

"ఆపైన నేనున్నాను. కర్నలయేది ఎవడయేది—" అన్నాడు పాస్పార్తు.

"అబ్బే అదేం లాభంలేదు" అంది అయుదా. "తన తరఫున ఇంకొకళ్ళు చెయిజేసుకుందికి ఈయన సుతరామూ ఒప్పుకోడు. ఈ సంగతి తేల్చుకుందికని

పనిగట్టుకు మళ్ళీ అమెరికా వస్తానన్న మనిషి—ఇప్పుడు అవకాశంవస్తే వదుల్తాడా? కనిపిస్తే ఘర్షణ తప్పదు. అది జరిగితే ఆ తరువాతది మన చేతుల్లో ఉండదు.అంచేత కనబడకుండానే చూడాలి".

"అదీ నిజమేలెండి. ఘర్షణజరిగితే, అంతా ధ్వంసం అయిపోతుంది. గెల్చినా ఓడినా, చివరకి ప్రయాణం ఆలస్యంకావడం అన్నైన ఫాగ్ ఆవిధంగా పందెం—"

—"ఓడిపోవడమూను" అంటూ అందుకున్నాడు పాస్పార్టు. క్షణంసేపు లెక్కలు చూసుకున్నాడు. "మనం న్యూయార్కు చేరడానికి ఇంకా నాలుగు రోజులు పడుతుంది. ఈలోపల వాళ్ళిద్దరూ కలుసుకోకుండా—అంటే మాయజమాని ఈ పెట్టె వదలి కదలకుండా కట్టుదిట్టం చేసుకుంటే, ఇహ ఫరవాలేదు. ఇప్పుడు ఈయనని ఇక్కడే అకట్టి ఉకచడం—"

ఫిలియాస్‌ఫాగ్ కదలడంచూసి పాస్పార్టు మాట మధ్యలో ఆపేశాడు. ఫాగ్ నిటారుగా కూర్చుని కిటికీలోంచి అవతల మంచులోంచి అవతలికి దృష్టి సారించి చూడసాగాడు. ధ్యానం ఇటులేదని గమనించి, పాస్పార్టు ఫిక్స్‌కేసి తిరిగి "పోట్లాటవస్తే మీరు నిజంగా మా యజమానిని వెనకేసుకుని ముందు నిలుస్తారా?" అన్నాడు.

"ఈయనగారిని సజీవంగాయూరప్ చేరవెయ్యటంకోసం ఏమన్నా చేస్తాను" అన్నాడు ఫిక్స్‌ధాటీగా.

ఈ మాట వినగానే పాస్పార్టుకు జరిగినకథ జరగబోయే కథ గుర్తుకు వచ్చాయి. ఒళ్ళు జలదరించింది. భయం ఎలా వున్నా, తన యజమాని పెద్దమనిషితనం గురించి అతనికి ఆవంత కూడా విశ్వాసం సడలలేదు.

ఇప్పుడు కర్నల్, ఫాగ్‌లు ఒకరి కొకరు ఎదురుపడకుండా చెయ్యడం ఎలాగ? ఫాగ్ లేనిపోని గొడవల జోలికి పోనివాడుకాబట్టి, వూరికే పెత్తనాలు షికార్లు చెయ్యనివాడుకాబట్టి నిజానికి ఏమంత ప్రమాదం లేదు. కదలగల అవకాశం ఏ కాస్తయినావుంటే, అది నివారించే ఉపాయం కూడా ఉండాలి. అలాటిది ఫిక్స్‌కు తోచింది.

"ఈ రైలుమీద గంటలు తెగ సాగుతున్నట్టుంటాయి. ఓపట్టాన పొద్దుపోదు." అన్నాడు ఫాగ్‌కేసి చూసి.

"మరే మరే. అయితేనేం మొత్తానికి సాగుతునే ఉన్నాయిగదా ఎలాగో అలాగ."

"ఓడలమీద అయితే మీరు విస్టు ఆడి కాలక్షేపంచేసేవారు కాబోలు"

"మరే. ఇక్కడ కష్టం. పేకాలేదు; ఆటగాళ్లూ లేరు."

"పేకకేం. కావలసినన్ని దస్తాలు. అమెరికాలో రైళ్ళమీద అమ్ముతూనే ఉంటారు. ఆటగాళ్ళంటారా ఆలోచించాల్సిందే...." అంటూ అయుదాకేసి సాభిప్రాయంగా చూశాడు ఫిక్స్.

"దానికేం. నేను ఆడగలను. విస్టు నాకు చేతనవును. ఇంగ్లీషు విద్యలో అదీ ఒక పారమేగదా" అంది అయుదా నవ్వుతూ.

"సరి ఇకనేం. నామటుకు నేను ఏదో బాగానే ఆడగలననుకుంటాను. మన ముగ్గురం తేలాం.

80 రోజుల్లో భూప్రదక్షిణం

నాలుగోచేతికి గుడ్డివాణ్ణి పెట్టుకుంటే — "

"ఇకనేం అయితే కానీండి—" అన్నాడు ఫాగ్ రైలు మీదకూడా తనకి విస్టు ఆడుకునే వీలు కుదిరినందు కానందిస్తూ.

మరునిమిషంలో పాస్పార్టు పరుగునవెళ్ళి పేకాటకి కావలసిన సరంజామా అంతా పట్టించుకొచ్చేశాడు. ఆట మొదలైంది. అయుదా ఆట చాలా బాగుగా తెలిసినదానిలా ఆడుతోంది. రెండుసార్లు సాక్షాత్తు ఫాగ్ స్వయంగా మెచ్చేసుకున్నాడు

జరిగిన కథ

80 రోజుల్లో భూప్రదక్షిణం సాధ్యమని 20 వేల పౌన్లు పందెం వేసి సేవకుడు పాస్పార్టుతో బయలుదేరుతాడు ఫిలియాస్ ఫాగ్. బాంకు దొంగ ఫాగ్ దొరికాడని, అరెస్టుకు బొంబాయికి వారంటు పంపమనీ లండన్‌కు టెలిగ్రామ్ పంపి, ఫాగ్ వెంట సూయజునుంచి బొంబాయికి చేరతాడు డిటెక్టివ్ ఫిక్స్. కాని వారంటు చేరలేదు. బొంబాయినుంచి కలకత్తాకు రైలుబండిలో ప్రయాణం అవుతాడు ఫాగ్. దారిలో అయుదాను రక్షించి ఆమెతో కలకత్తా చేరుకొంటాడు. అక్కడ వారిని నిలపడానికి ఫిక్స్ చేసిన యత్నం విఫలమైంది. ఫాగ్ ప్రభృతులు 'రంగూన్' ఓడలో పయనం ప్రారంభించారు. ఆ ఓడలోనే ఉన్నాడు ఫిక్స్. ఫాగ్‌ను అరెస్టుచేయడానికి భోగట్టా సేకరించాలని పాస్పార్టును చేరదీశాడు. కాని అంతు చిక్కలేదు. లండన్ విడిచిన 36 రోజులకు హాంకాంగ్ చేరుకొని, అయుదాతో యొకహామా ప్రయాణమవుతాడు. కాని ఆఓడ తప్పిపోయింది. దానిని షాంగ్‌హైలో అందుకునేందుకు ఫాగ్ ఒక పడవను కుదుర్చుకొని బయలుదేరాడు. పాస్పార్టు 'కర్ణాటిక్'లో అంతకుముందే ఎక్కి యొకహామా వెడతాడు. ఫాగ్, అయుదా సురక్షితంగా యొకహామా చేరుతారు. అక్కడ వారికి పాస్పార్టు కనిపిస్తాడు. ముగ్గురు శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరుతారు. ముగ్గురు శాన్‌ఫ్రాన్సిస్కోకు వెడతారు. అక్కడనుంచి వారు న్యూయార్కు పోతూ, అగ్డెన్ నగరాన్ని సందర్శించి ప్రయాణం ప్రారంభిస్తారు.

ఫిక్స్ ఆట చూడగా బాగా రాటుదేలినరకం అని తేలిపోయింది.

"అమ్మయ్య ఇక ఫరవాలేదు. ఇక ఈయన ఇక్కడి నించికదలడు" అనితృప్తిగా నిట్టూర్చాడుపాస్పార్టు.

ఉదయం 11 గంటలయేసరికి రైలు రాకీ పర్వత శిఖరాగ్రం అధిరోహించింది. ఇంగ్లీషు కొలమానం ప్రకారం సముద్రమట్టానికి 7524 అడుగుల ఎత్తుకు ఎక్కిందన్నమాట. ఆచోటు పేరు బ్రిగేడియర్ కనుమ. ఆ తరువాత రెండు వందలమైళ్ళ దూరం ప్రయాణంచేశాక, మైదానానికి దిగివచ్చింది. అక్కడనుండి అట్లాంటిక్ తీరంవరకూ అంతా చదునే. అంతవరకూ రైలు మార్గానికి అడుగడుగునా కఠినపరీక్షలు పెట్టి తిప్పలు పెట్టిన ప్రకృతి ఇక్కడ తృప్తిచెంది సుముఖ అయింది. అప్పుడే లేళ్ళలా గెంతి వస్తున్న ఏళ్లు కనబడుతున్నాయి. అవన్నీ నార్త్ ప్లేట్ నది కలిసే ఉపనదులు. తూర్పున, ఉత్తరాన దిగంతాలపై అర్ధచంద్రాకారంగా పెద్ద తెర వేసినట్టు కనిపిస్తోంది. అవి రాకీపర్వతశ్రేణుల దక్షిణ భాగాలు. ఆ శ్రేణిలో అగ్రశ్రేణిలో అన్నిటికన్న ఎత్తయిన లారమీశిఖరం ఉంది. రైలు దారికీ ఆ పర్వతశ్రేణికీ మధ్య నున్నదంతా విశాలమైన మైదానం. అంతటా నదులు ఏరులూ ప్రవహిస్తున్నాయి. రైలుమార్గానికి కుడివేపున తిరిగి కొండ గుట్టలువేస్తూ పోతున్నాయి. అవన్నీ, మిసిసిపీ ముఖ్య ఉపనదులలో ఒకటైన ఆర్కాన్సాస్ నది వరకు వ్యాపించి ఉన్నాయి.

పన్నెండున్నరకి సుదూరంలో లీలగా క్షణంసేపు పోర్ట్ హాలెక్ కనబడింది. ఈ ప్రాంతానికి పాలనకేంద్రం అది. ఇంక కొద్దిగంటలు గడిస్తే రాకీపర్వతాలను దాటిపోతుంది రైలు. ఈ కాస్త దూరంలోను ఎటువంటి ప్రమాదాలు, అవరోధాలూ ఉండవనే ప్రయాణికులు ఆశించసాగారు. అందుకు తగినట్టు మంచుకురవడం కూడా ఆగిపోయింది. ఈదురుగాలి వీస్తోంది. రైలు ఇంజనునుచూసి ఝడుసుకు పెద్ద పెద్ద పక్షులు అరుస్తూ రెక్కలు బారజాచి దూరానికి ఎగిరిపోతున్నాయి. బయళ్ళలో లేడిగాని, ఎలుగుగొడ్డుగాని, తోడేలుగాని ఎక్కడా కనబడలేదు. ఉట్టి గొడ్డుకొండ. బంజరు, ఎడారి.

ఫలహారాలు ముగిశాక ఫాగ్‌బృందం తిరిగి పేకాటకు కూర్చున్నారు — నిరంతరమైన ఆటను నిరంతరంగా సాగించడానికి. అంతలో ఇంజను గట్టిగా కూసినట్టయింది. రైలు ఆగింది. పాస్పార్టు కిటికీలోంచి బయటకు తొంగి చూశాడు. రైలాగడానికి కారణం కనబడలేదు. ఎక్కడా స్టేషను ఉన్నట్టులేదు.

ఫిలియాస్‌ఫాగ్‌లేచి రైలు దిగి సంగతి కనుక్కోబోతాడేమోనని క్షణంసేపు అయుదా, ఫిక్స్‌లు భయపడ్డారు. కాని ఫాగ్ లేవలేదు. "ఏమిటో చూడు" అని నౌకరుకు పురమాయించాడు.

పాస్పార్టు బయటకు పరుగెత్తాడు. అతనిలాగే దాదాపు నలభై యాభైమంది దిగి బయటకు వెళ్ళారు. వారిలో కర్నల్, స్టాంప్ ప్రాక్టర్ కూడాఉన్నాడు.

దారికడ్డంగా ప్రమాద సూచకమైన ఎర్ర సిగ్నలు ఉంది. డ్రైవరు, కండక్టరు ఆ సిగ్నల్ పెట్టిన అతనితో కంగారుగా మాట్లాడుతున్నారు. రాబోయే స్టేషన్ మెడిసిన్ బోనుండి,అతను పరుగెత్తుకు వచ్చాడట. కొందరు ప్రయాణీకులు కూడా ఆ చర్చలో పాల్గొన్నారు. ప్రాక్టర్ కూడా పెద్ద పెద్ద కేకలు వేస్తున్నాడు. పాస్పార్టు ఆ గుంపులోకి వెళ్ళాడు.

"వెళ్ళడానికి ఎంతమాత్రం వీలులేదు. మెడిసిన్ బో వంతెన చాలా ప్రమాదకరంగా ఉంది. ఈ రైలు బరువుకి ఇక తట్టుకు నిలబడలేదు" అంటున్నాడు సిగ్నల్ మన్.

ఆ వంతెన సస్పెన్షన్ బ్రిడ్జి. రెండు కొండకొనల మధ్య ఒక పెద్ద అఖాతం మీదుగా అడుగున దన్ను లేకుండా కటిన తరహా వంతెన. దాన్ని పట్టిఉంచే తీగెలు చాలమటుకు తెగిపోయాయని అర్థంకంగా ఉన్న ఆ వంతెన ఏ క్షణాన అయినా కూలిపోవచ్చుననీ, రైలు దానిమీదకివస్తే ఆక్షణానే పడిపోతుందనీ సిగ్నల్ మన్ చెబుతున్నాడు. నిజానికి అతను చెప్పేది అబద్ధంకాదు; అతిశయోక్తి కూడా కాదు. అదీకాక, అసలు అమెరికన్లు ఓపట్టాన దేనికీ ఖాతరు చెయ్యని తెగింపుమనుషులు. వాళ్లే భయపడి ఇది ప్రమాదం అని చెప్పారు. అంటే ఇక ఆ ప్రమాదం గురించి సందేహించనక్కరలేదు. సందేహించడం శుద్ధ అవివేకం.

సంగతి తెలిసినా, ఇది యజమానికి చెప్పే సాహసం చాలక, పాస్పార్టు పళ్ళు గిట్టగరచుకుని మనిషి కొయ్యబారినట్టు అలాగే నిలబడిపోయాడు.

"బావుంది. అయితే ఇంతకీ మనం ఇక్కడే చతికిలబడి కూర్చుని మంచులో కరడు కట్టుకుపోవాలనరుగా" అన్నాడు కర్నల్ ప్రాక్టర్ మండి పడుతూ.

"అయ్యా, ఒకరైలు పంపవలసిందని ఒక్కహోకి టెలిగ్రాం పంపించాము. అయితే అది మెడిసిన్ బో చేరడానికి ఆరుగంటలకి తక్కువ పట్టదు' అన్నాడు కండక్టర్.

"ఆరు ఘంటలే!" అన్నాడు పాస్పార్టు.

"ఆహా. అయితేనేంలెండి. మనం నడక సాగించి మెడిసిన్ బో చేరేసరికి దానికీ, దీనికీ సరిపోతుందిగా."

"అదేవిటయ్యా. స్టేషను ఇక్కడినుంచి ఒక్క మైలేగా?"

"మైలేగానండి, మధ్యన నదిఒకటి ఉందిగదా"

"పడవలమీదపోలేమా?"అన్నాడు కర్నల్ ప్రాక్టర్.

"హోలేవు. వర్షాలకి నదిమంచి పోటుమీద ఉంది. జలపాతంలా పోతోంది. కాస్త తెరిపిగాఉండేచోట దాటాలంటే ఉత్తరానికి పది మైళ్ళు నడిచిపోవాలి"

కర్నల్ ప్రాక్టర్, ఉపాయాలు చెప్పడం ఆపేసి అభిప్రాయ ప్రకటనకు దిగాడు—రైల్వేమీద, కంపెనీమీద, కండక్టరుమీద తీవ్రంగా ఉపన్యసించాడు. పాస్పార్టు కూడా శ్రుతి కలిపినా మానినా సరేనని హైస్టాయిలో అందుకుని శక్తివంచన లేకుండా తిట్టిపోశాడు. ఈసారి ఉపద్రవం సామాన్యమైనదికాదు. ఇది దాటరాని కష్టం. ఇక్కడ తన యజమాని బాంకు నోట్లన్నీ గుమ్మరించినా ప్రయోజనంలేదు. దిగ్భ్రంధం అయిపోయింది.

మిగతా ప్రయాణీకులకు కూడా ప్రాణాలు ఉసూరుమన్నాయి. ఆలస్యం గురించి బాధలేని వాళ్ళంతా ఈ దిక్కుమాలిన మంచులో ఎత్తెత్తి అడుగులేస్తూ పదిహేనుమైళ్ళు బయళ్ళ కడ్డ పడిపోవాలని విసుక్కున్నారు. ఫిలియాస్ ఫాగ్ పేకాటలో పీకమొయ్య మునిగిపోయాడు కాబట్టి సరిపోయిందిగాని లేకపోతే అక్కడ జనం చేసిన రణగుణధ్వనికి ఉస్సురస్సులకూ అదరిపడి లేచివచ్చేవాడే. ఎస్తే ప్రాక్టర్ని చూసేవాడే.

ఇక చెప్పక తప్పదని తలవంచుకొని తన పెట్టెవేపు బయల్దేరిన పాస్పార్టు హఠాత్తుగా "ఒకలా అయితే ఇది దాటవచ్చు. ఉపాయం లేకపోలేదు" అన్నమాట విని ఆగి గిరున వెనక్కు తిరిగాడు. ఆ మాట అన్నవాడు ఆ రైలు ఇంజనీరు ఫార్స్టర్. నికార్సైన యాంకీ.

"ఏది? వంతెనే దాటొచ్చునంటారా?"

"ఆహా. వంతెన మీదుగానే"

"ఏది? రైలుతోటే నంటారా?"

"ఆహా రైలుతోటే"

పాస్పార్టు గుడ్లప్పగించి ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటూ నిలబడిపోయాడు.

"వంతెన కూలిపోయేలా వుంది గదయ్యా" అన్నాడు కండక్టరు.

"ఏం ఫరవాలేదు. రైల్నిగనక అది వెళ్ళ గలిగినంత జోరుగానూ— ఫుల్ స్పీడులో వదిలేస్తే వంతెన దాటే అవకాశాలు కొంతవరకు లేకపోలేదు." అన్నాడు ఇంజనీరు.

"నీ అసాధ్యంకూల!" అని గొణుక్కున్నాడు పాస్పార్టు — ఆ ధీమా ఆ మాట తీరూ చూసి. ప్రయాణీకులు కొంతమందికిమాత్రం ఈ ఉపాయం అద్భుతంగా ఉందనిపించింది వెంటనే. కర్నల్ ప్రాక్టర్కు చాలా నచ్చింది. ఇందులో అసాధ్యం ఏమీలేదు. భేషుగ్గా ఉంది అన్నాడు ఆ మొండి ఘటం. అసలంతే కాదట. రైలుపెట్టెలన్నీ దగ్గరగా బిగలాగి కట్టి, బండిని జోరుగా వదిలేస్తే రెండు కొండలమధ్య అసలు వంతెనలే అవసరం లేదుట. అలా ఆవేగానికి ఈ శిఖరం మీరు ఆ శిఖరంమీది పట్టాల మీదకి దూకి సాఫీగా పోతుందని కొందరు ఇంజనీర్లు లోగడ అభిప్రాయపడ్డారట. చివరకు ఈ సులభతరణోపాయం నచ్చిన వాళ్ళంతా ఏకమై ఇంజనీరుకు మద్దతిచ్చారు.

"క్షేమంగా దాటడానికి నూటికి 50 వంతులు అవకాశం ఉంటుందని ఒకాయన అంచనా కట్టాడు.

కాదు అరవై అన్నాడు మరొకడు.

ఎనభై అన్నాడు మరొకడు. అంటూనే ఆ ఉత్సాహం పట్టలేక నూటికి 90 అనేశాడు.

పాస్పార్టు నిర్ఘాంతపోయాడు ఈ దుస్సాహసానికి. మొత్తంమీద ఈ వంతెన దాటడానికి కొంత సాహసం చెయ్యవచ్చునుగాని ఇది మరీ 'అమెరికన్ సాహసం' అనిపించింది అతని ప్రాణానికి. అదీకాక, ఇంతకన్న మెరుగైన పద్ధతి ఉందిగదా అది వీళ్లె వరికీ తట్టదేమి చెప్మా అనుకున్నాడు. "చూడండి! ఇంజనీరుగారి ఉపాయంలో కొంచెం ప్రమాదం ఉంది. అలా కాకుండా—" అని చెప్పబోయాడు దగ్గిర ఉన్న ఆసామికి. అతను వెనక్కితిరిగి "ఎనభై పాళ్లు దాటేస్తాం" అన్నాడు ఉత్సాహంగా.

"రైటే రైటే ఒప్పుకుంటా. అది సరేగాని ఇది కొంచెం ఆలోచించి—"

"ఛఛ. ఆలోచనేమిటి. శుద్ధ దండుగ. ఆ ఇంజనీరు చెబుతున్నాడుగా దాటిపోతామని" అన్నాడొకాయన కోపంగా.

"ఎంతమాట. వెయ్యేళ్ళనీ దాటవలసిందే. దాటుతాంగాని కొంచెం ముందు జాగ్రత్త—"

"జాగ్రత్తేమిటి చెప్పేది వింటంలే ఫుల్ స్పీడులో పోతాం. బోధపడిందా 'ఫుల్ స్పీడు'" అన్నాడు కర్నల్ ప్రాక్టర్ జబర్దస్తీగా.

పాస్పార్టుకి మతిపోతోంది. తనమాట సాంతం వినేవాడెవడూ కనబడలేదు.

"అయ్యో. తెలిసిందండి. అర్థం అయింది. కాని—అదే అదే జాగ్రత్త అంటే మీకు నచ్చకపోతే సబబందాం—కొంచెం సబబు చూడండి. చూస్తే—"

"ఏవిటిది. ఎవడువీడు.పదండి పదండి. ఎలాగ?" అంటూ నాలుగు వేపులనుంచీ కేకలు లేచాయి.

పాస్పార్టుకి ఏంచెయ్యాలో ఎవరితో మొరపెట్టుకోవాలో పాలుపోలేదు.

"ఏం భయంగా ఉందా?"అన్నాడుకర్నల్ ప్రాక్టర్.

"నాకా? భయమా?.....హు. సరే కానీండి. ఫ్రెంచివాడు కూడా మీ అమెరికన్లంతగానూ అమెరికన్ సాహసం ప్రదర్శిస్తాడని బుజువు చేస్తాను. పదండి" అన్నాడు పాస్పార్టు రోషంగా.

"అంతా బండి ఎక్కండి" అని కేక లేశాడు. కండక్టరు.

"ఎక్కండి. అంతా ఎక్కండి. నాకేం. ఎక్కండి. చెప్తే మీరు వినకపోయినా, అసలు చెప్పనివ్వకపోయినా—మనం అంతా నడిచి వంతెనదాటి కాళీరైలుని తరవాత పోనిస్తే క్షేమంగా ఉండేదని నేను మనసులో అనుకుంటూ ఉంటాను. అది మానిపించలేరుగా. ఎక్కండి ఎక్కండి" అని గొణుక్కుంటూ పాస్పార్టు రైలు ఎక్కాడు.

అతని మాట అప్పుడుకూడా ఎవరూ వినలేదు. విన్నా చెప్పినమాటలు వినేవారుకారు. పాస్పార్టు రైలు ఎక్కి మాటాడకుండా కూర్చున్నాడు. యజమానికి ఏమీ చెప్పలేదు. ఆటలో మునిగిన ఫాగ్ అడగనూలేదు.


ఇంజను ఉధృతంగా గర్జించింది. వెనక్కి బయల్దేరింది. అలా ఒక మైలు దూరం వెనక్కివెళ్ళి తిరిగి ముందుకు లంఘించింది ఉత్సాహంగా. అక్షరాలా కొండమీంచి కొండమీదికి దూకే తరహాలోనే వూపుగా జోరుగా పరుగు సాగించింది.

ఇంకోసారి కూసింది కానుకోమన్నట్టు. వేగం మరీ విపరీతమైపోయింది. క్రమంగా భయంకరం అయిపోయింది. ఇంజనునుండి చుక్ చుక్ మని శబ్దాలు ఆగిపోయి ఒకే దీర్ఘనిశ్వాసంలా ధ్వని రాసాగింది. చక్రాలలో పొగలు బయల్దేరాయి. గంటకి నూరు మైళ్ళ వేగంతో పోతున్న ఆ రైలు అసలు పట్టాలమీద నడుస్తున్నట్టు లేదు. ఇక్కడే ఎగరడం అలవాటయిపోతోంది. ఆ వేగానికి రైలు క్రమంగా బరువును కోల్పోసాగింది. వంతెనకిక ఈ రైలు బరువు తెలియదు. దాటడం సులభమేననిపించింది.

నిజంగానే దాటేసింది. మెరుపు మెరిసిపోయినట్టు ఇట్టే వంతెన ఎక్కి అట్టే దాటిపోయింది. ఈ గట్టునుంచి ఆ గట్టుకు దూకినట్టేవెళ్ళి అవలిగట్టున వాలింది. వాలినతరువాత దానిని ఆపడానికి ఐదు మైళ్ళ దూరం నడిచే వరకూ సాధ్యపడలేదు.


ఆపి వెనక్కిచూసేటంటే తెలిసేది. రైలు వంతెనను ఇలా దాటగానే అలా వంతెన కూలిపోయింది. కూలి, క్రింద ప్రవహిస్తున్న నదిలో తునాతునకలైపడి, కొట్టుకుపోయింది.

(ఇంకా ఉన్నది)



వీరన్న – వెంకన్న

— శ్యాలి. సూర్యనారాయణ



4

ఇంకా వస్తాడు, రామయ్య యింకా వస్తాడు అనుకుంటూనే ముందుకు నడిచాడు వీరన్న. ఆ సాయంత్రం మజిలీ చేరుకున్నాడు కాని రామయ్య జాడలేదు. తాను పరధ్యాన్నంగా ఉన్నప్పుడు, తనని మించి ముందుకు వెళ్లిపోయాడేమో వేళాకోళానికి అని మజిలీ చేరగానే అక్కడ వాకబు చేశాడు. రామయ్యని గురించి. ఎవరూ చెప్ప లేక పోయారు. ముందు మకాంలో దొరక్క పోతాడా అని ముందుకు కొనసాగించాడు ప్రయాణాన్ని. అక్కడా రామయ్య పత్తా దొరక లేదు. వీరన్నకి ఆశ్చర్యం చిరాకూ కూడా కలిగాయి. ఒకపని ప్రారంభించిన తరవాత, అది పూర్తి అవకుండానే పెత్తనాలేమిటని రామయ్యమీద విసుక్కున్నాడు. వెనకాల వస్తే, ఏకంగా తిరపతిలోనే కలుసుకో వచ్చునని వీరయ్య ఒక్కడే ముందుకు వెళ్లాడు.

అలా ప్రయాణంచేసి, కొన్ని రోజులకి వీరన్న తిరుపతి చేరుకున్నాడు. అక్కడ కొండమెక్కి పైకివెడితే దేవుడిదర్శనం అవుతుంది. ఆ కొండ ఎక్కడమే ఒక కష్టం. కనిపించవుగాని యేడుకొండలున్నాయిట! అవన్నీ ఎక్కి వెళ్లాలి. భక్తులభక్తిని శ్రద్ధను పరీక్షించడానికా అన్నట్టు ఆపైన వెలిశాడు స్వామి. ఆరోజుల్లో ఆకొండ మార్గాలన్నీ దొంగల గుంపులకి ఆటపట్టులు. వీలైనప్పుడల్లా ప్రయాణీకులపైబడి దోచుకునేవారు ఆ దొంగలు. అందుకని తీర్థయాత్రికులు గుంపులు గుంపులుగా బయలుదేరేవారు. గుంపు చేరకపోతే, పూర్తి అయ్యేదాకా క్రింద తిరపతిలోనే సత్రంలో ఉండేవారు. వీరన్నకూడా అలాగే ఒక సత్రంలో ఆగిపోవలసి వచ్చింది.

జనం పోగుపడే దాకా. ఈలోగా అతను ఆవూళ్లో ఉండే సత్రవులన్నీ వెదికివచ్చాడు రామయ్యకోసం. ఏం లాభం లేకపోయింది. స్వామి దగ్గరికివచ్చినా అతనిదృష్టి రామయ్య మీదే ఉంది.

వెతికి వెతికి వేసారిపోయాడు. ఇక్కడెక్కడా దొరక్కపోతే, కొండ మీద దొరక్కపోతాడా అనే గట్టి నమ్మకంతో, ఒక గుంపుతో కలిసి కొండ యెక్కడం ప్రారంభించాడు. కబుర్లు, కథలూ చెప్పుకుంటూ, పాటలూ పద్యాలూ పాడుకుంటూ, భక్తులంతా వెంకటరమణమీద ధ్యానంతో మెట్లు ఎక్కుతున్నారు. వీరన్నమాత్రం తనముందువారి లోని, తనని దాటుకు వెళ్లేవారిలోను రామయ్య దొరుకుతాడేమోనని వెతుకుతూనే ఉన్నాడు. ఏమయి ఉంటాడా అనే సందేహం అప్పు డప్పుడు అతనిని వేధిస్తూ ఉండేది. చివరికి మొత్తంగాయితేనేం కొండపైకి చేరి ఒక సత్రంలో మకాం చేశాడు.

ఆ మరునాడు తెల్లవారుఝామునే లేచాడు వీరన్న. పుష్కరిణిలో స్నానంచేశాడు. అప్పుడు కూడా రామయ్యని వెతకడం మానలేదు. స్నానం అయిపోయినతరవాత ధర్మదర్శనం కోసం తయారౌతున్న వరసలో నిలబడ్డాడు. ఎప్పుడో పన్నెండు గంటలకి అయ్యే ధర్మ దర్శనం కోసం, ప్రొద్దటినుంచీ కని పెట్టుకుని, ఆవరసలో నుంచుంటారు భక్తులు. వీరన్నకూడా అలాగే నుంచున్నాడు. అప్పటికే గుళ్లో కార్య క్రమాలు ఒక్కొక్కటే ప్రారంభం అవుతున్నాయి. "గోవిందా గోవింద" అనే కేకలు, ఘంటారవాలూ, ఎడతెరిపిలేకుండా వినిపిస్తూనే ఉన్నాయి. వచ్చేవారు వస్తూనే ఉన్నారు. వెళ్లేవారు వెడుతూనే ఉన్నారు. ఎప్పుడూ ఒకతీర్థములా ఉండే ఆ జనానికి అంతుఉండదు. మిగిలిన భక్తులంతా వేళ ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూస్తుం డగా, వీరన్న మాత్రం రామయ్య యేమయి ఉంటాడా అని ఆశ్చర్య పడుతూనే ఉన్నాడు. వచ్చేపోయే వారిలో వెతుకుతూనే ఉన్నాడు.

మొత్తానికి, ధర్మదర్శనం వేళ అయింది. భక్తులవరస కదిలింది. ముందువారు కదులుతోంటె వెనక వారు ముందుకువస్తూ ఉంటారు. గుళ్లో ప్రవేశించాక, స్వామి మూల విరాట్టుకి ఎదురుగా ఉన్న పెద్ద హాలు వంటి మంటపంలో మధ్యగా ఇనప ఊచలు బిగించారు. వాటిమధ్య వరసలో వెళ్ళిన భక్తులు అందులో ప్రవేశించినవారికి ఒకవంద గజాల దూరంనుంచీ స్వామిదర్శనం అవుతూ ఉంటుంది. అక్కడనుంచి క్రమ క్రమంగా దగ్గరికివస్తూ, తన అవ కాశం వచ్చినప్పుడు పులూ పండ్లు సమర్పించుకుని, ప్రసాదం స్వీకరించి ప్రక్కకి తప్పుకొని ఇంకో గుమ్మం ద్వారా బయటికి రావాలి. వీరన్న ఆ మంటపంలో ఊచివరకి వచ్చాడు. అక్కడనుంచి స్వామి మూలవిరాట్టు చక్కగా కాకపోయినా ఓ మోస్త రుగా కనిపిస్తూనే ఉంటుంది. దర్శనం కాగానే రెండుచేతులూ జోడించి నమస్కారం చేశాడు వీరన్న. ఆ స్వామి విగ్రహం పైననే దృష్టి ఉంచి, ఆవరసలో క్రమక్రమంగా ముందుకి వస్తున్నాడు. అంటె స్వామికి దగ్గరవు తున్నాడన్నమాట.

వీరన్నకీ స్వామికీ మధ్యదూరం ఇంకో యాభయిగజాలు మాత్రమే ఉంది. వీరన్నదృష్టి స్వామిపైననే ఉంది. కాని అంతలో అతని కన్ను లకి హఠాత్తుగా ఒకదృశ్యం కనిపిం చింది. మొదట నమ్మలేక కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు. అదే దృశ్యం. అరె! ఆశ్చర్యంగా ఉందే! అప్పుడే ఎప్పుడు వచ్చాడు రామయ్య గుళ్లోకి? అదిగో తనకి యాభయి గజాల దూరంలో స్వామికి దగ్గరగా నుంచుని హారతికూడా యిస్తున్నాడు. రామయ్య కాదనుకోడానికి ఆ బట్ట తల, ఆ కంటిమెడ చొక్కాచక్కగా కనిపిస్తోంటె! హారతి యిస్తున్నప్పుడు, ఆ వెలుగులో అతనిముఖం ఎంత గొప్పగా వెలిగిపోయింది! గుళ్ళోని దీపాల వెలుగులో అతని బట్టతల నిగనిగలాడుతోంటే ఎంత అందంగా ఉంది! ఈసారైనా గట్టిగాపట్టుకోవాలి. దర్శనం గబగబా చేసేసుకుని, మళ్లీ దాటిపోకుండా పట్టు కోవాలి. అనుకుంటూ వీరన్న ముందుకు గబగబా నడవబోయి ముందున్న వారిని గెంటాడు. వారు అదలించారు. పొరపాటు తెలుసు కుని తలపైకి ఎత్తేటప్పటికి రామయ్య లేడు. ఎక్కడ దాటిపోతాడో అని, వీరన్న హడావిడిగా స్వామికి పళ్లు పూలు సమర్పించి, గబుక్కున బయటపడ్డాడు. ఆ గుడి అంతా కలయ తిరిగేశాడు. కాళ్ళు నొప్పులు పెట్టాయి కాని, కంటికి రామయ్య మాత్రం కనిపించలేదు. అనేక ఆలోచనలతో అలాగే మకాం చేరు కున్నాడు.

మరునాడు 'పాపనాశన' తీర్థా నికి బయలుదేరాడు వీరన్న. దారి పొడుగునా, అతని మనస్సులో రామయ్యే మెదిలాడు. కంటికి కనిపించినట్టే కనిపించి, ఇట్టేమాయ మవ్వాడేమిటి రామయ్య. ఎక్కడికి వెళ్ళి ఉంటాడా అని ఒకటే ఆలోచన చేస్తూ నడుస్తున్నాడు. పాపనాశనం

అల్లంతదూరంలో ఉంది. కొండమీద నుంచి చాపచుట్టలా పడే నీరు క్రింద నుంచుని స్నానాలుచేస్తారు భక్తులు. ఆనీరు ఎక్కడనుంచి వస్తోందో ఎవరికీ తెలియదు. భక్తులు జారిపోకుండా కొండకి యినపగొలుసులు వ్రేలాడదీశారు. అవి పట్టుకుని ఆ ధార క్రింద నుంచుని పవిత్రులౌతారు భక్తులు. వీరన్న ఈ విషయాన్ని పరిశీలిస్తున్నాడు. మళ్లా యాభయి అరవై గజాలదూరం ఉందనగా అతడు ఠక్కున ఆగిపోయాడు. ఎవరినో కేక వేయబోయి ఆగిపోయాడు కూడా. భలే ఆశ్చర్యంగా ఉందే? మళ్ళీ యిక్కడకీ వచ్చాడు రామయ్య! అడుగో గొలుసు పట్టుకుని నుంచున్నాడు. పైనుంచి ధార అతని బట్టతలమీదపడి ప్రక్కకి జారిపోతోంది. వీరన్నకి బట్టతల మీద నీటి ధార గట్టిగా పడ్డప్పుడు అయ్యే శబ్దం వినిపించినట్టు కూడా అనిపించింది. ఆ నీరు పడుతోంటే రామయ్య చంటిపిల్లాడిలా ఎలా కేరింతాలు కొడుతున్నాడు. అది పూర్తికాకుండానే వెళ్ళి పట్టుకోవాలి. అని అనుకుంటూ వీరన్న పరుగెత్తాడు. ఒక పొద చుట్టు తిరిగి వెళ్ళవలసి వచ్చింది. అది దాటి చూస్తే మళ్ళీ రామయ్య కనిపించలేదు. ఈ మహామాయ వీరన్నకి అర్థంకాలేదు. అంతా అయోమయంగా ఉంది. అలాగే, ఆ పాపనాశనంలో స్నానం అయిందనిపించి ఆలోచనలతో బరువెక్కిన మనస్సుతో, నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ మకాంచేరాడు.

ఆ తరువాత వీరన్న వెళ్ళిన గోగర్భం, ఆకాశగంగ తీర్థాల్లో కూడా అలాంటి అనుభూతే కలిగింది. అక్కడగుమిగూడిన వేలాది జనంలో ఎక్కడో దూరంగా తనకి పరిచయం అయినబట్టతల, కంటిమెడ చొక్కా అంతలో కనిపించి అంతలో మాయమైనట్టు అనిపించేది. ఇన్ని పుణ్యక్షేత్రాల్లోను రామయ్య తనకంటె ముందుండడం వీరన్నకి మరీ ఆశ్చర్యం అనిపించింది. ఇటువంటి ఆశ్చర్య సందేహాలతోటే, అతను ఎలాగో యాత్ర అయిందనిపించి కావలసినవి సేకరించుకుని, మూట భుజానవేసుకుని యింటిదారి పట్టాడు

వీరన్న - వెంకన్న

ఒక లెక్చరరు క్లాస్ లో పిల్లలకు అన్నివిషయాలు బోధిస్తూ ఇలా అన్నాడు: "నేను మా యింట్లో పంపు త్రిప్పానుకోండి. నీళ్లురాలేదు. ఎందుచేత రాలేదో చెప్పగలరా?". వెనకాల బెంచీ నించి జవాబువచ్చింది "మీరు బహుశః బిల్లు కట్టడం మర్చిపోయుంటారు" అని.

డి. మాధవకిశోర్ (బందరు)

తిరుపతి విడిచిపెట్టాడో లేదో అతని దృష్టి యింటివైపు పోయింది. ఇంటిదగ్గర పనులన్నీ యేలా ఉండిపోయాయోనని ఒకటే బెడద, తాను వప్పగించిన పనులు తన కొడుకు సవ్యంగా ముగించాడో లేదోనని యింకొక ప్రక్క అనుమానం. ఈ విధంగా సతమతమైపోతూనే, అతను చరచరా అడుగులు వేసుకుంటూ యింటిదారి పట్టాడు.

కొన్ని రోజులకి, రామయ్య తానూ విడిపోయిన ఊరు మధ్యనుంచి నడుస్తున్నాడు వీరన్న. ఫలానా యింటిదగ్గర ఆగి, రామయ్య మంచి నీళ్ళకని వెళ్లాడుకదా అని జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఆయిల్లు అవునాకాదా అని పరకాయించి చూస్తున్నాడు. అంతలో యేడెనిమిదేళ్లఅమ్మాయి వీరన్న చెయ్యిపట్టుకుని లోపలకు తీసుకు వెళ్ళింది. ఏమీ తెలియని అయోమయావస్థలో యంత్రంమాదిరి ఆమె వెంట వెళ్లాడు. పిల్ల తీసుకువచ్చిన ఆయన్ని ఆమె తల్లితండ్రులు ఎంతో గౌరవించి మర్యాదచేశారు. వారి ఆదరణ అభిమానాలు అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేశాయి. వారి మాటల సందర్భంలో గ్రహించాడు, రామయ్య ఆ కుటుంబానికి ఎంత ఉపకారం చేసిందీ, వారు దీపం పెట్టుకున్నప్పుడల్లా అతని పేరు తలుచుకుంటున్నట్టూ, అతను అగుపిస్తే తమ చర్మాలతో చెప్పులు కుట్టించి యిచ్చేందుకు కూడా వారు సిద్ధపడడం, మొదలయినవన్నీ. ఈ విషయం తన స్నేహితునికి చెప్పి తప్పకుండా పంపుతానని హామీ యిచ్చిన తరవాతనే వాళ్లు వీరన్నని విడిచిపెట్టారు. వచ్చేటప్పుడు, దారిలో తను యిల్లుచేరుకునేవరకు సరిపోయే ఆహారపదార్థాలు మూటకట్టి యిచ్చారుకూడా. దారిపొడుగునా వీరన్న ఆ కుటుంబం గురించే ఆలోచించుకున్నాడు. వాళ్ళ మంచితనం, ఆదరణ అతనిని ఎంతగానో కదిల్చివేశాయి. వీటి అన్నింటికి కారణం ఆ బట్టతల మహానుభావుడని వారంతా అతిగౌరవంగా చెప్పడం అతనిలో ఏదో తెలియని అనుభూతి కలిగించింది. తీర్థయాత్ర మాని యింటికి పోయినా రామయ్య ధన్యుడనే అభిప్రాయం అంతకంతకి బలపడజొచ్చింది. తాను అంతకష్ట

కడి యాత్ర సమాప్తి చేసుకున్నా తనకే యేదో లోటు అనే అనిపించింది వీరన్నకి.

5

ఇంటికి చేరాడన్నమాటేకాని వీరన్నకి యిక్కడా సుఖం లేకుండా నే పోయింది. తానెంత భయపడుతూ ఉన్నాడో అంతకంతా అయింది. కడకు పాక నేయించనే లేదు. పైగా తాను నిలబెట్టిన కొయ్యలు వేటికవి ఊడిచక్కా వస్తున్నాయి. గడ్డిమేటు పొదుపు చేసుకోకపోవడం వల్ల ఎక్కువ భాగం పరులపాలే అయింది. వీటన్నింటికీతోడు తాను వెళ్ళిన ఈ గడువులో కొడుకు యిష్టం వచ్చినట్టు ఖర్చులుచేసేసి, ఊళ్ళో ఎక్కడపడితే అక్కడ అప్పులు చేసేశాడు. అన్ని దురలవాట్లూ చేసుకున్నాడు. ఇవన్నీ చూసుకుని వీరన్న లబోదిబోమని నెత్తీనోరూ కొట్టుకుని, అన్నీ సర్దుబాటు చేసుకునే సరికి తల ప్రాణం తోకకి వచ్చింది.

ఈ పనులతో వచ్చిన వెంటనే వెళ్ళడం పడలేదు అతనికి రామయ్య యింటికి. రెండురోజుల తరవాత అటువైపు వెడుతుంటే, రామయ్య భార్యపలకరించింది. "ఏంవీరన్నా న్నా! వచ్చి రెండునాళ్ళైనా యిటువైపుకే వచ్చావు కాదు? యాత్ర బాగా సాగినట్టేనా? నీకేం అదృష్టవంతుడివి చక్కా పూర్తిచేసుకు వచ్చావు. మా ముసలాయనా ఉన్నాడు. యేం లాభం? సగంలో వెనక్కి తిరిగి చక్కా వచ్చాడు..." అని యింకా యేమేమో అనబోతుంటే వీరన్న మధ్యలోనే ఆపి అడిగాడు "ఏడీ, రామయ్యబావ యెక్కడ?" అని.

"ఇంకెక్కడుంటాడు? అడుగో తోటలో. మళ్లీ తేనెటీగలు, కోడి పెట్టలు తన మామూలు గొడవలో పడ్డాడు. వెళ్లు. నువ్వు వచ్చావంటే ఎంతో యిదవుతాడు. పోయి కాస్త మందలించిరా!" అంటూ లోపలికి పోయింది.

వీరన్న తోటలోకి వెడుతున్నాడు. గేటుమీద చేయివేసి, తీయకుండా, అలాగే నిల్చుండిపోయి, ఆశ్చర్యంగా చూస్తున్నాడు. యాభయి అరవై గజాల దూరంలో రామయ్య అటువైపు తిరిగి, ఒక తేనెటీగల పెట్టెని జాగ్రత్తగా విప్పుతున్నాడు. అప్పటికే పైకి యెక్కి వచ్చిన ఎండలో అతని బట్టతల నిగనిగలాడుతోంది. కొంచెం ఓరగా కనిపిస్తున్న అతని మొహంలో చిరునవ్వు వెలిగిపోతోంది. లోకంలోని సంతృప్తినంతనీ ఆ చిరునవ్వులో చూడవచ్చు. సరిగ్గా యిదే దృశ్యం ఆనాడు తిరుపతిలో యేడుకొండలవాడి సన్నిధిలోను, పాపనాశనం ధారక్రిందా అదే వెలుగుతో చూచినట్టయింది వీరన్నకి. అతనికి తెలియకుండానే అతని కన్నులు చెమర్చాయి. డగ్గుత్తికతో "రామయ్యబావా!" అంటూ విసురుగా నడిచాడు చేతులు ముందుకుచాచి. హఠాత్తుగా వినిపించిన పేరుకి వెనక్కి తిరిగి రామయ్య అదేమందహాసంతో చేతులుజాపి తనవైపు వస్తున్న వీరన్నని తనివితీరా హృదయానికిహత్తుకున్నాడు. ఆ కౌగిలిలో ఉన్నప్పుడు అనుభవించిన ప్రశాంతత, తృప్తి వీరన్న జీవితంలోఎప్పుడూయెరగడు.

ఆ తరవాత రామయ్య మామూలు ధోరణిలో వీరన్నమీద ప్రశ్నలవర్షం కురిపించాడు. యాత్ర వివరాలు గుచ్చి గుచ్చి అడిగాడు. వీరన్న చెబుతున్నప్పుడు, తాను వాటినన్నింటినీ కన్నులారా చూడలేక పోయినందుకు ఎంతగానో యిదయ్యాడు. ఆ సందర్భంలోనే వీరన్న "అవునుగాని రామయ్యా! ఆ వేళ మంచినీళ్లకని నువ్వు ఆగి ఒక యింటిలోకి వెళ్ళావు; జ్ఞాపకం ఉందా? ఆ యింటి వాళ్లు..." అని చెప్పబోతోంటే, ఏదో తప్పుచేసినట్టు గతుక్కుమని రామయ్య, విషయం తప్పించడానికే అన్నట్టు "ఈ తేనెటీగ పిల్లలు చూశావా బావా! మాంచి పసందుగా తయారౌతాయిలే! ఈ యేడు మన కార్యానికేం లోటు ఉండదు. ఏమంటావు?" అంటూ సంభాషణ మొదలుపెట్టాడు. అంతలోకే రామయ్య భార్య, మనుమలూ బిలబిలమంటూ వచ్చేశారు. వీరన్నకి మళ్ళీ ఆ ప్రస్తావన చేయడానికి వీలుపడలేదు.

అప్పుడేకాదు, ఆ తరవాత ఎప్పుడు వీరన్న ఆ ప్రస్తావన తీసుకువచ్చినా, రామయ్య కావాలని దానిని తప్పిస్తు ఉండేవాడు. అందువల్ల రామయ్యచేసిన పని, వీరన్నకి తప్ప యింకెవరికీ తెలిసే అవకాశం లేకపోయింది. ★

(ఆధారం : టాల్‌స్టాయ్)

ఒక ఇంటిప్రక్కనే ఉన్న చెట్టుమీదికి పళ్ళకై కొందరు కుర్రాళ్ళు, రాళ్ళు రువ్వుతున్నారు. ఆ ఇంటాయనవచ్చి.

ఇంటాయన:-ఏయ్! అబ్బాయిలూ! రాళ్ళురువ్వుతున్నారు తగుల్తాయ్! జాగ్రత్త.

అబ్బాయిలు: అబ్బే! పళ్ళు రాలగొడతాం, గాని అంతవరకూ రానిస్తామా?

శింగనపల్లి బలరాం (గున్నతోటవలస)

ఇచ్ఛ - దైవేచ్ఛ

(19వ పేజీ తరువాయి)

గడచిన పది రోజులలోనూ రాజు తన మామయ్యదగ్గరనుంచీ మరో రెండు మామూలు ఉత్తరాలు పుచ్చుకున్నాడు ఏప్రిల్ నెలను వదిలి మే నెలలో ప్రవేశించి మే నెలను కూడా సగం వెనక్కి నెట్టాము.

అవేళ టపాలో రాజుకు లాయర్ నోటీసు వచ్చింది. నాకు చూపించాడు ఇద్దరం మా వీధి అరుగుమీద కూర్చున్నాము

"నాకు ఉద్యోగం కావాలి నేను సంపాదించాలి. ఋణం తీర్చాలి లేకపోతే చచ్చిపోవాలి" రాజు తనలో తను గొణుక్కుంటున్నాడు

"నా మాట విని డబ్బు ప్రస్తుతం తీర్చలేను ఉద్యోగంలో చేరిన తర్వాత దఫదఫాలుగా తీర్చగలను అని" రాసెయ్యి" అన్నాను

రాజు నా మాటలకు ఏమీ సమాధానం యివ్వలేదు.

* * *

ఆ సాయంత్రం మామూలుగా నూతి గట్టున కూర్చున్నాము

"రాజూ పోనీ మీ యింకోమ్మగారిని అడగ కూడదూ'

"ఏమిటి?"

"డబ్బురా—ఏం? ఆవిడకు బోలెడు ఆస్తి వుంది కదా ఆ మాత్రం యివ్వలేదూ—ఉద్యోగం వచ్చిన తర్వాత తీరుద్దుగాని"

"ఇస్తుందని నేననుకోను"

"ఎందుకు యివ్వదు? చచ్చినట్టు యిస్తుంది. అసలు తప్పంతా ఆవిడదేకదా మీ అమ్మగారు పోయినపుడు నిన్ను ఆవిడ మీ నాన్నగారివద్దనుండి వేరుచేసి యిక్కడకు తెచ్చి పెంచింది ఇక్కడే నువ్వు యస్. యస్ యల్ సి. ప్యాసయ్యావు నువ్వు ఫోర్తుఫారం చదువుతున్నప్పుడు అనుకుంటా మీ నాన్నగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నది. అనాడు కూడా నిన్ను వెళ్ళనివ్వలేదు ఇంటరు చదువుకోసం నువ్వు వెళ్ళేలోగా అసలు ఆగడపే తొక్కలేదు అందుకనే మీ నాన్నగారు నిన్ను అనుమానించడానికి అవకాశం ఏర్పడింది ఆయన కళ్ళెదురుగానే నువ్వు ఎదిగితే యిలాంటి అవస్థ అనుమానాలకి తావు వచ్చేదికాదు. యీ తప్పు లన్నిటికీ మీ యింకోమ్మే బాధ్యురాలు. కనుక ఆవిడ నష్ట పరిహారంక్రిందైనా యిచ్చి తీరాలి' అన్నాను పిచ్చి ఆవేశంతో

'సరే నీ మాట కాదనడం ఎందుకు? నీ ఎదురుగానే అడుగుతానురా" అంటూ లేచాడు. నేనూ లేచాను. తిన్నగా రాజు యింటికి వచ్చాము నేను కుర్చీమీద కూర్చున్నాను రాజు నాకేసి రెండుసార్లు చూసి డబ్బు విషయం ప్రస్తావించాడు సొంతం విన్న ఆమె ముఖం సాంబ్రాణిలా నల్లబడిపోయింది

"బి ఏ చదివావుకదా ఉద్యోగం చెయ్యలేవురా? యింకా నేనే సహాయం చెయ్యాలా—చిన్నప్పటి నుంచీ పెంచాను, పెద్ద చేశాను చాలా డబ్బు ఖర్చు పెట్టాను యిక నావల్లకాదురా నాయనా—నీకు కోపంవచ్చినా సరె!" అంటూ కోపంగా నాకేసి చూసింది. రాజుకు సంజ్ఞ చేసి నేను యింటికి బయల్దేరాను. యాంత్రికంగా భోజనంచేసి ఆరుబైట మంచం వేసుకు పడుకున్నాను నా ఆలోచనలలో రాజు మెదిలాడు. నాకు ఏంచెయ్యాలో తోచలేదు.

నాన్నగారు పొలంనుంచివచ్చి స్నానంచేసి భోజనంచేసి పక్కమీద కూర్చున్నారు. నాన్నగారి సహాయం అడుగుదాం అనుకుని నేను లోపలకెళ్ళి ముక్కాలిపీట తెచ్చుకుని ఆయన మంచం ఎదురుగా వేసుకుని నెమ్మదిగా కూర్చున్నాను నా మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తోంది. నాన్నగారిని అడగడానికి నోరు పెగలటంలేదు జవాబు ఏమని చెప్పాలో—

ఆయనతో మాట్లాడడమే చాలా కష్టం. నాన్నగారు చాలా తక్కువగా మాట్లాడుతారు.

"ఏం? పనుందా' అన్నారు గంభీరంగా

కాస్సేపు తటపటాయించి నేన సలు సంగతి చెప్పాను

"అంటే నీ వుద్దేశ్యం?"

ఉపాధ్యాయుడు: ఈ క్లాసులో మొద్దులెవరైనా వుంటే లేవండి. (బల్లముందు నిల్చొని ప్రశ్నించాడు)

కొద్దిసేపయ్యాక ఒకవిద్యార్థి లేచి నిలబడ్డాడు

ఉపా: నీవు మొద్దువని నీకే తెలుసా?

విద్యార్థి:—అది కాదండి. మీ రొక్కరే నిలబడివుంటే నాకు సిగ్గేసి మీకు తోడుగా నేను నిలబడ్డానండి.

డి. ఋష్యేంద్రమణి (మద్రాసు)

"మనం కొంచెం ఆదుకుంటే అతనికి కొంచెం శాంతి కలుగుతుంది చాలా బాధపడుతున్నాడు" నీళ్ళు నములుతూ అన్నాను

"ఆహా! ఎంత ఏమిటి?

"వెయ్యి రూపాయలు"

ఆ మాటతో ఆయనోట్లో చుట్ట చప్పున జారి నేలమీద పడిపోయింది

"వెయ్యి రూపాయలు సర్దగల స్తోమత మనకు ఉందని నువ్వు అనుకుంటే—యివిగో తాళాలు యినప్పెట్టె తెరిచిచూడు నీకే తెలుస్తుంది—నావూహ ఎంతవరకూ నిజమో" అంటూ తాళం చెవులు నా ఒళ్ళోకి పడేసి మంచంమీద వెల్లకిల్లాపడుకున్నారు

"మనం సహాయం చెయ్యగలమనికాదు—చెయ్యగలం ఏమో అని అడిగాను' అంటూ తాళాలు మంచంమీద పెట్టాను

"అదికాదు—ఒక రెండు మూడు వందలయితే నిరభ్యంతరంగా సర్దగలము" అన్నారాయన.

"అలా చెప్పమంటారా" అన్నాను నేను.

"ఆ విషయం ఆలోచించవలసినది నువ్వు. ఆ డబ్బు నువ్వు ఎప్పుడడిగినా యివ్వడానికి నేను సిద్ధం అన్నారు

"అలాగేనండీ!" నా పక్కమీదకు వచ్చేశాను.

* * *

మర్నాడు సాయంత్రం షికారులో రాజుతో యీ సంగతి చెప్పాను దానికి రాజు తల అడ్డంగా వూపుతూ "లాభంలేదు! డబ్బు అంతా ఒక్కసారిగానే యిస్తానని రాశాను" అన్నాడు నాకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"ఛీ—అదేం పనిరా? నువ్వు చేసిన పని శుద్ధ తెలివి తక్కువవాడు కూడా చెయ్యడు!" అన్నాను నేను 'అవును' అని తల వూపాడు.

"మీ మామయ్యని తన యిష్టం వచ్చినట్లు చేసుకోమని వ్రాయి—కోర్టువారు కూడా సంపాదనలేని నిన్ను ఏమీ చెయ్యలేరు దఫ దఫాలుగానే తీర్చవచ్చునంటారు" అన్నాను.

"కానీ జాలి పడి నా బాగుకోసం ధన సహాయం చేసిన మామయ్యను కోర్టుకులాగడం నాకుఇష్టం లేదు"

"ఛీ—యవడ్రా నువ్వు? వాడే నిన్ను కోర్టుకెక్కిస్తే—నువ్వు వాణ్ణి ఎక్కించేదేమిటి?"

రాజు నా మాటలు వినకుండా ఎటో చూస్తున్నాడు" రాజా! యిలాగే గనుక నువ్వు సంచరిస్తే నీకు వారం రోజుల్లో పిచ్చిఎక్కిపోతుంది" అన్నాను. "నిజంగానా" అన్నాడు నాకేసి చూస్తూ.

"ఆ! నిక్కచ్చిగా" అన్నాను రాజు చిన్నగా నవ్వుతూ "అప్పుడయితే నా అంత అదృష్టవంతుడు ప్రపంచంలో ఎవ్వడూ ఉండడు" అన్నాడు.

* * *

అవేళ మే మిద్దరం షికారుకువెళ్ళి అప్పుడే యింటికి వచ్చాను అనుకోకుండా ఆవేళ రిజల్ట్సు వచ్చాయి రాత్రికి రాత్రి బెజవాడనుంచి పేపరు తెప్పించారు

"రిజల్ట్సు వచ్చాయి" అని మా తాతయ్య అనగానే రాజు కుప్పలాగ అరుగుమీద కూర్చున్నాడు. మీ నెంబర్లు ఎంతోయ్! అని అడుగుతున్న తాతయ్య చేతిలోంచి పేపరు తీసుకు చూశాను.

నేను మూడు పార్టులూ మామూలుగానే ప్యాసయ్యాను. రాజు పార్టు టూ, పార్టు త్రీ ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు.

"రాజా! వెరీగుడ్" అని అరిచాను "ఏమిటి ఫస్టుక్లాసా? నాకా??" అన్నాడు. అరుగుమీంచి లేస్తూ నా చేతిలో పేపరు తీసుకుని చూసి "అవును రైట్!" అన్నాడు నవ్వుతూ మళ్ళా పేపరు చూశాడు యీసారి కొంచెం గట్టిగా నవ్వాడు. మళ్ళా పేపరు చూశాడు యింకా గట్టిగా నవ్వుతూ పేపరుచింపి నా ముఖంమీద పారేశాడు 'రాజా' అని అరుస్తూ, అతన్ని గట్టిగా పట్టుకున్నాను. నన్ను విదిలించుకోబోయి రాజు క్రిందపడిపోయాడు. పావుగంట సేపయినా స్పృహలేదు. నేనూ, తాతయ్యా రాజు తల దగ్గర కూర్చున్నాం. 'ఏం జరిగింది' అంటూ అప్పుడే పొలంనుంచి వస్తున్న నాన్నగారు రాజు పక్కన కూర్చున్నారు. అమ్మా, పిల్లలూ నించుని చూస్తున్నారు

రాజు నెమ్మదిగా కదిలాడు. "పాపం దుర దృష్టి మంతా పోగై వాణ్ణి హింసిస్తోంది' అన్నారు నాన్నగారు రాజు ముఖంమీద నీళ్ళు జల్లుతూ.

రాజు నెమ్మదిగా లేచాడు చుట్టూరాచూసి "ఎందుకిలా మూగారు? నేనేం చచ్చిపోలేదుకదా?" అన్నాడు.

ఆ మాటకు పిల్లలు కిలకిలా నవ్వారు. నాన్నగారు తలెత్తి వాళ్ళకేసి చూశారు. అమ్మ వాళ్ళని లోపలకు తీసుకెళ్ళిపోయింది.

రాజును మడత కుర్చీలో కూర్చోపెట్టాను మోకాళ్ళల్లో తల పెట్టుకుని కూర్చున్నాడు పది నిముషాలల్లో అమ్మ కాఫీ పట్టుకొచ్చి యిచ్చింది. రాజు కాఫీత్రాగేసి గ్లాసు నాచేతికియిచ్చి చకచకా వీధివైపు వెళ్ళిపోయాడు నేను రాజువెంట పరిగెత్తాను. దారిలో కలుసుకుని ఎక్కడికిరా అలా పరిగెత్తుతూ పోతున్నావు అన్నాను "ఎక్కడికేమిటి మా యింటికి" అన్నాడు మాట్లాడకుండా నేను వెంబడించాను కొంచెం దూరం వెళ్ళాక "వాసూ నీకు ఫస్టుక్లాసువచ్చినందుకు నమ్మ చాలా సంతోషం" అన్నాడు నా చెవులని నేనే నమ్మలేకపోయాను "నాకు కాదురా, నీకే ఫస్టుక్లాసు వస్తే!" అన్నాను వాడి చెయ్యి గట్టిగా పట్టుకుని. "అలాగా అయితే మరీ సంతోషం. నీకన్నా ముందు నాకే ఉద్యోగం వస్తుంది. నా అప్పు తీర్చుకుని మరీ చచ్చిపోవచ్చు" అన్నాడు.

రాజును వాళ్ళింటి దగ్గర దిగవిడిచి వాళ్ళ వాళ్ళతో ఏమీ చెప్పకుండా యింటికి చేరుకున్నాను

"రాజుకు మతిపోయి ఉంటుందిరా" అన్నాడు తాతయ్య నాతో నేను మాట్లాడకుండా పక్కమీద వాలాను. కళ్ళవెంట నీరు ఆపుకుందామని చేసే ప్రయత్నాన్ని జయించి కారసాగాయి.

* * *

మర్నాడు షికారు వేళకి రాజు మా యింటికి వచ్చాడు. నేను చొక్కా తొడుక్కోడానికి లోపలకు వెళ్ళాను. "వాసూ రాజుకు మతి సరిగ్గాలేదు. జాగ్రత్తసుమా" అంది అమ్మ. "అలాగేనమ్మా" అని చొక్కా తొడుక్కుని వీధిలోకి వచ్చాను.

మామూలు స్థానంలో కూర్చున్నాము "వాసూ నాకు క్లాసు వచ్చింది నీకు రాలేదు అంచేత నాకు ముందర ఉద్యోగం రావాలి నేనూ నీలాగ సూటూ బూటూ వేసుకోగలను నా బాకీ తీర్చగలను. మా తండ్రికన్నా ఎక్కువ డబ్బు సంపాదించగలను." రాజు ఉద్రేకంతో చెప్పుకు పోతున్నాడు. రాజుకు నిజంగా మతిపోయి ఉండాలనిపించింది నాకు సంపాదనమీదా, బాకీ తీర్చటంమీదా అతని మనస్సు స్థిర పడిపోయింది అనుకున్నాను

మరోనాడు బాతాఖానీలో "నాకు పిచ్చి ఎక్కిందని యీవూరివాళ్ళ అభిప్రాయం" అన్నాడు

"మరి నీ అభిప్రాయం?"

"జనవాక్యం కర్తవ్యం అన్నారు పెద్దలు కనుక బహుశానాకు పిచ్చి ఎక్కే ఉండచ్చని నా నమ్మకం" అన్నాడు అతని చూపులు యిదివరలాగ గంభీరంగానూ, నిశ్చలంగానూ లేవు.

"రాజూ! నీకు పిచ్చీలేదు చాదస్తమూ లేదు లోకం అన్నంత మాత్రాన మనం పిచ్చివాళ్ళము అవలేము కనుక నువ్వు అనవసరంగా మధనపడక" అన్నాను.

"అవును నీకేం? బూటూ, సూటూ వేశావు. వాచీ పెట్టుకున్నావు ఎన్నికబుర్లయినా చెప్తావు చూడు నాకు ఒక్క ఉద్యోగం అయినాలేదు" అన్నాడు రాజు మాటలకు నా మనస్సు వెయ్యి శూలాలతో పొడిచినట్లు బాధపడ్డాను. రాజను మంచి మనిషిగా తిరిగి చూడగలనో లేనో అని బాధపడ్డాను.

* * *

ఆవేళ ఆదివారం. సాయంత్రం మా యింటికి వచ్చి "వాసూ అర్జంటుగా నాకో ఉద్యోగం యివ్వగలవా? నీకు కమీషను యిస్తాను" అన్నాడు 'సరే పద' అంటూ వీధిలోకి వచ్చాను చెరువుగట్టు వెంబడి నడిచి నూతిగట్టుమీద కూర్చున్నాము

రాజు జేబులోంచి రుమాలుటీసి దాన్ని పీలిక లుగాచింపి అన్ని ముడివేసి ఒక తాడులాగా తయారు చేశాడు. నేను చాలా జాగ్రత్తగా అతన్ని గమనిస్తున్నాను ఆపీలిక రెండు కొసలూ చెరో చేతికి కట్టుకొని మెడ చుట్టూ వేసుకుని నవ్వుకున్నాడు

"మిస్టర్ వ్యాస్! నేను ప్రాక్టీసు పెట్టదలిచాను. నీకేమైనా రోగం ఉందా? ఉద్యోగం దొరకని రోగంఉంటే మాత్రం నాకు తెలియదు. ఎంచేతంటే ప్రస్తుతం మనకే ఉద్యోగాలు లేవు" అన్నాడు. అతని ముఖం కళావిహీనమయ్యింది.

* * *

అవేళ టపాలో వచ్చిన ఉత్తరాన్ని నాన్నగారు చూసి నా చేతిలో పెట్టారు ఆ ఉత్తరం చదువుతుంటే నాకు కోపం పేట్రేగిపోయింది నాన్నగారి దగ్గర ఏమీ అనలేక వంటింట్లోఉన్న అమ్మ దగ్గరకువెళ్ళి "అమ్మా యీ మామయ్యను ఉద్యోగం చూడమని ఎవరు అడిగారు? రాజు పరిస్థితిచూడు ఎలావుందో? వాణ్ని కొంచెం లొంగదీసి మామూలు మనిషిగా చెయ్యాలి లేకపోతే ఆజన్మాంతం పిచ్చివాడయిపోతాడు" అన్నాను. నా మాటలకు అమ్మ చిన్నగానవ్వి, "యీ మాత్రందానికి యింత రగడఎందుకురా పోనీ నీ యిష్టమొచ్చినపుడే వెళ్ళుదువుగాని" అంది. నన్ను పూర్తిగా అర్థం చేసుకున్న నా తల్లికి మనస్సులో నమస్కారం పెట్టుకున్నాను. ఈ ప్రస్తావన రాజుతో చెప్పకూడదు అనుకున్నాను

మరో నాలుగు రోజులు గడిచాయి. రాజులో ఉద్యోగం అన్న వూహలు ఎక్కువయిపోయాయి. ఎవర్ని చూసినా అదేమాట. ఎప్పుడైనా అదేమాట. ఒకనాడు నేను అతని యింటికి వెళ్ళాను

"ఏమండీ పిలకా పోలయ్యగారూ ఏంకావాలి" అన్నాడు రాజు నాకు వళ్ళు చల్లారిపోయింది భయంతో. "నేనురా" అన్నాను జంకుతూ "నువ్వా మిస్టర్! కుశలమా! ఏ వూళ్ళో పని? లీవు ఎప్పుడు పెట్టావు? 'ఎరియర్సు' వర్కు పూర్తి చేశావా— నాకు తెలియదులే ఎంచేతంటే నేను ఉద్యోగం చేయుటంలేదుగా" అన్నాడు నాకు భయం వేసింది

"నేనురా వాసుని" అన్నాను "నువ్వా! సారీ! మీ కోక్సర్కు అనుకున్నాను షికారు వెళ్దామా?" అన్నాడు ఇద్దరం బయల్దేరాము

నూతిగట్టుమీద నేను కూర్చున్నాను బావి పక్కనున్న పాడుపడిన గుడి గోడమీద రాజు కూర్చుని చిన్న చిన్న రాళ్ళు నామీదుగ నూతిలో విసురుతున్నాడు. ఏ రాయైనా నామీద విసురుతాడేమోనని నాకు భయంవేసింది చాలా జాగ్రత్తగా చూస్తూ కూర్చున్నాను

అంతలో రాజు గభాలున గోడమీంచి దూకి నా పక్కన కూర్చుని "ఒరేయ్! దీనికంతకూ కారణం ఎవరో తెలుసా?" అన్నాడు దేనికంతకు? అని అడుగుదాం అనుకున్నాను కానీ తెలియదు అన్నాను ముక్తసరిగా రాజు లేచి నించుని ప్యాంటు జేబులో చేతులు పోనిచ్చి 'మా అక్కయ్యే కారణం—అదే మా నాన్నగారికి లేనిపోని విషయాలు చెప్పి అనుమానం కలిగించి అత్తారింటికి పోయింది నాకీ గతి పట్టింది. ఆడవాళ్ళని నమ్మక ఆడవాళ్ళని పెళ్ళాడక నాకు ఉద్యోగం వస్తే నేనే నిన్ను పెళ్ళాడుతాను అన్నట్టు నువ్వు ఆడదానివికాదుగా? అయినా ఫరవా లేదులే నేను వాళ్ళని బాగా అర్థం చేసుకున్నాను."

రాజు ధోరణి నన్ను అత్యంతమైన బాధ పెట్టింది కళ్ళ ఎదురుగుండా రాజులో మానసిక దౌర్బల్యమైన మార్పుకు, చిత్తభ్రమణకూ నా కడుపు తరుక్కుపోయింది

"చీకటి పడింది. ఇంటికి వెళ్దాంపద" అన్నాను. "ఓ యస్! మనం రడీ" అన్నాడు ఎదురుగుండా ఉన్న యిటికరాయిని కాలుతో తన్నుతూ.

ఇద్దరం బయలుదేరాము రాజును నెమ్మదిగా వాళ్లింట్లో దిగవిడిచి యింటికి బయల్దేరాను "వాసూ జాగ్రత్త. రోజులు మంచివికావు రాత్రి సుమా! జాగ్రత్తగా వెళ్ళు" అన్నాడు. అలాగే అని వచ్చేశాను

ఇంటికివెళ్ళి భోజనంచేసి మంచంమీద పడుకున్నాను. నాకెందుకో బావురుమని ఏడవాలనిపించింది. కానీ ఏడుపు రాలేదు. కడుపులో తాచుపాములు మెదిలినట్లయింది పక్కమీదలేచి కూర్చున్నాను.

"రాజు పరిస్థితి ఏమైనా నయమా?" అన్నారు నాన్నగారు దొడ్లోకివచ్చి తన మంచంమీద కూర్చుంటూ

"ఒక్కొక్కసారి మామూలుగా మాట్లాడుతాడు మరొకసారి వింతగా అసలు నేనంటే గుర్తులేనట్టే మాట్లాడతాడు" నాన్నగారి మంచం దగ్గరున్న ముక్కాలిపీటమీద కూర్చుంటూ అన్నాను.

"విధి బలీయమైనది దాన్ని ఎదిరించే శక్తి వాడిలో లేదు ఉద్యోగం, అప్పు, అన్నమానసిక ఆందోళనే వాడిని అలా చేసింది" అన్నారు

"రాజు యిక మారడంటారా?" నా ప్రశ్న నాకే భయం కలిగించింది

"మారడని నేను అనను. కానీ మారలేడు. అతనికి మానసిక శాంతి కావాలి ఆదరణ కావాలి. ఉద్యోగం కావాలి ఇవన్నీ జరిగితే మనం వద్దన్నా అతను మామూలు మనిషి అయిపోతాడు" అన్నారు.

నిజమే!! కాని యివన్నీ జరగవు అంటే రాజు యిక మామూలు మనిషి అవడం కల్ల అన్నమాట అనుకున్నాను నా గుండె గుభేలుమంది. నా పక్కమీదకువచ్చి పడుకున్నాను

* * *

సాయంత్రం షికారు టైముకల్లా, టంచనుగా మా యింటికివచ్చి "హల్లో వాసూ ఏమి

ఇచ్ఛ-దైవేచ్ఛ

టింకా ఆలస్యం?" అన్నాడు అరుగుమీద కూర్చున్న తాతయ్య రాజులో మార్పు వచ్చిందని అనుకుని "ఏంనాయనా! ఎలా వుంది నీ వంట్లో" అన్నాడు

"నాతో మాట్లాడకోయ్! ఈ ముసలాళ్ళంటే నాకు అసహ్యం! లోకంలో వీళ్ళవల్లే యువకులు అవస్త పడుతున్నారు ఉద్యోగాలు కూడా దొరకటంలేదు" అని వీధిగుమ్మంవైపు నడిచాడు నేను కూడా రాజు వెనకాల పరిగెత్తాను. తాతయ్య కొయ్యబారిపోయాడు.

బావిగట్టుకు చేరేదాకా మళ్ళా ఏమాటా మాట్లాడలేదు నేను గట్టుమీద కూర్చున్నాను. రాజు గోడ ఎక్కి కూర్చుని "మిస్టర్ వ్యాస్— నీ పేరు ఏమిటి?" అన్నాడు

"వ్యాసభూపతి" అన్నాను భయపడుతూ,

"అలాకాదు. ఏ పేరు పెట్టిపిలవను?"

"వాసు అని పిలు"

"ఆ! వాసూ నేను చావదలుచుకోలేదు నా నిశ్చయం మార్చుకున్నాను మామూలుగా ప్యాసైన వాడివి నువ్వే బతికి యిస్త్రీ బట్టలుకట్టి బాగుపడాలని చూస్తుంటే డబుల్ ఫస్టు క్లాసు వచ్చిన నేను ఎందుకు చావాలి చావను నాకు తప్పక ఉద్యోగం వస్తుంది. నీకన్నాముందరే వస్తుంది. ముందుగా నాకు యిచ్చి తర్వాత నీకు యిస్తారు. అదైనా కాళీలుంటేనే" అన్నాడు

"అవును నీకు తప్పక ఉద్యోగం వస్తుంది" అన్నాను

"ఎదురు సమాధానం చెప్పక, బుద్ధిమంతుడిలా విను. లేకపోతే అసలు నీకు ఉద్యోగం రాకుండా చేస్తాను' అన్నాడు.

నేను లేచి నించున్నాను. రాజు గోడ దిగాడు. "వాసూ! నిన్ను అనరాని మాటలు అంటే క్షమించు. వాటిని మర్చిపో. నాకీ మధ్య బుర్ర సరిగ్గాలేదు. కారణం ఏమిటో నాకే తెలియదు" అన్నాడు. ఆ మాటలతో నా హృదయం పగిలిపోయినట్లయింది. "సర్వేశ్వరా ప్రపంచంలో మంచివాళ్ళకూ అమాయకులకూ నువ్వు ఏమీ చెయ్యలేవా? వాళ్ళ నేనా నువ్వు నాశనం చేసేది" అనుకున్నాను.

మౌనంగా యిద్దరం నడక ప్రారంభించాము.

"నేను చావదలుచుకోలేదు. చావే వచ్చి అడిగినా వీల్లేదు. ఇప్పుడు శలవ దొరకదు. పో అంటాను" అన్నాడు. "అవును నువు చావద్దు. నీకు తప్పక ఉద్యోగం వస్తుంది" అన్నాను.

* * *

మర్నాడు ఉదయం నాన్నగారు నన్ను ఏదో పొలం పనులమీద పొరుగూరు వెళ్ళమన్నారు. వెళ్ళక తప్పిందికాదు. "రాజు మనింటికి వస్తే వంటరిగా షికారుకు నేను వెళ్ళద్దని చెప్పానని చెప్పండి. వీలైతే సాయంత్రంలోపు వచ్చేస్తాను' అని మా నాన్నగారితో చెప్పి బయలుదేరాను.

అనుకున్నట్టుగా పని అవలేదు. ఆనాడంతా ఆ వూళ్ళోనే ఉండవలసి వచ్చింది. ఆ రాత్రంతా నాకు నిద్దర పట్టలేదు. కళ్ళుమూసినా, తెరిచినా రాజే ప్రత్యక్షమయ్యాడు. తెల్లవారింది పని యింకా తెమల్లేదు. పదిన్నరకు నా పని అయ్యింది. ఆ వూళ్ళోనే భోజనంచేసి కారెక్కాను.

మావూరు జేరుకునేసరికి టైము రెండు అయ్యింది. మిట్ట మధ్యాహ్నం వేసవికాలం గాడ్పు విపరీతంగా వస్తోంది వీధిలో ఒక్క పురుగు కూడా లేదు రిక్షా దిగి ఇంట్లో ప్రవేశించాను.

అమ్మ మజ్జిగ తెచ్చి యిచ్చింది. మజ్జిగతాగి గ్లాసు క్రిందపెడుతూ "అమ్మా అలా వున్నావేం" అన్నాను. "ఏంలేదురా" అనేసి లోపలకు వెళ్ళిపోయింది

గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకున్నాను. "మా మామయ్యను బతిమాలి నా ఉద్యోగం రాజుకు వేయించేస్తే రాజు పిచ్చి నయమవుతుందనుకున్నాను. ఈలోగా అమ్మ గదిలోకివచ్చి నా ఎదురుగాఉన్న కుర్చీలో కూర్చుంది. ఆమె ముఖంలో అనిర్వచనీయమైన బాధ వుంది.

"అక్కకులాసాగా ప్రసవించిందా?" అని అడిగాను అనుమానంగా.

"ఆ! మగపిల్లాడుట. సుబ్బాడు చెప్పాడు" అంది.

"మరింకా ఏమిటి" ఆశ్చర్యంతో అడిగాను.

"మన రాజు లేడూ...."

"ఆ .ఏంమయ్యింది" అన్నాను పక్కమీంచిలేచి కూర్చుని.

"....నిన్న ఎంత వద్దన్నా వినకుండా షికారు వెళ్ళాడు. పాము కరిచి పోయాడుట. శవాన్ని ఫదింటికి వెతికి పట్టుకొచ్చారు."

నా బుర్ర బొంగరంలా తిరిగిపోయింది. కూర్చున్న మంచం పాతాళంలోకి జారపడిపోయినట్లయ్యింది 'ఆ! చచ్చిపోయాడా' అన్నాను మంచం మీంచిలేచి నించుంటూ.

'నేను చావను. చచ్చినా చావను చావు వచ్చి అడిగినా సరే యిప్పుడు సెలవులేదని చెప్తాను' అన్న రాజు మాటలు నా చెవిలో రింగుమన్నాయి. ఏడుద్దామన్నా కళ్ళవెంట నీరు కారలేదు

"శవ దహనం అయిపోయి ఇందాకనే వాళ్ళు వచ్చారు" అంది అమ్మ నెమ్మదిగా.

"చస్తాను చస్తాను అన్ననాడు వాడిని దేముడు కూడా చావనివ్వలేదు. చావను అన్నాడో లేదో చచ్చిపోయాడు"

"ఏదీ మన చేతిలో లేదురా నాయనా—దైవేచ్ఛకూ, మానవేచ్ఛకూ ఎప్పుడూ పొత్తు కుదరదు" అంది అమ్మ.

మంచంమీంచిలేచి చకచకా బట్టలు సర్దుకోడం ప్రారంభించాను. "ఎక్కడికి వెళ్తావురా హడావుడిగా బట్ట సర్దుతున్నావు' అన్నాడు. తాతయ్య లోపలకు వస్తూ.

"నన్ను ఎవ్వరూ మాట్లాడించకండి. ఈ దిక్కుమాలిన వూళ్ళో ఒక్క క్షణం కూడా ఉండను. మామయ్య దగ్గరకు పోతున్నాను నేను ఆ ఉద్యోగమే చేస్తా" అని అరిచాను.

స్నేహితుణ్ణి పోగొట్టుకున్న ఆ వూరిలో కన్న తల్లి దండ్రులకోసమైనా ఉండబుద్ధి కాలేదు.

నా బాధ గ్రహించిన నాన్నగారు జేబులోంచి వంద రూపాయల కాగితంతీసి "నీయిష్ట ప్రకారమే చెయ్యి" అన్నారు.

పెట్టే బెడ్డింగూ పాలేరువాడి నెత్తినపెట్టి అంత ఎండలోనూ బస్సుస్టాండుకేసి పరిగెత్తాను. ★



వనితా వాణి

ఆఫీసు కాదు

ఎ. బాలగారు వ్రాసిన "ఆఫీసు కాదు" వ్యాసం చదివాను. మగవారు దుబారా ఖర్చు ఎందుకు చేస్తారో చెప్పాలనుకుని వివరంగా చెప్పలేక పోయారు. చివరకు భర్తలు ఇంటికి రాగానే ఎందుకు చిరాకు పడ్తారో విపులంగా చెప్పారు. మగవారి దుబారా గురించి యింకా కొంచెం వివరంగా చెప్తే బాగుండేది. కొన్ని విషయాలు అసంబద్ధంగా ఉన్నాయి. ఆడవారు కొన్ని గొప్ప చదువుకుంటున్న ఈ రోజుల్లో భర్తను పిల్లల్ని, ఇంటినీ వదిలేసి పెత్తనాలకు పోవటం సహజంగా లేదు. సాధారణంగా అలా జరగటం లేదు. ఇక మగవారి దుబారాగురించి. మనిషన్న తరువాత కొన్ని అలవాట్లుంటాయి. అవి చెడ్డవి అని తెలిసినా మానుకోలేము. చాలామంది ఆడవాళ్ళు 'మావారు అన్ని సిగరెట్లు కాలుస్తారు, ఇన్నిమార్లు కాఫీ త్రాగుతారు' అని వాళ్ళ దగ్గిరా, వీళ్ల దగ్గిరా వాపోతుంటారు. మగవారి బాధల గురించి వివరంగా ఆలోచిస్తే వారి కది సహజంగా కనిపిస్తుంది. పెద్ద పట్టణాలలో ఉండే వారికి ఎక్కడో ఆఫీసు ఉంటుంది. ఇల్లెక్కడో ఉంటుంది. పది గంటలకి ఆఫీసుకి పోవాలంటే తొమ్మిది గంటలకే పోవాల్సి ఉంటుంది. అర గంట ఆలస్యంగా గృహిణి పని కాలేదని విసుక్కుంటూ, అన్నంలోకి సరైన ఆధరువులు లేకుండా భర్తకి అన్నం పెడ్తుంది. టైమై పోయిందని హడావుడిగా భోజనం చేసే మగవారికి పనిచేసిన అలసటవల్ల ఆక లెక్కువవు తూంటుంది. అందువల్ల, కాఫీ, టిఫెను ఎక్కువ సార్లు తీసుకోవలసి వస్తుంది మనకి భోజనం చెయ్యగానే వక్కపొడి వేసుకోవాలనిపించినట్లే వాళ్లకి సిగరెట్ తాగాలనిపిస్తుంది. గృహిణి శ్రమనుకోకుండా కాఫీ, టిఫిన్ చేసిస్తే కొంత ఖర్చు తగ్గుతుంది. దగ్గరగా ఆఫీసు ఉన్నవాళ్లయితే మధ్యాహ్నం యింటికే వచ్చి కాఫీ, టిఫిను తీసుకొని వెళ్లవచ్చు అసలు ముఖ్యంగా భార్యా భర్తని ఖర్చులు నిగ్గదీసి అడగటం, మీ కాఫీ సిగరెట్ల వల్లనే ఇంత ఖర్చు అవుతోందని వాపోవడం ఇలాంటివి తగ్గించుకోవాలి. సాధారణంగా బాధ్యత తెలిసిన మగవాడు ఖర్చులు తగ్గించి పొదుపుగా సంసారం నడుపుకోటానికే ప్రయత్నిస్తాడు అలా లేని పక్షంలో గృహిణి తన మటుకు తాను చాలా జాగ్రత్తగా ఖర్చు చేసుకోవాలి 'ఆయన దుబారా చేస్తున్నారు గదా నే నెందుకు పొదుపుచేసి యిబ్బంది పడాలి ?' అని భార్య అనుకుంటే ఆ సంసారం బాగుపడదు. భార్యాభర్త లిద్దరూ బాధ్యత గుర్తించి అనవసర ఖర్చులూ, అవసర ఖర్చులూ ఆలోచించి చేస్తూ పొదుపుగా వాడుకుంటుంటే ఆ సంసారం సంతోషంగా ఉంటుంది.

శ్రీమతి కోడూరి మైథిలీ రాజేంద్రన్,
(విజయవాడ—2)

* * *

'మీ వాళ్ళేం పెట్టారు'

"మీవాళ్ళేం పెట్టారు" అన్న వ్యాసం వసంత గారు చాలా చక్కగా వ్రాశారు. అమ్మలక్క లందరికీ యిది బాణం దెబ్బలా పనిచేస్తుందని ఆశించవచ్చు. రచయిత్రికి మీ పత్రిక ద్వారా అభినందనలు.

ఆర్. సత్యవతీశర్మ, (చింతలపల్లి).

* * *

వసంతగారు వ్రాసిన "మీవారేం పెట్టారు" అన్న వ్యాసం ఈనాటి పరిస్థితులకు అనుగుణంగా ఉంది. వారు చెప్పినట్లు ఈ చెడు అలవాటు ధనవంతులు మొదలు, పేదవారి వరకు (చదువుకున్న వారిలోను, చదువుకోనివారిలోను) వ్యాపించి ఉన్నది. కోడలు పుట్టింటినుండి రాగానే "మీవారేం పెట్టారు" అని ఇంట్లో స్త్రీలే ముందు ప్రశ్నిస్తారు ఒకవేళ ఏదైనా పెట్టారని చూపిస్తే తృప్తిపడరుగదా. పైపెచ్చు నిరసన చూపుతారు

శ్రీమతి యశోదప్రకాశరావు (మద్రాసు)

* * *

చెప్పుడు మాటలు

బి. సరోజగారు వ్రాసిన "చెప్పుడు మాటలు" అను వ్యాసము నా కెంతో నచ్చింది ఇలాంటి మాటలు చెప్పే చీడపురుగులను మన దగ్గరకు రానీయకుండా జాగ్రత్తగా ఉండాలి రచయిత్రికి నా హృదయపూర్వక ధన్యవాదములు.

కె. అమృతవల్లి, (పిఠాల)

* * *

కాటుక పుల్లలు

రాధారాఘవన్‌గారు వ్రాసిన "కాటుక పుల్లలు" అనే వ్యాసం చదివాము ఆమాదిరిగనే పుల్లలను తయారు చేశాము బాగానే కుదిరినవి అట్లే కాటుక చేసే విధానము కూడా అందులో వ్రాసి ఉంటే నాలాంటి తెలియనివారికి ఇంకనూ బాగా తెలియజేసేవారు. రాధారాఘవన్‌గారికి పత్రికద్వారా అభినందనలు.

ఎం. ఆర్. సుబ్బలక్ష్మమ్మ (మామిడూరు)

* * *

రాధారాఘవన్‌గారు వ్రాసిన 'కాటుక పుల్లలు' వ్యాసం చాల బాగుంది. కాని అందులో "వెన్న, పచ్చకర్పూరం, కాటుకపొడుం ఈ మూడూ పళ్లెంమీద వేసి, మెత్తగా నూరుతూ దానిమీద పదిహేను చెంబుల నీరో పోయాలని వ్రాశారు. ఆ నీరు కాటుకమీద పోయాలో, పళ్లెం మీద పోయాలో అర్థంకాలేదు. దానిని గూర్చి శ్రీ రాధారాఘవన్‌గారు తెలుపుతారని ఆశిస్తున్నాను.

ఎం. వి. అరుంధతి (నర్సాపురం)

* * *

అనుభవించేవారు

శ్రీమతి రాజ్యలక్ష్మిగారు వ్రాసిన "అనుభవించేవారు" అన్న వ్యాసానికి నా ధన్యవాదాలు. రాజ్యలక్ష్మిగారూ ! మీ చుట్టం చాలా మంచి వాడు సుమా ! ఎందుకంటే మీ చుట్టం అందరిని మంచి చేసుకుని కేవలం భోజనంచేసి వెళ్లిపోయాడు. కాని ఏదీ తస్కరించి పోలేదుగా? కాని మా యింటికి వచ్చిన చుట్టం అలా కాదు. చాలాకాలం క్రిందట మా యింటికి ఒక చుట్టం వచ్చాడు. ఆయనకు జ్వరం రావడంవల్ల ఒక నెల మకాం వేశాడు చివరికి పాపం తనని మరచి పోతామని భయం వేసింది, కాబోలు, వెళ్తూ, వెళ్తూ మా నాన్నగారి పైలెట్ పెన్ను జాగ్రత్త చేసుకున్నాడు.

శ్రీమతి మూర్తి ఆర్. (బందరు)

* * *

నండూరి రాజ్యలక్ష్మిగారి "అనుభవించేవారు" అన్న వ్యాసం చాలా బావుంది రచయిత్రి అన్నట్లు ఏమి సంబంధం లేనివాళ్ళు మన ఇండ్లకు వచ్చి పావనం చేస్తుంటారు. అలాంటివాళ్లను మనం చేరనీయకుండా ఉండాలి అనుకోని అతిథులవల్ల మనకు కలిగే కష్టనష్టాలు అపారం. నండూరి రాజ్యలక్ష్మిగారు తమ అనుభవాన్ని వ్యాసరూపంలో చక్కగా వివరించారు. వారికి నా ధన్యవాదాలు.

అవ్వారి సుబ్బలక్ష్మి (అమలాపురం)

* * *

శ్రీ రాజ్యలక్ష్మిగారు వ్రాసిన వ్యాసము చాల బాగుంది. ఇటువంటి సంఘటనే పూర్వం జరిగినది జ్ఞాపకం వచ్చింది వ్యాసము చాల చక్కగా వ్రాశారు. రాజ్యలక్ష్మి గారికి పత్రికద్వారా అభివందనములు తెలియజేయగోరుతున్నాను.

టి చంద్రమోహిని (బరంపురం)

* * *

రాజ్యలక్ష్మిగారు రాసిన వ్యాసం "అనుభవించేవారు" మాకు ఏమి నచ్చలేదు. ఎందుకంటె ఎంత నిర్మొహమాటమైన మనిషైనా పరాయి యింట్లో దూరి చొరవగా మాట్లాడటం అసంభవము. ఈవిధముగా కథలలోను, సినిమాలలోను జరుగుట సంభవముగాని, నిత్య జీవితములో జరుగుట అరుదు కనుక యికమీదట యిటువంటి అర్థములేని వ్యాసములు వ్రాయవద్దని రచయిత్రి గారికి మనవిచేస్తున్నాము

చియ్యేడు శారద, రాజమ్మ, రమ, సుజాత,
(అనంతపూర్) ★



"జ్వాల" చిత్రంలో మధుబల.

వర్ధమాననటుడు వల్లం నరసింహారావు

సొగసైన విగ్రహం, విగ్రహానికి తగ్గనటనా కౌశలం ఉన్నా నిర్మాతలు దృష్టికిరాని నటుడు శ్రీ వల్లం నరసింహారావు.

మూనాన్ తీసిన 'ప్రపంచం' చిత్రంతో తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయ మయ్యారు శ్రీ నరసింహారావు. సారధీ వారి 'అంతా మనవాళ్లే' లో కథానాయకుడు సత్యంగా నటించి పలువురు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నారు. ఆనాడు ఆ చిత్రాన్ని చూచినవా రంతా శ్రీ వల్లం తన నటనానైపుణితో అందరి ఉల్లాలు ఘల్లు మనిపించే ఉన్నత స్థాయికి అందుకోగలరని ఆశిం చారు, ఆశీర్వదించారు కూడా. నీతి, నిజాయితీ



'భక్తఅంబరీషలో' నారదుడుగా నరసింహారావు.

లాంటి సద్గుణాలు గల నాయకుడు సత్యం పాత్రను శ్రీ నరసింహారావు చాలా చక్కగా నిర్వ హించారు. నాయిక పాత్ర ధరించిన కృష్ణ కుమారితో కలిసి ఆయన "పాడిన పాటేనా, పాడరా ఓ తెలుగువాడా, పాడరా ఓ కలిమిరేడా" అన్న పాటలకు చూపిన భావ ప్రకటనం ఈనాటికి గూడా కళ్లకు కట్టినట్లు కన్పిస్తుంది.


కాలక్రమాన వల్లం పరిస్థితి దిగజారిపోయింది. ఒకనాడు ఉత్తమ నాయకపాత్రధారిగా అతణ్ణి ఆశీర్వదించిన లోకం ఈనాడు వల్లం నరసింహారా వంటే, ఎవరతను ? అని అడిగినా అడగొచ్చు.

"అంతా మనవాళ్లే" తరువాత "మాగోపి" చిత్రంలో వల్లం బలరాం పాత్ర ధరించారు. మొత్తంమీద ఆయన నటన మెచ్చుకోదగినట్లు గానే వుందని ప్రేక్షకులు అభిప్రాయపడ్డారు. కాని సారధివారి 'రోజులు మారాయి' చిత్రంతో నిజంగా వల్లం రోజులు మారినట్లే కన్పిస్తోంది. ఆ చిత్రంలో ఆయన ఎక్స్ట్రా పాత్రకన్న ఎక్కువ ప్రాముఖ్యంలేని గోపాలం పాత్రను ధరిం చారు.

క్రమక్రమంగా ఆయనకు లభిస్తున్న పాత్రల విలువ క్షీణించి కేవలం ప్రాముఖ్యంలేని పాత్రలు లభిస్తూ వచ్చాయి. "ఎత్తుకు పై యెత్తు, ఎం. ఎల్. ఎ." చిత్రాలలో ఆయనకు లభించిన పాత్రల విలువ పెద్దగా లేదు. కొన్నాళ్లు చిత్రరంగం మీద శ్రీ నరసింహారావు కనుపించనేలేదు. ఇటీవల శ్రీ రామావారి అంబరీషలోను, చంద్రికా ఫిలింస్ వారి కృష్ణరాయబారంలోను ఒకమాదిరి పాత్రలు లభిం చాయి. తనకిచ్చిన పాత్రను శాయశక్తుల ప్రయ త్నించి రసవత్తరంగా రూపొందించేందుకు ఆయన ఈనాడు కూడా కృషిచేస్తూనే ఉన్నారు.

ఒకనాటి నాయిక పాత్రధారికి ఈనాడు చిన్న వేషాలు లభిస్తున్నాయంటే నిజంగా ఈ నటుని ప్రతిభ విశేషాలు నిర్మాతలు గమనించటం లేదని తెలుస్తుంది.


శ్రీ నరసింహారావు కేవలం ఆడనేర్చినవాడే గాక పాడనేర్చినవాడు గూడా. చక్కని కంఠస్వరంతో వీనుల విందైన గానాన్ని అందించగలడు. రేడియో నాటికల్లోను, బుర్రకథల్లోను పాడి ఈయన శ్రోతలను రంజింపజేస్తూంటారు. ఈయన ప్రత్యేకంగా బుర్రకధలు చెప్తూవుంటారు. సీతా రామరాజు కధ, బొబ్బిలి లాంటి బుర్రకధలు రేడియోలలో వింటుంటేనే శ్రోతకు రస స్పందనం ఉంటుంది.



"అంతామనవాళ్ళే"లో కథానాయకుడుగా వల్లం.

నిర్దుష్టమైన ఉచ్చారణ, విస్పష్టభావ ప్రక టనాసామర్థ్యం తీయని కంఠంగల ఈ నటుని నిర్మాతలు సక్రమంగా వినియోగించుకోగలిగితే ఆంధ్ర చలనచిత్ర కళారంగానికి ఒక ప్రతిభా సంపన్నుడైన నటుడు లభిస్తాడు.

ప్రభుత్వం విధిస్తున్న నిర్బంధాలతో సత మత మవుతున్న నిర్మాతలు పెద్ద నటీనటులను తీసుకొని సరిగా నిర్వహించలేక చిత్రాలు విడుదల చేసిన వారంలోనే కాపీలు శరవేగంతో వెనక్కు వచ్చి సంస్థల పేర్లు మార్చే స్థితి ఏర్పడకుండా ఉండాలంటే చిరకాలంగా అజ్ఞాతంగా రం గంలో ఉంటున్న ప్రతిభావంతులకు సరైన స్థానం కల్పించి, కొత్త నటులకు ప్రవేశం చూపి సర్దుకుపోవాలి. ఈనాడు పెద్ద నటులు తమ తమ పాత్రలు వేలెత్తి చూపటానికి వీల్లేనంత సామ ర్థ్యంతో నిర్వహించినా చాలా చిత్రాలు విజయం పొందలేక పోతున్నాయి. ఇది నటుల లోపం కాదు. అనేక చిత్రాలలో నటించాల్సి రావడంవల్ల వారు ప్రయత్నించినా ఒక్కొక్క ప్పుడు పాత్రలు సక్రమంగా నిర్వహించలేక



"ఎత్తుకుపైయెత్తు"లో సి. యస్. ఆర్., వల్లం మొదలైనవారు.



సింధూర్ ఫిలిమ్స్ "ఎవరుదొంగ"లో బి. సరోజాదేవి నాట్య సన్నివేశం.

వల్లం నరసింహారావు

కొవచ్చు వారు హాజరైన సమయానికి, సన్నివేశానికి కావలసిన తదితర నటులూ హాజరు కాలేకపోయి షూటింగు వాయిదా పడటం దాని వల్ల నిర్మాతలకు అదనపు ఖర్చులు పెరగటం చివరి వరకు పని వారికి జీతా లిచ్చేనాటికి నిర్మాతలు ధనం చెల్లించలేకపోవటం లాంటి అవాంతరాలు ఏర్పడతాయి. ఇలాంటి అవాంతరా లను దాటాలంటే నిర్మాతలు అజ్ఞాతంగా ఉన్న నటీనటులను వెదక్క తప్పదు. ఇందువల్ల ఈ చిన్న నటుం కుండే బుక్కింగులు, తక్కువ. నటుడు తా లభించిన పాత్రపై నిశితంగా కృషిచేసి ఆ పాత్రకు న్యాయం చేకూర్చ గలుగు తాడు.

తన పాత్రకు న్యాయం చేకూర్చాలని ఆరాటపడే నటులలో శ్రీ వల్లం కూడా ఒకరు. యువ కుడు, సంస్కారం కలవాడు, ఇలాంటి నటుడు ఆయనకు లభించిన అవకాశం సద్విని యోగపర్చుకుంటా డనేందుకు సందేహంలేదు. కొత్తవారిమీద మోజుతో (తప్పేం లేదనుకోండి) గాలింపు మొదలుపెట్టే నిర్మాతలు వల్లం లాంటి ప్రతిభాసంపన్నులైన నటులకు అవకాశం కల్పించి వారిని పైకి తీసుకు రాగలిగితే ఎంతో హర్షించ దగ్గ విషయం.

అంతేగాక, వల్లం పాడగల్గినవా డవటంవల్ల నిర్మాతలు తాము నటించిన చిత్రాల్లో ఆయనే పాటలు పాడే అవకాశం కల్పించితే, సాధారణంగా తెరమీది ఆటగాడికి తెర లోపలి పాటగాడికి ఏర్పడే స్వర వైవిధ్యం కూడా తొలగిపోయే అవకాశం ఉంది.

ఈనాడు చిత్రజగతిలో ఎన్నో కొత్త సంస్థలు ఏర్పడుతున్నాయి. నవనవోన్మేషప్రతిభావంతులు, నవనవోద్రేక ప్రవాహ సంపన్నులు అయిన నిర్మాత లందరో వస్తున్నారు అన్ని రంగాల్లోను యువ కులు ముందంజ వేస్తున్నారు సహృదయులైన ఈనిర్మాత లందరు శ్రీ వల్లం నరసింహారావులాంటి ప్రతిభాసంపన్నులైన యువకనటులను ప్రోత్స హిస్తారని ఆశించవచ్చును

శ్రీ వల్లం నరసింహారావు అచిరకాలంలోనే ప్రధాన పాత్రలు నిర్వహించే ప్రతిభా సంపన్నులలో స్థానం ఏర్పరచుకోగలరని, ఆయన ప్రయత్నా లకు నిర్మాతలు తగిన దోహదం చేస్తారని ఆశి స్తున్నాం.

'నాగరాజ్' ★

వార్తా భరణం

"కనకదుర్గ పూజామహిమ చిత్రంతో కనకవర్షం కురిపించుకుని విశాలాంధ్ర జయపతాకా నెత్తిన వర్ధమాన దర్శకుడు విఠలాచార్య నిర్మిస్తున్న "వరలక్ష్మీవ్రతం" చిత్రం శరవేగంతో పూర్తవు తున్నట్లు వార్త ఈ చిత్రంలో కాంతారావు, రాజనాల, కృష్ణకుమారి, రమాదేవి, మిక్కిలినేని, బాలకృష్ణ, సత్యనారాయణ ప్రభృతులు నటిస్తున్నారు. రచన కృష్ణమూర్తి, సంగీతం · నాగేంద్ర, రాజేంద్ర.

* * *

భాస్కర్ ప్రొడక్షన్స్‌వారు 'మోహినీ రుక్మాంగదను' ప్రేక్షక జన సమ్మోహనకారిగా తయారు చేయాలని చిత్ర నిర్మాణం కొనసాగిస్తున్నారు. చిత్రం దాదాపు పూర్తి కావచ్చింది కె. యస్. ప్రకాశరావు దర్శకత్వం నిర్వహిస్తున్న ఈ చిత్రంలో జమున, కృష్ణకుమారి, బాలసరస్వతి, బాలయ్య కాంతారావు, రేలంగి, మిక్కిలినేని, వంగర తదితర్లు నటిస్తున్నారు సంగీతం : ఘంటసాల కథ, సంభాషణలు : డి. వి. నరసరాజు.

కొత్త సంస్థ విర్గో

శ్రీ కడారు వెంకటేశ్వరరావు 'విర్గో' అనే సంస్థ పేరుతో ఒక చిత్రాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే సెట్సుకు వెళ్ళనున్న ఈ చిత్రానికి కథ (స్క్రిప్టు) బి. యస్. చారి సంగీతం : అశ్వత్థామ, దర్శకుడు : పి. యస్. రావు.

విక్రమ్ స్టూడియోలో వర్ణచిత్రం

దర్శక—నిర్మాత శ్రీ బి. యస్ రంగా కన్నడ, తెలుగు భాషల్లో వర్ణ చిత్రాన్ని నిర్మించాలని సన్నాహాలు చేస్తున్నారు. "అమరశిల్పి జక్కన్న" అన్న పేరుతో నిర్మాణం కాబోయే ఈ ఈస్ట్‌మన్ వర్ణ చిత్రం వచ్చేనెల మూడవ వారంలో సెట్సుకు వెళ్తున్నట్లు కూడా తెలుస్తోంది.

ఈ చిత్ర నిర్మాణం శ్రీ రంగా స్వంత స్టుడియో "విక్రమ్"లో జరుగుతుంది.

* * *

సీతారామ కళ్యాణాన్ని శతారామ కళ్యాణ సదృశ్యంగా నిర్మించిన దిగ్విజయ సంస్థ నేషనల్ ఆర్ట్ థియేటర్స్‌వారు "గులేబకావళి" ఐతే రంజుగా తయారు చేస్తున్నారు. చిత్ర నిర్మాణం సాహిసి

(స్టూడియో)లో శర వాహినీ వేగంతో సాగుతోంది.

జనరంజకంగా తయారవుతున్న ఈ జానపద చిత్రంలో యన్. టి. రామారావు, ముక్కామల, రాజనాల, కె వి యస్ శర్మ, బాలకృష్ణ, పద్మనాభం, లంకాసత్యం, పేకేటి శివరావ్, ఋష్యేంద్రమణి, ఛాయాదేవి పి. హేమలత, నల్లరామ్మూర్తి ప్రభృతులు నటిస్తున్నారు. సంభాషణలు : సముద్రాల (జూనియర్) పాటలు : సి. నా. రెంగా ప్రసిద్ధి కెక్కిన పి. నారాయణరెడ్డి, ఛాయాగ్రహణం : వగాయిచ్

గారీకూపర్ అస్తమయం

30 సంవత్సరాలపాటు అవిచ్ఛిన్న ప్రతిభతో ప్రజల మన్ననలందుకొన్న ప్రఖ్యాత హాలివుడ్ చలన చిత్ర నటుడు గారీ (ఫ్రాంక్‌జేమ్స్) కూపర్ ఈనెల 13 వ తేదీన మరణించారు. ఈయన వయస్సు 60 సంవత్సరాలు. కొద్దికాలంగా పుట్ట కురుపు వ్యాధితో బాధపడుతున్నారు. ఈయన 7 మే 1901 న జన్మించారు

స్వర్గీయ కూపర్ తమ 18 వ ఏట హెలినాలోని వార్తా పత్రికలో వ్యంగ్య చిత్రకారుడుగా చేరారు. తరువాత ఎక్స్‌ట్రా వేషాలువేసి క్రమంగా చలన చిత్ర రంగంలో ప్రఖ్యాతి పొందారు.

ఆయన నటించిన చిత్రాలన్నిటికన్నా ప్రఖ్యాతి పొందింది: ది లైఫ్ ఆవ్ ఎ బెంగాల్ లాన్సర్". శ్రీ కూపర్‌కు రెండు చిత్రాల్లో ఉత్తమ నటనకు అకాడమీ బహుమతులు లభించాయి (సార్జెంట్ యార్క్ 1941, హైనూన్ 1952 అన్న చిత్రాలు) చిరస్మరణీయంగా అనేక పాత్రలు ధరించి నిర్వహించినందుకు ఆయనకు ప్రత్యేకంగా 1961లో ఆస్కార్ బహుమతి కూడా లభించింది

తమ జీవిత కాలంలో శ్రీకూపర్ ఫేర్‌వెల్. టు ఆరమ్స్, ఫర్‌హూమ్ ది బెల్‌టోల్స్, లైఫ్ ఆఫ్ ది బెంగాల్ లాన్సర్, ది వెస్టర్నర్, ది ప్రైడ్ ఆవ్ ది యాంకీస్" లాంటి ఉత్తమ చిత్రాల్లో నటించారు.

ఆయన మరణ సమయంలో భార్య వెరోనికా, కుమార్తె మేరియా, గృహ వైద్యుడు దగ్గర వున్నారు.



గారీ కూపర్.



శ్రీ కృష్ణ బాలాజీ ఫిలిమ్సు "మదనమంజరి"లో కమ్మా.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవం

అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ఈ సంవత్సరం భారతదేశంలోని నాలుగు ముఖ్య కేంద్రాల్లో జరుగుతుంది. అక్టోబరు 27 నుండి నవంబరు 17 వరకు ఈ చిత్రోత్సవాలు న్యూఢిల్లీ, కలకత్తా, మద్రాసు, బొంబాయిల్లో జరుగుతాయి.

మద్రాసులో ఈ చిత్రోత్సవాలు నవంబరు 6 నుండి 12 వరకు జరుగుతాయి ఇందులో కథా చిత్రాలు, వైజ్ఞానిక, విద్యా విషయిక చిత్రాలు కార్టూన్ చిత్రాలు ప్రదర్శనలు జరుగుతాయి.

తెలుగు సాంఘిక చిత్రం

జయరాం ప్రొడక్షన్ అనే కొత్త సంస్థ ఒక సాంఘిక చిత్రం తీయాలని సంకల్పిస్తోంది. దర్శక నిర్మాత శ్రీ కె వి రెడ్డి ఇటీవల వాహినీ స్టూడియోలో కెమెరాకు స్విచ్ ఆన్‌చేసి ప్రారంభోత్సవం జరిపారు

కథ, పాటలు, మాటలు : బైరాగి, సంగీతం : టి వి రాజు, ఛాయాగ్రహణం : జానకిరామ్, దర్శకత్వం : ఎ రంగారావు

ఈ చిత్రంలో యన్ టి రామారావు, సి. యస్. ఆర్ రేలంగి, పి బి ఆనంద్, గిరిజ, హేమలత, కుటుంబరావు నటిస్తున్నారు నిర్మాత శ్రీ జయరాంరెడ్డి కళా దర్శకత్వం నిర్వహించగలరని తెలుస్తోంది

తర్జుమా చిత్రాలకు ముడిఫిల్మ్

ఒక భాషలో చిత్రం విజయం పొందితేనేతప్ప ఆ చిత్రాన్ని ఇంకొక భాషలోకి తర్జుమా చేసే ప్రయత్నంకు ముడి ఫిల్మ్ కేటాయించటం జరగదని ముడి ఫిల్ము కమిటీ ఇటీవల ఒక తీర్మానంలో పేర్కొంది.

ఏదైనా ఒక చిత్రాన్ని ఇంకో భాషలోకి తర్జుమా చేయాలంటే, ముడి ఫిల్మ్ కేటాయింపు ఆ చిత్రం



సుప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు, నిర్మాత శ్రీ కడారు నాగభూషణం తమ కుమార్తె చి|| సౌ|| కృష్ణవేణిని, పి. డబ్ల్యు. డి. ఇంజనీరు శ్రీ బి. సత్యనారాయణకిచ్చి ఇటీవల వివాహమహోత్సవం జరిపారు.



శ్రీ కడారు నాగభూషణం శ్రీమతి పి. కన్నాంబ ఇటీవల త్యాగరాయనగరులో తమ నూతన గృహప్రవేశ ఉత్సవం జరుపుకున్నారు.

వార్తాభరణం

అసలు భాషలో విజయం పొందితేనే తప్ప సాధ్యం కాదు దిగుమతులపై విధించిన కోతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని కూడా తమ ప్రకటలో ఈ కమిటీ పేర్కొంది.

విశ్వకవి రవీంద్రునిపై సోవియట్ చలనచిత్రద్వయం

విశ్వకవి రవీంద్రుని జీవితం ఆధారంగా శ్రీ సాముయెల్ బుబ్రిక్ దర్శకత్వం వహించి నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రం 'రవీంద్రనాథటాగూర్' మాస్కోలో విడుదలైంది. 'రష్యాలో రవీంద్రుడు' అన్న చిత్రం త్వరలో విడుదల కాబోతోంది.

స్టూడియో నిర్మాణంలో ప్రభుత్వ సహాకారం

బెంగుళూరులో అధునాతన పరికరాలతో ఒక ఫిల్మ్ స్టూడియో నెలకొల్పే విషయం పరిశీలించ వలసిందిగా మైసూరు ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘంలో నియుక్తులయ్యే వ్యక్తులు వారి పదవీ పరిమితి మున్నగు విషయాలు త్వరలోనే నిర్ణయిస్తామని మైసూరు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బి. డి జెట్టీ సంపూర్ణ రామాయణ నాటక ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరుపుతూ వెల్లడించారు.

స్వయంపరీక్షాపద్ధతి: చిత్రవాణిజ్యమండలి ఆమోదం

చలన చిత్రాలకు ప్రదర్శనానుమతులివ్వటంపట్ల సెన్సారు అధికారులు అమలు జరుపుతున్న తీవ్ర చర్యలగూర్చి దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి ఇటీవల చర్చ జరిపింది. సంస్థ అధ్యక్షులు శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. చర్చల అనంతరం మండలి, స్వయం సెన్సారు పద్ధతి అమలు సంఘంకు 12 మంది సభ్యులను ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు శ్రీ నాగిరెడ్డి ప్రసంగిస్తూ, "సెన్సారు అధికారులు చాలా ఇబ్బంది పెడుతున్నారని చెప్పలేం. అంతమాత్రం చేత వాళ్ళు చేసే ప్రతి పనీ మనం న్యాయమనీ అనలేం" అని చెప్పారు

దక్షిణ భారత చిత్రాలు కత్తిరింపులవల్ల చాల తక్కువ బాధపడ్డాయి మన చిత్రాల్లో కత్తిరింపులు కేవలం రాజకీయ,వర్ణ ప్రాతిపదికలపైన జరిగినవే"

"మన కన్న అన్ని విషయాల్లోనూ బొంబాయిది ముందడుగుగావుంది మనమూ ఢిల్లీ వెళ్ళి బొంబాయి సభ్యులతోపాటుగా మన వాదనను వివరించటం అవసరమేమో నిశ్చయించుకోవాలి" అని కూడా సూచించారు.

డైరెక్టర్ శ్రీ వి. శ్రీనివాసన్ ప్రసంగిస్తూ శ్రీమతి లీలావతీ మున్షి (ఫిల్ములపట్ల) ఆచార్య వినోబా భావే (పోస్టర్లపట్ల) ఆందోళన సాగించిన తరువాతనే సెన్సారు నిబంధనలు జటిలమయ్యాయని అన్నారు. ఇప్పుడు రాబోయే స్వయం పరీక్షా పద్ధతికి నిర్మాతలందరు లోబడాలని కోరుతూ సభవారు తీర్మానించారు.



రాజలక్ష్మి పిక్చర్సు "విప్లవవీరుడు" లో ఎం. ఎస్. రాజం.

హరివంశము

సాందీపనిపర్వం - 16

ఆ మరునాడు భగవంతుడు సాగ్రజుడై కాశికి బయలుదేరినాడు మధురయంతయు నాడు వారిని సాగనంపుటకు సాలంకృతమై వచ్చినది మహారాజు ఉగ్రసేనుడు ఉత్తమ సూతులను నియోగించి వారి ప్రయాణమునకు రథములను ఆయత్తము చేయించినాడు. సూతులలో ప్రతి ఒక్కరు తాము రథమును తోలెదమన్న తాము రథమును తోలెదమని అహమహమికలు పడినారు దారుకుడు కుర్రవాడు రథమును తోలుటకు వయస్సు చాలదు కాని వాని సంబరమునకు అంతులేదు హడును ముందునకు వచ్చి, ఆ అందరిలో తాను శ్రీ కృష్ణదేవుని రథమునకు సారథిని అగుదును అన్నాడు అందరును నవ్వినారు. "ఓరి! దారుక! నీవు కుర్రవాడవు ముక్కుపచ్చలు ఇంకను ఆరలేదు రథమును నీవు తోలుటయేమిటి? గుర్రములు నీ మాట వినునా? నీకు అశ్వహృదయము తెలియునా ! రథమును తోలుటయందు నేర్పరివా! మరి ప్రయాణము దగ్గరయా! దాపా ! దుర్గమారణ్యములను దాటి నదులనుదాటి పర్వతములను దాటి, బహు రాజ్యములమీదుగా కాశికి పోవలసియున్నది ఈపని చేయుటకు నీవు వలతివా?" అన్నారు మందలించినారు దారుకుని తండ్రి, వృద్ధసూతుడు, పుత్రుని ఆ ఉబలాటమును చూచి సంతోషించినాడు విచారించినాడు కుర్రవానిని అనునయించినాడు బుజ్జగించినాడు వాడు వినలేదు "నేను శ్రీ కృష్ణదేవుని రథమునకు సారథి కావలయును" అన్నాడు. ఆ తండ్రికి ఏమియు తోచలేదు. "నేను మహారాజుతో ఈ విషయమును మాట్లాడి వచ్చెదను" అన్నాడు "నీవు మహారాజుతో మాట్లాడవలయు నవసరములేదు నేను శ్రీ కృష్ణదేవునితో మాట్లాడెదను ఆయన నన్ను కాదనరు" అన్నాడు దారుకుడు. సూతులందరును వగులపడి నవ్వినారు తండ్రి కుర్రవానిని ఓరగా చూచినాడు తక్కుంగల సూతులన్నారు. "ఓరి దారుక! శ్రీ కృష్ణదేవునితో మాట్లాడిరారా!" దారుకుడు వారి వంక చూచినాడు వాని కన్నులు నవ్వుచున్నవి వాని మనస్సు ఉత్సాహముతో తొణికిసలాడుచున్నది వాడు వసుదేవుని గృహముల దిక్కు పరుగున పోయినాడు సూతులందరును వాని వంక ఆశ్చర్యసూచి ముఖారవిందులై చూచినారు

దారుకుడు వసుదేవుని గృహములను చేరగా, దౌవారికులు వానిని వారించినారు. "ఓరి సూతపటుక ! ఎచ్చటకురా పోవుచున్నావు !" అన్నారు. "నేను స్వామిని చూడవలయును నేను స్వామి రథమును తోలవలయును" అన్నాడు దారుకుడు వారికి నవ్వైనది "స్వామిని చూచుటయేమిటి? రథమును తోలుట ఏమిటి ?" అన్నారు దౌవారికులు. "అవును! నేడు స్వామి కాశికి పోవుచున్నాడు. నేనును కాశికి పోయెదను. స్వామి రథమును తోలెదను" అన్నాడు దారుకుడు వారు మరియు నవ్వినారు. కుర్రవానిని చూడగా వారికి ముద్దైనది. వారు వానిని లోపలకు పోనిచ్చినారు

లోపల శ్రీ కృష్ణదేవుడును, బలరాముడును ప్రయాణసన్నాహము నందు నిమగ్నులై వున్నారు రోహిణీదేవి స్వయముగా వచ్చి వారికి ప్రయాణమునకు వలయు సామాగ్రులను సర్దుచున్నది. మరియు ఉద్ధవుడు ఆదిగాగలదు కుమారులనుగూడా వారి తల్లి దండ్రులు విద్యాభ్యాసము నిమిత్తము కాశికి పంపగా నిశ్చయించినారు వారును తమబిడ్డలతో వసుదేవుని ఇండ్లకు వచ్చినారు. మహారాజు ఉగ్రసేనుడు స్వయముగా ఉత్తమబ్రాహ్మణులచేత ప్రయాణ ముహూర్తమును నిశ్చయింపజేసి, యదుకుమారులను ప్రయాణమునకు సన్నాహము చేయుటలో నిమగ్నుడై వున్నాడు మధురయందలి యాదవ రాజలోకము అంతయు అప్పుడు అక్కడ ఉన్నది దారుకుడు వచ్చిన ఆ రాకను ఈ సందడిలో ఎవ్వరును గమనించలేదు ఒక్క శ్రీ కృష్ణదేవుడు మాత్రము ఓరగన్నులతో వాని రాకను గమనించి "దారుక! ఏదియో పనిమీద వచ్చినట్లు వున్నావు!" అన్నాడు

అప్పుడు అందరుమ దారుకుని చూచినారు. దారుకుడు మాటాడలేకపోయినాడు "స్వామి! స్వామి!" అన్నాడు. భగవంతుతునకు నవ్వు వచ్చినది "ఏమి! దారుక! ఏమిటి స్వామి!" అన్నాడు దారుకునకును నవ్వు వచ్చినది. ధైర్యమును వచ్చినది. "స్వామి! నేను తమకు సారథిని. మీ రథమును నేను తోలెదను" అన్నాడు అందరుమ వాని వంక ఆశ్చర్యముతో చూచినారు. "ఏడేమి! వీని వయస్సేమి! వీడు రథమును తోలుటయేమి! ఎక్కడికి! కాశికా!" అనుకున్నారు భగవంతు డేమియనునో వారికి తెలియదు దారుకునకును తెలియదు. అంతలో మహారాజు ఉగ్రసేను డద్దమువచ్చి "దారుక! ఈ రథమును మీ నాయన తోలును. నీవును అతనితో కాశికి పోవుదువుగాని" అన్నాడు.

దారుకుని కన్నులలో అయిష్టము తోచినది. కాదు ! నేనే రథమును తోలవలయును అన్న దీక్ష పొడగట్టినది. "మహారాజ! నేను పసివాడనని మీ అభిప్రాయమువలె వున్నది. స్వామికి ఎంత వయస్సు, నాకును అంతియ వయస్సు" అన్నాడు

భగవంతుడు అనినాడు: "అవును! అవును! దారుక! రథమును ఆయత్తము చెయ్యి. ఇంద్రునకు మాతలి యట్లు! నీవు, దారుకుడవు, నాకు సారథివి"

దారుకుడు అనిమిషుడై భగవంతునియందు బద్ధదృష్టియైనాడు. నిలువెల్లను ఆనందమేలయి నిలబడినాడు.

రోహిణి అన్నది: దారుక! "తండ్రి అన్నమాటలు విన్పించలేదా! ప్రయాణమునకు సమయము మించిపోవుచున్నది. రథమును ఆయత్తముచేసి తీసికొనిరా!"

ఘోరమైన తపస్సుచేసి ద్రుహిణుని వరమును పొందిన ఋషినిపోలి దారుకుడు మేలుకున్నాడు. "అవును! తల్లి! నేను శ్రీ కృష్ణస్వామికి సారథిని అవును! తల్లి! నేను దారుకుడను అవును తల్లి! నేను మాతలికన్న అధికుడను స్వామి! రథము ఆయత్తముచేసి తీసికొని వచ్చెదను. నాల్గు హయములనుపూన్చి తెచ్చెదను దారుకుడు పసివాడని అందరు అనుచున్నారు మాతలిని మించినవాడని ఈ అందరిచేతను అనిపించెదను"

దారుకుడు కదిలిపోయినాడు అందరును శ్రీ కృష్ణుని దిక్కు చూచినారు దేవకి అన్నది. "తండ్రీ దారుకుడు పసివాడు వాడు రథమునకు సారథ్యము వహించగలడా!" భగవంతుడు మందహాసము చేసినాడు "తల్లీ! దారుకుడు జన్మ చేతనే నాకు రథసారథి వానికి అశ్వహృదయము తెలిసినట్లు మరి ఒక్కనికి తెలియదు రథమును నడుపుటయందు వానికి వుండిన నైపుణ్యము అనితరసాధ్యము. నేను పరీక్షచేసి చూచినానుకదా!" తరువాత మరి యెవ్వరూ మాటలాడలేదు

అంతలో వాకిటిలో రథము నిల్చినది మేఘములనుపోని నాల్గు గుఱ్ఱములను పూన్చిన రథముతో దారుకుడు వాకిట నిల్చినాడు వాని రథముతో మరికొన్ని రథములుగూడ ఆయత్తములై వచ్చినవి. మధురలో సూతులందరికి ఇదియే విచిత్రమైనది వారు ఎప్పుడును వృద్ధసూతుని పుత్రుడు, దారుకుడు, రథమును కట్టగా చూచినది లేదు. రథమును నడిపించగా చూడలేదు మరి ఈ క్షణములో వాడు గుఱ్ఱములను మాలిమి చేసిన పద్ధతి, రథమునకు వానిని పూన్చుటలో చూపిన చాకచక్యము, రథశాలనుండి ఆ రథమును వసుదేవుల ఇండ్లకు తోలుకొని వచ్చిన వైఖరి సర్వము, వానియందలి రథ సారథికమైన పుష్కల పాండిత్యమును చాటుచున్నవి. వీడు ఇంతటి పండితు డెట్లయ్యెను! తక్కుంగల సూతులు వృద్ధ సూతుని ప్రశ్నించిరి ఆయనకును ఆ సంగతి తెలియదు. తాను ఇంటిలో వానికి ఈ విద్యను గూర్చి అంతగా చెప్పినదియులేదు ఇప్పుడు తన పుత్రుని ఈ వైదగ్ధిని చూడగా, వృద్ధసూతుని హృదయము పుత్రప్రేమతో, ప్రేమతోగూడిన గర్వముతో, సహజమైన ఆ పుత్రుని పాండిత్యమును చూడగా కల్గిన విస్మయముతో నిండిపోయినది. ఆయన తక్కుంగల సూతులను చూచి అనినాడు: "ఇది యేమియో నాకు తెలియదు. ఇది పూర్వ జన్మలయందలి పుణ్యము యొక్క పరిపాకము అనుకొందును."

"దారుకా!"

మేఘగంభీరమైన ఆ సంబోధనమును విని దారుకుడు కోలతో గుఱ్ఱములను మెల్లగా, ఒడుపుగా తాకినాడు గుఱ్ఱములు విచిత్ర చంక్రమణ [illegible] తక్కిన రథము

లను తప్పించుకొనుచు, కదలు లాడినవి రథము శ్రీ కృష్ణదేవునిముందు ఆగినది

"స్వామి! రథము సిద్ధముగా నున్నది ప్రభువులు అధిరోహించవచ్చును"

శ్రీ కృష్ణదేవుడు ముందు హయములను తనిశీలనచేసినాడు. రథమును పరామర్శించినాడు. అనంతరము రథమును అధిరోహించినాడు బలరాముడును శ్రీ కృష్ణదేవునితోపాటు రథమును ఎక్కినాడు సకల యాదవులును తమ తమ రథములను అధిరోహించినారు వృద్ధసూతుడు రథమును తీసికొనిరాగా, వసుదేవుడు దేవకితో రోహిణితో ఆ రథమును అధిరోహించినాడు. ఉగ్రసేనుని రథమును వచ్చినది. ఆయన ఆ రథమును ఎక్కివన్నాడు "దారుకా! ఆ నీ రథమును ఇటు రానీయుమురా! నేను బిడ్డలతో అంతదాక ప్రయాణము చేసెదను మరి నీన్నై పుణ్యమును పరిశీలన చేసెదను" అన్నాడు. దారుకుడు గుఱ్ఱములను పగ్గములతో అదలించగా అవి యజమాని హృదయమును ఎరిగినవివోలె ముందుకు కదిలినవి. వాని నడిపించిన చొప్పున నడచినవి ఉగ్రసేనునిముందటికివచ్చి ఆగినవి ఆయన రథమును అధిరోహించినాడు రథములన్నియు కదిలినవి యమునను అంటి కొంత దూరము నడచినవి. పట్టణపు పొలిమేరల దరి దాపులలో రథములు తిరిగి ఆగినవి. మధుర అంతయు శ్రీ కృష్ణదేవుని సాగనంపుటకు అచ్చటకు వచ్చి వాలినవి వసుదేవుడు తన రథమును శ్రీ కృష్ణదేవుని రథము వెనుకనే పోనిమ్మనెను వృద్ధసూతుడు ఆ రథమును అట్టులనే నడిపెను రథములు అగగా ఆయన శ్రీ కృష్ణదేవుని సంబోధించి, బలరామదేవుని సంబోధించి "తండ్రులు! మీకు ప్రయాణము సుఖము అవుతుంది గాక! ఇడుగో అంధకుడు, ఇతనిని గూడ మీతో వారణాసివరకును పంపుచున్నాను మిమ్ములను అక్కడదింపి, ఆయన తిరిగివచ్చును గురువులయందు భక్తితో విద్యను అభ్యసించవలయునుసుమా! మరి కాశియన్న నీ మాన్యముకాదు. పరమశివుడు కాశికి వచ్చిన యందరిని పట్టిచూచును. భగవంతుడైన బాదరాయణుకే ఆపరీక్ష తప్పలేదు. మీరు ఏమరి వుండకూడదు" అన్నాడు.

వసుదేవుని ఇంగితమును ఎరిగినదిపోలె రోహిణి అన్నది: "తండ్రులు! మీ నాయనకు అన్నియు అనుమానములు పరమ శివుడు బాదరాయణుని పరీక్షచేసెనుగాని, మిమ్ములను ఎందుకు పరీక్షచేయును ఆర్యపుత్ర! పిల్లలను దీవించండి"

వసుదేవుడు నేత్రములతో త్రావుచున్నట్లు తన బిడ్డలవైపు చూచుకున్నాడు. ఆయనకు వారిని వదిలిపెట్టి వుండటము కష్టముగా వున్నది. దేవకికి గూడా అటులనే వున్నది కాని వారు విద్యాభ్యాసమునకుగా పోవుచున్నారు వారిని వారించుట ఎట్లు! వారించుట యుమనదే ఇక్కడలేదు ఎక్కడి మధుర! ఎక్కడి కాశి! వసుదేవుడు తన బిడ్డలతో అన్నాడు 'నాయనా! కాశిలో డుంఠివిఘ్నేశు ఉన్నాడు. కాలభైరవుడు వున్నాడు. లోలార్కదేవుడు వున్నాడు. విశ్వేశ్వర శ్రీ మన్మహాదేవుడు వున్నాడు తల్లి అన్నపూర్ణాదేవి వున్నది. అడిగితే అన్నం లేదనదు ఆ తల్లి. తండ్రి! ఒక్కొక్క రోజున ఆ తల్లియు, ఆ తండ్రియు, తమ బిడ్డలను పరీక్ష చేస్తారు. బాదరాయణదేవుణ్ణి అట్లా పరీక్షచేశారు. భగవంతుడు ధరాతలం అఖిలము తీర్థయాత్రలకుగా క్రుమ్మరిలుతూ అవిముక్తం చేరుకున్నాడయ్యా! సమధికులు జైమిని, పైలుడు, సుమంతుడు ఆదిగాగల శిష్యవర్గం అంతా గూడా ఆయనతో వున్నది. ఏమి శకునమున వారు అక్కడికి వచ్చారో! ఏడు రోజులు వారికి ఆ మహా పట్టణంలో, ఆ ఆనందకాననంలో, భిక్ష వేసినవారులేరు. "భిక్షాందేహి" అని అడిగితే, పట్టెడన్నము పెట్టినవారు లేరు వారణాసీ క్షేత్రంలో వ్యాస భగవంతునికి భిక్ష కరవైపోయింది వైశంపాయనుడు సుడివడిపోయినాడు. సుమంతుడు వాడిపోయినాడు. పైల జైమినులు క్లేశం పొందినారు దేవలుడు దుఃఖించినాడు. దాల్భ్యుడు ఆశాంతములు చూచినాడు. కాశిపట్టణ విప్రవాటికలలో వారికి భిక్షాలబ్ధి లేకపోయింది. ఉదరాగ్నిక్షుధాక్షోభచే వాళ్ళు బిట్టు ఉడికిపోయినారు. ఏడునాళ్ళు కాశిలో బాదరాయణుడు, ఆయనశిష్యులు నిట్టుపవాసం చేసినారు. ఆ ఏడవనాడు భగవంతునికి భరించరానిదైపోయింది. తాను సరే! తన శిష్యులు ఎట్టి బాధపడుతున్నారు ఆరోజున గూడా ఆయన శిష్యులతో భిక్షకు బయలుదేరినాడు. ఏ యింటికి పోయినాలేదు; నడువుడు; పొండు; కూడదు. అనెడి నిషేధవాక్యాలేగాని, పట్టెడన్నము పెట్టినవారు కన్పించలేదు ఆయనకు వినువు పుట్టింది. వేసరిపోయినాడు బవిసిమాలినాడు ఆరట పొందినాడు సొలసినాడు. తూలినాడు దూపటిల్లినాడు తనకే ఇట్లా వుంటే, తన శిష్యులకు ఎట్లా వుంటుంది! ఆయనకు క్రోధం ఉద్భవించింది కుక్షిప్రోద్భవ నిష్ఠురక్షుధిత దుష్ప్రోద్ధాంధకారంచేత అక్షులు రెండును చిమ్మ చీకటులు క్రమ్మినాయి ఆయనలో ఉద్రేకం రెచ్చిపోయింది. ఉద్రేకించి భిక్షాపాత్రాన్ని హట్టమునవున్న రాతిపై శతధా భిన్నంగా పగులవైచినాడు ప్రేక్షచ్ఛాత్రులు భయపడిపోయినారు భగవంతుని కోపం తగ్గలేదు ఆయన కాశిని శపించగా పూనినాడు హస్తంబున మణికర్ణికా జలంబులు ధరించి "మాభూత్ త్రైపూరుషీ విద్యా; మాభూత్ త్రైపూరుషం ధనం; మాభూత్ త్రైపూరుషీభక్తిః; కాశ్యాం నివసతాంసదా!" అని శాపిద్దామనుకున్నాడు. కాని చెయ్యి వణుకుతుంది. జలం వదులుదామంటే చెయ్యి ఆడటంలేదు. ఆ పరిస్థితిలో కాశికానగర సోమవీధికా మధ్యంలో ఒక మచ్చకంటి, పంచాశద్వర్షదేశీయ, పలిత సారమ్మైన వేణికాభారంతో,కంకణఝణఝణత్కారంతోరముగా ఆయనముందు నిలిచి, కలమధుర వీణా క్వాణపాటంధమమ్మైన ఎలుగుతో, "ఓయి! బ్రాహ్మణుడా! ఇట్లారా! ఆశాపం ఇస్తానంటావు ఏమిటి? భిక్ష లేదని ఇంతటి కోపంచేస్తున్నావు నీ పేరు ఏమన్నావు! వ్యాసుడా! సరిసరి! నీవు వ్యాసుడవా! బాదరాయణుడవా! మాకు కావలసినవాడవేనే! చూడు ఇది ఆలోచించావు? గ్రామం ఈచిలకంతుని దట; ఆయన అడపా దడపా భక్తులను ఇట్లా పరీక్షచేస్తూ వుంటాడుట! అది ఇదియేమో ఆలోచించుకొన్నావు ? అయినా అవి అన్నీ నాకు ఎందుకు? మా ఇంటాయన ముదుసలి. అతిధుల కోసం కూర్చున్నాడు. నీవు, వ్యాసుడవు, కన్పించినావు. నాకు కావలసింది ఏమి వుంది. వీరు నీ శిష్యులా! పెద్దవాడవే! స్నానం చేసి, నీ శిష్యులతోగూడారా! మా ఆయన కాచుకు కూర్చుంటారు" అన్నది. వ్యాసునికి ఆమెమాటలు అమృతంలాగా వున్నాయి. ఏడురోజులుగా కాశి కావాటంలో ఆ అన్నం పెడతామన్న మాట విన్పించలేదు

"తల్లీ! నీవు చల్లని తల్లివి. ఇదిగో వియల్లోకకల్లోలినిలో స్నానంచేసి వస్తున్నాము" అన్నాడు బాదరాయణుడు స్నానంచేసి తాను ఏ వెలదుకతో ఎక్కడ మాట్లాడినాడో, ఆ యింటికి శిష్యులతోగూడా చక్కా వచ్చినాడు. ఆ ముదసలి ముత్తైదువ వచ్చి వారిని లోపలకు తీసుకుపోయింది పీటలువేసి కూర్చోపెట్టింది. లేత అరటియాకులు ఆ పీటలముందు వేయించింది. కాశిలోని బ్రాహ్మణపురంధ్రులంతా ఆరోజున అక్కడ వడ్డనకు వచ్చినట్లు బాదరాయణుడు భావించినాడు అంతలో తొలి ముత్తైదువవచ్చి అతిధులను గంధ పుష్పాక్షతములతో అర్చించింది కాలాగరు ధూపములతో ధూపం ఇచ్చింది. కప్పురముతో నివాళించింది. ఒక్క వ్యాసుడు వ్యాసశిష్యులేనా అతిధులు? ఇంకా చాల మంది వున్నారు. పంక్తులుగా కూర్చున్నారు. పంక్తిపంక్తికివచ్చి ఆ యమ బ్రాహ్మణులను ఆరాధించింది కాని విస్తరిలో అన్నములేదు. ఇది యేమా? అనుకున్నాడు బాదరాయణుడు.

బ్రాహ్మణపురంధ్రులు వచ్చి అభికరిస్తున్నారు. ఇంకోమూలనుంచి ఆపోశనములు పట్టండి అంటున్నారు. ముసలి ముత్తైదువు "అయ్యా! మీకు ప్రొద్దుపోయింది. ఇక అమృతమస్తు అనండి అడుగో లోపల మావారు నైవేద్యము పెట్టినారు" అన్నది. వ్యాసుడు భగవంతుడా! ఆయనకే ఇది అంతయు అయోమయముగా నున్నది అంతలో విచిత్రము జరిగినది, తండ్రీ! విచిత్రము జరిగినది

ఆ ముత్తైదువ వ్యాసునివద్దకువచ్చి "నాయనా! పారాశర్య! ఇదిగో! ఆ పోశనము! ఇన్నినాళ్ళకు నాకు ఉత్తమబ్రాహ్మణుడవు దొరికినావు" అన్నది. ఆపోశనము వడ్డించినది ఆమె ఆ ఆపోశనము వడ్డించినదో! తండ్రి! అన్ని పత్రపాత్రీమధ్యమున వంటకములు; ఓగిరములు; దివ్యాన్నములు; షడ్రసోపేమాగ్రిరుచిమత్ పదార్థచయములు ? వ్యాసునకు ఆశ్చర్యమైనది అప్పుడు ఆయనకు అర్థమైనది ఆయమ ఎవ్వరు? తండ్రీ! ఆమె మన కాశకీదేవి! ఆమె, తండ్రీ! విశాలాక్షి! కృష్ణా! రామా! ఆమె అన్నపూర్ణ వంచిన తల ఎత్తకనే వ్యాసుడు భోజనమును ముగించినాడు. ఆ తరువాత పరమ శివుడు వ్యాసుణ్ణి, భగవంతుణ్ణి, ఎంతగా మందలించినాడు! ఎంతగా దూషించినాడు కాశిమీద వ్యాసునకు కోపమా ! ఓరి ! నీవారముష్టింపచా! బహుసంహితావృధా పాఠపఠన కైవల్యకల్యాణ ఘంటాపథమైన కాశికాపురముమీద నటరా నీ అలుక ! ఇంతమాత్రవు ఆకలినే జయించలేనివాడవు, లోపలి శత్రువులను ఎట్లా జయించగల్గుతావురా! మరివేత్తవు నీవే ఇట్లా అయితే, ఇంకా ధర్మం ఏమి అవుతుంది? ఇది మా పరీక్షరా! ఓరి! యోజనగంధి ప్రథమ పుత్ర! అన్నపూర్ణదయవలన బ్రతికిపోయినావు." అన్నాడు వ్యాసుడు అక్కడ గూడ ఒంచిన తల ఎత్తలేదు. తండ్రీ! పరమ శివుని పరీక్షలు ఇట్లావుంటాయి. కాశియెడల ఎట్టి అపచారము చేయరాదుసుమా! జాగ్రత్త! ఓయి! అంధక! బిడ్డలతో నీవుగూడ వారణాసికి పో! అక్క త

వారిని దింపిరా!"

ంోహిణి అన్నది "స్వామి! అయినదా కుర్ర లక బోధించడము ఇక దీవించండి"

వసుదేవుడు నవ్వినాడు "రోహిణి" నీవు ముందు దీవించు. నీవు బిడ్డలకు ప్రథమ గురువవు" అన్నాడు

ఉగ్రసేనుడు అన్నాడు 'మీరు ఆగండి నేను పెద్దను నేను బిడ్డలను ముందు దీవిస్తాను"

హరివంశము

ఉగ్రసేనునకు రామకృష్ణులు సాష్టాంగముగా నమస్కారము చేసినారు తల్లిదండ్రులకు ప్రణామములు ఆచరించినారు వారి దీవనలను అందుకొన్నారు

రామకృష్ణులతో ఉద్ధవాది యాదవకుమారులతో రథములు యమునఒడ్డున అంటి ప్రయాగముఖమై బయలుదేరినవి.

అంధకుడును వారితో బయలుదేరి పోయినాడు ఉగ్రసేనాది యదువృద్ధులు, తక్కుంగల సాధురులు, ఇండ్లముఖముపట్టినారు

దారుకుడు హయములను అదలించగా, వాని కంఠములు చేసిన ధ్వని యమునా జలములలోని చల్లనితనమును పోసుకొన్న గాలిమీదుగా తేలి వచ్చి, మధురయంతటా విన్పించినది ★

క్రికెట్టూ — క్రీగంటి చూపులూ

(10 వ పేజీ తరువాయి)

'అలా అనకండి. రోజులు మంచివికావు. ప్రతి క్షణం అనుకోని ప్రమాదంతో నిండివుంది. ఖూనీలు, దారి దోపిడీలు ఇవి రోజు రోజుకీ ఎక్కువవుతున్నాయి. అందుకు ఓ కారణమంటూ అవసరం లేదు..'

'మీకు పుణ్యం ఉంటుంది మీరు మరీ భయపెట్టేస్తున్నారు'

'నో .... నో ... అలాంటిదేం లేదు. బండి పావుగంటలో వస్తుంది. అలా ముందుకు పోదాం'

గిరి వెనక, ఆమె ముందు నడిచారు

'హరి అదృష్టవంతుడు' అనుకున్నాడు ఆమెను చూశాక. అందంతోబాటు నడకలో చిత్రమైన ఆకర్షణ కవులు వర్ణించినట్లు 'గజగమన', 'హంసగమన' కాక 'మరేదో' లీరుగా ఉంది

'ఆరెంజ్ తాగుతారా ?' అనడిగాడు రెస్టారెంట్ దగ్గరకు రాగానే

ఆమె వద్దంటూనే తీసుకుంది.

'మీ పేరు అడగలేదు సుమండి ....'

'గౌరి .... ఆయన రాయనేలేదా ?'

ఇద్దరూ వెయిటింగ్‌రూంలో కూర్చున్నారు. బండి వచ్చేందుకు పది నిముషా లుంది.

'మీకు క్రికెట్ అంటే అమితమైన ....' అని వవ్వేసింది గౌరి

గిరి, తను గిరంత ఎత్తున నిలబడి భూమ్మీద మనుషుల్ని చీమల్లా చూసినట్టు వూహించుకున్నాడు.

'అభిమానం ... కాదు . ఓ పిచ్చి హరి చెప్పే ఉంటాడు కంపెనీ తరఫున ఫైనల్సు ఆడేందుకు వెడుతున్నాను నన్ను నేను స్తుతించుకోటం బాగుండదు కాని 'నువ్వు మన జట్టుకు వెన్నెముకలాంటి వాడి' వని మేనేజరే అన్నారు'

గౌరి ఆశ్చర్యపడుతున్నట్లు రెండుసార్లు కనురెప్పలు 'టపటప' లాడించి, పిదప పెదవి విరిచి, 'మిమ్మల్ని నిరుత్సాహ పరుస్తున్నా ననుకోకండి అయినా ఈ ఆటలో ఏముందండి ? నిముషానికో బంతి విసరటం—బాట్‌తో దాన్ని ఆపటం రోజంతా ఎండలో మలమల మాడటం అంతకు మించి మిగిలిం దేముంది ? . వట్టి బోరింగ్. మీరు టెన్నిస్ ఆడినా బాగుండిపోను బోలెడంత ఏక్షన్ ఉంది క్రికెట్‌లో కదలిక సున్న .' అంది.

ఆశించని జవాబు—గిరి కోపాన్ని సభ్యతకోసం చంపుకున్నాడు

అతను తల్చుకుంటే గౌరిని గిరగిర తిప్పి ఒప్పించవచ్చు

'కొన్ని గంటల ప్రయాణం ఆ తరువాత ఎవరి దారి వారిది వసపిట్టలా వాగుతుంది మనకెందుకు' అని ఊరుకున్నాడు ఇంత స్వేచ్ఛగా ధైర్యంగా మాట్లాడే గౌరిని 'పిరికిపంద'ని, వదిళ్లవతల ఉన్న చుటాలింటికి వెళ్లలేద'ని వ్యాఖ్యానించిన హరిని చూసి జాలిపడ్డాడు

భార్య నతను పూర్తిగా అర్థం చేసుకోలేదు గామోలు!

ఇక సంభాషణ సాగేందుక వీల్లేకుండా రైలు వచ్చేసింది

ఆ పెట్టెలో మిగిలివున్న ఒక్కగా నొక్క సీటులో ముందే తన సూట్‌కేసును కూర్చో

వంతోషిస్తూ.

'మరి మీరు ? ....' అంది మర్యాదకోసం.

'నేను నిలబడతాను. మరేం ఫరవాలేదు. ఇద్దరం 'నువ్వు నువ్వ' ని వాదించుకుంటే మూడో వ్యక్తి దాన్ని తన్నుకుపోతాడు.'

గౌరి కిటికీవారగా కూర్చుంది. గిరి ఆమె పెట్టె సీటుకింద సర్దాడు. చెంపకు చేయి ఆనించి పటుత్వం కోల్పోయిన సూర్యకిరణాలను ధైర్యంగా ఎదుర్కొనే గౌరిని చూసి, మరీ మరీ చూడా లనుకుని, మర్యాద కాదని మానుకున్నాడు. ఆ కోణంలో గౌరి మరింత అందంగా కనిపించింది.

గిరిని ఎవరో వీపు చరిచి పిలిచినట్టయింది. చుట్టూ చూసి ఎవరూ కనిపించక తన భ్రమేమో ననుకున్నాడు ప్రయాణీకులు ఎవరి బాధలో వారున్నారు.

బండి రెండు స్టేషనులు దాటేసరికి ప్రకృతి శృంగారం పూర్తి చేసుకుంది ఎర్రటి బట్టకు బదులు రంగు రంగుల వస్త్రాలు తొడుక్కుంది. వాడినపూలు/ తీసిపారేసి కొత్తపూలు, పెట్టుకుంది తన్నింతసేపూ ఎండలో ఎండబెటిన సూర్యుణ్ణి కోపంతో అగ్నిగుండంలో విసిరేసింది. చీకటి మాత్రం ఇదంతా దొంగతనంగా కనిపెడుతూ ప్రకృతిని పొట్టబెట్టుకోటానికి అవకాశం కోసం ఎదురుచూస్తోంది తెల్లవన్నీ పాలని నమ్మి పిచ్చిగా గాలికి పూలు కదులుతూండగా ప్రేమ గీతాలు పాడుకుంటోంది .. గిరి నిరాశగా చుట్టూ చూశాడు. అరగంట గడిచింది నిలబడి ప్రయాణం చేయటం మహ యిబ్బందిగా ఉంది అనుకున్నట్టు ఆదివారం బయలుదేరితే సరదాగా ఉండేది తమకోసం కంపెనీ ఓ చిన్న పెట్టె రిజర్వుచేసింది కూడా — ఈలోగా హరి ఉత్తరం— ఈ బాధ్యత—అన్నీ తన ఉత్సాహాన్ని నగం చంపేశాయి. సోమవారం ఫైనల్సు ప్రారంభం. అలా ఆలోచిస్తూ ఎటో చూస్తూ నిలబడ్డాడు.

'ఇలా వచ్చి కూర్చోండి' అంది గౌరి

ఆ స్టేషనులో చాలామంది ప్రయాణీకులు దిగిపోయారు పెట్టె నగం ఖాళీ అయింది గౌరికెదురుగా ఓ సీటు ఖాళీగా వుంది

'ఎందుకులెండి, ఇక్కడే కూర్చుంటాను' అన్నాడు ఆమెకు దూరంగా వున్న సీటుకేసి వెడుతూ ఎదురుగా కూర్చోటానికి కాస్త భయపడి—

'మీ కిష్టం లేనప్పుడు నన్ను తీసికెడతానని ఆయనతో ఎందుకు చెప్పాలి ? నాతో మాత్రం ఎందుకనాలి ? మీకంత యిబ్బందిగా ఉంటే మరో పెట్టె చూసుకోవచ్చుగా నా గురించి శ్రమపడకండి '

ఆమె కంఠంలో కోపాన్ని గుర్తించాడు గిరి

'నో .. నో ... మీరలా అనుకోకూడదు'

గటం అతని కంతగా అలవాటు లేదు. ఈమూ లెవరో మళ్లీ వీపు గట్టిగా చరచి 'గిరి ! ఒరేయ్ గిరి !' అని పిలిచారు అయిదు నిమిషాల క్రితం అదెవరో గుర్తించలేక పోయినా, ఇప్పుడు తెలుసుకున్నాడు అతని 'లోపలి గిరి'.

'ఎందుకయ్యా నా వీపు ఇలా చిట్లకొడతావ్? నీకేం పోయేకాల మొచ్చింది ?' అని విసుక్కున్నాడు.

'నాకు పోయేకాల మొస్తే నువ్వు బతికే దెలాగరా నాయనా ? ... ఇద్దరం ఒక్కటే ! నీ అంతర్భాగం నేను—నా అంతర్భాగం నువ్వు తెలిసిందా ? గౌరి గురించి అంత ఘాటుగా ఆలోచించవలసిన అవసర మేమొచ్చింది ?

ప్రేమించి పెళ్లిచేసుకుంటావా ? .... ఓరి చవట నాయనా ! జాగ్రత్త ! ఆమెకు పెళ్లయింది. కబడ్దార్ !'

గిరి వెనక్కి తగ్గాడు ఈ లోపలి గిరితో అసలు వాదించకూడదు. శివుని ఆత్మలింగంలా వాదించేకొలదీ పెరిగిపోతాడు

రైలు ఉత్సాహంతో పిచ్చిగా ఏదో పాడుకుంటూ కదలిపోతోంది గిరి 'స్వంత' ఆలోచనల్లో పడిపోయాడు. ఫైనల్సులో తమ కంపెనీ గెలిచినట్టు, పెద్ద షీల్డును మోయలేక అందుకున్నటూ వూహిస్తూంటే పెదవులు చిరునవ్వులు తగిలించుకున్నాయి.

గౌరి ఫక్కున నవ్వింది.

'ఏం ? .... ఏం ? .... ఏమైంది ?' అని కంగారు వడ్డాడు.

'అబ్బే ! ఏంలేదు మీ క్రికెట్ గురించి ఆలోచిస్తుంటే నవ్వొస్తుంది అరగంట కష్టపడి కాళ్లకూ, చేతులకూ ఏవేవో కట్టుకుని యుద్ధ రంగంలో మహావీరుడిలా వెడతారు మొట్ట మొదటి బంతికే తిరుగుముఖం పట్టి ఏడుపు మొహం వేస్తారు అదే మరో ఆట తీసుకోండి . గంటో, గంటన్నరో తప్పనిసరిగా ఆడి తీరాల్సిందే. అందుకే నవ్వుకున్నా—ఏమీ అనుకోకండి '

గిరి మాట్లాడలేదు అతనికి పొద్దుటికలి కళ్లముందు గిరగిర తిరిగింది అన్నీ అపశకునాలు.

ఆమె కెదురుగా కూర్చోటం ముళ్లమీదున్నట్టుంది క్రూరమృగంతో పోరాడి గెలవొచ్చు విషసర్పాన్ని వంగదీయవచ్చు. పర్వతాన్ని పిండిచేయవచ్చు కాని మహాప్రభో ! ఆడుదానితో మాట్లాడి గెలవటం కల్ల అందులోనూ పెళ్లయిన అమ్మాయితో ఎలా మాట్లాడినా, ఎలా ప్రవర్తించినా చిక్కే మాట్లాడక మౌనంలో దాక్కున్నా చిక్కే హరికోసం 'హరీ' మంటూ వూరుకోవలసిందే

'క్రికెట్ గురించి ఆమె అసందర్భపు మాటలు రెండుసార్లు విన్నాను మన్నించాను మూడోసారి వూరుకొనేది లేదు' అనుకున్నాడు పదేపదే

చీకటిపడింది నల్లకాగితంమీద బంగారు ముద్దల్లా దీపాలు చెల్లాచెదరై వెనక్కి కదలుతున్నాయి చల్లగాలి మనసును, శరీరాన్ని వశం చేసుకుని 'నిన్ను నిద్రలోకి విసిరేయకపోతే నాపేరు గాలికాదు' అని సవాలు చేసింది గిరికి ఆకలేసింది బండి ఆగగానే ఏదైనా కొనుక్కు రావాలి ఆమె తింటుందో, తిరస్కరిస్తుందో.

పింది. చెదరిన ముంగురులు సర్దుకున్నాయి.

గాలి కాస్త కినిసి గిరిని చుట్టేసి మత్తుమందు చల్లి కునుకులో విసిరేసింది

'టైమెంతయిందమ్మా ? ....' ఎవరో ముసిలామె గౌరి నడిగింది.

అప్పటికే గిరి మేలుకున్నాడు కిటికీకి జారబడి కళ్ళుమాత్రం తెరవలేదు

'నా దగ్గర వాచీ లేదండి .. ఇది వాచీలా కని పించే గాజు సుమారు ఏడున్నరవుతోంది' అంది గౌరి నవ్వుతూ

''సిది మరీ చోద్యంతల్లి! నీ చేతికున్నది వాచీ కాదని నాకు తెలియదా ఏవిటి? మీ ఆయన చేతికి తాటికాయంత వాచీ వుందికదా! చూసి చెబుతావని అడగాను '

గిరి గుండెలు ఆగి మళ్ళీ కొట్టుకున్నాయి గౌరి ఏం సమాధానం చెబుతుందోనని చెవులు 'ఆటెన్షన్' పొజిషన్‌లో నిలబడ్డాయి

'అతను మా ఆయనని మీ కెవరు చెప్పారు? ఆడ మగ కలిసి మాట్లాడుకుంటే, ఆలుమగలేనా ఏవిటి? మీలాంటి శంకబుద్ధులకు వేరేవని వుండదు అన్నా చెల్లెలు ఎందుక్కాకూడదు. బంధుత్వం లేక పోయినా తెలిసిన వారెందుక్కాకూడదు? మీక్కావ లసింది టైము—నా స్వవిషయం మీ కెందుకు? అదీకాక నేను వివాహితను. నోరు దగ్గర పెట్టుకుని మసలు కోండి.' అని గౌరి కస్సు మంది. కాదు, కాదు. అలా అంటుంది గిరి వూహించాడు. అవును మరి పెళ్ళైన ఆడదానితో పరాయి మొగాడు 'నీ మొగుడు' అంటే వూరుకుంటుందా? తలతీసే స్తుంది.

''ఏడుంపావైందండి.....' అంది నెమ్మదిగా గౌరి.

గిరి ఆశ్చర్యంతో కళ్ళుతెరిచాడు. గౌరి చిరునవ్వు నవ్వింది.

'నిద్ర ముగిసిందా?... మీ వాచీ సరిగ్గానడు స్తోందనుకుంటా. ఇందాకా ఓ ముసలామె టైమడి గితే చెప్పేను......''

''సెకను దగ్గర్నుండి ఆల్ కర్క్టెకు!' అన్నాడు గర్వంగా

'నిజమే మరండి! ...ఎంత క్కొన్నారు

గిరి మొదట్లో ఆమె ప్రశ్నకు సంశయించి నా జవాబు చెప్పాడు.

'షేక్స్‌పియర్‌లో మొదటి మార్కు వచ్చినందుకు మా నాన్నగారు ఆప్యాయంగా బహూకరించినది.'

'అలాగా?.... చాలా సంతోషం మీ పేరుకు తగ్గట్టు శరీరం ఎలాగూ లేదుకదా — పోనీ వాచీ అయినా పర్వంతంలా వుండాలనా ఈ తాటికాయ కొన్నారు ?...దయవుంచి దాన్ని అమ్మేసి, మరో చిన్న వాచీ కొనుక్కుంటే చూట్టానికి ముచ్చటగా వుంటుంది. టైమెంతయిందో సరిగ్గా చూసు కోండి

గౌరి ముసిముసి నవ్వులు నవ్వింది గిరి గడియారం కేసి చూస్తే ఎనిమిదిన్నరైంది ఆమె నవ్వు వెనక హేళన అర్థమైంది బండితో పాటు అది కూడా గంట ముందు నడుస్తోంది తనేమో 'సెకను దగ్గ ర్నుండి ఆల్ కరెక్ట్' అన్నాడు మరి. తన్ను తాను సమర్థించుకోటానికి ఏదో అనాలనుకుని ఏమీ

క్రికెట్టూ –
క్రీగంటి చూపులూ

అనక వూరుకున్నాడు అతని మనసంతా మల్లె పూవులా వికసించింది.

లోపలికి గిరి రంగంలోకి వచ్చాడు

'ఏమయ్యా గిరిరాజ్ ?.... వ్యవహారం ముదిరి పోతోందనుకుంటాను. గౌరి మరొకరి సొత్తన్న సంగతి మర్చిపోయావా? నీ ప్రవర్తన హరికి తెలిస్తే నీ గురించి ఏమనుకుంటాడు. మీ నాన్న కీ సంగతి తెలిస్తే నీ మీదున్న సదభిప్రాయం ఏమవుతుంది ? ఇవన్నీ కాస్తయినా ఆలోచించావా? ఆడువారు వలలు పన్ని బంధిస్తారు కాని బయ టకు వచ్చే మార్గం చెప్పరు వలలో చిక్కుకున్నాక కంటికి కనపడరు. నీ అవస్థ నీది '

గిరికి శివమెత్తినట్లైంది. లోపలి గిరిని పాచి రెంపకాయ కొట్టాలనుకుని ధైర్యం చాలక వూరు కున్నాడు.

'నువ్వు చేస్తున్న నేరారోపణ సరైందికాదు ఆమె నన్ను సంభాషణలోకి దించుతోంది. ప్రయత్న పూర్వకంగా ఆమె ప్రమేయంకోసం ఎగబడుటలేదు. వాచీగురించి ఎలా ఎత్తి పొడిచిందో విన్నావుగా...'

'అదంతా నాకు తెలియదు. . మెలకువగా వుండ మని హెచ్చరిస్తున్నా అంతే '

బండివేగం క్రమంగా తగ్గుతూ వచ్చింది పచ్చ సిగ్నలు పలుకరించింది. ఫ్లాటుఫారం బండికి దగ్గరగావచ్చి నిలబడింది. 'నాకు ఆకలేస్తోంది. ఏదైనా కొనుక్కువస్తాను.....మీరు అన్నంతింటారా లేక టిఫిను వగైరా....' అంటూ లేచి నిలబడ్డాడు. 'ముందు మీరు మీ సీట్లో కూర్చోండి' అని ఆజ్ఞా పించింది గౌరి.

సంచిలోంచి తినుబండారాలుతీసి రెండు ప్లేట్లలో సరిసమానంగా సర్దింది.అవన్నీ చూస్తుంటే నోరూరిన మాట నిజమే కాని, నభ్యతకోసం ఆగాడు.

'తీసుకోండి!' అంది ఓ ప్లేటు అందిస్తూ.

'అబ్బే ఇవన్నీ ఎందుకండి?. ..' అన్నాడు నసు గుతూ నవ్వుతూ.

'తినటానికండి.....ఊ! నాకు మహ చెడ్డ ఆకలి వేస్తోంది. మీవాటా మీరు త్వరగా తింటే మేలు లేకపోతే అది కూడా స్వాహా '

గిరి రెండు కప్పుల కాఫీ తెప్పించాడు

బండి కదలబోతుంటే ద్రాక్షపళ్ళు కొన్నారు. గిరి ద్రాక్షకేసి, ఆమెకేసి చూపులు మార్చాడు.

'ఏమిటోయ్ గిరిరాజ్ ! అంతదీక్షగా చూస్తు న్నావ్?' అన్నాడు లోపలి గిరి.

'ఆ అమ్మాయి కళ్ళు ద్రాక్షపళ్ళలా వున్నాయి ఆ సౌందర్యాన్ని చూస్తున్నా.....' అనేసి తనెవరితో మాట్లాడుతున్నది తెలిసిరాగానే చటుక్కున నాలి క్కరచుకున్నాడు

'నన్నుక్షమించు. ఏదో బుద్ధి గడ్డితిని, తన్మ యత్వంలో ఎవరితో మాట్లాడుతున్నదో తెలి యక ఏదో అనేశాను' అన్నాడు ఏడుపు కంఠంతో. లోపలి గిరి నవ్వాడు

'నువ్వు దాచినా దాగదోయ్! ..నేను నీ అంత రాత్మాన్ని. జాగ్రత్త!' అంటూ గుండెలో దాక్కు న్నాడు.

గౌరి ఏదో కాగితాన్ని కిటికీలోంచి బయటకు విసురుతుంటే, గిరి ముందు కెగిరి కాగితాన్నందు కున్నాడు. ముడతలు సరిచేసి మడిచి జేబులో పెట్టు కున్నాడు

'ఇదేమిటండోయ్?. .పిచ్చెక్కిందా ఏవిటి?'

'ఓ వస్తువుమీదకాని — విషయంమీదకాని—అత ధికి మించిన ఆశ వుంచితే — శ్రద్ధ చూపితే—అది కూడా పిచ్చే. క్రికెట్ అంటే నాకు ప్రాణం. ఆ కాగి తంలో లెన్‌హటన్ ఫోటోవుంది క్రికెట్ చేస్తుంటే తీసిన ఫోటో. దాన్ని మీరలా విసిరివేయటం సహించలేక తీసుకున్నాను. గౌరి నవ్వింది. విరగబడి నవ్వింది. ఏదో గిరంత హాస్యాన్ని కనుక్కొన్నట్లు మరింత విరగబడి నవ్వింది.

'ఏం? ఏం? ఎందుకిలా నవ్వుతున్నారు?'

'ఏంలేదు మీరింతగా ప్రేమిస్తున్న ఆటలో ఏముందని ఆలోచిస్తున్నా ఎండలో మల మల మాడిపోతూ నిమిషానికోసారి బంతికోసం ఎదురు చూస్తూ పాపం చేసినవాడిలా నిలబడటం—ఎంతో ధీమాగా, పర్వతాన్ని పెకలించటానికన్నట్టు బయలు దేరటం మొదటి బంతికే తిరిగిరావటం చూసే వాళ్ళ కసలు మతి లేదంటాను . .'

ఆమె ఇంకా చెబుతూనే వుంది గిరి వినిపించు కోటం మానేశాడు ఓమాటు తోటి విద్యార్థి 'క్రికెట్ అంటే — ఇరవై ఇద్దరు మూర్ఖులు ఆడేది. ఇరవై వేలమంది మూర్ఖులు చూసేది! అంటే చెంప చెళ్ళుమనిపించాడు. వ్యవహారం ప్రిన్సిపాలుదాకా వెళ్ళింది. క్షమాపణ చెప్పుకోటంలో అంతరైంది. గౌరిమీద బలప్రయోగం తగదు తగదు. అందుకు కారణాలు ముఖ్యమైనవి మూడు. మొదటి కారణం ఆమె స్త్రీ. రెండోది పరాయి మగాడి భార్య. మూడో ది ఆ పరాయి మొగాడు తన ప్రియమిత్రుడు.

'రెండుపొర్లు సహించాను ఇక మౌనముద్ర అసాధ్యం' అనుకున్నాడు గిరి.

'దయవుంచి మీరు క్రికెట్ గురించి నా దగ్గర ఏమీ మాట్లాడకండి. మీ కిష్టం లేనంతమాత్రాన దాని విలువ నశించదు. అభిమానించేవారు కోట్ల కొలది వుండగా, ఎడారిలో నీటి బొట్టులా మీ మాట ఇంకిపోతుంది. దాన్నెవరూ వినరు . ..ప్లీజ్ ! ... ఇకముందు ఆటాపిక్ వద్దు.'

'గౌరి ఆశ్చర్యంలో కళ్ళెత్తి చూసింది అతని మాటల్లో ప్రతి అక్షరమూ నిండుగా ధ్వనించింది. కళ్ళల్లో నిశ్చితమైన అభిప్రాయం కనపడింది. ఆ క్షణంలో గిరి ఓ సిద్ధాంతవాదిలా కనిపించాడు. మనసులో మాటను ఖండితంగా మాటగా చెప్పే అతని తీరు తెన్నులు ఆమె నాకర్షించాయి.

'క్షమించండి. మీ మనసును కష్టపెట్టడం నా అభిప్రాయంకాదు. మీరింత సీరియస్‌గా తీసు కుంటారని తెలిస్తే నోరు మూసుకుందును.

గిరి సమాధానం చెప్పక 'అంతా మర్చిపోండి' అన్నట్లు చూశాడు. మరో పది నిమిషాలు గడిచాయి.

'మీ ఆవిడ బెజవాడలో వుందాండి ?... ఆమె నోమారు చూపించరూ?' గిరి గతుక్కుమన్నాడు. అది రూపంలేని ప్రశ్న.

'ఏ. ...ఏ....మన్నారు?'

గౌరి కొంటె కళ్ళతో కలుక్కుమంది. 'బావి అమాంతం పట్టుకున్న వాడిలా బెంబేలు పడిపోతున్నారేమిటి ఈ అబ్బాయి?' అనుకుంది.

'మీ ఆవిణ్ని తెలుసుకోకూడదా ఏమిటి?.... అలా ఎందుకు కంగారుపడతారు?'

'నాకు పెళ్ళైందని మీ కెవరు చెప్పారు?'

గౌరి కళ్ళు పెద్దవి చేసింది

"నేనే వూహించి పొరబడ్డాను. గత ఏడాదిన్నర నుండి ఆయన మీకోసం సంబంధాలు చూస్తున్నారనే వారు ఈపాటికి' అని మళ్ళా నవ్వింది

'హరి చెప్పిన మాటలు నిజమే కాని ఇప్పట్లో అలాంటి ఆలోచనలేదు'

'ఎందుచేత?' అంది అదోలా చూస్తూ.

"నా అభిప్రాయంలో మీరు ఏకీభవిస్తారనే ఇదంతా చెబుతున్నా ప్రతి మనిషికీ కొన్ని లక్ష్యాలుంటాయి. అవన్నీ నెరవేరాలంటే అతనికి స్వాతంత్ర్యం అవసరం. ఏ సమయంలో ఎలాంటి సాహస చర్యలు చేయవలసి వస్తుందో అతనికే తెలియదు. అందుచేత ఎలాంటి బాధ్యతలు, బరువులు వుండకూడదు. భార్యవుంటే, ఆమె తనుగుణంగా మనసు ఎరగకుండా నడవుకోవాలి. ఏ పని చేసే ముందైనా ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి వివాహం అభివృద్ధికి ఆటంకం. గమ్యస్థానం చేరుకున్నాక పెళ్ళి చేసుకోటం మంచిది ..'

గౌరి శ్రద్ధగా విన్నట్టే కనపడింది ఆ పెట్టెలో ఎక్కువమంది ప్రయాణీకులులేరు స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకు ఆటంకాలులేవు

'నిజమే కావచ్చు కాని, మీ లక్ష్యం—లేక లక్ష్యాలు ఏవిటో కాస్త చెప్పండి'

'ఉద్యోగరీత్యా అంతా వుత్సాహకరంగానే వుంది క్రికెట్ ఆటలో అగ్రస్థానం అందుకోవాలి. టెస్టుల్లో ఆడాలి. అభిమానులు ఆదరించాలి. అప్పటిదాకా నా లక్ష్యం నెరవేరదు...ఏం?....ఎందుకు నవ్వుతున్నారు? అంత హాస్యాస్పదంగా వుందా? నవ్వకండి. ..నాకేం అభ్యంతరంలేదు.'

'నెమ్మళ్ళి నేనాకోశం చేస్తున్నాననుకోకండి. మీరు క్రికెట్ ఆడితే మీ భార్యవద్దంటుందా? నలుగురూ మిమ్మల్ని గౌరవిస్తే ఆమె ఏడుస్తుందా? పెళ్ళికీ, దీనికీవున్న సంబంధం నాకర్థంకావటం లేదు'

'ఇంత స్పష్టంగా చెప్పినా మీ కర్థం కానందుకు చాలా బాధపడుతున్నా ప్రతినెలా టూరు వెడితే పెళ్ళాం ఎగిరిపడదటండీ!'

'అది కూడా నిజం కావచ్చు మీరు గొప్ప ఆటగాళ్ళయ్యాక పెళ్ళి చేసుకున్నారనుకోండి అప్పుడు మాత్రం ఇంట్లో శాశ్వతంగా వుండగలరా ఏవిటి? పెళ్ళి కాగానే ఆటకు ఫుల్‌స్టాప్ పెడతారా?'

గిరి గతుక్కుమన్నాడు

గౌరి గర్వంగా గెలుపు నవ్వు నవ్వింది.

అంతటితో సంభాషణ ఆగింది

గిరి నాన్నకు రాసిన పదహారు వుత్తరాల్లో ఇదే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వచ్చాడు ఇలాంటి ఎదురు ప్రశ్న నెవరూ వేయలేదు. తన లక్ష్యంలో లోపం వుందనలేదు. గౌరి మాటలు నిజమనిపించాయి. వివాహం జీవితానికి అంతిమ ఘట్టం, ఆడుకోటం పిల్లాటలు కాదేమో!

లోపలి గిరి నవ్వుతూవచ్చి నిలబడ్డాడు గిరి ఆశ్చర్యపోయాడు.

అతనికి జ్ఞాపకం వున్నంతవరకూ లోపలిగిరి నవ్విన పాపాన పోలేదు.

'ఏమయ్యా! ఏం అపరాధం చేశాను? మళ్ళీ వచ్చావ్'' అని విసుక్కున్నాడు.

'నీ టక్కరి వేషాలు నా దగ్గర సాగవుసుమా! ఆ అమ్మాయి గురించే ఆలోచించి మనసెందుకు పాడుచేసుకుంటావ్? ఆమెను పెళ్ళి చేసుకుంటావా ఏమిటి అసలు పెళ్ళంటే నీకు కిట్టదుగా!'

ఇన్నాళ్ళూ అలాగే అనుకున్నా కాని గౌరిని చూశాక, ఆమెమాటలు విన్నాక ఆఅభిప్రాయం మార్చుకోవాలనుకుంటాను. గౌరిని చేసుకోటం ఎలాగూ వీలుపడదు. ఆమెలాంటి అమ్మాయినైనా చేసుకోవాలని నిర్ణయించుకున్నా'

'బెస్! బాగుంది గిరిరాజ్! వివాహమంటే వైతరణి దాటటమనేవాడివి. ఒక్క క్రీగంటి చూపులో ఐస్‌క్రీంలా కరిగిపోయావు ఆలస్యం అమృతం విషం. మీ నాన్న కుత్తరం రాయి.'

'తొందరపడకూడదు గౌరిలాంటి అమ్మాయిని నేను వెతుక్కుంటా. నాన్న కుదిర్చే సంబంధాలు నాకు నచ్చకపోవచ్చు'

'శుభస్యశీఘ్రం!' అని ఆశీర్వదించి స్వస్థలం చేరుకున్నాడు లోపలి గిరి

గౌరి కిటికీకి జారబడి నిద్రలో మునిగిపోయింది.

గిరి చిత్రమైన వూహల మధ్య చిక్కుకున్నాడు

* * *

మద్రాసు వచ్చేసింది

'అన్నట్టు అడగటం మర్చిపోయాను. మిమ్మల్ని తీసికెళ్ళేందుకు స్టేషనుకెవరు వస్తారు?'

'ఎవరైనా వస్తారు. చూద్దాం' అంది ప్లాటుఫారంలో అడుగుపెడుతూ.

రెండు నిమిషాల్లో నల్లగా పొడుగ్గావున్న ఓ వ్యక్తి వచ్చాడు. గిరి తెల్లబోయాడు అతను నిజాన్ని నిజంగా నమ్మే స్థితిలోలేడు.

'నరహరి! .....నువ్వెక్కణ్నుంచి దిగబడ్డావ్?'

'ముందు బయటికి పోదాం — తరువాత విను బాబు'

బయట కారు రెడీగా వుంది.

'ఏం అలా చూస్తున్నావ్? కారు మన సొంతం కాదులే! కంపెనీ సొత్తు! కారు కదిలింది.

'గౌరి! .మన గిరి చాలా మంచివాడు ఉత్తరం రాయగానే సాయపడ్డాడు' గౌరి నిజమన్నట్టు తల వూపింది.

'నన్ను సస్పెన్సులోవుంచి చంపుతున్నావ్ నువ్వు మద్రాసు ఎప్పుడు వచ్చావ్? ఎలా? మచిలీపట్నం నుండి మొన్ననేకదా ఉత్తరం రాశావు' నరహరి నవ్వాడు.

అంతా ఒకసారే చెప్తే గుండాగిపోతుందని కొంచెం కొంచెంగా చెప్తాను. మచిలీపట్నం ఎలా వుంటుందో ఇంతవరకూ నాకు తెలియదు నేను బి. ఏ పూర్తిచేసి మద్రాసులో ఉద్యోగంలో చేరాను. ఇక్కడే వుంటున్నా.

"మరి మీ ఆవిడ అక్కడే వుంటోందా?'

'లేదే! ఆవిడ కూడా నాతోపాటు ఇక్కడే!'

గిరికి తల గిరగిర తిరిగింది.

'హరి ఇదంతా ఏవిటి? నిజం చెప్పు' అన్నాడు ప్రాధేయపడుతూ.

'నిన్ను మోసం చేశానని మాత్రం అనుకోకు. చెప్పేదంతా విని నన్ను క్షమించు. అంతా నీ మంచి కోసమే! మీనాన్నగారిని అయిదుసార్లు కలుసుకున్నాను. నీపెళ్ళిగురించి బెంగపెట్టుకున్నారు నువ్వుపక్కదారులు తొక్కావేమోనని అనుమానపడ్డారు కూడా. వారం రోజుల్లో నీ మనసు మారుస్తానని ఆయనకు మాటిచ్చాను 'ఎలాగా' అని ఆలోచిస్తుంటే మరదలుపిల్ల మచిలీపట్నంనుండి వస్తానంది. మద్రాసు చూడాలనుందట—ఇదే అవకాశమని నీకు ఉత్తరం రాశాను నువ్వు కవరుమీద తపాలా ముద్ర చూడలేదు. నా పథకం నెరవేరింది'

గిరి గౌరికేసి ధైర్యంగా చూశాడు. ఆమె ఎక్కడలేని సిగ్గుతో తలవంచుకుని కాబోయే క్రికెట్‌వీరుణ్ని క్రీగంటితో చూసింది.

"అయితే గౌరి నీ భార్య కాదన్నమాట! ..."

"కాదయ్యాకాదు! ఆమె నా మరదలు. ఇంటర్ పూర్తి చేసింది సంబంధాలకోసం చూస్తున్నారు మీ నాన్నగారు ఆమెనిదివరకే చూశారు. ఆయన అంగీకారం ఏనాడో వుంది. మరి నీ అభిప్రాయం తెలియాలి."

'నా మనసు మారుతుందని నువ్వు ముందే ఎలా వూహించగలిగావ్?'

'గౌరి ఎలాంటి పిల్లో నాకు తెలుసు చమత్కారం, కొంటెతనం—ఎదుటివాణ్ణి ఏడిపించటం—ఇవన్నీ ఆమెకు ఉబుసు పోకలు. తల్చుకుంటే ఎంత పనైనా చేస్తుందని నాకు తెలుసు ఆమె ముందు నువ్వు ఓడిపోక తప్పదు .'గౌరి' అనే అస్త్రం చేత 'క్రికెట్' అనే రాక్షసుడిని సంహరించాను ... అలా అని గౌరి గయ్యాళి కాదుసుమా! అణకువ—నమ్రత అన్నీ వున్నాయి

లోపలిగిరి పరుగెత్తుకు వచ్చాడు

'ఇంకా ఆలోచిస్తున్నావేమయ్యా! నాతో అన్నావుగా గౌరిలాంటి అమ్మాయిని చేసుకుంటావని. వెంటనే ఒప్పేసుకో. ప్రతిసారి నిన్ను హెచ్చరిస్తూ కాపలా కాస్తూ నా తల ప్రాణం తోక కొస్తోంది.

ఆ గడుసరి గడుగ్గాయ నీ సంగతి చూసుకుంటుంది నేను కొంతకాలమైనా విశ్రాంతి తీసుకుంటాను'

'సరే సరే .నువ్వెళ్ళు'అన్నాడు గిరి.

'గిరి! నా ప్రశ్నకు సమాధానం? ....'

మా నాన్న కిష్టమైతే నాకూ ఇష్టమే!' అన్నాడు.

'అదీ మాట! అదృష్టవంతుడివి' అంటూ గట్టిగా వీపు చరిచాడు. డ్రైవరు వులిక్కిపడి కోపంగా వెనక్కి తిరిగి చూశాడు

ముగ్గురూ నవ్వుకున్నారు.

* * *

మరోక్కవిషయం.

ఆ మర్నాడు గిరి ఫైనల్సులో ఆడాడు మొదటి బంతికే అవుట్! కానతను బాధపడలేదు. నవ్వుకుంటూ వెనక్కి తిరిగి వచ్చాడు బంతి ఎదురు వస్తున్నప్పుడు గౌరినిగురించి ఆలోచిస్తే అవుట్ కాక ఏమవుతాడు? ★

ప్రియబాంధవి

(గతసంచిక తరువాయి)

అడవిలో మేడ మేడలో పంకజం. అంతా ఒక కల చిట్ట చివర దారుణాఘాతం. అఘాతంతో చెదరిపోతున్న తీయటి కల ....

"దిగులుగా ఉం దటయ్యా పంతులూ !"

అది పరామర్శ గాదు గాయంపైన పోతు తున్న కైజారు

"దమ్ములుండాలయ్యా పంతులూ ! లేకపోతే గమ్మునుండాలి. నీకు దమ్ములూ, లేవు గమ్మనా ఉండకపోయావు. ఏడువు. ప్రపంచంలోకి వెళ్లి వింపాదిగా ఏడువు .."

మాటలు కటువుగా ఉన్నా నరసింహులు మనసులోని మృదుత్వాన్ని పోల్చుకో గలిగాడు సత్యమూర్తి

" నేనేం చేశానో వింటావా పంతులూ ! మేన మామ పిల్ల నివ్వనన్నాడు. వాళ్ళ వూరు వూరంతా ఒకటి ఐతేనేం, అమ్మాయి మన తట్టు ! రాత్రికి రాత్రే లేవుకొచ్చేశాను" క్షణంసేపాగి మళ్లీ కొనసాగించాడు నరసింహులు "నువ్వే చేశావు ? అసలు రేపావు అమ్మాయికి గాకుండా వెళ్లిపోతున్నావు రేపే మవుతుంది ? అమ్మాయిని తీసుకెళ్లి ఆ పుచ్చిన పళ్ల పుల్లయ్యకు కట్టబెట్టేస్తాడు తండ్రి ! నీతోబాటు ఆమె గూడా ఏడుస్తుందిలే ... "

జీవితపథంలో ఎదురైన అగాధాలపైన సంజాయిషీల వంతెనలు కట్టుకుని సాగిపోతారు మానవులు కొందరు మరికొందరి కలా వంతెనలు కట్టుకోడం చేతగాదు వాళ్ళ అగాధంలో కూలిపోతారు. మళ్లీ కోలుకోరు సత్యమూర్తి రెండవ తరగతికి చెందినవాడు

అందుచేతనే గావచ్చు, సత్యమూర్తికి సంజాయిషీ చెప్పుకోవా లనిపించలేదు

చెప్పడం పూర్తయిందేమో, నరసింహుల్ని పూర్వస్మృతులు ఆవహించుకుంటున్నాయి

"చనిపోయి స్వర్గలోకంలో ఉందా యిల్లాలు. పంచ ప్రాణాలు బిడ్డపైన పెట్టుకుని బ్రతికింది. ఆమె చనిపోతుండగా బిడ్డ నా చేతుల్లోనే ఉంది. బంగారంలాంటి బిడ్డ. పెరిగి పెద్దదైంది. ఏం లాభంలేవయ్యా పంతులూ ! గంగానమ్మలాంటి సవతితల్లి తోడేళ్లలాంటి పిల్లలు ఎలుగుబంటి లాంటి కాబోయే మొగుడు ఊనగాచి వక్కలపాలుజేసినట్టుంది . . "

బండికి గట్టిన గిత్త జవనాశ్వంలా పరుగిడుతోంది క్రోసెడు దూరం ఎలా గడిచిపోయిందో ఏమిటో, చెట్ల సందుల్లో నుంచి స్టేషను దీపాలు కనిపిస్తున్నాయి అయిపోయిన పెళ్లికి మేళాలెందు కనుకున్నాడేమో, నరసింహులు గూడా మాటలు చాలించుకున్నాడు

స్టేషను వెనుక నేరేడు చెట్టుక్రింద ఆగింది బండి. గిత్తను వదిలించి బండిని దించేశాడు నరసింహులు వెంటనే పెట్టెల్ని గూడా దించాడు. దుప్పటి తీసి పెట్టెలపైన వేశాడు. పాత్ర సామగ్రిని అందుకో బోతున్నాడు.

అప్పుడొక విచిత్రమైన శబ్దం వినిపించింది. చేతులకు తొడుక్కున్న గాజులు మెల్లగా కదిలిన చప్పుడు . .

"పంతులూ ! ఇలా రావయ్యా బాబూ ! ఏమిటిది ? ఎవరిక్కడ ?"

సవారీ కడ్డంగా ఆ చివర కట్టిన మేదర తడిక కానుకొని ముఖాన్ని చీరచెరగులో దాచుకుని సన్నగా విలపిస్తోంది పంకజం.

నరసింహులకు నోట మాట రాలేదు

సత్యమూర్తి తన కళ్లను తానే నమ్మే స్థితిలో లేడు.

"నాదేం తప్పో చెప్పండి మేష్టారూ !" తడిక కానుకుని మంచుదెబ్బ తినిన తమ్మిపువ్వులా కుంచించుక పోయింది పంకజం. తడిసిపోయిన తరువాత రెక్కలు విదిలించుకుంటూ పైకి లేస్తున్న పావురాలకు మల్లే గద్గదికమైన కంఠంలో నుంచి మాట లొక్కొక్కటిగా వెలువడుతున్నాయి. "నాన్నగారేదో చేయబోతున్నారని నాకు తెలుసు. అందుకు తగ్గట్టుగా, అర్ధరాత్రి దాటాక ఆయన నరసింహుల్ని వెంట బెట్టుకుని మేడ మెట్లు దిగారు గేటు దాటుకుని వెళ్తున్నారు. భయం

మధురాంతకం రాజారాం

నన్ను లోపల వుండనిచ్చింది కాదు. తలుపు తెరచుకుని పెరట్లోకి వచ్చాను అక్కడ నిల్చుంటే ప్రాకారాని కా వైపున ఏం జరుగుతున్నదో తెలియదు. అందుకని ప్రహరీ తలుపు గూడా తెరచుకుని బయటకు వచ్చాను. అక్కడికి నాన్నగారూ, నరసింహులూ చీకట్లో నీడల్లా కనిపిస్తున్నారు. అక్కడే నిల్చుంటే నేను వాళ్లకు కనిపించిపోతానేమోనని పాకలోకి వెళ్లిపోయాను పొద అడ్డమై పోవడంవల్ల వూరింటి దగ్గర ఏం జరుగుతోందో సరిగ్గా కనిపించలేదు. అంతలో అల్లంత దూరాన కనిపించాడు నరసింహులు. ప్రహరీ తలుపు పది బారల దూరంలో ఉంది ఏం చేయాలో తోచక బండిలో కెక్కేశాను. నాకేం తెలుసు మేష్టారూ ! ఈ నరసింహులు బండికోసమే వచ్చాడు .... '

దేవుడి మూలకేసి తిరిగి తలపైకెత్తి చేతుల' జోడించేశాడు నరసింహులు "ఏడు కొండలవాడా! వెంకటరమణా ! నువ్వు లేవేమోననుకున్నానురా బాబా ! తప్పు తప్పు నువ్వు లేకపోవడ మేమిటి'!' లెంపలు వాయించుకుంటున్నాడు నరసింహులు. హర్షాతిరేకమని చెప్పడం చప్పగా ఉంటుంది భగవత్సాక్షాత్కారం పొందిన భక్తుడిలా తన్మయత్వాన్ని భజిస్తున్నాడు నరసింహులు

కేలూత యిచ్చి పంకజాన్ని క్రిందికి దింపుకున్నాడు సత్యమూర్తి పైగుడ్డతో పంకజం కళ్లల్లో నిలిచిన అశ్రువుల్ని తుడిచేస్తూ "అందుకోసం ఏడుస్తున్నావా పంకజం ! తప్పుకాదూ ! ఇందులో నీ తప్పేముంది ? దైవికంగా జరిగిందిది. భగవంతుడే మన కలయికకు ఒప్పుకున్నాడు" అన్నాడు



తొలికోడి కూసింది

వేగుచుక్క పొడిచింది

పదిహేను నిమిషాలవరకూ అంతర్థానమైపోయిన నరసింహులు యిన్ని ఎర్రగన్నేరుపూలతో తిరిగి వచ్చాడు.

"పెట్టెలో దువ్వెనుందేమో చూడవయ్యా పంతులూ ! చిన్నమ్మగారు తల దువ్వుకోవాలి. పువ్వులు పెట్టుకోవాలి అత్తారింటికి వెళ్తూ ఏడుస్తారటమ్మా ఎవరన్నా ! నవ్వుతూ వెళ్లాలి" అంటూ పంకజాన్ని బుజ్జగించాడు

పంకజం తలదువ్వుకుందనీ, పువ్వులు పెట్టుకుందనీ, వేణిబంధంలో చిరునవ్వులు విరజిమ్ముతున్న ఎర్రగన్నేరు పువ్వుల అరుణకాంతులు వెన్నెల వాకల్లా పంకజం చెంపలపైకి ప్రాకి వచ్చాయనీ . యిలా పొడిగించుకుంటూ పోతే

చూపించాయి. ఇందుకు సంబంధించిన వ్యతిరేక వాతావరణం వారికొక అవకాశాన్ని కలిగించాయి. అక్కడితో జాతీయోద్యమఘట్టం పూర్తి అయింది.

ఆ తర్వాత వచ్చిన స్వాతంత్ర్య సముపార్జన ఘట్టంలో కూడా 1942, 1952, 1962 అనే మూడు దశలు ఉన్నాయి. వీనిలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని కాదన్న కమ్యూనిస్టుల మీదికి వ్యతిరేకోద్యమం, కాంగ్రెసులో వచ్చిన ముఠా తగాదాల కల్లోలం, ఎన్నికల ప్రచారం, కొత్త పార్టీల నిర్మాణం అనేవి ఉన్నాయి. ఇవి కలిగించిన వ్యతిరేక వాతావరణం విభిన్నమైనది.

జాతీయోద్యమంనాటి పరిస్థితులకు విరుద్ధమైనది కమ్యూనిజమనే సిద్ధాంతానికి, పార్టీకి వ్యతిరేకం అనుకూలం అనే వివాదం కొంతకాలం సాగింది. చివరకు అది ముఠా తగాదాలతో ఒక వ్యక్తికి—ఒక ముఠాకు జయం—అపజయం అనేదిగా మారింది. అదే చివరకు కొందరు వ్యక్తుల పట్ల, వారు అంటిపెట్టుకొని ఉండే ముఠాల పట్ల అభిమానం, ఆవేశ ప్రదర్శన, ఆదరంగా తయారైంది.

ఇదే ఇప్పటి స్థితిలో కూడా ఆంధ్ర ప్రదేశ్‌లో నిలిచివుంది. 1962 ఎన్నికల అనంతరం ఇది మరెలాంటి రూపాన్ని పొందగలదో ఎవ్వరూ చెప్పలేరు కాగా పార్లమెంటరీ కార్యక్రమాల్లో ఒకటికి రెండు అనుభవాలు పొందిన తర్వాత యువకుల్లో సహజంగా ఉండే ఆవేశం, అభిమానం, ఆశయం అనేవి క్రమక్రమంగా ఒక వ్యక్తినుంచి, ఒక ప్రాంతం నుంచి, ఒక ముఠా నుంచి, ఒక వర్గం నుంచి, ఒక పార్టీకి రూపాంతరం చెంది, విశాలమవుతూ చివరి కొక స్థిరత్వాన్ని పొందగలవు ఆంధ్రలో సోషలిస్టు, కమ్యూనిస్టు, రాయిస్టు, నేషనలిస్టులు, స్వతంత్ర అనిపించుకుంటున్న కొందరు యువకుల, పెద్దల, ప్రముఖుల జీవిత చరిత్రలు విమర్శనాదృష్టితో చూస్తే, ఈ సంగతి మనకు స్పష్టం కాగలదు

ప్రియబాంధవి

కథ పూర్తయ్యే దెప్పుడు? అయినా ఒకటి రెండు మాటలు మాత్రం చెప్పకతప్పదు.

తల దువ్వుకుని పువ్వులు పెట్టుకుంటూ "నువ్వింత మంచివాడవని అనుకోలేదు నరసింహులూ!" అంది పంకజం.

"మీకంటే మంచివాళ్ళా చిన్నమ్మగారూ! మీకంటే మంచివాళ్ళు ప్రపంచంలో లేరు" అన్నాడ నరసింహులు.

"మరైతే మేష్టారు మంచివారు కారూ?'

"ఆ సంగతి నాకేం తెలుసునమ్మగారూ! మీకు తెలియాలి .... ?"

పంకజం నవ్వింది.

సత్యమూర్తి నవ్వాడు.

నరసింహులు నవ్వాడు.

చీకట్లు పోకార్చి జగతిని వెలుగు వెల్లువల్లో ముంచెత్తే ఉషాసుందరి మాట మరచిపోగూడదు ఆమెగూడా నవ్వింది! ★

ఆంధ్ర యువకుల...

(11-వ పేజీ తరువాయి)

కాని పలాయి రాష్ట్రాలనుండి వచ్చే పెద్దలకు ఇది అర్థంకాదు.

మన యువకుల తత్వం, మన వాతావరణం సంగతి సందర్భాలు ఇలాంటివి కనకనే విజయవాడ పంత్ నగర్‌లో సమావేశమైన సుమారు 500 మంది ప్రతినిధులు చేసిన తీర్మానాల్లో కూడా తాత్కాలికమైన ఆవేశం, తక్షణ ప్రయోజనాల దృష్టి మాత్రమే కానవస్తున్నది ఈ తీర్మానాలు మూడు రకాలుగా ఉన్నాయి. నేటి విద్యా విధానం "క్రమశిక్షణా రాహిత్యాన్ని" పెంచుతున్నదని ఖండిస్తున్న తీర్మానం నిర్దిష్టమైన దృష్టిని సూచిస్తున్నది. అయితే "స్వయం క్రమశిక్షణా సంఘాలు" పాఠశాలల్లో ఏర్పడాలన్న సూచన విచిత్రంగా ఉంది పసివాడుగా తల్లిదండ్రుల నుంచి, విద్యార్థిగా గురువుల నుంచి, యువజనుడుగా పెద్దల నుంచి ఎన్నో సంగతులు నేర్వవలసిన "అపరిపక్వదశ"లో "స్వయం శిక్షణ" అనేది ఎలా ఆచరణసాధ్యమో అర్థం కాకున్నది. ఒకవేళ ఇది సుసాధ్యమైతే అందుకు ఆంధ్ర యువజన కాంగ్రెసును అభినందించవలసిందే.

ఎన్నికల ప్రచారానికి లక్ష మంది యువకుల సమీకరణ, ఎన్నికల్లో యువకులకు మూడవ వంతు మందికి కొత్తగా అవకాశం, పదేళ్ళ పదవులలో ఉన్న పెద్దలు ప్రభుత్వ రంగంనుంచి విశ్రమించడం వగైరా తీర్మానాలు ఇప్పటి రాజకీయ జమానాకి అనువుగానే ఉన్నాయి కాని శ్రద్ధగా ఆలోచిస్తే, ప్రతిదఫా ఎన్నికలకు కొన్ని లక్షలమంది యువకులు ఐచ్ఛికంగా కాంగ్రెసు పతాకాన్ని చేబడుతున్నారు. ఎన్నికల ప్రచారం కోసం సొంత సొమ్ము అయినా—పరుల సొమ్ము అయినా కొన్ని లక్షలు ఖర్చు చేస్తున్నారు. కాని ఇది తాత్కాలికమైపోతున్నది ఎన్నికల అనంతరం ఒక జెండాగాని, ఒక ఆఫీసు గాని, ఒక కరపత్రంగాని కనిపించదు ఇదే శోచనీయం. ఎన్నికల సందర్భంలో చేసుకొనే ఏర్పాట్లు "శాశ్వతం"గా నిలుపుకుంటే, ఒక సంస్థకు అవసరమైన వ్యవస్థ సులభంగా ఏర్పడుతుంది. ఇందుకు అటు ప్రదేశ్ కాంగ్రెసు శ్రద్ధ చూపదు ఇటు యువజన కాంగ్రెసు దృష్టి సారించదు.

కొంచెం దూరదృష్టితో ఆలోచిస్తే, ఈ ఎన్నికల కార్యాలయాలు అధ్యయన తరగతులకు, గోష్ఠులకు, సభలకు, శిక్షణకు నిలయాలు కావాలి. ఎన్నికల అనంతరం ప్రాంతాల వారీగా వోటర్లు ఎలా వోటు చేసిందీ, అందుకు సహేతుకమైన కారణాల పరిశీలన, వాటిని తొలగించే ప్రయత్నాలు కొత్త ధోరణిలో జరగాలి. ఏదో ఒక వ్యక్తినో, కులాన్నో, లెగనో దూషించడం, నెపం వేయడం, తద్వారా వ్యక్తిగతమైన కక్షలు పెంచుకొనడమనేది ప్రజాస్వామ్యం కాదు పార్లమెంటరీ వ్యవహారాల్లో విజయసాధన మార్గం కూడా కాదు. ఇప్పటికీ కాంగ్రెసులోని యువజనులకు ఈ కొత్త దృష్టి లేకపోవడం విచారకరం.

ఇక యువకులకు అవకాశమివ్వాలనే నినాదం ఆకర్షణీయంగానే ఉంటుంది. కాని నిజమాలోచిస్తే, ఈనాడు రాష్ట్ర నాయకత్వాన్ని చేపట్టియున్నది యువకులే మంత్రిపదవుల నుంచి పంచాయితీ సమితి సభ్యత్వం వరకు పదవులలో ఉన్న వారిని జిల్లాలవారీగా, ప్రాంతం వారీగా, రాష్ట్ర స్థాయిని చూచినప్పుడు పెత్తనం పదవులు పూర్తిగా యువకుల చేతుల్లోనే ఉన్నాయి. శ్రీ ప్రకాశం నుంచి శ్రీ సంజీవయ్య వరకు, గత పదిహేను సంవత్సరాల్లోను రాష్ట్రంలో అధికార పదవులు పొందడంలో వచ్చిన పరిణామాల చరిత్ర యావత్తు ఆంధ్ర యువకుల స్థిర—అస్థిరచిత్తాల వ్యక్తీకరణ చరిత్రే. చివరకు అనధికార పార్టీల చరిత్ర చూచినా ఇంతే కనక ఆంధ్రలో యువకులకు అవకాశాలు కొత్తగా ఒకరివ్వవలసిన అవసరం లేదు. వారే వానిని సృష్టిస్తారు అదే ఇంటా—బయటా వారి ప్రత్యేకత

ఈ ప్రత్యేక జాతీయోద్యమాలలో ఒకరకంగా ఆంధ్రజాతికి కీర్తి తెచ్చింది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కూడా, ఈ ప్రత్యేకతే మన పేరు నిలబెట్టింది. చివరకు సోషలిస్టు, కమ్యూనిస్టు ఉద్యమాల్లో కూడా మన యువకులు, వారి సమీకరణపద్ధతులు విశిష్టమైనవి, విభిన్నమైనవి కనుకనే ఈ పార్టీలలో కూడా (ఇవరకు కాంగ్రెసులో కూడా) వారు అఖిలభారత నాయకత్వం చేపట్టారు అందులోను తిరుగులేదనిపించుకున్నది వారి ఆంధ్రత్వం యువకతత్వం ★

వి. వి. నరసింహారావు.

ఒకతను జబ్బు పడ్డాడు. డాక్టరువచ్చి చూచి మందిచ్చి నేను చెప్పేవరకూ మంచం దిగకండని చెప్పి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళకతని జబ్బు తగ్గిపోయింది. అయినా డాక్టరు చెప్పలేదుకదా అని మంచం దిగడం మానేశాడు. కొన్ని రోజుల తర్వాత అతని స్నేహితు డొకతను వచ్చి ఆ డాక్టరు చచ్చిపోయాడన్న వార్తను అతని చెవిని వేశాడు. "అయ్యో నేనింక మంచం దిగడం ఎలాగా" అని బెంబేలు పడి పోయాడా మహానుభావుడు!

వి. వి. రమణారావు (విశాఖపట్టణం)



న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)


రాష్ట్ర ఆరోగ్య మంత్రి అయ్యారు ఆ తరువాత ఢిల్లీ రాష్ట్ర శాసన సభాధ్యక్షురాలుగా కూడా పని చేశారు గత ఎన్నికలలో ఝూన్సీ నియోజకవర్గంనుంచి లోకసభకు ఎన్నికయ్యారు

డా యుద్‌వీర్‌సింగ్ ఇంతకన్న చాలా పెద్ద పెద్ద త్యాగాలే చేశారు అసలాయన ఇదివరలో హోమియో వైద్యులుగా వుండేవారు క్రమ క్రమంగా ఆయన ఢిల్లీ పురపాలక సంఘ అధ్యక్షులయ్యారు ఢిల్లీ రాష్ట్ర మంత్రివర్గంలో కూడా పని చేసి రాష్ట్రం రద్దైపోవటంతో ఢిల్లీ చీప్ కమీషనరుకు సలహాదారుగా నియుక్తులయ్యారు. ఇప్పటికీ ఆయన ఆపదవిలోనే వున్నారు ఈ డాక్టర్లిద్దరు అసభ్య చలన చిత్ర ప్రకటనల దహనోద్యమాన్ని ప్రతిపాదించిన "నారీ రక్షా సమితి" అధ్యక్ష ఉపాధ్యక్షులుగా వుంటున్నారు గత వారం జరిగిన బహిరంగ సభలో వీరిద్దరూ అవసరమైతే అసభ్య ప్రకటనలకు వ్యతిరేకంగా సత్యాగ్రహం గూడా చేయటానికి సిద్ధమేనని ప్రకటించారు కాని డా యుద్‌వీర్‌సింగ్‌కు ఇది కొద్దిగా ఇబ్బందే. ఆయన ఇప్పుడున్న ఉద్యోగంలో నెలకు వెయ్యి రూపాయలు పుచ్చుకుంటున్నారు. ఇప్పుడు సత్యాగ్రహం ప్రారంభిస్తే ఆఉద్యోగం రామార్పణం కావచ్చు పైగా ఉద్యోగి కావటంవల్ల ఆయన ప్రభుత్వోద్యోగుల ప్రవర్తన నిబంధనలకు కట్టుబడి ఉండాలి

తమ నియోజకవర్గం ఝూన్సీకి బదులు ఢిల్లీలో డా సుశీలానయ్యార్ సత్యాగ్రహం చేయాలని సంకల్పించటంలోవున్న అంతర్యమేమిటో తెలియటంలేదు. అదీగాక ఢిల్లీతో పోలిస్తే ఝూన్సీ చాలా చిన్నవూరు అక్కడ ఆవిడ సత్యాగ్రహం పట్టి ఆప్రజలు ఎక్కువ ఆసక్తి చూపవచ్చు. వచ్చే సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆమె తన నియోజకవర్గం ఝూన్సీని, ఇలాంటి ప్రయత్నాలతో ఎంతైనా బలపర్చుకోవాల్సి వుంటుంది. ఆవిడ చూపు ఢిల్లీపైవుంటే అది వేరు. అసలు ముఖ్యమైన రహస్యం ఇది : ఆమె పంజాబీగావటంవల్ల ఝూన్సీ వారికి పరాయి వారవుతారు.

పార్లమెంటులో ఝూన్సీ ప్రతినిధిగా ఉన్నవారు, ఏ ఆందోళన అయినా, ఉదాహరణకు ఆ మరణ నిరాహారదీక్షే అనుకోండి, ఆ ఊరులో ప్రారంభిస్తేనే ప్రయోజనకరంగా ఉంటుంది. ఢిల్లీలో సంఘ సేవకులు, తమ ఇళ్ళముందు నుంచునే ఫొటోలు తీయించుకోవాల్సి ఉంటుంది. ★

గళ్లనుడికట్టు-54




అడ్డం

2 ఒక కాగితాల బుట్ట ముందు ఉండే(దన్న)మాట!
3 గొంతుక, మెడ.
6 దక్షిణ ప్రదేశంలో చిక్కును.
7 చిందరవందర అయిన రాముని కొడుకు.
8 ప్రయాణం.
9 అటునుంచి చదివితే నాలుగు కాళ్లమీద కదులు!
11 ఇది కానిదే !
12 పునస్కారం ముందుది
14 గణితశాస్త్రమా ? (బహువచనం)
15 'బల్ల' లో నగానికి మొదటి విభక్తి ప్రత్యయం చేర్చి తిరగవేస్తే మీరు కానివారు వెంటనే వస్తారు.
17. సర్పము.
18 చెప్తే వినబడేది !
20 సోమ—
21 ఏర్పడు, కదురుకి కొమ్ము కావాలా ?
22 చారల మృగాన్నిలా వ్రాస్తే 'పూ'రుకోదేమో కాని భక్తి ఎక్కువ. పాల్నతోనే సరిపుచ్చండి
23. ఒక వెయ్యి కాదు, కాని ఒకటే !
24 తల్ర కిందులయిన మృగయావినోదం.
26 సంఖ్య సంతోషమయినది కాదు మరి.
27. అవలయుతో నలుపా ?
29 అటునుంచి శిఖరు.
30 దాపు.
32. వంటలో కొంత భాగం వందిరి వంటిది.
33. ఎలుకల చప్పుడుతో సగమే !
35. ఒట్టు.
36. మిమ్మల్నివిధంగా పిలిస్తే మర్యాద అనుకున్నా కూనె పిడిపోతారు !
37. వన్ని !
38. రాజు తిరగబడి పోయాడు.
39. అగప్ప కాని మధ్య తిసిగోపు.

నిలువు

1. ఇల్లు.
2. ఒకవిధమైన నీటిబొట్టు.
4 ఉన్నది.
5. క్రిందనుంచి పైకి పుష్పాలు.
8 క్రతువు.
10. ఒక రకమైన పూరు.
11. కోపం !
13 పూజచేసే సోమయాజిలో సుగంధ ద్రవ్యం.
16 తలమీద కొడితే దిగేవి
17. ఏరుకి ఉండే గుణం
19. మాధవుడు మీకు కనిపిస్తే శివుడు కూడా కనిపిస్తాడు.
20. అవన్న!
23. ప్రొద్దున.
25. సంబరం వేడుకోలుని పెంచితే వస్తుంది.
26. ఏ పక్షి ? అంటే అదే
28. అందువలన, ఎలాగో అమ్మాయిని సృష్టించండి
31. పిల్ల.
32. విజయ—
34 ఇది తాకపోతే మొద్దు.
35 తర్వాత ?

53-వ గళ్లనుడికట్టుకు జవాబు



★

ఆసుపత్రిలో ఒక రోగి తన ప్రక్క రోగితో: "మన నర్సు వుందే! నిజంగా ఒక దేవత. ఆమె చెయ్యి ఒక్కసారి నా చెంపకి తగిలేసరికి సగము జ్వరము తగ్గిపోయింది."

ప్రక్కరోగి: అవును నీ చెంప మీద ఆవిడ చెయ్యి వెయ్యడము ఈ హాలులో అందరికీ విన్పించింది.

పి. యస్. రావు (ఏలూరు)

ఒక వూరిలో ఒకరాజు. ఒక రోజున ఆయనకు ఒక అనుమానం వచ్చింది. వెంటనే మంత్రిని పిలిచి, "మంత్రీ, మంత్రీ యీ వూరిలోకల్లా గొప్ప సోమరి ఎవరో నాకు తెలుసుకోవాలని ఉంది" అన్నాడు. వెంటనే మంత్రిగారు వూరిలో దండోరా వేయించారు. ఏమనంటే "ఈ వూరిలోకల్లా ఎవరు గొప్పసోమరో, వారికి రాజుగారు గొప్పబహుమతి ఇస్తారహో". దీనిని విని ఆ వూరిలో పేరుబడ్డ సోమరు లందరు రాజుగారింటికి వచ్చారు చిన్నగా. చాలామంది వచ్చారు. వారిలో ఎవరు గొప్పసోమరో తెలుసుకోవాలి. సరే. వారందరిని ఒక పెద్ద తాటాకుల గుడిసెలో కూర్చోబెట్టాడు మంత్రిగారు. సోమరులందరు, హాయిగా పడుకున్నారు. ఇప్పుడు, వారిలో ఎవరు గొప్పసోమరో తెల్సుకోవాలి. మంత్రిగారు వెళ్ళి, ఆ గుడిసెకు ఒకమూల నిప్పంటించాడు. కొంచెం సెగతగలగానే, అందరు సోమరులు లేచి బయటికి పరుగెత్తారు. కాని ఒకడుమాత్రం వెళ్ళలేదు. మంత్రిగారికిగూడా వాడుతగులబడ్డాడేమోనని భయమేసి, వాణ్ణి బయటకు లాక్కురమ్మని భటులను పంపించాడు. తరువాత రాజుగారు వాడిని, ఇల్లు తగులబడుతుంటే ఎందుకయ్యా ఇంకా కూర్చున్నావని ప్రశ్నించాడు. "దగ్గరికి వచ్చింతర్వాత లేవచ్చులే అని కూర్చొన్నానండి" అన్నాడు భేష్, నిజ

హాస్యకథలు

మైన సోమరి అంటే వీడేనను కొని రాజుగారు వాడికి ప్రథమ బహుమతినిచ్చి పంపాడు.

శర్మ (నరసరావుపేట)

* * *

అగ్రస్థానం

ఒక పెద్దమనిషి ఒక సభలో ప్రసంగిస్తున్నాడు. ఉపన్యాసం బాగాలేక ఎవరూ ఆయన

"ఎగాదిగా చూడక నన్ను అభినందించండి. నా వల్లనే దేశంలో పెద్ద పరిశ్రమ ఏర్పడబోతోంది."

చెప్పేది వినిపించుకోక తమలో తామే బిగ్గరగా మాట్లాడడం, ఉపన్యాసకుడికి సలహాలివ్వడం చేస్తున్నారు. ఇదంతా చూచి ఉపన్యాసకుడికి ఒళ్లు మండింది: "ఈ సభలో అందరూ మాట్లాడే వెధవల్లాగున్నారే! ఒక్కొక్కరినొక్కొక్కసారి మాట్లాడనిస్తే బాగుండేటట్లుంది" అన్నాడాయన. "మంచిది! ముందు మీరు కానివ్వండి" అన్నారెవరో సభలోంచి.

* * *

ఒక అందమైన కాలేజీపిల్ల రైలుపెట్టెలో తోటిస్నేహితురాండ్రతో అంటోంది: "ఏ తరుణానికి తగిన బట్టలు ఆ తరుణములో వేసికోవాలి. రైలుప్రయాణములో నేను మగవాళ్ళ సూటు ధరిస్తాను. సాయంత్రము పికారుకు సాంధ్యవస్త్రాలు, ఈతకొట్టడానికి బేతింగు డ్రస్"

అదంతా వింటున్న ఒక యువకుడు నెమ్మదిగా "అయితే మీ పుట్టిన రోజు పండుగనాడు ఏం కట్టుకొంటారు?" అని అడిగాడు.

పి. యస్. రావు (ఏలూరు)

* * *

న్యాయాధిపతి:- నీవంటి వారిని నేను చాల మందిని చూచినాను. నీవేమి చెప్పెదవో దానికి వ్యతిరేకమైనదే సత్యమని నాకు తెలుసు. నీవేమి చెప్పెదవో చెప్పు.

అపరాధి:- నేను అపరాధిని స్వామీ!

* * *

"చిలుక అంటేనాకు చాలా ఇష్టము"

"ఎందుకు"

"చెప్పిన మాటకు ఉప్పు కారము చేర్చకుండ చెప్పినట్లే చెప్పేది ఈ ప్రపంచంలో అదొక్కటే"

నాగరాజ (బెంగుళూరు)

Edited, Printed and Published by S Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street,

Regd. No. M 4479 ANDHRA-SACHITRA VĀRA PATRIKA